C MB018207
12-B

తాళ్లపాక అన్నమాచార్యులు

ఐతిహాసిక నవల



గాంధీ క్షేత్రం
అవనిగడ్డ, కృష్ణాజిల్లా.

తుమ్మలపల్లి
రామలింగేశ్వరరావు


D

MB01 & 207
I త్రి 1223

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు

(ఐతిహాసిక నవల)

HL 82
Ph-56



తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు

సర్వస్వామ్యసంకలితము

Copy Right 1971.

గ్రంథకర్తచే ప్రకాశితము.

(వెయ్యి ప్రతులు)

మూల్యము. రు. 6/-.

ప్రతులకు

శ్రీయార్లగడ్డ వెంకన్నచౌదరి

షష్ట్యబ్దపూర్త్యుత్సవ సంఘము

69, జి. యన్. శెట్టిరోడ్డు, మద్రాసు - 17,

కృతజ్ఞతాభివందనము

దాదాపు పదునాలుగు నెలలక్రితము నాకు శ్రీవెంకట్రామచౌదరితో యాదృచ్ఛికంగా పరిచయమైంది. ఆప్పు డాయన నన్ను గురించి తెలుసుకుంటూ నేను వ్రాసిన గ్రంథాలేమిటని అడిగి తెలుసుకున్నారు.

తరువాత పదిరోజులకు ఆయన మా యింటికి వచ్చి నేను రచించిన 'తిక్కన సోమయాజి' నవలను చదివినట్లు అమితంగా ఆనందించినట్లు చెప్పారు. మళ్ళీ పదిరోజులకు మరొకసారివచ్చి నేను రచించిన "ధర్మనిర్ణయం" నవల. చదివినట్లు - తన అభిప్రాయంలో అది అత్యుత్తమైన నవల అని చెప్పి ఒక సారి నన్ను వారింటికి రమ్మన్నారు.

అప్పుడు నాకు "తం సంతః శ్రోతు మర్హంతి సదసద్వ్యక్తి హేతవః హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిః శ్యామికాపివా" అని రఘువంశము నందు, "అపరితోషా ద్విదుషాం న సాధుమన్యే ప్రయోగవిజ్ఞానమ్" అని అభిజ్ఞానశాకుంతలమునందు కవికుల గురువు చెప్పిన మాటలునూ - నైష్కర్మ్య సిద్ధిలో "బ్రహ్మ విన్నికషాశ్మసు" అని శ్రీజగద్గురు సురేశ్వరాచార్యులవారు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చినాయి.

శ్రీచౌదరి ఆహ్వానించినట్లుగా నేను వారింటికి వెళ్ళగా ఆయన ప్రాసంగికంగా "సప్తసంతానములలో కృతి ప్రశస్తమైనది అన్నారు. కాని - అది ఖిలము కాకుండ - భాష ఉన్నంత కాలము ఉండేదై లేనే ప్రశస్తిపొందుతుంది. మీరు ఖిలము కానట్టి రచనలు చాల చేశారు. మరియొక నవల వ్రాసి - నా సత్కారాన్ని స్వీకరించి - ఆంధ్రభాష ఉన్నంతకాలము నన్ను చిరంజీవుని చేయండి"అని అభ్యర్థించగా-ఈర్ష్యా సూయలకాలమైన యీనాడు ఇంతటి భావుకత్వము వెలిబుచ్చిన శ్రీచౌదరి కోరికను నేను పాటించాను.

శ్రీచౌదరి ఉత్తమశీలి. దైవగురు భక్తిభరితుడు. ఆయన కిష్టమైన భక్త శిఖామణిగాథను తీసుకున్నాను. ఉత్తమ సాహిత్యభావుకుడు, దైవగురు భక్తియుక్తుడునగు శ్రీచౌదరికి సాహిత్యస్వరూపిణియైన శ్రీదేవి అనుగ్రహమున నిఖిలాయురారోగ్యైశ్వర్యాద్యభివృద్ధియు నిరతిశయానంద శ్రేయోభాగ్యమును కలుగుగాక.

మద్రాసు - 33
విరోధికృత్ శుక్ల చతుర్థి గురువారము
30-12-1971.

తుమ్మలపల్లి
రామలింగేశ్వరరావు.


అంకితం

ఆంధ్రభూమి మధ్యయందున్న సీమలో
తూర్పుదిక్కునందు తోయధికిని
చేరువైన యట్టి చీరాలప్రాంతంబు
రాజసములు పండు రత్నగర్భ.

చీరాల సమీపమునన్
కారంచేడన్న పేరు గల గ్రామములో
ధీరులు కమ్మవతంసులు
వాకలలో యార్లగడ్డవారు ప్రధానుల్.

పట్టినట్టి దెల్ల బంగారుగాజేయు
పరుసవేదియైన కరమువాడు
విదితదానమూర్తి వెంకన్నచౌదరి
యార్లగడ్డకుల సుధాబ్ధిహేళి.

ప్రాకటమతియగు వెంకన
ఈకృతి నైకొన్ననేత, హిమకరతుల్య
శ్రీకోమలు డీతనివం.
శ కరమున చేకురు సకలాభ్యుదయములున్.



శ్రీ యార్లగడ్డ వెంకన్నచౌదరి

VII

ారోధికృతిని స్వీకరించిన

ారొక్షిౖయుంర్లగడ్డ వెంకన్నచౌదరి

జనిసెము: శ్రీవిరోధికృత్ శుక్ల చతుర్దశి
జయవారము (3-1-1912).

షష్టిపూర్త్యుత్సవము: శ్రీవిరోధికృత్ శుక్ల చతుర్దశి
గురువారము (30-12-71).

జన్మస్థలం: కారంచేడు (చీరాల తాలూకా) ఒంగోలుజిల్లా.

తండ్రిగారు: (కీ. శే.) శ్రీనాయుడమ్మ.

తల్లిగారు: (కీ. శే.) శ్రీమతి రత్నమాంబ.

భార్య: (కీ. శే.) శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ
(వీరు 1968 లో ఉద్యోగస్థులైరి.)

కుమారుడు: చిరంజీవి శంభుప్రసాదు (జననము 1945 సం॥).

కోడలు: చిరంజీవి సౌభాగ్యవతి ప్రభావతీదేవి.

పౌత్రి: చిరంజీవి రాజ్యలక్ష్మి.

తమ్ముడు: శ్రీరంగనాయకులు చౌదరి.



శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు గుడివాడ (కృష్ణా) లో 1921 లో జన్మించి రాజమహేంద్రవరకళాశాలనుండి పట్టభద్రుడై సత్యమును శాంతిని అన్వేషించుచు పెక్కు వృత్తులను చేపట్టి విసర్జించి తుదకు ప్రథమశ్రేణి సాహిత్యకారుడై తపోజీవిగా స్థిరపడినవాడు.

అందుచేతనే ఈయన రచనలన్నియు ఆర్షేయ సంస్కృతిమయమై భారతీయ జీవనమూల్యములను ప్రతిబింబించుచు ఉజ్జ్వలసుందరమైన శైలితో నొప్పారుచున్నవి. సహజముగానున్న బహుముఖప్రజ్ఞ, స్వయంకృషివలన సాధించిన మంత్ర దార్శనికాది బహుశాస్త్రపాండిత్యము ఆయన రచనలలో సాహిత్యస్ఫురన్మాధుర్యరూపమును తాల్చినవి.

రచనలు:

తిక్కనసోమయాజి (నవల) — శివానుగ్రహము (కవిత)

ధర్మనిర్ణయం (నవల) — పితృయజ్ఞము (కవిత)

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు (నవల) — అగ్నిష్టోమము (కవిత)

సాహిత్యవిమర్శ

పోతన్నగారి సహజపాండిత్యము — నన్నిచోడునివస్తుకవిత

శ్రీచక్రవిలసనము (మంత్రశాస్త్రము)

ఇంకా పెక్కు ఇతర ఆంధ్ర, ఆంగ్ల గ్రంథములు.

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు

(ఐతిహాసిక నవల)

1

వసంతకాలం వచ్చిన దని చెప్పడానికి ప్రతిసంవత్స రమూ కోకిలలు గొంతులెత్తి మధురంగా స్వాగతాలు చెప్పు తూనే ఉంటాయి. ఆ సంవత్సరం కోకిలలు మధురగానాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఆ సంవత్సరం మామిడిపూతలు ఎక్కువ ఉండటంవలన మామిడిచివుళ్లు ఎక్కువగా ఉండటం వలన కోకిలలకు తియ్యని తిండి లభించి వాటి కంఠమాధు ర్యానికి అవధులులేకుండా పోయాయి. ఊరకే కోకిలలు తమ గానమాధుర్యాన్ని ముంచెత్తి పోస్తున్నాయి.

ఈ నూతన వసంతాగమనశోభలో శ్రీ అలమేలుమంగా పురంలోఉన్న పద్మావతీదేవి అమ్మవారి ఆలయప్రాంగణం మాధు ర్యగసాలయమై దశదిక్కులకు ప్రసారణం చేసింది. అమ్మవారి ఆలయంలో రసాలములు ఉన్నాయి. వాటి చిటారు కొమ్మల మీద కోకిలలు కూర్చుని అమ్మవారి వసంతనవరాత్రి ఉత్సవా లకు మంగళగీతాలు ఆలపిస్తూ ఉన్నాయి.

ఒక మామిడిచెట్టుక్రింద నుంచుని పన్నెండు సంవత్సరాల బాలుడొకడు కోకిలలతోపాటు కూస్తూ వాటిని రెట్టిస్తూ ఉన్నాడు. అతడు ఎదుట కూతలుకూసిన కొద్ది కోకిలలు మళ్ళీ మళ్ళీ కూసికూసి - అతడు తమ్ము వెక్కిరిస్తున్నాడనే భావంతో దూరదూరంగా వెళ్లిపోతున్నాయి.

కోకిలలు వెళ్లిపోయినా బాలుడు కొంతసేపు కూసి, కోకిలల ప్రతిధ్వనులు లేకపోవడం మూలాన ఆగి - మళ్ళీ గొంతెత్తి మధురాతిమధురంగా పాడటం సాగించాడు.

"మందారమకరందమాధుర్యమున దేలు
మధుపంబువోవునే మదనములకు
నిర్మలమందాకినీ వీచికలదూగు
రాయంచ జనునె తరంగిణిలకు
లలితరసాలపల్లవఖాదియైచొక్కు-
కోయిలచేరునే కుటజములకు
పూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరకం
బరుగునే సాంద్రనీహారములకు
అంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్తమేరీతినితరంబు చేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయునేల?"

ఆ బాలుడు ఈ పద్యాన్ని శ్రీరాగమధురంగా తన్మయుడై పాడుచుండగా ఆసమయానికి అచ్చటి లోక యాత్రిక

బృందము వచ్చింది. వాళ్లు బాలుని గానాన్ని వింటూ ముగ్ధులై నిల్చుండి పోయారు. ఆబాలుడు పద్యం ముగించిన తరువాత అక్కడకు సమీపంలో ఉన్న యాత్రికుల బృందాన్ని చూచాడు. వాళ్లు తనవంకనే చూస్తూఉన్నారనీ తను పాడటం విన్నారని గ్రహించి కొంచెం సిగ్గు పడ్డాడు మళ్లీ అంతలో సిగ్గువదలి స్థైర్యాన్ని అవలంబించి వాళ్లవంక చూచాడు.

ఆ బృందంలో నలుగురు ఉన్నారు. ఇద్దరు మగవారు. ఇద్దరు ఆడువారు. మగవాళ్లలో పెద్దవాడు నడివయస్సు దాటినవాడుగా ఉన్నాడు. తేజస్వీగా ఉన్నాడు. పండిన సౌందర్యరాశిగా ఉన్నాడు. సుఖద్రూపిగా ఉన్నాడు. ఆయన బాలుని చూచి "నాయనా! పద్యం చక్కగా పాడావు. నువ్వు ఎవ్వరి అబ్బాయివి!" అన్నాడు. బాలుడు "ఎందుకు?" అన్నాడు అయిష్టంగా. ఆయన "దేనికీలేదు! ఆపద్యాన్ని చాలాబాగా పాడావు!" అన్నాడు.

బాలుడు "ఆ పద్యం చాల గొప్పది. దానిని మా మామయ్యగారు వ్రాశారు. ఆపద్యం మా తండ్రిగారికి చాల అభిమానమైనదట." అన్నాడు. ఆయన ఆ మిగిలినవారు బాలుని మాటలకు ఆశ్చర్యచకితులైనారు. అందలో యువకుడు బాలునితో "ఆపద్యాన్ని మీ మామయ్యగారు వ్రాశారా? ఎవరా మామయ్యగారు? ఎక్కడ ఉంటారాయన?" అని ఆశ్చర్య సంభ్రమాలతో అన్నాడు. పెద్ద ఆయన బాలుని సమాధానం కోసం ఆతురతతో వేచిఉన్నట్లుగా చూచాడు. బాలుడు

మాత్రం మళ్ళీ "ఎందుకు" అని సాగదీసి "పద్యం బాగా లేదా?" అన్నాడు.

ఆ మాటలకు యువకునకుగాని పెద్ద ఆయనకుగాని తృప్తి కలుగలేదు. బాలుడు తా నెవ్వరివాడో చెప్పుటలేదు, ఆపద్యమును తన మామయ్యగారు వ్రాశాడని చెప్పుతున్నాడు. కాని ఆయన పేరేమో చెప్పుటలేదు. యువకుడు "ఆ పద్యమును మీ మామయ్యగారు వ్రాశాడంటున్నావు. ఆయన పేరు చెప్పవు. చెప్పితే నీకేమినష్టము?" అన్నాడు. బాలుడు "ఈ పద్యములోని అతిలోకమాధుర్యాన్ని గ్రహించడానికి వ్రాసినవారి పేరెందుకు? మీ కాపద్యములోని మాధుర్యం అవగాహన కాలేదా? ఇంతకంటె తియ్యగా తెలుగు పద్యములు వ్రాయగలవారు లేనేలేరు! ఇంతకంటె తియ్యగా తెలుగు పద్యాలు వ్రాయగల కవులను మీ రెరుగున్నారా?" అని గద్దించాడు.

యువకుడు బాలునితో "అత్యధికమధురమైన రచన యని చెప్పుచున్నావు. దానిని రచించిన కవి మీ మామయ్యగారని చెప్పుచున్నావు. ఆయన పేరు చెప్పవు. నీపేరు చెప్పవు. ఇంతకు నీకు మాధుర్యమనగా నేమిటో తెలియునా?" అన్నాడు.

బాలుడు "సంస్కృత ఆలంకారికులు మాధుర్యమనగా పృథక్పదత్వ మని ధ్వనిమత్తగాంభీర్య మని చెప్పుచున్నారు. నేను చెప్పుచున్న మాధుర్యము లోకానుసారముగా చెప్పబడు చున్నది. తీపి అని భావము. వాఙ్మాధుర్యానికి ప్రియపడిన

సంస్కృతకవులు దానిని ప్రియాధరాసవముతోను, మృగ మదముతోను, మల్లికాసౌరభముతోను, అమృతముతోను, చంద్రాతపముతోను పోల్చినారు. కావ్యామృతమునందలి తీపిని తెలుగుకవులుకూడ ప్రశంసించారు. 'కావ్యంబు సరసులైన కవుల చెవుల చెక్కవలయు' నని కవిబ్రహ్మ శాసించినాడు. ధ్వని రసాలంకారాదులెన్నియున్నా శ్రవణప్రసాదనము కూర్చని కవిత్వము తెలుగువారాదరించరు. కావ్యవిషయమున 'తీపి' అన్న నామాటకిదియే అర్థము. ప్రాయికముగా పూర్వ తెలుగుకవులంతా శ్రుతిసుభగముగా వ్రాయగలవారే. అయినా వారిలో విశిష్టఖ్యాతి మామయ్యగారిది." అన్నాడు.

బాలుని మాటలు ఆపెద్ద ఆయనను కదలించినవి. ఆయన ఆనందబాష్పములతో బాలుని కౌగలించుకొని "నాయనా! నీకు తెలుగు భాషయొక్క మాధుర్యస్వరూపము ప్రత్యక్షమైనది. నీవు గొప్ప రచనలు చేయగలవాడవని తోస్తున్నది!" అన్నాడు.

ఇంతలో దూరమునుండి బాలుని తల్లి పూర్వసువాసిని కుమారునితో "నాయనా! ఎవ్వరితోరా నీవు వాదించుచున్నావు?" అని కేకవేసినది. అతడు "వీరెవ్వరో నమ్మా! మామయ్యగారి పద్యములోని తీపితనాన్ని అనుభవించలేకుండా ఉన్నారు" అని యువకునివంక చూచాడు. అతని తల్లి అక్కడకు చరాచరా రానేవచ్చింది. ఆమె దగ్గరకువచ్చి ఆ యాత్రిక బృందంలో పెద్ద ఆయనను ఆయన భార్యను తేరిపారచూచి

స్తంభించిపోయింది. మళ్లీ తేరుకొని కుమారునితో "నాయనా! నువ్వు నిత్యమూ చదువుచున్న పద్యాన్ని వ్రాసిన పోతనామాత్య మామయ్యగారు వీరేరా!" అని ఆయన వంకచూస్తూ "అన్నయ్యా! నన్ను గుర్తుపట్టలేదా! నేను తాళ్లపాక లక్కమ్మను" అన్నది.

ఆయన ఆశ్చర్యముతో "అమ్మా, సీరూపము మారిపోవడమువలన గుర్తుపట్టలేకపోయినాను. బావగారు నారాయణయ్యగారు వెళ్లిపోయిన సంగతి నిన్ను చూచి గుర్తించిన తరువాతగాని నాకు తెలియలేదు" అన్నాడు. ఇంతలో బాలుడు ఆయనకు సాష్టాంగప్రణామంచేసి "నన్ను క్షమించండి. మా తండ్రిగారికి ఇష్టసఖులై, ఉభయకావ్యకరణదక్షులై, శ్రీమన్నారాయణకథా ప్రపంచవిరచనాసమర్థులైన బమ్మెర పోతనామాత్యులవారని తెలియక మాట్లాడాను. నన్ను అనుగ్రహించండి" అన్నాడు. పోతన్నగారు బాలుని దగ్గరకు తీసికొని చుబుకాన్ని ముద్దాడినారు.

పోతన్నగారి భార్య లక్కమ్మగారిని సమీపించింది. వాళ్లిద్దరు అన్యోన్యం కుశలప్రశ్నాదికం చేసుకున్నారు. లక్కమ్మగారికి భర్తృవియోగం కలిగినందుకు పోతన్నగారి భార్య దుఃఖాన్ని, పరితాపాన్ని వెల్లడించింది. ఆమె తన కుమారుడు మల్లన్నను అతని భార్యను లక్కమ్మగారికి పరిచయం చేసింది.

2

భారతదేశమున ప్రబుద్ధములైనట్టి అన్ని మతములవారికి తీర్థయాత్రాటన మున్నది. అందరకు కాశీక్షేత్రము దివ్య క్షేత్రమే. హైందవులు కాశీయాత్రచేయుట ముఖ్యకర్తవ్య విశేషముగా భావించెదరు.

ఏకశిలానగరమున కౌండిన్యగోత్రసంకలితుడైన బహు కళానిధి దానమానసీతిధనుడు కేసన్నగారు. ఆయన శైవశాస్త్ర మతమును గనినవాడు. ఆయన ధర్మపత్ని లక్కమాంబ. ఆమె మిక్కిలి ఉత్తములాలు. ఆ పుణ్యదంపతులకు ఈశ్వరసేవా కాముడైన తిప్పన పెద్ద కుమారుడు. సాధునయయుక్తుడైన పోతన్నగారు ద్వితీయపుత్రుడు.

ఉభయకావ్యకరణదక్షుడైన పోతన్నగారు పుణ్యయాత్రా శీలియై ఉత్తరదేశయాత్రకుపోయి ఆయన పుణ్యక్షేత్రరాజ మైన వారాణసి పురమునకు సజ్జనానుమతమున వెళ్లి అచ్చట సాంప్రదాయానుసారముగా గర్భవాసకాలము వసించినాడు. అంటే పదినెలలకు తక్కువ కాని కాలము.

ఆ సంవత్సరము ఆంధ్రదేశమునుండి మాత్రమేగాక అన్నిప్రాంతములనుంచి కాశీక్షేత్రానికి యాత్రికులు చేరారు. దానికొక ముఖ్యకారణం ఉన్నది. ఆ సంవత్సరం శ్రావణ పూర్ణిమనాడు సంపూర్ణచంద్రగ్రహణమున్నూ, శ్రావణ అమా వాస్యనాడు సంపూర్ణసూర్యగ్రహణమున్నూ వచ్చినాయి. అది అపూర్వమైన విశేషము. చంద్రసూర్యోపరాగకాలములందు

పుణ్యక్షేత్రములకువెళ్లి దివ్యతీర్థములలో స్నానాలు చెయ్యడం ఆచారం. ఒకే నెలలో రెండు గ్రహణాలురావడం అపూర్వమైన సంఘటన. ఆకాలంలో కాశీలో ఉండాలని పోతనామాత్యులవారు సకుటుంబముగా వెళ్లినారు. ఆయన కాశీలో ఉండగా అభ్రంకష శుభ్రసముత్తుంగభంగయగు గంగానదికి పోయి త్రిసంధ్యలలోను స్నానాలుచేస్తూ ఉండేవాడు. సాయం వేళలందు గంగానదీ మహనీయమంజుల పులినతలమున కూర్చుండి మహేశ్వరధ్యానముచేస్తూ ఉండేవాడు.

పోతనామాత్యులవారు కాశీలోఉన్న కాలంలోనే అక్కడకు ఆంధ్రప్రాంతంలో తాళ్లపాక నారాయణయ్యగారు కూడా యాత్రార్థం వెళ్లిఉన్నారు. ఆయన భార్యతోకలసి వెళ్లి ఉన్నాడు. ఆయనకు సంతానం కలుగక పెద్దలు చెప్పిన చొప్పున తీర్థయాత్రలు చేయడానికి పూనుకున్నాడు. ఆయన కూడా అపూర్వసంఘటన ఐన ఏకమాసగ్రహణద్వయకాలములందు గంగాస్నానం చెయ్యాలనే కుతూహలంతోనే వెళ్లాడు.

కాశీలో పోతనామాత్యులవారికి తాళ్లపాక నారాయణయ్యగారికి పరిచయం అయింది. ఇద్దరు కాశీలో ఒకే సత్రంలో బసచేశారు. పదినెలలకాలం కలసిఉన్నారు. వాళ్లపరిచయం మిక్కిలి స్నేహంగా పరిణమించింది. తిరుగు ప్రయాణంలో ఇద్దరున్నా కలసే కొన్నిమజిలీలు చేశారు. పోతనామాత్యుల వారు తమ స్వగ్రామానికి వెళ్లిపోగా నారాయణయ్యగారు తమ స్వగ్రామమైన తాళ్లపాకకు చేరుకున్నారు.

కాశీలోఉండగానే పోతనామాత్యుల వారికి శ్రీమన్నా రాయణకథా ప్రపంచవిరచనా కుతూహలం కలిగింది. అక్కడనే ఆయన కించిదున్మీలితలోచనుడై మహేశ్వరధ్యానము చేయు చుండగా—మెఱుగుతో కూడిన మేఘమువలె ఉనిదతో నొప్పు వాడు, చంద్రమండల సుధాసారమును పోలియున్న చిఱునవ్వు మొలకతోనున్నవాడు, లతాయుక్తమైన తమాలవృక్షమువలె పెద్దపిల్లు మూపునందున్నవాడు, నీల నగాగ్రమున సూర్యుని వలెనున్న ఘనకిరీటమును తలయందున్నవాడు, పుండరీక యుగముబోలు కన్నులవాడు, విపులభద్రమూర్తియైన రాజ పురుషు డొక్కడు కన్నుగవకు కన్పించి 'నే రామభద్రుడ, నా కంకితముగా శ్రీమహాభాగవతమును తెనిగింపుము. నీకు భవ బంధములు తెగును' అని ఆనతిచ్చి తిరోహితుడయ్యాడు.

పోతనామాత్యులవారు సమున్మీలితనయనుడై వెఱగు పడి పలికించు విభుడు రామభద్రు డున్నాడని భాగవతమును పలుకుటకు, విబుధజనులవలన విన్నంత కన్నంత తెలియవచ్చి నంత తేట తెల్లము చేయుటకు నిశ్చయించుకున్నారు.

నారాయణయ్యగారు నిఖిలపురాణజ్ఞుడు. శ్రీమహాభాగ వత నిత్యపారాయణశీలి. కాశీలో పోతనామాత్యవారు నారా యణయ్యగారి దగ్గర శ్రీమహాభాగవతాన్ని నిత్యమూ వింటూ ఉండేవారు. ఇద్దరూ పారాయణచేస్తూ ఉండేవారు. ఇద్దరు కలసి శ్రీమహాభాగవత పురాణపారిజాతపాదపసమాశ్రయము పొందేవారు. పారమహంస్య సంహితయైన మహాభాగవతము

లోని తాత్త్విక రహస్యాలను ఇద్దరూ కలసి వివరించుకుంటూ ఉండేవారు. ఇద్దరునూ భాగవతనైష్ఠికులై ఉండేవారు.

శ్రీ రామభద్రాంకితమయిన కవిత్వతత్త్వజ్ఞానము గోచరము కాగా పోతనామాత్యులవారు కాశీలో ఉన్నప్పుడే మహా భాగవతములోని కొన్ని ఘట్టాలను అప్పుడప్పుడు తెనిగించారు. ఆఘట్టాలను సకల పురాణార్థజ్ఞానవిఖ్యాతుడైన నారాయణయ్య గారికి విన్పిస్తూ ఉండటం, ఆయన సంతోషపడుతూ ఉండటం - వాటికి తాను వ్రాతప్రతులు తయారుచేసుకోవడం, పోతనామాత్యుల వారిని కవిపట్టపురాజని కొనియాడుతూఉండటం, విష్ణుచరితామృతనిష్యంది పటువాగ్విలాసానందోచిత మానసుడని కీర్తించడం, ఇద్దరూకలసి హరిచరణస్మరణపరిణామవినోదులు కావడం జరుగుతూ ఉండేది.

తరువాత కాశీనుండి పోతనామాత్యులవారు స్వస్థానమునకువెళ్లి అక్కడ గురువృద్ధ బుధ బంధుజనానుజ్ఞాతుడై చిత్తమున శ్రీరామచంద్రుని సన్నిధానము కల్పించుకొని శ్రీమహా భాగవతాన్ని తెనిగించుట పూర్తిచేశారు అప్పటికి కొన్ని సంవత్సరములు గడచినవి. కుమారుడు మల్లన్న పెద్దవాడయ్యాడు. అతనికి వివాహమై భార్య కాపురానికి వచ్చింది.

కాశీయాత్రచేసిన వారంతా రామేశ్వరయాత్ర కూడా చేసి సేతుస్నానం చేస్తేగాని యాత్ర సంపూర్ణంకాదని విశ్వాసం ఉండటంవలన పోతనామాత్యులవారు కుటుంబసహితంగా రామేశ్వరయాత్రచేసి, దక్షిణదేశంలో మిగిలిన దివ్యక్షేత్రా

లను కూడా దర్శించి తిరుమలక్షేత్రంలో వేంచేసిఉన్న శ్రీవేంక టేశ్వరస్వామిని కూడా సేవించుకుని ఆనాడు అలమేలు మంగా పురంలో వేంచేసియున్న పద్మావతీదేవి అమ్మవారిని కూడా దర్శించుకోవడానికి వచ్చారు.

నారాయణయ్యగారు కాశీయాత్రనుంచి తిరిగివచ్చిన తరు వాత వెంటనే రామేశ్వరాది దక్షిణక్షేత్రాలను కూడా దర్శించి వచ్చారు. ఆయనకు సంతానం కలుగలేదు. ఆయన తనకు ఇష్ట దైవమైన తిరుమల వేంకటేశ్వరస్వామిని కొలుస్తూ నిత్యసేవలు చేస్తూ కొండమీద సంవత్సరకాలం ఉన్నాడు. ప్రభాతకాల సేవనుంచి పవళింపుసేవదాకా అన్ని సేవలలోనూ నారాయ ణయ్యగారు సంతతం పాల్గొంటూ ఉండేవాడు నిత్యనారా యణస్మరణమానసుడై ఉంటూ ఉండేవాడు. తిరుమలక్షేత్రం నిత్యవిభూతి యని విశ్వసించి హరినామస్మరణచేస్తూ ఉండేవాడు.

ఇట్లాసంవత్సరకాలం గడచిన తర్వాత శ్రీస్వామివారికి బ్రహ్మోత్సవాలు జరుగుచున్నసమయంలో ఆలయంలో సర్వా లంకారభూషితమైన స్వామివారి విగ్రహాన్నిచూచి ఆయన ఆనందపులకితుడయ్యాడు. ఆయనకు శ్రీస్వామివారు ధరించిన ఆయుధములన్నీ తేజఃప్రసన్నమూర్తులై కన్పించాయి అందులో స్వామివారు ధరించిన నందకఖడ్గం ధగద్ధగలతో మిలమిల్లు గొలుపుతూ అమితప్రసన్నత చూపించింది.

ఆనాటిరాత్రి స్వప్నంలో నారాయణయ్యగారికి శ్రీస్వామి దర్శనం అనుగ్రహించాడు. స్వామి నందకఖడ్గ మాత్రధారియై

ఉన్నాడు. నారాయణయ్యగారు ప్రదక్షణీకరించి, సాష్టాంగ ప్రణామంచేసి అంజలి బంధించి నిలువబడిఉండగా - స్వామి తన చేతిలోని నందకఖడ్గాన్ని నారాయణయ్యగారి చేతులందుంచి అదృశ్యుడయ్యాడు.

నారాయణయ్యగారి మేలొక్కని స్వామికి తనయందు అనుగ్రహం కలిగిందని ఆనందపడ్డాడు. తరువాత భార్యతో కలసి స్వగ్రామానికి తిరిగివెళ్లాడు. భార్య లక్కమాంబ త్వరలోనే గర్భవతి అయింది. క్రోధినామ సంవత్సర వైశాఖ పూర్ణిమనాడు విశాఖానక్షత్ర కాలమున లక్కమాంబ సుపుత్రుని కన్నది.

నారాయణయ్య కుమారునికి జాతకర్మాదులను నిర్వర్తించి తన తండ్రి పేరే తన కుమారుడికి ఉంచాడు. అన్నమయ్య అన్న పేరది. వాళ్లవంశంలో పూర్వపురుషు డొకాయన నిరతాన్న ప్రదానం చేశాడట. అందుచేత ఆయనకు అన్నమయ్య అనేపేరు జనశ్రుతిలో రూఢినామంగా ఏర్పడిపోయిందట. తరువాత ఆవంశంలో పారంపర్యంగా ఆపేరు కొన్నికొన్ని తరాలలో మళ్లీమళ్లీ పెట్టుకోవడం జరుగుతూ వచ్చింది.

అన్నమయ్యను తలితండ్రులు అల్లారుముద్దుగా పెంచుతూవచ్చారు. చిన్నప్పటినుంచీ తండ్రి కుమారునికి మహాభాగవత కథలుచెప్పుతూ ఉండేవాడు. కుమారుడైన అన్నమయ్యకు అయిదవఏడైనా నిండకమునుపే అకస్మాత్తుగా నారాయణయ్యకు జబ్బుచేసింది. ఆయన పరమపదించాడు.

భర్తపోయిన క్రొత్తలో లక్కమాంబ కుమారుని వెంట బెట్టుకొని పుట్టిల్లయిన సిద్ధవటప్రాంత మాడుపూరు గ్రామానికి వెళ్లింది. అక్కడ పుట్టింటి వారివలన వలసినంత సాయము లేక పోగా తిరిగి తాళ్లపాక గ్రామానికి వచ్చింది. అక్కడ గ్రామస్థుల సహాయంతో దినములను గడపజొచ్చింది. బాలుడైన అన్న మయ్య గ్రామంలోనే ఆంధ్ర సంస్కృత సాహిత్యాలు చదు వుతూ ఉన్నాడు.

ఇంతలో తాళ్లపాకప్రాంతం పెద్ద క్షామానికి గురి అయింది. గ్రామంలో త్రాగేనీళ్లుకూడా కరవైనాయి. గ్రామంలో తిండిగింజలు దొరకటమే దుస్సాధ్యమై పోయింది. లక్కమాం బకు తన కుమారుని తన్ను పోషించుకోవడం దుర్భరమై పోయింది. ఆమెకు దిక్కుతోచలేదు. తనకు ఇష్టదైవమైన మాడుపూరు మాధవస్వామిని తలచుకొని దుఃఖించింది. ఆయన స్వప్నదర్శన మిచ్చి అలమేలుమంగాపురం వెళ్లి అమ్మవారి ఆలయంలో సేవలుచేస్తూ ఉండమని ఆదేశించాడు.

లక్కమాంబ కుమారుడైన అన్నమయ్యను వెంటబెట్టు కుని అలమేలు మంగాపురం చేరుకున్నది. అక్కడ ఆమె అమ్మ వారి ఆలయంలో పరిచారికావృత్తిని స్వీకరించింది. ఉదయ సాయంకాలములలో అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా సమ్మా ర్జనంచేసి శుభ్రంచేసి పూలతోటకుపోయి ఏపూట కాపూట అమ్మవారి పూజకు పూలుకోసి తెచ్చిఇస్తూ ఉండేది.

బాలుడైన అన్నమయ్యకూడా అర్చకులు చెప్పేపనులు చేస్తూ ఉండేవాడు. దేవాలయంలోనే ఉండి తీరికఉన్న అర్చ

కుల దగ్గర సంస్కృతం చదువుతూ ఉండేవాడు. తల్లి కుళ్లు రాత్రింబవళ్లు అన్నివేళల దేవాలయంలోనే ఉంటూ ఉండే వారు. అక్కలు అమ్మవారికి నైవేద్యంచేసిన ప్రసాదాన్ని మధ్యాహ్నం, రాత్రిపూట ఇస్తూఉంటే దానిమీద ఆధారపడి లక్కమాంబ, అన్నమయ్య బ్రతుకుతూఉండేవారు.

అన్నమయ్యకు సహజంగానే తియ్యని గొంతుక ఉన్నది చిన్నప్పటినుండి తండ్రి మహాభాగవతంలోని శ్లోకాలను కొన్ని టిని కంఠస్థంచేయించాడు. అవి కాకుండా ఆంధ్రమహాభార తంలో పద్యాలను కొన్నిటిని పోతనామాత్యులవారి దగ్గర వ్రాసి తెచ్చుకున్న మహాభాగవత పద్యాలను కొన్నిటిని నారా యణయ్యగారు రాత్రిపూట చదువుచుండగా వింటూండటం వలన అంశలో చాలభాగం శ్రుతపరిచయములైనాయి. తరు వాత ఆపద్యాలను అన్నమయ్య కంఠస్థం చేశాడు. వాటిని తరచు చదువుతూ ఉండేవాడు.

లక్కమాంబ కుమారుడైన అన్నమయ్యతోకలసి అల మేలుమంగాపురములోని పద్మావతీదేవి అమ్మవారి ఆలయములో పరిచర్యలుచేస్తూ కొన్ని సంవత్సరములు గడపింది. ఇంతలో కాటకం తగ్గి తాళ్లపాక ప్రాంతం మళ్లీ సుభిక్షమైనా లక్క మాంబ మాత్రం అలమేలుమంగాపురంలోనే ఉండిపోయింది. తాళ్లపాక తిరిగి వెళ్లలేదు. తాళ్లపాకలో వారికి ఉన్నవసతి యేమిన్నీ లేదు. ఇక్కడ అమ్మవారి ఆధారమైనా ఉన్నది.

దినములు అమ్మవారి ప్రసాదంతో గడుస్తాయిగాని లక్క మాంబకు మాత్రం శాంతిగాలేదు. తన కుమారునికి తగిన

విద్యాబుద్ధులు చెప్పించలేక పోతున్నదనీ, ఈము దాటిపో తున్నా ఉపనయనం చేయలేక పోతున్నదనీ, తనదని చెప్పుతగిన జీవనాధారమేమీ కుమారునికి లేకపోయినదనీ లక్కమాంబకు అశాంతిగానే ఉన్నది.

ఆలయపరిచారికగా కాలంగడుపుతూ, శ్రీ తాయారును సేవిస్తూ, నిత్యము శ్రీ తాయారుకు తన కష్టాలు నివేదిస్తూ, తన కుమారుని భారాన్ని స్వీకరించమని నిత్యప్రార్థనలుచేస్తూ లక్క మాంబ కాలంగడపుతూ ఉన్నది.

ఇటువంటి పరిస్థితులలో బమ్మెర పోతనామాత్యులవారు కుటుంబసహితంగా రామేశ్వరయాత్ర ముగించుకొని శ్రీవేంక టేశ్వరస్వామివారిని సేవించుకొని అలమేలు మంగాపురంలో శ్రీతాయారు దర్శనానికి రావటం తటస్థించింది. అక్కడ పోతనా మాత్యులవారు బాలుడైన అన్నమయ్యను లక్కమాంబను చూడటం, లక్కమాంబ పోతనామాత్యులవారి కుటుంబాన్ని గుర్తించడం తరువాత పోతనామాత్యులవారున్నూ ఆయన భార్యయున్నూ లక్కమాంబను గుర్తించడం జరిగినాయి. తరు వాత అన్యోన్య కుశల ప్రశ్నాదికాలున్నూ అయినవి.

3

పోతనామాత్యులవారు అలమేలు మంగాపురంలోఉన్న రెండు దినములలో లక్కమాంబ తన కష్టాలన్నీ ఆయనకు

చెప్పుకున్నది. ఆ రెండు దినాలలోనే అన్నమయ్య పోతనామాత్యులవారికీ ఆయన కుటుంబం వారికీ ప్రీతి పాత్రుడైనాడు. తన మహాభాగవత పద్యాలను అన్నమయ్యచేత మళ్లీమళ్లీ పాడించుకొని పోతనామాత్యులవారు విని ఆనందించారు.

లక్కమాంబ కోరికమీద పోతనామాత్యులవారు మంచి ముహూర్తాన్ని నిశ్చయించి అన్నమయ్యకు ఉపనయనం చేశారు. ఆయనే స్వయంగా బ్రహ్మోపదేశం చేశారు. సంప్రదాయాన్ని బట్టి ఆనాడే నారాయణ మంత్రోపదేశమున్నూ చేశారు.

"నాయనా! మీ తండ్రి నారాయణయ్యగారు మహా భక్తుడు. ఆయనకు శ్రీవేంకటేశ్వరస్వామి ఇష్టదైవము. పిలచిన పలుకువాడట. నీవు కూడ ఆయనను సేవించి తరణోపాయమును తెలిసికొనుము." అని పోతనామాత్యులవారు అన్నమయ్యకు ఉపదేశించారు. లక్కమాంబ కోరినందున ఉపనయనము జరిపిన తరువాత పదునారవ పండుగవరకు ఉన్నారు. ఆకాలములో అన్నమయ్యచేత అధ్యయనం ప్రారంభింపచేశారు. అతనిచేత ఆ పదహారునాళ్లు శ్రీమహాభాగవతాన్ని పారాయణచేయించి వీలైనంతవరకు ముఖ్యఘట్టాలను వ్యాఖ్యానసహితంగా ప్రవచనం చేశారు.

అన్నమయ్య పోతనామాత్యులవారితో "మీరు మా తండ్రిగారికి సఖులగుట మాత్రమేగాక, నాకు బ్రహ్మోపదేశము నారాయణ మంత్రోపదేశముచేసి పితృతుల్యులైనారు. భాగవత మంత్రపరాయణులైన మీ అనుగ్రహాన్ని నేను నిత్యము సర్వ

కాలములందు నన్ను పాయకుండ నుండమని అర్థిస్తున్నాను" అనిచెప్పి సాష్టాంగప్రణామాలుచేసి వీడ్కోలు చెప్పాడు.

పోతనామాత్యులవారు "నాయనా! మహాభక్తుడైన వాని కడుపున పుట్టినావు. మీ తండ్రిగారి ఇష్టదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు. నీవు ఆడిన మాటల్లు అమృతకావ్యముగాను, పాడిన పాటల్లు పరమగానము గాను కాగలదు." అని ఆశీర్వదించి, లక్కమాంబను అనునయించి కుటుంబముతో కలసి స్వస్థలానికి వెళ్లిపోయారు.

పోతనామాత్యులవారు వెళ్లిపోయిన తర్వాత అన్నమయ్యకు తిరుమల కొండపైకిపోయి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలనే కోరిక ప్రబలం కాజొచ్చినది. బాలుడు కొండ యెక్కలేడని తల్లి లక్కమాంబ అతని ఉత్సాహాన్ని కొంతకొంత తగ్గిస్తూ వచ్చింది. కాని అన్నమయ్యకు అదే నిత్యస్మరణ అయింది. స్వామిదర్శనం చేసుకుంటే కాని అతనికి బాహ్యప్రపంచంతో సంబంధము నిలచేటట్లు కన్పించలేదు. అతని మానసికవ్యగ్రత అతిలోకంగా ఉన్నది.

నిత్యవ్యవహారాన్ని విస్మరించి అన్నమయ్య ప్రవర్తిస్తుండగా తల్లికి వీమీ పాలు పోలేదు. వీమి పనిచెప్పినా అన్నమయ్య చీకాకు పడుతున్నాడు. 'బంధులా! తనకు తల్లులును తండ్రులును వగలబెట్టుచు తిరుగువారే గాని' అనియు, 'అంతరాత్ముడు వేంకటాద్రీశు కొలిచెదను - సంతకూటముల అలజడికి లోనుగాను' అనియు, అన్నమయ్య తనలో తాను పలుకుచు తల్లి మాటలను లక్ష్యము చేయకున్నాడు.

లక్కమాంబ శ్రీ తాయారుకు అనేక మ్రొక్కులు మ్రొక్కుకున్నది. తన కుమారుని ప్రవృత్తి జాగరితుని, చేయు మని. కనిపించిన పెద్ద వారందరికీ చెప్పింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన యాత్రికులలో జ్ఞానవయోవృద్ధులుగా కన్పించిన వారం దరికీ మనవిచేసి తన కుమారుని రక్షించమని కోరింది. అందరు వచ్చి అన్నమయ్యను చూచి పోతున్నారే కాని వారేమీ చెప్పలేకపోతున్నారు.

అన్నమయ్య అమ్మవారి ఆలయముఖమంటపంలో పగలల్లా కూర్చుని ఉంటాడు. ఒక మూలగా కూర్చుని ఉంటాడు. పద్మాసనం వేసుకుని ఉంటాడు. నిమీలితనేత్రుడై ఉంటాడు. చేతులు మోకాళ్లమీద పెట్టుకుని ఉంటాడు. అట్లాగే సూర్యాస్తమయందాకా కూర్చుంటాడు. తరువాత ఎట్లాగో లేచి - అమ్మవారి ఆలయంలో ఇచ్చిన ప్రసాదాన్ని భక్షించి వెళ్లిపోతాడు. మళ్లీ ఆలయప్రాంగణంలో ఏ మూలకోపోయి పడుకుంటాడు. ఎవరితోనూ మాట్లాడడు. మళ్లీ సూర్యోదయానికి ముందేలేచి కాల్యకరణీయములను నిర్వర్తించి మళ్లీ అట్లాగే కూర్చుంటాడు. ఈవిధంగా దినములు గడపుచున్నాడే కాని తల్లి మాటలను పట్టించుకోవడం లేదు.

ఒకనాడు పద్మావతీదేవి అమ్మవారి ఆలయానికి వైష్ణవశిఖామణి యొకడు సేవ చెయ్యడానికి వచ్చాడు. ముఖమంటపంలో పద్మాసనస్థుడై నిమీలితనేత్రుడై అన్నమయ్య తపస్సుచేస్తూ ఉండటం ఆయన గమనించి అతని దగ్గరకువెళ్లాడు. ఆయన

కొంతసేపు అన్నమయ్యకు ఎదురుగాకూర్చుండి చూచాడు. తరువాత లేచి అన్నమయ్య వంక ఆర్ద్రంగాచూస్తూ వెళ్లిపోయాడు.

ఆయన వెళ్లిపోతూ ఉంటే అన్నమయ్య అప్పుడు గమనించాడు. ఆ వెళ్లిపోవుచున్న వైష్ణవశిఖామణి గమనరేఖలలో అన్నమయ్యకేవో దివ్యస్ఫురణలు కలిగినవి. ఏదో తేజోమయ సందర్శనం కలిగింది. మనస్సులో సౌకుమార్యభావనలు కలిగినవి. ఆయన వెంట పరువెత్తి ముఖదర్శనం చేదామనుకున్నాడు. కాని ఆయన గమనరేఖ సర్వమూ తేజస్సర్వస్వంగా ఉన్నదేకాని ఆయన స్వరూపమే కన్పింపలేదు. ఆ తేజఃకిరణసముదాయంలో ఆయన ఏ దిక్కుగా వెళ్లినది తెలియనే లేదు. తరువాత తేజోమండలము కొంచెము కొంచెముగా తగ్గిపోతూ చివరకు అదృశ్యమై పోయింది.

దివ్యదర్శనము లభించి దానిని మనస్ఫూర్తిగా అవగాహన చేసుకునేటంతలో అదృశ్యమయినట్లయి అన్నమయ్య విహ్వలించి పోయాడు. దివ్యతేజోదర్శనము కనుపించకపోయినా మనస్సు కలకతేరింది. అతడు అప్రయత్నంగా గొంతు విప్పాడు. ఆశ్చర్యకరంగా కంఠం భూపాలరాగాన్ని ప్రస్తరించింది.

ఇప్పు డిటు కలగంటి నెల్ల లోకములకు
నప్పుడరు తిరువేంకటాద్రీశుఁ గంటి. (పల్లవి)

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి

శతకోటి సూర్యతేజములు వెలుఁగఁగ గంటి
చతురాస్యుఁ బొడగంటిఁ జయ్యన మేలు కంటి. ॥ఇప్పు॥

కనకరత్నకవాటకకాంతు లిరుగడఁ గంటి
ఘనమైన దీపసంఘములు గంటి
అనుపమమణీమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటిఁ గ్రక్కున మేలుకంటి. ॥ఇప్పు॥

అరుదైన శంఖచక్రాదు లిరుగడఁ గంటి
సరిలేని యభయహస్తము గంటిని
తిరువెంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి
హరిఁగంటి గురుఁగంటి నంతట మేలుకంటి. "ఇప్పు"

అనే మధురమైన పదం అన్నమయ్య కంఠంనుంచి శబ్ద తరంగమోహనమై వెలువడింది. అమ్మవారి ఆలయంలో ఉన్న జనమంతా ఆగానమాధుర్యానికి పులకితులై అన్నమయ్యచుట్టు మూగినారు. అన్నమయ్య మాత్రం ఏదో అతిలోక భూములం దున్నట్లు పారవశ్యం అనుభవిస్తూ పాడుచున్నాడు. దూరంగా ఉన్న తల్లి లక్కమాంబ కూడావచ్చి విన్నది. ఆ మాధుర్యానికి ఆమెకు కూడా పారవశ్యం పుక్కిలింతలైనది. అప్పుడు ఆమెకు తన పుత్రుడైన అన్నమయ్య కారణజన్ముడని, మహాభక్తుడని, గాంధర్వవిద్య పూర్వజన్మసంస్కారవిశేషంచేత అతనికి సహజంగా వశ్యమైనదని తెలిసినది.

పాట ముగించిన తరువాత అన్నమయ్య తల్లిని చూచి "అమ్మా! సందేహమెక్కడా లేదు. సంతోషించుకొన్నానమ్మా

నేను. కందువ బ్రహ్మానందమును గైకొన్నానమ్మా నేను. ఏవేళా శ్రీవేంకటేశు డెదురుగా వుండగాను పావనమై యిన్నిటాను ప్రబలుచున్నానమ్మా నేను: నన్ను శ్రీవేంకటాద్రీశు దర్శనము నకు కొండపైకి పోవనీయవమ్మా నీవు" అని ప్రార్థేయపడినాడు.

కుమారుని ఆనందపారవశ్యంలో పాలు పంచుకొన్న లక్కమాంబ "అట్లాగే తండ్రీ. మన ఇలువేలై ఎన శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి బయలుదేరు." అన్నది.

4

ఆ సాయంత్రమే అన్నమయ్య తిరుచానూరులో అమ్మ వారిని సేవించుకుని తల్లి లక్కమాంబ అనుజ్ఞను గ్రహించి దిగువ తిరుపతికి బయలుదేరి "వేడుకుందామా వెంకటగిరి వేంక టేశ్వరుని" అని పాడుకుంటూ వెళ్లాడు. చీకటిపడే సమయానికి దిగువ తిరుపతికి చేరుకున్నాడు. వెంటనే గోవిందరాజ పెరుమాళ్లు దర్శనంచేసుకుని ఆ రాత్రి దిగువ తిరుపతిలో విశ్రమించాడు.

వేకువజామున లేచి కాల్యకరణీయములను నిర్వర్తించు కొని అన్నమయ్య కొండయెక్కుట ప్రారంభించాడు. అన్న మయ్య కొండ యెక్కుతూ భగవన్నామ సంకీర్తనంచేస్తూ ఉన్నాడు. ఆయన వేంకటేశ్వరనామసంకీర్తనాన్ని దేశాటి రాగంలో ప్రారంభించి త్రిపుట తాళంతో మేళవించాడు. అన్న మయ్య గానంలోని చతుశ్రుతి ఋషభ అంతరగాంధార, కైశికి

నిషాదమునందున్న సంవాదమాధుర్యము ప్రభాతకాల ప్రకృతి మయ అంతర్లీననాదాన్ని ప్రస్ఫుటం చేసింది.

అల్లంత దూరాన తిరుమలకొండ దర్శనం ప్రసాదించగా అన్నమయ్య "అదిగో అల్లదిగో హరివాసము, పదివేలశేషుల పడగలమయము" అని శ్రీరాగ రంజితముగా పరవశించి పోయాడు. అఖిలోన్నతమైన వేంకటాచలమును, బ్రహ్మాదులకపురూపమైన దానిని, అఖిలమునులకు నిత్యనివాసమైన దానిని ఆనందమయమైన దానిని చూచి మ్రొక్కులుపెట్టాడు. నింగినున్న దేవతలకు నిజనివాసమై, ముంగిటనున్న మూలధనమై బంగారుశిఖరాల బహుబ్రహ్మమయమై చెంగటనున్న శేషాచలమునకు ప్రణామాలుచేశాడు. కలసంపదలరూపమై పావనములకెల్ల పావనమయమై శ్రీవేంకటపతికి సిరులైన కైవల్యపదము వేంకటనగరమునకు అంజలించాడు.

తరువాత రామక్రియగా కట్టెదుర వైకుంఠము కాణాచిరై తెట్టలుగ మహిమలే తిరుమలకొండగా కన్పించినవని స్తుతించాడు. వేదములే శిలలై వెలసిన కొండ యని, ఏదెసగాని పుణ్యరాసులే యేటులైన కొండ యని, గాదిలి బ్రహ్మాదిలోకముల కోనల కొండ యని, శ్రీదేవుడుండేటి శేషాద్రికొండ యని, సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ యని నిర్వహించి జలధులే నిట్టచటులైన కొండ యని పూర్వతపసులే తరువులై నిలిచిన కొండ యని, వరములను కొటారుగా వక్కణించి పెంచే

కొండ యని, కురిసి సంపదలెల్ల గుహాలనిండిన కొండ యని విరివైన శ్రీ వేంకటపుకొండను కీర్తించాడు.

కొండపైకి పోయెత్రోవ పరమరమణీయంగా ఉన్నదట. మూరట బారట ముంచిన లతలతో త్రోవెల్లా తోరణములేనట. కూరిమి మటములు గోపురములు తెరువెల్లా తేరుపడగల్లే ఉన్నవట. కోరినపండ్లు గురిసేటి తరువులు, తోరములైన వెదురు జొంపములు, ఆటలు దిరువులును అందపుటురుపులు, కూటువనెమిళ్లు కోవిల గుంపులు, పేటల దేటల పెనుగూటములు, వనమంతా వైభవంగా ఉన్నదట. వింజామరలు, విసనకట్టి లుగా కొండెల్లా గొంజె గొడుగులున్నవట. ఈ పర్వతవర్ణనను ఆహిరిరాగంలో పాడుకుంటూ అన్నమయ్య ప్రయాణించాడు.

చింతచెట్టునకు ప్రదక్షిణీకరించి, అడిపడిదాటి, తలయేరు గుండునకు తలను మోకాళ్లను తాకించి అన్నమయ్య శ్రీపాద ములను చేరుకున్నాడు.

భగవద్రామానుజాచార్యులవారు తిరుమలకు విచ్చేసి కొండపై మూడునాళ్లుండి శ్రీవేంకటేశ్వరస్వామిని సేవించిన తరువాత దిగువ తిరుపతిలో సంవత్సరకాలముండి తిరుమల నంబిగారియొద్ద రామాయణరహస్యార్థములను తెలిసికొన్నారట. ప్రతిదినము తిరుమల నంబిగారు తిరుమలలో శ్రీస్వామిని ప్రాతఃకాలమున సేవించి కొండదిగుచు అడిపడి దగ్గరనున్న తలయేరు గుండు సమీపమునవనున్న మండపానికి వచ్చేవారట. ఆ సమయానికి భగవద్రామానుజాచార్యులవారు తిరుపతి గోవింద

రాజస్వామివారిని సేవించుకొని ఆమండపానికి విచ్చేసేవారట. అక్కడ వారికి సమావేశమయ్యేదట. అక్కడనే తిరుమల నంబి గారు రామాయణరహస్యార్థాలను రామానుజాచార్యులవారికి వివరించేవారట.

ఒకనాడు తిరుమల నంబిగారికి చింత కలిగినదట. తనకు నిత్యము స్వామిసన్నిధిని మధ్యాహ్నపూజ తప్పిపోవుచున్నదని చింత. ఆనాటిరాత్రి తిరుమల నంబిగారికి శ్రీస్వామి స్వప్న దర్శనం ప్రసాదించి "నీకు చింతవలదు. నీకున్న కొఱత తొలగి పోగలదు" అని అభయప్రధానం చేశారట. మరునాడు తిరుమల నంబి ప్రాతఃకాల పూజచేసి, అడిపడి మండపానికివచ్చి భగవ ద్రామానుజాచార్యులవారికి రామాయణ రహస్యోపదేశము చేయుచుండగా మధ్యాహ్న సమయమున ఆయన ముందు శ్రీస్వామివారి శ్రీపాదములు దివ్యకుసుమ తులసీ మృగమద కర్పూర సుగంధకల్లోలిత కనుపట్టములై ప్రత్యక్షమైనదట. స్వయంభువులై వెలసిన శ్రీస్వామివారి శ్రీపాదముల కానాటి నుండి అర్చన జరుగుచున్నదట.

అన్నమయ్య శ్రీపాదములను దర్శించి, ప్రణామించి ముఖారిరాగంలో శ్రీపాదస్తుతి చేశాడు. బ్రహ్మ కడిగిన పాద మని, బ్రహ్మస్వరూపమైన పాదమని, భూదేవి కొలిచిన పాదమని, బలిచక్రవర్తి తలమోపిన పాదమని, తలగక గగనమును తన్నిన పాదమని బలరిపుని గాచిన పాదమని, కామిని పాపము కడిగిన పాదమని, పాము తలనిడిన పాదమని, ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదమని పామిడి తురగపు పాదమని ప్రస్తుతులు చేశాడు.

అన్నమయ్య శ్రీపాదములను ప్రస్తుతించి ముందుకుసాగి కుమ్మరమండపానికి చేరుకున్నాడు. పూర్వం ఒక కుమ్మరి ప్రతి దినము స్వామివారి ఆలయానికి కావలసిన వంట కుండలుచేసి ఇస్తూ ఉండేవాడు. స్వామివారి ఆలయానికి ప్రతిదినము చాల కుండలు కావలసి ఉన్నవి. ఎడతెగక ఎల్లప్పుడు కుండలు చేస్తూ ఉండటంవలన అతనికి స్వామిదర్శనం లభించడం కఱవైనది. అతడు కుండలు చేసేచోటనే కొయ్యతో శ్రీస్వామిమూర్తిని కల్పించుకొన్నాడు. కుండలు చేయగా మిగిలిన మట్టితో పువ్వులు చేసి తాను కల్పించుకొన్న కొయ్యమూర్తికి అర్చన చేస్తూ ఉండేవాడట.

శ్రీస్వామివారికి ఆదినములలో తొండమానురాజు తోలి పూజ జరుపుతుండేవాడట. అతని తోలిపూజ బంగారు పూవులతో జరుగుతుండేదట. ఒకనాడు శ్రీస్వామి పాదములపైన బంగారు పూవులు ప్రక్కకుతోయబడి వాటిస్థానంలో మట్టి పూవులుండుట తొండమానురాజు గమనించాడు. రాజు మట్టి పూవులను గురించి విచారించాడు. ఆయనకు మహాభక్తుడైన కుమ్మరిని గురించి తెలియవచ్చింది. ఆకుమ్మరి తాను ఉన్నచోట అర్చించిన మట్టి పూవులు ఆలయంలో ఉన్న శ్రీస్వామి పాదములపైన కన్పడుటవలన అతడు మహోత్ముడైన మహాభక్తుడని తొండమానురాజు గ్రహించాడు. రాజు వినయంతో కుమ్మరిని దర్శించి తన పూజను కూడ శ్రీస్వామి స్వీకరించేటట్లు చేయమని ప్రార్థించాడు. అహంకారహీనుడై నయసంపన్నత కలిగిన తొండ

మానురాజును, మహాభక్తుడైన కుమ్మరిని శ్రీస్వామి సాన్నిధ్య మిచ్చి అనుగ్రహించాడు.

అన్నమయ్య కుమ్మరి మండపంలో కొంతసేపు విశ్రమించి కాంబోది రాగంలో కురువనంబి దాసరి తనము బలమును ప్రస్తుతించి ముందుకు సాగాడు. పెద్ద యొక్కుడు దాటి కపు రంపుదావులు గడునూలుకొలుపు కపురంపు గాలువను దాటి ముందునకు ప్రయాణించాడు.

ఇక అక్కడనుంచి కొండ సాలగ్రామస్వరూపమైనది. అది సాక్షాత్తు శేషాహిమూర్తియే. అందుచేత పాదములతో గాక భక్తులు మోకాళ్లతోనే కొండెక్కువారట. అందుచేత దానికి మోకాళ్ల ముడుపని పేరు. మోకాళ్లను ముడుచుకొని మెట్ల నెక్కవలెను. బాలుడైన అన్నమయ్యకు మోకాళ్లతో నడువవలెనని తెలియలేదు. చెప్పులు వేసికొన్న కాళ్లతో సాగుచున్నాడు.

శేషాహిమూర్తియై సాలగ్రామశిలామయమైన కొండకు అన్నమయ్య చెప్పులున్న కాళ్లతో నడచుట మహాపచార మని పించినది. ఆగ్రహము వచ్చినది. శేషాహి గిట్టున పడగలు త్రిప్పినది. అన్నమయ్యకు కనులు తిరిగినవి. దిక్కులు తెలియ లేదు. మైకము క్రమ్మినది. అతడు స్మృతిపోయి ప్రక్కగానున్న వెదురు పొదక్రింద నొక తాతిబండపై పడిపోయాడు. ఉదయ కాలంలో స్మృతి తప్పిపడిపోయిన అన్నమయ్య మధ్యాహ్నపు కొండలో వెదురుపొదక్రిందనే ఉండిపోయాడు. సాయంకాలం కాబోతున్నా ఆతనికి స్మృతి రానేలేదు. అట్లాగే ఉన్నాడు.

తిరుచానూరులో అమ్మవారి ఆలయంలో సేవలు చేస్తూ ఉన్న లక్ష్మమాంబకు అనవరతమూ తన కుమారుని గురించే ఆలోచనలు. అన్నమయ్య తిరుమలకొండకు బయలుదేరినప్పటి నుండి ఆమె తన కుమారుడు క్షేమంగా తిరిగి రావలెనని అమ్మ వారిని ప్రార్థిస్తూనే ఉన్నది. ఆమధ్యాహ్నకాలానికి ఆమెకు భోజనం చెయ్యాలనిపించలేదు. ప్రతినిత్యము కుమారునికి అన్నముపెట్టి తాను భుజించే తల్లి ఆనాడు కుమారుడు లేకుండా భోజనానికి కూర్చోలేక పోయింది.

తన కుమారుడు అన్నమయ్యకు షడ్రసోపేతమైన భోజ నాన్ని సమకూర్చమని లక్ష్మమాంబ అమ్మవారిని పదే పదే ప్రార్థిస్తూ కూర్చున్నది. లక్ష్మమాంబ చేసిన ప్రార్థనలకు అమ్మవారికి దయ కలిగింది. జగన్మాత అయిన శ్రీతాయారుకి లక్ష్మమాంబ హృదయంలో ఉన్న మాతృవాత్సల్యం, అవగాహన అవడంలో ఆశ్చర్యమేమున్నది!

సాయంవేళదాకా స్మృతిలేకుండా ఉన్న అన్నమయ్యను ఆదరించి లక్ష్మమాంబను అనుగ్రహించాలని అమ్మవారు తల పోసింది. అమ్మవారు లక్ష్మమాంబరూపాన్ని గ్రహించి మోకాళ్ల ముడుపు సమీపంలో వెదురు పొదక్రింద బండతాతిమీద స్మృతి లేకుండా ఉన్న అన్నమయ్యను సమీపించి అతనిని లేవనెత్తి తన ఒడిలో పరుండబెట్టుకుని తన దివ్యహస్తస్పర్శతో అన్నమయ్యకు స్మృతి కలిగించింది. అయితే అన్నమయ్య తన తల్లి ఒడిలోనే ఉన్నట్లుగా భావించుకుంటూ ఉండటంవలన కన్నులు తెరచి ఆమెను సరిగా చూడలేదు. కన్నులు మూసికొని అల

సట తీర్చుకుంటూ ఉన్నాడు. ఆమె మధురమైన పలుకులతో, బుజ్జగింపులతో అన్నమయ్యకు సేదతీర్చింది. అతనిశరీరం నూత్న మైన శక్తి ఉత్సాహాలను పొందింది. కాని అన్నమయ్యకు మాత్రం తాను కొండమీద ఉన్నట్లుగాని, తిరుమల ప్రయాణంలో ఉన్నట్లుగాని, తను స్మృతి తప్పిపడిపోయి మళ్లీ కోలుకున్నట్లుగాని గుర్తుకు రాలేదు. తాను తల్లి ఒడిలో పడుకుని ఉన్నట్లు మాత్రమే అతడు అనుకుంటున్నాడు.

ఆ తల్లి అన్నమయ్యకు దివ్యమైన పాయసాన్ని ముద్దలు ముద్దలుగాచేసి నోటిలోపెట్టి తినిపించింది. తన తల్లి తనచేత వాత్సల్యపూర్ణంగా పరమాన్నం తినిపిస్తున్నదని అన్నమయ్య భావిస్తూ-ముద్దలు కుడుస్తూ-కన్నులు మూసిపెట్టుకుని పాయసం ముద్దలు భక్షించాడు.

అన్నమయ్య పాయసాన్ని భక్షించి సంపూర్ణమైన శక్త్యుత్సాహాలు కలిగిన వాడు కాగా - ఆతల్లి మెల్లిగా అన్నమయ్య తలను తన ఒడిలోనుంచి చేతులతోతీసి చిన్నతాతిమీద పెట్టింది. తాను లేచి నుంచుంది. అన్నమయ్యతో "నాయనా! నువ్వు వేకువజామున కొండమీదకు స్వామిదర్శనానికి బయలుదేరావు. పగటి యెండలో అలసిపోయి ఉంటావని ఆకలివేసి ఉంటుందని, అనుకుని, పాయసం తెచ్చాను. ఇక నేను తిరిగి తిరుచానూరు వెళ్లిపోతాను. నువ్వు కొండమీదకు జాగ్రత్తగావెళ్లు" అని చెప్పింది. అప్పుడుగాని అన్నమయ్యకు తానున్నపరిస్థితి అర్థము కాలేదు. అప్పటికీ ఆమె కొండదిగిపోతూ ఉన్నది. అన్నమయ్య

కన్నులు తెరచి కొండడిగిపోతూ ఉన్న తల్లివంక చూచాడు. అతనికి దిగ్భ్రమ కలిగింది.

అతనికి అతని తల్లి లక్ష్మాంబ కన్పించలేదు. ఒక్క క్షణం సర్వతేజస్సమ్మిశ్రితమై జగన్మాత్రమూర్తి ప్రకాశించి అదృశ్యమై పోయింది. అతనికి పూర్తిగా అర్థం అయింది. జగన్మాత తిరుచానూరు తాయారు తనమీద వాత్సల్యంతో తన తల్లి రూపంతో వచ్చింది. తను స్మృతితప్పి పడిపోయి ఉండగా స్మృతి కలిగించి శ్రమపోగొట్టి దివ్యాన్నప్రాశనం చేయించింది. తన్ను ఒడిలో నుంచుకొని పుత్రునిగా లాలించింది. అయితే తానుమాత్రము మూర్ఖుడై అమ్మవారిని గుర్తించలేదు. క్షుద్ర జీవిగా ప్రవర్తించాడు. ఆమెకు ప్రణామమైనా చెయ్యలేదు. అన్నమయ్యకు అమ్మవారియందు తాను మహాపచారం చేసినట్లు దుఃఖం వచ్చింది.

అన్నమయ్య లేచి నిలువబడి అమ్మవారు వెళ్లిన దిక్కుగా చూచి సాగిలబడి ప్రణామాలు చేశాడు. తన మూర్ఖతకు తన్ను క్షమింపమని ఎలుగెత్తి ప్రార్థించాడు.

అమ్మవారు తనకు సూపఖోట్లతో నేతుల పోపులతో విని ర్మలాన్నముల పరమాన్నశతములపెట్టినదని కృతజ్ఞతలు వెల్లడించాడు. పరమేశ్వరి ఐన అలమేలు మంగాదేవి మఱుగు జొచ్చితినని, మన్ననచేయుమని విన్నపాలు చేశాడు. యోగ్యతలేని కష్టుడనని, అయోగ్యుడనని, గర్భనిర్భాగ్యుడనని చెప్పుకొని

తల్లియొక్క కృపాగరిమ ప్రాప్యముగా కావుమనుచు భాగ్యవతీ శిరోమణి అయిన అలమేలుమంగాంబికను సన్నుతులు చేశాడు.

పదాన్యంతమున "వేంకటేశ్వరా!" అని సంబోధించుతూ అలమేలు మంగాంబికా స్తుతిపరముగా నూఱు పద్యములను వాక్పుష్పసూనములుగా ఆశువుగా చెప్పాడు. తన్ను పాలింపు మని పెక్కు పర్యాయములు అలమేలు మంగాంబికను శ్రీవేంక టేశ్వరుని ప్రార్థించి అన్నమయ్య మురల కొండమీదకు ప్రయాణం సాగించాడు.

5

అన్నమయ్యకు సూర్యాస్తమయకాలంలో అమ్మవారి దర్శనం లభించింది. తరువాత కొంతసేపు పద్యశతకం చెప్పుతూ ఉన్నాడు. తరువాత చీకట్లో మెల్లిగా కొండ ఎక్కడం ప్రారం భించాడు. చీకటిలో నక్షత్రముల కాంతిలో కొంతసేపు— మబ్బులు క్రమ్మిన చంద్రకిరణముల వెన్నెలలలో కొంతసేపు ప్రయాణం చేశాడు. ప్రయాణం చేస్తున్నంతసేపు వేంకటేశ్వర దివ్యనామసంకీర్తనం చేస్తూనే ఉన్నాడు.

అన్నమయ్య కొండపై కెక్కి బ్రాహ్మీముహూర్త సమ యానికి స్వామి పుష్కరిణిని దర్శించి స్నానముచేసి "వేవేలు మొక్కులు లోకపావని" అని గుండక్రియ రాగములో స్వామి పుష్కరిణిని ధ్యానించాడు. పెద్దగోపురాన్ని నీడ తిరుగని చింత చెట్టును గరుడగంభాన్ని చంపకప్రదక్షిణాన్ని వడగోపురాన్ని

భాష్యకారులను, యాగశాలను, ఆనందనిలయాన్ని కల్యాణ మంటపాన్ని బంగారు గరుడుని శేషుని స్వామిని స్తుతించు చిలుక పంజరాలను శ్రీభండారాన్ని బంగారు గాదెలను బంగారు వాకిటిని దర్శించి వినతులు చేశాడు.

స్వామిదర్శనానికై లోపల ప్రవేశించడానికి ప్రయత్నము చేయగా ద్వారము లింకా తెరువబడలేదు. అన్నమయ్యకు నిరుత్సాహమై పోయింది. స్వామికి తనయందు కరుణలేదని భీతి పడ్డాడు. దుఃఖము ముంచుకువచ్చింది. కట్టలు త్రెంచుకొనివచ్చిన కన్నీటిని నిలువ త్రొక్కుకొనలేకపోయినాడు. ఉద్వేగియై శ్రీ వేంకటేశ్వర సుప్రభాతాన్ని సహజమధురంగా తన మనోధర్మాన్ని అభివ్యక్తంచేస్తూ గానం చేశాడు. "వేదాంతవేద్య, నిజవైభవ భక్తభోగ్య, శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతం" అని అంటుండగా బంగారు తలుపులు వాటంతట అవి తెరచుకున్నాయి.

అన్నమయ్య గానంచేస్తున్న సుప్రభాత మాధుర్య స్వర తరంగములతో ఆకృష్యమానులై అప్పటికే ముఖ్య పూజారులు వచ్చి ఉన్నారు. బంగారు వాకిలి తనంతట తాను తెఱచుకోవడం, అన్నమయ్య పైన స్వామివారికి ఉన్న దయావాత్సల్య చిహ్నమని, అన్నమయ్య అసామాన్య భక్తి యుక్తుడైన మహాపురుషుడనీ అందరికీ తెలిసిపోయింది. వారందరు విస్మ్రులై పోయారు. తలుపులు తెఱచుకోగా, పూజారులు అన్నమయ్యను వెంటబెట్టుకొని లోపలకు తీసుకొనిపోయారు.

అక్కడ పురుషోత్తముని చూచి అన్నమయ్య పరవశత్వం పొందాడు. కనకపుపాదములు గజ్జెలు, అందెలు, ఘనపీతాం బరములు, కటారి, మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు, ఒనర నాభీకమల ముకరబంధములు, గరిమవరదహస్త కటిహస్త ములును, సరసనెత్తిన శంఖచక్రహస్తములు ఉరముపై కౌస్తుభ మొప్పగుహారములు, కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు కట్టాణి ముత్యాల సింగారనామము, నక్షత్రసిరముమీద నమరే కిరీటము, అన్నమయ్య చూచి ఆనందపడ్డాడు. మధురమైన గొంతుకతో కీర్తనలు పాడాడు.

స్వామివారి అభయహస్తం అన్నమయ్యకు అభయం ప్రసాదించింది. అందఱికి అభయంబు లిచ్చుచేయి, కందువలగు మంచి బంగారుచేయి, వెలలేని వేదములు వెదికి తెచ్చినచేయి చిలుకు గుబ్బలిక్రింద చేర్చుచేయి, కలికియగు భూకాంత కాగి లించినచేయి, వలనైన కొనగోళ్ళ వాడిచేయి, తనివోక బలిచేత దాన మడిగిన చేయి, ఒనరంగ భూదాన మొసగు చేయి, మొనసి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి, యొనయ నాగేలు ధరి యించు చేయి, పురసతుల మానములు పొల్లచేసిన చేయి తుర గంబు బరపెడి దొడ్డచేయి, తిరువెంకటాచలాధీశుడై మోక్షము తెరువు ప్రాణులకెల్ల తెలిపెడి చేయి, శ్రీస్వామివారి హస్తము అన్నమయ్యకు అనుగ్రహ అభయవరాన్ని ప్రసాదించింది.

పూజారులు స్వామికి ప్రత్యేకార్చనలుచేసి అన్నమయ్యకు దేవాలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు, శ్రీపాదం యిచ్చారు.

అన్నమయ్య తనివితీరా స్వామి విగ్రహాన్ని తిలకించి దివ్యగానం చేసి ఆనందపారవశ్యం పొందాడు. అక్కడ ఉన్న పూజారు లందరూ అన్నమయ్య దివ్యగాంధర్వ గానాన్ని విని పరవశించి పోయారు. అన్నమయ్య దివ్యపురుషుడనీ, గాంధర్వగాయకు డనీ, కారణజన్ముడనీ, వారంతా గ్రహించారు.

అన్నమయ్య స్వామి దర్శనాన్ని చేసుకుని మధ్యాహ్న సమయందాకా గానంచేసి బయటకు వస్తూండగా అతనికి ఆశ్చ ర్యంకలిగే సన్నివేశం జరిగింది. ఎదుట గుమ్మంలో ఒక వైష్ణవ శిఖామణి నిలువబడి ఉన్నాడు. ఆయన నిల్చున్న తీరు అన్న మయ్య కేదో పూర్వపరిచయాన్ని స్ఫురింపజేసింది. కాని ఇదమిత్థ మని పోల్చుకోలేక పోయాడు. ఆయన నిలువబడి ఉండగా— ఒక తేజఃపరిమండలంగా ఉన్నది. పూర్వం తనకు తిరుచానూ రులో అమ్మవారి మందిరంలో కన్పించి అదృశ్యమైన దివ్యస్వరూ పంగా ఉన్నదని అన్నమయ్య భావించాడు.

ఆ భావం కలుగగానే అన్నమయ్య మనస్సు భక్తిగౌరవ ప్రపత్తులమయమై పోయింది. మహావేగంతో వచ్చి ఆ వైష్ణవ శిఖామణి పాదములపైన వ్రాలి ప్రపత్తి పఠించాడు. ఆయన అన్నమయ్యను లేవనెత్తి "నాయనా! నేనే నిన్ను వెతుక్కు టూ వచ్చాను. నీ గానాన్ని ఇంత సేపటినుంచి వింటూ ఇక్కడ నిల్వ బడిఉన్నాను. నీ నాదము నారట భావుళ స్వరూపములుగా ఉన్నది. నీ కంఠశబ్దము మృష్ట మధుర, దేహాల, త్రిస్థానక, సుఖా వహా, ప్రచుర, కోమల, గాఢ, శ్రావక, కరుణమయ, ఘనస్నిగ్ధ,

శ్లిష్ట, ర క్తిమత్తు చనిమత్తుగా ప్రకాశించుచున్నది. నీ గానము మధురమై సుకుమారమై సయమై, శ్లిష్టమై, వ్యక్త వికృష్టమై అలంకృత ప్రసన్నమై రక్తపూర్ణమై విరాజిల్లుచున్నది. స్వల్ప మైన శిక్షతో నీవు ఉత్తమ వాగ్గేయకారుడవు కాగలవు" అని చుబుకాన్ని స్పృశించగా అన్నమయ్య "మహాప్రసాదం" అని అంజలి బంధించి "తమరే నన్ను ఉద్ధరించాలి" అన్నాడు.

ఆ వైష్ణవశిఖామణి తన పేరు 'ఘనవిష్ణుశర్మ' అని చెప్పి ఆనాడే అన్నమయ్యకు సంగీతశిక్షణ ప్రారంభించాడు. అన్నమయ్య జన్మసిద్ధముగా అనభ్యాసముచేత రాగము ప్రకాశించు నట్టి శక్తిగల గాత్రము కలవాడు. అతని కంఠస్వరము తారస్థాయివరకు వ్యాపించునదై అనురణనము, సౌకుమార్యము, రామణీయకత, అగాధత్వము, స్నిగ్ధరంజకత్వము, ఘనకాంతి ప్రాచుర్యత మొదలైన గుణములు కలది.

ఉత్తమగురుశిక్షణలో అన్నమయ్యకు చిత్తైకాగ్రత కుదిరినది. భాషాజ్ఞాన, శబ్దార్థజ్ఞాన, కవిత్వరచనాజ్ఞాన, అలంకారశాస్త్రజ్ఞాన, రసపరిజ్ఞాన, గద్యపద్యపదభావజ్ఞాన, లోకజ్ఞాన, శృంగారశాస్త్రజ్ఞాన, నృత్యగీతవాద్యజ్ఞాన, ద్రుతాదిలయజ్ఞాన, తాళజ్ఞాన, సశబ్దనిశ్శబ్దక్రియాజ్ఞాన, సకలకాకుస్వరజ్ఞాన, ప్రతిభా సంపన్నశ్రావ్యమార్గదేశీరాగప్రావీణ్యత, వాక్పటుత్వ, వీత రాగద్వేషత్వ, రసౌచిత్యభావ, స్వరకల్పనాశక్తి, గీతప్రబంధ ప్రాగల్భ్యత, త్రిస్థాయి గమకప్రజ్ఞ, వివిధ ఆలాపనానైపుణ్యత, నానాగీతనిర్మాణప్రజ్ఞ మొదలైనవి గురుకటాక్షమువలన లభించినవి. అన్నమయ్య వాగ్గేయకార రత్నమైనాడు.

గురుకటాక్షమువలన అల్పకాలములో అన్నమయ్యకు అనల్పమైన సంగీతసాహిత్యపాండిత్యము లభించినది. సంగీతమునకు ముఖ్యమైనది గాయకుని మనోధర్మము. రసోదంచితమైన మనోధర్మము కలుగడానికి గాయకుని మనస్సు విగతకల్మషము కావలసియున్నది. అందుకు భగవద్భక్తి ఒక్కటే సాధనం. అన్నమయ్య సహజముగనే శ్రీవేంకటాచలాధీశునియందు భక్తి గలవాడు. గురువుగారు అన్నమయ్యభక్తి దృఢతమము కావలసియున్నదని అతనికి శ్రీవేంకటేశ్వర తిరుమంత్రరాజాన్ని అనుగ్రహించి త్రిసంధ్యలయందు పురశ్చరణ చేయించారు.

అన్నమయ్య అతని గురువైన ఘనవిష్ణుశర్మ ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారు. అన్నమయ్య విద్యాభ్యాసము, సాధన, సంధ్యాజపపురశ్చరణలు అన్ని ఆలయములోనే. ఆలయములో లభిస్తున్న ప్రసాదాదులే అతనికి ఆహారము. ముప్పదిరెండు వేళలందు శ్రీవేంకటేశ్వరుని మహిమలను కొనియాడుచుండుటే అతని విహారము.

అన్నమయ్య తల్లి లక్కమాంబ తిరుచానూరులోనుండి వచ్చిపోయే యాత్రికులవలన కుమారుని యోగక్షేమములు తెలుసుకుంటూనే ఉన్నది. కాని కుమారుని వదలిపెట్టి - ఏక పుత్రుడు గల తల్లి, విగతభర్తృక - ఎన్నాళ్లు ఏకాంతజీవనం గడుపగలదు!

రోజులు, నెలలు, మాసములు గడచి సంవత్సరము అయింది. ఒక సంవత్సరము గడచి రెండవ సంవత్సరము కూడ

గతించినది. లక్ష్మమాంబ కుమారుని చూడక నిలువ లేక పోయింది. తిరిగి తిరుచానూరు రమ్మని కుమారునికి వర్తమానం పంపింది.

అవిరళ సంగీత సాహిత్యవిద్యాసాధనలోఉన్న అన్న మయ్య తల్లిగారి వర్తమానాన్ని మనస్సునకు తెచ్చుకోలేదు. అన్నమయ్య సాధనలో తల్లిగారి స్మరణలేనేలేదు.

ఒకనాడు తల్లి లక్ష్మమాంబ బయలుదేరి వచ్చింది. కొండపైకెక్కి ఆలయంలోకి ప్రవేశించింది. ప్రదక్షిణము ప్రారంభించినది. కల్యాణమంటపములో గురు సన్నిధానమున కూర్చుండి ఆనందభైరవి రాగ ఆలాపనసాధనచేస్తూ తన్మయుడై, న్యాసాదులతో, సంవాదస్వరములతో పరిసరవాతావరణానికి ఆనందసమాధి కూర్చుచున్న కుమారుని చూచింది. ఆగానాన్ని వినగా ఆమెకున్నూ మాధుర్యరసానందస్థితి లభింపగా వింటూ నిలబడిపోయింది.

కొంతసేపటికి అన్నమయ్య సాధననిలిపి కన్నులు తెరచి ఎదురుగా నిలబడి ఉన్న తల్లిని చూశాడు. వెంటనే లేచివచ్చి ఆమెకు పాదాభివందనంచేసి "కుశలమేనా అమ్మా! ఎప్పుడు వచ్చావమ్మా" అన్నాడు. ఆమె సమాధానం చెప్పేలోగా గురువైన ఘనవిష్ణువు ఆమెవంక తిరిగి "అమ్మా! నీవు ఇక్కడ లేని కొరతలేకుండా నీకుమారుణ్ణి నేను జాగ్రత్తగా చూచాను. ఇతడు గాయకసార్వభౌముడైనాడు. వాగ్గేయకార రత్నమైనాడు. ఇక సంగీతములో నేర్వవలసినది మిగల్చలేదు. ఇతనిని ఇక నీవు ఇంటికి తీసికొనిపోవచ్చును" అన్నాడు.

లక్కమాంబ ఆయనకు నమస్కరించి "తండ్రీ! మీరు మహాత్ములు. మీకృపవలన నా కుమారుడు పెద్దవాడైనాడు. వీనిని ఆశీర్వదించి పంపండి" అని మళ్లీ మోకరిల్లినది. అన్న మయ్య తల్లితో "అది కాదమ్మా! నేను గురువుగారిని విడచి శ్రీస్వామిని విడచి ఉండలేనమ్మా! నన్ను మన్నించవమ్మా" అని ప్రార్థేయపడ్డాడు. అప్పుడు ఘనవిష్ణుశర్మ "అన్నమయ్యా!" అని పిలువగా అతడు గురువుగారి ముందు మోకరిల్లాడు.

అంత అన్నమయ్యతో గురువుగారు "నాయనా! నీవు దివ్యమంత్రాన్ని పురశ్చరణచేసి సిద్ధుడవైనావు. స్వామి నీవు పిలిస్తే - ఎక్కడకురాడు! నీవు కోరితే ఎప్పుడు కన్పించడు! ఇక నీవు నీతల్లిగారి కోర్కెలను తీర్పవలసిఉన్నది. ఆమె వెంట బోయి పుత్రధర్మాన్ని నిర్వహించు. నీవంశమున పుట్టబోవు వారు మహనీయులు కాగలరు" అని దివ్యోపదేశపురస్సర ముగ ఆశీర్వదించారు.

అన్నమయ్య, అతని తల్లి ఆయనకు కృతజ్ఞతా ప్రణామాలు చేసిలేచారు. అప్పుడు వాళ్లకు ఆశ్చర్యమైంది. అంత వరకు అక్కడఉన్న గురుమూర్తి ఘనవిష్ణుశర్మగా రచ్చటలేరు. ఎటువెళ్లినట్లు లేదు. ఆయన తేజోమయుడై అక్కడనే కాంతిలో కలసిపోయినట్లుగా ఉన్నది. శ్రీవేంకటేశ్వరస్వామియే అట్లు మానవాకారంలోవచ్చి తన్ను సంగీత సాహిత్య శిక్షితుని చేసినట్లు అన్నమయ్య భావించి తల్లితో గర్భాలయమునకు వెళ్లి స్వామిని బహువిధాల కీర్తించాడు. కృతజ్ఞతలు నివేదించాడు.

6

క్షామపరిస్థితులు తొలగి తమ తాళ్లపాక గ్రామం తృణ జలకాష్ఠ సన్నృద్ధిగా ఉండటంవలన అన్నమయ్య తల్లి లక్కమాంబతో తిరుచానూరునుండి వచ్చి స్వగ్రామంలోనే ఉంటున్నారు. అన్నమయ్య సాహిత్య గ్రంథాలను చదువుకుంటూ సంగీతసాధన చేసుకుంటూ, శ్రీవేంకటేశ్వరుని నిత్యపూజా ధ్యానములతో సేవించుకుంటూ, దినములు గడపుతున్నాడు.

సంవత్సరములు గడుస్తుండగా లక్కమాంబకు వృద్ధాప్యం పెరుగుతూవచ్చింది. ఆమె తన కుమారుని వివాహం చేసుకోమని తొందరచేస్తూ వచ్చింది. క్రోధి సంవత్సర వైశాఖ పూర్ణిమా విశాఖానక్షత్రకాలమున జన్మించిన అన్నమయ్యకు ఇరువది సంవత్సరములు పూర్తికావచ్చుచున్నవని రుధిరోద్గారి చైత్ర శుక్ల పాడ్యమి సంవత్సరాదినాటికే లక్కమాంబ వెంటనే కుమారుని పెండ్లిచేయాలని పట్టుదల పట్టింది.

లక్కమాంబ సోదరుడు వెంకటరమణయ్య సిద్ధవట సీమలోని మాడుపూరు గ్రామంలో ఉన్నాడు. ఆయనకు తిరుమలమ్మ అను కుమార్తె ఉన్నది. ఆమె అన్నమయ్యకు తగిన కన్యయే. పన్నెండేండ్ల వయస్సున్నది. ఆమె పుట్టిననాటినుండి లక్కమాంబ ఆమెను తన కోడలుగానే భావిస్తున్నది. లక్కమాంబ తమ్మునికి వర్తమానం పంపగా ఆయన తాళ్లపాకవచ్చి పెద్ద లతో సంప్రతించి లగ్నం నిశ్చయించాడు. వైశాఖ పూర్ణిమ వెళ్లిన తదియనాడు పెండ్లికి లగ్నం పెట్టారు.

తాళ్లపాకనుండి మాడుపూరు వెళ్లే త్రోవలో చెయ్యేరు అనే బాహుదానది ఉన్నది. మధ్యలో ఉన్న ఏరు దాటవలసి ఉన్నది గనుక విదియనాటికే మాడుపూరుచేరి అక్కడనే స్నానకం చేసుకోవలసివచ్చింది. పౌర్ణమి చివరి ఘడియలలో బండికట్టుకుని లక్కమాంబ కుమారునితో మాడుపూరు బయలు దేరింది. ఆరాత్రి చెయ్యేరు గట్టుపైన ఉన్న గుండ్లూరులో మకాముచేశారు.

గుండ్లూరులో ఏటిగట్టున అతిపురాతన శివాలయం ఉన్నది. ఆ శివాలయంలోకి ప్రతిపూర్ణిమా అమావాస్యలకు, దివ్యనాగేంద్ర డొకడు వచ్చి శివలింగానికి పడగపట్టి సేవించి వెళ్లుతాడని ప్రతీతి. ఆ దేవాలయంలో వైశాఖ పూర్ణిమకు తిరునాళ్లు జరుగుతాయి. మరునాడు పాడ్యమినాడు రథోత్సవం జరుగుతుంది. ఆనాటితో ఉత్సవాలు ముగింపు.

అన్నమయ్య తల్లితో గుండ్లూరు చేరిన నాటిరాత్రి ఉత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ పెండ్లివారుకూడా ఉత్సవాలలో పాల్గొని దేవదర్శనం చేసుకున్నారు. ఆరాత్రి గుండ్లూరు దేవాలయ ధర్మశాలలో భోజనాలు చేశారు.

భోజనాల దగ్గర అన్నమయ్యను లక్కమాంబను టంగుటూరు నివాసి వేంకటాచలమయ్య చూశాడు టంగుటూరు బాహుదానదికి ఆవలగట్టున దాదాపు నాలుగు క్రోశుల దూరంలోఉన్న పెద్ద ఊరు. వేంకటాచలమయ్య అన్నమయ్య తండ్రి నారాయణయ్యకు ప్రాణస్నేహితుడు.

వేంకటాచలమయ్య లక్ష్మమాంబను గుర్తించి కుశల ప్రశ్నాదికం చేశాడు. తాను సకుటుంబంగా ఉత్సవాలు చూడ టానికి వచ్చానని, తన భార్య, కుమార్తె అక్కలమ్మ కరణముగా రింట్లో ఉన్నారని చెప్పాడు. కరణముగారు తనకు బావమరది అని చెప్పి—వీరిద్దరినీకూడా తనతో రమ్మని కరణముగారింట్లో విశ్రాంతి తీసుకోవచ్చునని వసతి ఉన్నదని తొందరలు చేశాడు.

ఆయనమాట తోసివేయడానికి కాక లక్ష్మమాంబ కుమారునితో కలసి కరణముగా రింటికి వెళ్లింది. తమతోవచ్చి కుమారుని వివాహం చేయించమని ఆమె వేంకటాచలమయ్య గారిని కోరవలసివచ్చి కోరింది. ఆయన సరేనన్నాడు. కొంచెము సేపట్లోనే వేంకటాచలమయ్యగారి భార్యకు లక్ష్మమాంబకు గాఢమైన అనుబంధం ఏర్పడిపోయింది. అక్కలమ్మ చక్కని చుక్క. మంచి పొడుగరి. ఆపిల్ల లక్ష్మమాంబను 'అత్తమ్మ' అని పిలుస్తూ సన్నిహితురాలైనది.

తన సోదరుని కుమార్తె తిరుమలమ్మకంటె యీపిల్ల అక్క లమ్మ చక్కనిదని, తనమీద ఎక్కువ భక్తి ప్రేమలు చూపిస్తున్న దని, ఈపిల్ల తనకు కోడలు అయితే ఎంతో బాగుండేదని లక్ష్మమాంబ అనుకున్నది.

తెల్లవారిన తర్వాత అక్కడనే కాల్యకరణీయాలు అన్న మయ్య నిర్వర్తించుకున్నాడు. వేంకటాచలమయ్యగారి బలవం తముమీద ఆయన బావమరది కరణముగారి బలవంతముమీద

ఆపూట వారింటిలోనే భోజనం చేసిన తరువాత బయలుదేరుటకు అంగీకరింపవలసి వచ్చినది.

అన్నమయ్య అనుష్ఠానమునకు, దేవతార్చనకు, కావలసిన వస్తుసామగ్రిని, పూజాద్రవ్యాన్ని అక్కలమ్మ తెచ్చిపెట్టుతూ అన్నమయ్యను "బావగారు" అని పిలుస్తూ అతని మనస్సును హరించింది. అన్నమయ్యకు ఆమెపైన మనస్సు నిలిచింది. ఆమె సౌందర్యం అతని మనస్సును ఆకర్షించింది. ఆమె కలుపుగోలు తనము, ప్రవర్తన, ఉత్సాహం అతనిని చలింపచేసినై.

వేంకటాచలమయ్యగారు తన భార్యతో, కుమార్తె అక్కలమ్మతో అన్నమయ్య లక్కమాంబల బండిలోనే వివాహానికి బయలుదేరారు. బండిబయలుదేరి చెయ్యేరు గట్టుకి వచ్చింది. చెయ్యేరు అకాలవర్షముతో నిండుగా ఉన్నది. కష్టము మీదగాని బండి ఏరు దాటునట్లు లేదు.

బండితోలువాడు బండిని ఏటిలో దింపినాడు. అతడు దిగి ఎద్దుల తలత్రాళ్లు పట్టుకొని ముందు నడుస్తూ బండిని ప్రవాహమును దాటిస్తున్నాడు. వేంకటాచలమయ్యగారు కూడా బండి దిగి, బండి వెనుకగా ఉండి ముందున్న వానికి హెచ్చరికలు చేస్తున్నాడు. బండిలో లక్కమాంబ, వేంకటాచలమయ్యగారి భార్య, కుమార్తె అక్కలమ్మ ఉన్నారు. అన్నమయ్య ముందు తోట్టిలో ఉండి ఎద్దులను అవసరమైనప్పుడు అదలిస్తూ ఉన్నాడు.

బండిలోఉన్న తన తల్లి లక్కమాంబా వద్దని వారిస్తున్నప్పటికీ విస్వించుకోకుండా అక్కలమ్మ బండిలో బాగా వెను

కకు వచ్చి కూర్చుని ప్రవాహాన్ని చూస్తూ—"బావగారూ! అటుచూడండి. పెద్ద తాటిదుంగ కొట్టుకువస్తున్నది బావగారూ! ఇటు చూడండి చిన్న ఈతచెట్టు కొట్టుకుపోతున్నది." అని అన్న మయ్యకు చూడమని హెచ్చరికలుచేస్తూ ఉన్నది.

ఆమె బండి చివరకూచుని అటూ ఇటూ చూస్తూ శరీరాన్ని బండిలోనుంచి వంచి ప్రవాహాన్ని తిలకిస్తూ దూరాన దేనినో చూచి దానివంక చేయి చూపుతూ "బావగారూ!" అంటూ బండిలోనుంచి ప్రవాహంలో పడిపోయింది. వెనకాల కొంచెం దూరంలో ఉన్న వేంకటాచలమయ్యగారు, బండిలో ఉన్న లక్కమాంబ, అక్కలమ్మ తల్లి ఒక్కసారి గొల్లుమన్నారు.

క్షణంలో అన్నమయ్యకు అంతా అవగాహన అయింది. ప్రవాహంలో కొట్టుకొనిపోతున్న అక్కలమ్మ కన్పించింది. పైన ఉన్న ఉత్తరీయాన్ని తీసి బండితొట్టిలో వేసి అన్నమయ్య వెంటనే ప్రవాహంలోకి దూకి నిమిషంలో అక్కలమ్మను చేరుకున్నాడు.

అక్కలమ్మ అప్పటికే రెండు మునకలువేసి తేలింది. రెండు గ్రుక్కలు నీరు త్రాగింది. సగం స్మృతిపోయి ఉన్నది. అన్నమయ్య అక్కలమ్మను సమీపించి ఆమెను ఒక చేత్తో పట్టుకుని వాటువేసుకున్నాడు. అప్పటికే ఆమె ధరించిఉన్న పావడా ప్రవాహంలో కొట్టుకొని పోయింది. పైన ధరించిన రెవిక మాత్రం అంటిపెట్టుకుని ఉన్నది.

అన్నమయ్య ఆమెను ఒక చేత్తో కౌగిలించుకొని, రెండవ చేతి సహాయముతో నిలువు ఈత ఈదుతూ—మెల్లిగా ప్రవాహానికి కొంచెం వాలుగాపోతూ కొంచెం దూరాన ఆవలిగట్టుకి చేరుకునేటట్లు కన్పించాడు.

అన్నమయ్య నోటితో చేతులతో చేసిన సంజ్ఞలను గుర్తించి మిగిలినవారు అక్కలమ్మకు ప్రమాదం లేదని గుర్తించారు. త్వరగా బండిని ఏరు దాటించారు. వేంకటాచలమయ్యగారు పరువెత్తుకొని వాలుగా కొంతదూరానకు గట్టుచేరుకొన్న అన్నమయ్య దగ్గరకువచ్చి చేరాడు.

ఒడ్డు చేరేటప్పటికి అక్కలమ్మకు తగినంత స్మృతి వచ్చింది. ఆమె అన్నమయ్యను గట్టిగా కౌగలించుకొని ఉన్నది. వస్త్రము లేకపోవడంవలన ఆమెకు లజ్జగా ఉండి కౌగిలి వదలనేలేదు. బట్టలేకుండా అన్నమయ్య ఎదురుగా విడిగా ఎట్లా నిలుచుండాలి? ఇంతలో అక్కడకు చేరిన వేంకటాచలమయ్యగారు తన ఉత్తరీయం అన్నమయ్య కందిచ్చాడు.

అన్నమయ్య ఆ ఉత్తరీయాన్ని అక్కలమ్మకు చుట్టచుట్టి "ఇక సిగ్గుపడనక్కరలేదులే! బావగారి కౌగిలి వదలిపెట్టవచ్చు" అన్నాడు. అక్కలమ్మ సిగ్గు పడిపోయింది. వేంకటాచలమయ్యగారు మళ్ళీ బండిదగ్గరకుపోయి అందులోనుంచి ఇంకొకపావడా, రెపిక తీసుకరావడానికి పరుగెత్తాడు.

ఇంతలో అన్నమయ్య ఒడ్డున కూర్చున్నాడు. అక్కలమ్మ తండ్రిగారి ఉత్తరీయాన్ని చుట్టుకొని తానుకూడ అన్న

మయ్యకు దగ్గరలో కూర్చున్నది. అన్నమయ్య నవ్వుతూ "మొండిమొల మరదలిగారి మొగు డెక్కడున్నాడు?" అంటూ రాగం తీశాడు. అక్కలమ్మ సిగ్గుపడి తలవంచుకున్నది. అన్న మయ్య మళ్ళీమళ్ళీ రెట్టించి అదేపాట పాడాడు. అప్పుడు అక్కలమ్మ "వీటిగట్టుమీద ఎడముగా ఉన్నాడు!" అన్నది.

అన్నమయ్య ఆమాటకు ఆనందం తట్టుకోలేక "అమ్మో! ఎంత ఆశ!" అన్నాడు. అప్పుడు ఆమె అన్నది "ఏమి బావా! నన్ను నీవు మొండిమొలతో చూశావు. కాగిలించుకున్నావు. ఇప్పుడు నీవు తప్ప నన్నెవరు పెండ్లాడుతారు? నీవు నన్ను పెండ్లాడకపోతే ఈసారి నిజంగా వీట్లో దూకుతాను" అన్నది. "ఐతే ఇందాక నిజంగా దూకలేదన్నమాట. నన్ను కాగిలించు కోవాలని నాటకంగా దూకా వన్నమాట!" అని అన్నమయ్య అన్నాడు.

"పోనీ అట్లాగే అనుకో! ఈనది పోగొట్టుకొన్న చేతులను ఇస్తుందని బాపనదానది అన్నారు. ఇది సంగీతసాహిత్యాలరాశి అయిన భర్తనుకూడా ఇస్తుందన్నమాట" అన్నది అక్క-లమ్మ. అన్నమయ్య పగలబడి నవ్వాడు.

ఇంతట్లో కుమార్తెకు బట్టలు పుచ్చుకొని వేంకటాచల మయ్యగారు ఆయన భార్య, అన్నమయ్యకు ధోవతి పుచ్చుకుని లక్కమాంబ వచ్చారు.

7

తిరిగివచ్చి అందరూ బండి ఎక్కేదాకా వేంకటాచల మయ్యా ఆయన భార్యా, తమ ఏకపుత్రిక అక్కలమ్మ ప్రాణా లను రక్షించినందుకు అన్నమయ్యకు కృతజ్ఞతలు చెపుతూనే ఉన్నారు. అవే మాటలు, అవే భావాలు మళ్లీమళ్లీ చెప్పారు. లక్కమాంబ మాత్రము 'ఇవాళ లేచినవేళ మంచిదైనది. బిడ్డ లిద్దరు క్షేమంగా ఉన్నారు' అని భగవంతునికి కృతజ్ఞత తెలిపింది.

జరిగిన సంఘటనలవలన మనస్సు నూత్న ఉత్సాహపూరిత మయి అన్నమయ్య బండి ఎక్కగానే కూనిరాగములలోకి దిగాడు. ఆరాగములు త్వరలోనే పెద్దవి ఐనాయి. అతడు ధారాళంగా పాడసాగాడు. అతని గానములోని సౌకుమా ర్యము ప్రసన్నత అపూర్వములై వేంకటాచలమయ్యగారికి ఆయన భార్యకు అమితమైన ఆనందాన్ని కలిగించాయి. అక్క లమ్మ కూడా బండిలో ముందు భాగంలో అన్నమయ్యకు ప్రక్కగా కూర్చుని ఉన్నది. ఆమెకు ఈ అతిలోకగాంధర్వ మాధుర్యం పరవశత్వాన్ని కలిగించింది.

అక్కలమ్మ అన్నమయ్యమీదకు పరవశత్వంతో వ్రాలి పోయింది. ఆమె తనమీద వ్రాలగా అన్నమయ్య ఆమెవంక చూచి నవ్వుతూ పాట ఆపాడు. ఆమెకు సమాధిభంగము అయి నట్లయి కన్నులు తెరచి అతనిపైనుండి లేచి సర్దుకుని కూర్చుని తానుకూడా నవ్వింది. అప్పుడు అన్నమయ్య "మరదలుగారూ! కొట్టుకుపోతున్న ప్రవాహంలో అయితే నన్ను కాగిలించుకో

వచ్చునుగాని, బండిలో కూర్చుని అందరి ముందూ - పాట పాటకూ కౌగిలించుకోరాదు" అంటూ నవ్వాడు. అక్కలమ్మ సిగ్గుపడి ముసిముసి నవ్వులు నవ్వింది. వేంకటాచలమయ్యగారు, ఆయన భార్యకూడా నవ్వారుగాని, వాళ్లకు ఏదో అంతరార్థము స్ఫురించిందిగాని అది సరిగా రూపుకట్టలేదు.

అన్నమయ్య తల్లితో "అమ్మా! మరదలుగారు ప్రవాహం నుంచి బయటపడిన తర్వాత ఏమిచెప్పిందో విన్నావా?" అన్నాడు. ఆమాటలు అన్నమయ్య తల్లితో అన్నాడే కాని నిజానికి అక్కలమ్మ తలితండ్రులకోసం ఉద్దేశించినవే. వేంకటాచలమయ్యగారే అందుకుని 'ఏమిచెప్పింది నాయనా!' అన్నాడు. అన్నమయ్య "మీ అమ్మాయిగారినే చెప్పనియ్యండి" అన్నాడు. అక్కలమ్మ మాట్లాడలేదు. అప్పుడు అన్నమయ్య మళ్లీ "మరదలుగారూ! మీరు చెప్పినమాటలు మీ తండ్రిగారికి మీ అమ్మగారికి తెలియాలి. మా అమ్మగారికి తెలియాలి. మీరు మౌనం పట్టుకు కూచుంటే మీ కోరిక నెరవేరదు. తరువాత నీళ్లలో దూకుతానంటే లాభం లేదు" అన్నాడు.

వేంకటాచలమయ్యగారు "ఏమిటమ్మా అది" అన్నాడు. అక్కలమ్మ "అదికాదు నాన్నా! నేను ప్రవాహంలో పడిపోయినప్పుడు నాపరికిణా జారిపోయి కొట్టుకుపోయింది. బావ నన్ను పట్టుకునేటప్పటికి నాకు పరికిణా లేదు. ఆయన నన్ను కౌగిలించుకొని తెచ్చాడు. నేను కూడా ఆయన్ను కౌగిలించుకొని వచ్చాను. అంతసేపు వస్త్రహీనంగా బావను కౌగలించుకున్న

నన్ను వేరే పురుషులెవ్వరు వివాహమాడతారు చెప్పు? అంతే కాదు. ఇంతసేపు బావ కాగిలిలో ఉన్నతర్వాత నా మనస్సు ఎట్లా ఉంటుందో గ్రహించు. ఇప్పుడు బావ నన్ను చేపట్టకపోతే నాగతి ఏమికావాలిచెప్పు? నేను లోకం ముఖం ఎట్లా చూడాలి? అందుచేత బావతో చెప్పాను - "నన్ను పెండ్లాడకపోతే నేను మళ్లీ నీళ్లలో దూకుతానన్నాను."

ఆమె మాటలకు తలి తండ్రులు విస్మయచకితులయ్యారు. తమ పసికూన ఇంత ఆరిందా మాటలనెట్లా నేర్చిందా అని విస్తు పోయారు. కాని ఆమె మాటలు అతిసమంజసంగా ఉన్నాయని, కులీన అయిన కన్య అట్లాగే చెప్పవలసి ఉన్నదని వాళ్లు నిశ్చ యానికి వచ్చారు. లక్ష్మమాంబకు ఆమాటలు ఆనందాన్ని విభ్రాంతిని కూడా కలిగించాయి. అక్కలమ్మ కోడలు కావడం ఆమెకు ఇష్టమే. ఐతే పుట్టిననాటినుండీ తన కోడలని చెప్పు కుంటున్న తిరుమలమ్మగతి ఏమికావాలి! వివాహలగ్నం నిశ్చయ మైన తర్వాత తిరుమలమ్మను చేసుకోమని చెప్పడ మెట్లా సాధ్య మౌతుంది? పైగా ఆమె తన సోదరుని కూతురు. రక్తసంబంధము. ఆమెకు అన్యాయం జరుగకూడదు.

వేంకటాచలయ్యగారికి కూడా ఏమీ పాలు పోలేదు. కుమార్తె అక్కలమ్మ భావాలు సక్రమంగా, సమంజసంగా, సంప్రదాయబంధురంగా, కులీనంగా ఉన్నాయి. కాదనడానికి వీలు కన్పించడమే లేదు. ఐతే అన్నయ్యకు మేనమామ కూతురుతో రెండురోజులలో వివాహంకావలసి ఉన్న

దాయెను. ఏమి చెప్పడానికి అతనికి నోరాడలేదు. ఆయన భార్యకు మతిపోయినట్లయింది. చివరకు ఆయన గొంతుక పెకలించుకుని "లక్ష్మమాంబ అక్కయ్యా! ఇప్పుడు ఈవిపత్తు నుంచి మమ్ము ఎట్లా గట్టెస్తావో? నీ కుమారుడు అక్కలమ్మ ప్రాణాలను కాపాడాడు. ఇప్పుడు నువ్వు మా ముద్దుర ప్రాణాలను కాపాడాలి." అన్నాడు.

లక్ష్మమాంబ మాత్రం ఏమి చెప్పకలుగుతుంది. "ఈవిచిత్రపరిస్థితులలో నాకేమీ తోచడంలేదు." అని చెప్పి నిట్టూర్చి అన్నమయ్యతో "నాయనా! ఈపరిస్థితులను ఎట్లా చక్కదిద్దుతావురా!" అన్నది. అన్నమయ్య తల్లితో "అమ్మా నువ్వు తొందరపడకు. ఇందులో ఏదో భగవన్నిర్ణయం ఉన్నట్లుగా ఉన్నది. అంతా సక్రమంగానే జరుగుతుంది. ఎవరికిగాని అన్యాయం జరుగదు. మామయ్యదగ్గరకు వెళ్లుతున్నాముకదా! అక్కడనే అంతా తేలుద్దాము. మామయ్య అన్నీ తెలిసినవాడు. ధర్మం తెలిసినవాడు. ఆయనమటుకు అక్కలమ్మకు అన్యాయం చెయ్యమని చెబుతాడా? తన కుమార్తెకు అన్యాయం జరిగితే ఒక్కటే - అక్కలమ్మకు జరిగితే ఒక్కటేనా? మీరా రెవ్వరు ఆందోళన పడకండి. నా మనస్సు శాంతి భంగం పొందటంలేదు. అన్నీ అందరికీ తృప్తిగా సరిదిద్దుకుంటాయని నాకు తోస్తున్నది. 'సతాంహి సందేహ ప్రదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః' అని పెద్దలు చెప్పుతున్నారు కదా!" అన్నాడు.

అంతకంటె అప్పుడు జరుగతగినది ఏమీలేదు కనుక లక్ష్మమాంబ, అక్కలమ్మ తలితండ్రులు ప్రత్యుత్తరమేమీ చెప్పలేదు. ఐతే వేంకటాచలమయ్యగారు మాత్రం "ఏమో నాయనా! మాబిడ్డ అక్కలమ్మ అందాలరాశి, బుద్ధిమంతురాలు. దానిని నీకు బావుదానది భార్యగా అందిచ్చింది. అమ్మవారు లక్ష్మీదేవిని క్షీరసాగరం శ్రీమహావిష్ణువునకు సమర్పించగా - గంగాదేవి అయిన బావుదానది నీకు అక్కలమ్మను సమర్పించింది. అమ్మవారు లక్ష్మీదేవి విష్ణువక్షస్థలంలో నిత్యనివాసం ఏర్పరచుకొన్నది. మరి నీవు అక్కలమ్మను ఎట్లా దక్కించుకుంటావో" అని దీనంగా అన్నాడు.

ఆయనభార్య "బాను తండ్రీ. నాబిడ్డను ఇంకోసారి రక్షించు. అది మాకు ఏక సంతానం. దానిని రక్షిస్తే మాకుటుంబాన్ని రక్షించినట్లే. మాముగ్గురి ప్రాణాలు నీ చేతులలో ఉన్నాయి" అన్నది.

అన్నమయ్య మళ్లీ "మీరు ఆందోళనపడకండి. అంతా తృప్తిగానే జరుగుతుంది" అని చెప్పాడు.

*　　*　　*　　*

ఆ సాయంకాలానికి పెండ్లివారి బండి మాడుపూరు చేరుకున్నప్పటికి ఊరుబయటనే లక్ష్మమాంబ సోదరుడు వేంకట రమణయ్య కొద్దిమంది బంధువులతోవచ్చి స్వాగతాలు చెప్పాడు. టంగుటూరు వేంకటాచలమయ్యగారు సకుటుంబంగా పెండ్లికి వచ్చారని చూచి ఆనందపడ్డాడు. పెండ్లివారిని

ఊరుమధ్య మాధవాలయంలో చాపలుపరచి కూర్చుండపెట్టి వారికి సదుపాయాలు చేయడానికి బంధువులను నియోగించి వేంకటాచలమయ్య పానకపుకావిళ్లు పట్టించుకొని వస్తానని వెళ్లాడు. పెండ్లివారు ఎక్కివచ్చిన బండి ఆయన పంపించినదే. ఆయనవెంట బండివాడు బండిని తోలుకెళ్లాడు.

ఘడియకాలం తరువాత వచ్చిన వేంకటరమణయ్య పానకపు కావిళ్లతో వచ్చాడు. వెంట ఆయనభార్య ఇతర సువాసినీ జనం ఉన్నారు. మంగళవాద్యములు ఉన్నవి. ఆయన రావడం సరాసరి వేంకటాచలమయ్యగారిని సమీపించి "అన్న య్యగారు! నన్ను క్షమించండి. విషయాలు నేను వెంటనే గ్రహించలేకపోయాను. మీరు, వదినగారు, అమ్మాయిని వెంట బెట్టుకుని మన ఇంటికి పదండి. బయట బండి సిద్ధంగా ఉన్నది. మీరు ఉండవలసినది ఇక్కడ కాదు. ఆలస్యం చెయ్యకపదండి" అన్నాడు.

ఆయన మాటలు అర్థంకాక వేంకటాచలమయ్యగారు, ఆయన భార్య ఒకరి నొకరు చూచుచున్నారు. తటపటా యించారు. తన మాటలు వారికి సరిగా అవగాహనకాలేదని వేంకటరమణయ్య గ్రహించాడు. "అన్నగారూ! నాకు అంతా తెలిసింది. త్రోవలో చెయ్యేరునదిలో అమ్మాయి ప్రవాహంలో కొట్టుకొనిపోతుంటే అల్లుడు రక్షించాడని తెలుసుకున్నాను. వాడు నామేనల్లుడే కదా! వాడి మనస్సు నాకు అర్థమైంది. వాడికి ఇష్టమైనపని చెయ్యడమే నా అభిమతం. ఇక మీరు

మాయింటికి పదండి అక్కడ మిగతా విషయాలు మాటాడు కుందాం" అన్నాడు.

ఆయన భావ మేమిటో ఇంకా వీరికి అవగాహనకాలేదు. లక్కమాంబకు కూడా అతని ధోరణి అవగాహనకాలేదు. ఆమె "తమ్ముడూ! నువ్వు చెప్పుచున్నది బోధపడలేదురా!" అన్నది. వెంకటరమణయ్య "అక్కా! బండివాడు నాకంతా విశదంచేశాడు. అబ్బాయి అన్నమయ్య ధర్మమూర్తి. అక్కలమ్మకు అన్యాయం జరుగటం అతనికి అభిమతంకాదు. అట్లాగే చిన్నప్పటినుంచి తన భార్య అని మురిపాలు చూపిన నాబిడ్డ తిరుమలమ్మకుకూడా అన్యాయం జరుగకూడదని అన్నమయ్య అభిప్రాయం. ఈ వివరాలన్నీ బండివాడు నాకు చెప్పుతుండగా వింటున్న తిరుమలమ్మ సమస్యను తేలికగా తేల్చివేసింది. 'నాన్నా! నీవు ఆందోళన పడకు. బావకు నాతోపాటు చెల్లాయి అక్కలమ్మను కూడా యిచ్చి ఒకేసారి వివాహం చెయ్యండి. అందరికీ సంతోషం అవుతుంది.' అని చెప్పింది. అది బుద్ధిమంతురాలు. సంస్కృతాంధ్రాలలో సాహిత్యాలంకారశాస్త్రాలు పూర్తి చేసింది. ఆప్రకారమే కానిద్దామనుకున్నాను.

అల్లుడు అన్నమయ్యకు ఈప్రకారం జరపడమే అభిమతమని వాని చిరునవ్వులే చెప్పుతున్నాయి. అమ్మాయి అక్కలమ్మకు కూడా ఇది ఇష్టమేనని ఆమె సిగ్గు దొంతరలు చెప్పుతున్నాయి. మీకుమాత్రం ఏమి అభ్యంతరం ఉన్నది?" అని వేంకటాచలమయ్యగారిని నిగ్గదీశాడు.

వేంకటాచలమయ్యగారికి కూడా సంతోషం పుక్కిలింత లైనది. ఈ గడ్డుసమస్య ఇంత తేలికగా పరిష్కరింపబడుతుందని ఆయన భావించలేదు. ఆయన భార్యకూడా సంతోషపడింది. లక్ష్మాంబగారికి సంతోషం అవధులు లేకుండా పొంగింది. అన్నమయ్య చిరునవ్వులతో ఆనందాన్ని వెళ్లబోశాడు.

వేంకటాచలమయ్యగారు వెంటనే భార్యాకుమార్తెలతో వెంకటరమణయ్యగారిల్లు చేరి, అప్పటికప్పుడే రెండు గుట్టాలను మాట్లాడుకుని తా నొక గుట్టుంమీద, వెంట మరొక గుట్టు మీద వేరొక సేవకుని నియమించుకుని స్వగ్రామమైన టంగుటూరుకు వెళ్లారు.

తెల్లవారేటప్పటికి ఆయన పది గుట్టాలమీద పెండ్లికి కావలసిన వస్తుసంభారాన్ని టంగుటూరునుంచి తీసుకొని వచ్చాడు. గుంట్లూరునుంచి ఆయన బావమఱది మరికొంతమంది ముఖ్యబంధువులు ఆ విడియనాటి రాత్రికి చేరుకున్నారు.

టంగుటూరులో వేంకటాచలమయ్యగారు పెద్ద సాముంతుడు. ఆయన రాజమిత్రుడు. చంద్రగిరి మండలేశ్వరులకు టంగుటూరులో కోట ఉన్నది. అక్కడ రాచరాణువస్థావరం ఉన్నది. ఆ రాణువకు అధిపతిగా చంద్రగిరి యువరాజు సాళువ నరసింహరాజు ఉంటున్నాడు. వేంకటాచలమయ్యగారు చతుశ్శాస్త్రవేత్త అయిన మహామనీషి. ఆయనయందు సాళువ నరసింహరాయలకు పెద్ద అభిమానము. పెండ్లికి కావలసిన సంభారములన్ని రాచనగరునుంచే వచ్చినవి. గుట్టములమీద రాజపురుషులే తీసికొనివచ్చారు.

పెండ్లి మహావైభవంగా జరిగింది. వీకలగ్నంలో అన్న మయ్య రెండు కన్యాదానాలను స్వీకరించాడు. ఇద్దరు పెండ్లి కూతుళ్లు ప్రక్క-ప్రక్క కూర్చుండగా ఇద్దరికీ మాంగళ్యధారణ మహోత్సవం జరిగింది. మూడవనాటి సదస్యమునకు చంద్రగిరి యువరాజు సాళువ నరసింహరాజు స్వయంగావచ్చి కట్నములు చదివించాడు. అనేకమంది వేదశాస్త్ర పండితులు వచ్చారు. అందరికీ వేంకటాచలమయ్యగారు భూరి సంభావనలతో తృప్తిని కలిగించాడు. ఊరిలో అన్ని కులాలవారు పంక్తిభోజనాలకు వచ్చారు.

ఇద్దరు పెండ్లికుమార్తెలను ఒక పెండ్లికుమారుడు వీక కాలమందు వివాహం చేసుకోవడం అందరికీ కుతూహలాన్ని కల్గించడంవలన వచ్చి చూచిపోతున్నారు. ఇద్దరు యువతులు అందకత్తెలు. గుణవతులు. అందులో ఒకామె మహావిదుషీమణి. ఇద్దరు యువతులు ఆవరుని వరించారట. అతడు వారిద్దరినీ అభిలషించాడట. అతడు సంగీత సాహిత్యశాస్త్రద్వయమూర్తి అట. ఈ విషయములన్ని విచిత్రమైన గాథలుగా పయనించి అల్లిక బిల్లికలుగా అల్లుకొని లోకానికి ఆశ్చర్యకుతూహల జనకాలైనవి.

8

వివాహమైన తర్వాత అన్నమయ్య ఇద్దరు వధువులతో గృహప్రవేశముచేసి తరువాత మాడపూరు, మల్లుతోరణానికి వెళ్లాడు. అక్కడ మూడు రాత్రులు గడపి వధూద్వయంతో

టంగుటూ రు వెళ్లాడు. వేంకటాచలమయ్యగారి బలవంతముమీద టంగుటూరులో మాసము నాళ్లుండవలసి వచ్చినది. వేంకటాచల మయ్యగారికి అక్కలమ్మ ఒక్కతే సంతానము. అందుచేత వారికి అన్నమయ్య అంటే ప్రాణాధికమైన ప్రేమకలిగింది.

టంగుటూరులో అన్నమయ్యకు సకల సౌకర్యములు సమకూడినవి. చెయ్యేరు నదిగట్టుమీద టంగుటూరు పరము రమణీయంగా ఉంటుంది, ఊరిలో పెక్కుమంది రాజోద్యోగులే. కోటలో రాణువ స్థావరం ఉన్నది. దళపతులు, దండనాయకులు ఉన్నారు

వేంకటాచలమయ్యగారి పలుకుబడి అనల్పమైనది. రాజోద్యోగు లందరు ఆయనయందు మిక్కిలి గౌరవము కలవారు. యువరాజు సాళువ నరసింహరాజు కూడా ఆయనయందు మిక్కిలి గౌరవం కలవాడు. వారందరికి అన్నమయ్యతో పరిచయ స్నేహాలు కలిగినై. ప్రతిప్రత్యూషకాలంలోను, సాయంవేళలలోను అన్నమయ్య సంగీతసాధనచేస్తూ ఉంటూడని, ఆయన లోకోత్తర గాయకుడని, ఆయన గానంలోని మృష్టమధుర ప్రసన్నతా రక్తిమత్తుగుణములు అనన్యమైనవని త్వరలోనే ఊరివారందరకు తెలిసిపోయినది.

రాజోద్యోగులు వారివారి అవకాశములనుబట్టి ప్రాతస్సాయంకాలములందువచ్చి అన్నమయ్య గానం విని ఆనందించేవారు. అన్నమయ్య అసాధారణ గాన వృత్తాంతం యువరాజు సాళువ నరసింహరాజునకు కూడా తెలిసింది. ఆయన మొదటి

సారిగా వచ్చి వినిననాడే ఆయనకు అన్నమయ్యమీద విపరీతమైన గౌరవం కలిగింది. అన్నమయ్య గాయక సార్వభౌముడనీ, సంగీతశాస్త్ర లక్ష్యలక్షణవేత్త అనీ, అసాధారణ ప్రజ్ఞాశాలి అనీ, కారణజన్ముడనీ తెలుసుకున్నాడు. సాళువ నరసింహరాజునకు అన్నమయ్యకు మధ్య అన్యోన్యప్రేమ గౌరవము లేర్పడినవి.

*　　*　　*

అన్నమయ్యభార్య లింకా కాపురాలకు రాలేదు. తాను తాళ్ళపాకలో తల్లిగారిని సేవించుకుంటూ ఉన్నాడు. నిత్యము సంగీతసాధనచేస్తూ, పదకవితలు పాడుతూ నిత్యపూజా జపధ్యాన ములతో శ్రీవేంకటేశ్వరస్వామిని ఆరాధిస్తూ, తల్లిగారికి శుశ్రూషలు చేస్తూ ఉండేవాడు. అన్నమయ్య సంస్కృతపాండిత్యము గొప్పది. సాహిత్యాలంకారశాస్త్రాలు పూర్తిచేశాడు. అయితే అతనికి దార్శనికశాస్త్ర అధ్యయనం చెయ్యాలని కోరిక ఉన్నది. వేదాంతశాస్త్ర అధ్యయనం విశిష్టాద్వైత దర్శన శ్రవణం చేయాలని కుతూహలం ప్రబలం కాజొచ్చింది. ఈ కోరికను మనస్సులో పెంచుకుంటూ శ్రీవేంకటేశ్వర స్మరణ చేస్తూవచ్చాడు.

ఒకనాడు స్వప్నంలో అశరీరవాణి విన్పించినట్లు అన్నమయ్యకు భాసించింది. అహోబిలం వెళ్లమని ఆదేశం విన్పించినట్లు అన్నమయ్య అనుకున్నాడు. ఆమరునాడు తల్లిగారి అనుజ్ఞ తీసికొని మంచి సుమహూర్తంలో బయలుదేరి కాలినడకన కొన్నిదినాలకు అహోబిలం చేరుకున్నాడు.

అహోబిలంలో అన్నమయ్యకు శ్రీ ఆదివన్ శఠగోప యతీంద్రుల దర్శనం లభించింది. ఈయన అహోబల నరసింహ స్వామి స్వయముగా గురువై తానే త్రిదండాన్ని మంత్రాలను అనుగ్రహింపగా హయగ్రీవదేవుని అనుగ్రహమున్నూ బడసి సన్న్యాసి యైనవాడు. ఆయన విశిష్టాద్వైతమతమున వేదాంత దేశికుని సంప్రదాయాన్ని అనువర్తించుచున్నవాడు. కరుణా నిధియైన రంగపతికి కాంచీవరదునకు, వేంకటగిరిపతికి నిరతిగా నహోబలన్నృకేసరికి తత్పరుడైన వాడు.

అన్నమయ్య శఠగోపయతీంద్రుని పాదము లాశ్రయించగా ఆయనకు దయ కలిగినది. ఆయన సకల వేదాంతశాస్త్రము అన్నమయ్యకు బోధించి విశిష్టాద్వైతరహస్యములను వివరించాడు. అన్నమయ్య మనస్సు కృతజ్ఞతామయమై శఠగోప యతీంద్రునిపైన పెక్కు పద్యములు పాడాడు.

అన్నమయ్య అహోబలంలో ఉండి వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్న దినములలో ప్రతి ప్రాతస్సాయంకాలము లందు అహోబల నారసింహుని దర్శనముచేసి కీర్తిస్తూ ఉండేవాడు. ఆకాలమున శ్రీరామనవమి వచ్చినది. ఆనాడు శ్రీరామ చంద్ర గుణకీర్తనం చెయ్యాలనిపించింది అన్నమయ్యకు.

అన్నమయ్య శ్రీమదాళ్వారికి రామాయణగాథను సంకీర్తనాత్మకంగా అహోబల నారసింహుని సన్నిధానంలో గానం చేశాడు. అన్నమయ్య సంకీర్తన పరమ ప్రసన్న మధురంగా ఉండి శఠగోపయతీంద్రుల మనస్సునకు ఆహ్లాదం కలిగించింది.

ఆయన అన్నమయ్యను సంకీర్తనాచార్యుడని ఆశీర్వదించాడు. అహోబలంనుంచి తిరిగి స్వగృహానికి చేరకమునుపే అన్నమయ్య సంకీర్తనపద్ధతి జగన్మోహనమై ప్రఖ్యాతికెక్కింది.

అన్నమయ్య ప్రఖ్యాతి తల్లి లక్కమాంబకు, మామగార్లు వేంకటరమణయ్య, వేంకటాచలమయ్యగార్లకు మాత్రమే కాకుండా సాళువ నరసింహరాజుకి కూడా ప్రమోదాన్ని కూర్చింది. అన్నమయ్య అహోబలాన్నుంచి తిరిగి వస్తున్నాడని తెలిసినప్పుడు సాళువ నరసింహరాజు కొంత పరివారంతో మేనాను ఆయన్ను తోడితెచ్చుటకు పంపాడు.

పరివారంతో మేనాలో టంగుటూరు వచ్చిన అన్నమయ్యకు నరసింహరాజు రాజమర్యాదలతో గౌరవం నెరపాడు. అన్నమయ్యను భద్రగజంపై అవరోహింపజేసి పౌరోత్సవంచేసి మంగళాహుతులు చల్లించాడు. అత్యధికంగా భూషణాంబరాలనూ రత్నాలనూ కానికలు పెట్టాడు.

అన్నమయ్య సాళువ నరసింహరాజు గౌరవాలను స్వీకరించి, నాలుగు దినములు టంగుటూరులో ఉండి వేంకటాచలమయ్యగారికి సంతోషాన్ని కలిగించి స్వగ్రామాన్ని చేరుకున్నాడు. తల్లి లక్కమాంబ తిరిగివచ్చిన కుమారుని చూచి అమితంగా సంతోషించింది,

అన్నమయ్య తిరిగివచ్చిన వార్త వెంకటరమణయ్యగారికి తెలియగా ఆయన తాళ్లపాకకు వచ్చి లక్కమాంబను అన్న

మయ్యను చూచి యోగక్షేమాలు తెలుసుకున్నాడు. తిరుమ లాంబ వ్యక్తురాలై ఈడువచ్చి ఉండటంవలన ఆయన లక్క-మాంబతో సంప్రతించి నిషేకముహూర్తం నిశ్చయించాడు.

నిషేకముహూర్తానికి అన్నమయ్య తల్లితో కలసి మాడు పూరు చేరుకున్నాడు. ఆహ్వానము రాగా టంగుటూరునుండి వేంకటాచలయ్యగూడ కుటుంబముతో కలసివెళ్లాడు. వెంకట రమణయ్యగారు వీరికి స్వాగతాలు చెప్పి ఆదరించాడు. మూడు రోజులు అయిన తరువాత తిరుమలాంబ ప్రోద్బలముతో అక్క-డనే అక్కమాంబకు కూడ పునస్సంధాన ముహూర్తం కావించారు.

ఎంత ఔదార్యం ఉన్నా స్త్రీ సహజమయిన గుణాన్ని వదలుకోలేదు. అందులో భర్తయందు లోకోత్తరనుయిన భక్తి గౌరవాలు ఉన్నస్త్రీ విషయము చెప్పనవసరములేదు. ఇటువంటి విచిత్రమయిన పరిస్థితికి తానే కారణం అయినప్పటికి తిరుమలాంబ నిగ్రహించుకోలేక పోయింది. తన భర్తకు అక్కమాంబతో తన కోరిక మూలంగానే వివాహం జరిగింది. ఇప్పుడు తానే ఆమెను భర్త దగ్గరకు పంపింది.

తిరుమలాంబకు ఆరాత్రి నిద్దురపట్టలేదు. అక్కమాంబ అన్నమయ్యను చేరిన మొదటిరాత్రి అది. తిరుమలాంబకూడా అనుభవంతో పంటపండిన స్త్రీ కాదాయెను. ఆమె బయటకు తన దుఃఖాన్ని వెళ్లగ్రక్కకపోయినా లోపల మాత్రము భరించ లేనంత బాధపడింది. ఎవ్వరితోనూ చెప్పుకోవడానికి వీలులేని

బాధ. తన మనస్సునకు శాంతి లభిస్తుందని ఆంధ్రమహాభారతాన్ని తీసుకుని చదవటం మొదలు పెట్టింది. ఆదిపర్వ కథాఘట్టమది అర్జునుడు చేసుకొన్న మాటప్రకారం చాంద్రాయణానికి వెళ్లి తీర్థయాత్రలు చేసాడు.

యతివేషంతో ద్వారకానగరానికి వెళ్లి శ్రీకృష్ణ దేవుని సహాయంతో సుభద్రని వివాహం చేసుకొని ద్వారకానగరం నుంచి సుభద్రని తీసుకొని అడ్డగించిన యాదవసైనికుల్ని జయించి ఇంద్రప్రస్థ సమీపానికి వచ్చాడు. అర్జునుడికి ద్రౌపది మనస్సు తెలుసు. ఆమె మహాపతివ్రత. ఆమెకు మనఃక్లేశము కలిగితే ఉపద్రవాలు సంభవిస్తాయి. అందుచేత చక్కని ప్యూహాన్ని పన్నాడు.

అర్జునుడు సుభద్రాదేవితో ఇట్లా అన్నాడు. మన మిద్దరం కలసి ద్రౌపదిని చూడడానికి పోతే ఆమెకు మనస్సులో బాధ కలగవచ్చు. అప్పు డేమయినా అంటే, ఆమె పరమ పతివ్రత కాబట్టి—అది అప్రియమయినా సరే జరిగి తీరుతుంది. కావున నీవు ముందుగా గోపాల బాలికలతో కలసి పురంలోకి వెళ్లి ద్రౌపదిని దర్శించు అని చెప్పాడు.

సుభద్రాదేవి అర్జునుడు చెప్పినట్లుగా గోపబాలికలతో కలసి వెళ్లి అంతఃపురాన్ని ప్రవేశించి కుంతీదేవిని ద్రౌపదిని దర్శించి నమస్కరించింది. అప్పుడు ద్రౌపది "నీ భర్త మహావీరుడయి నిత్యవిజయం కలవాడవుతాడు. నీవు మహావీరునికి తల్లి వౌతావు. నీవలన ఉభయవంశాలు ఉద్ధరింపబడుతాయి" అని సుభద్రను ఆశీర్వదించింది.

తర్వాత అర్జునుడు బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో పురః ప్రవేశం చేసాడు. ధర్మరాజుకి ధౌమ్యునికి భీమునికి నమస్కరించాడు. తనకు మ్రొక్కిన నకుల సహాదేవులను కౌగలించుకున్నాడు.

ఈ కథాఘట్టము చదువుతుండగా తిరుమలాంబకు విచిత్ర మయిన అనుభవం కలిగింది. ద్రౌపదిదేవికూడ తనకు మల్లేనే సుభద్రాదేవిని ఆదరించింది. నిజంగా ద్రౌపదిదేవిని స్వయం వరంలో గెలుచుకున్నవాడు అర్జునుడు. సకల రాజన్యలోకం చూస్తూ వుండగా బహుదేవర్షి భూసురలోకం ఆశీర్వదిస్తూ వుండగా మంగళవాద్యాలు మ్రోయుచుండగా పంచభూతముల సాక్షిగా ద్రౌపదిదేవి అర్జునుని మెడలోనే స్వయంవర పూల హారాన్ని వేసింది. ఆమె అతనినే వరించింది. ద్రౌపది తండ్రి ద్రుపదమహారాజు మహర్షుల సహాయంతో యజ్ఞాన్ని చేసి అర్జునుడికి భార్యకాగల కుమార్తెను వాంఛించి, యాజ్ఞసేని అయిన ద్రౌపదిని కుమార్తెగా పొందాడు.

ఇన్ని ప్రబలమయిన హేతువులతో ద్రౌపదిదేవికి అర్జునుని మీద గాఢానురాగమువున్నా, ఆమె సుభద్రాదేవిని ఆదరించింది. తనకు నమస్కరించినపుడు ఆశీర్వదించింది. వంశాన్ని ఉద్ధరించే సంతానాన్ని పొందమని త్రికరణశుద్ధిగా దీవించింది. ఈ పరిస్థితులు తిరుమలాంబకు స్వానుభవంలోకి వచ్చాయి. తన కథలో ద్రౌపదిదేవి కథకు ప్రతిబింబాలు కనపడుతున్నాయని ఆమె తెలుసుకొన్నది. ఆమెకు ఈ అవగాహన కాగానే శాంతి

లభించింది. ఆమె అప్పుడే ప్రారంభించి సుభద్రా పరిణయము అనే కావ్యాన్ని రచించింది. అది తెలుగుదేశీయ ఛందస్సు అయిన ద్విపదలో మనోహరంగా రచించింది. ద్రౌపదిదేని సుభద్రాదేవిని అర్జునుడున్న శయ్యామందిరానికి పంపే ఘట్టము తిరుమలాంబ లోకాతిశాయిగా నిర్వహించింది. అది సాహిత్య చరిత్రలో ఉదాత్తమయిన ఘట్టముగా ప్రకాశిస్తున్నది.

9

అన్నమయ్య ఇద్దరు భార్యలతో సంసారము సాగిస్తూ వున్నాడు. వేంకటాచలమయ్యగారు గతించగా ఆయన ఆస్తి యావత్తు అన్నమయ్యకు సంక్రమించింది. ఇంతలో తల్లి లక్కమాంబ గతించడం ఆమెకు యథావిధిగా సంస్కారాలు చేయడం జరిగినది అన్నమయ్యకు పుత్రసంతానం కలిగింది. ఈవంశోద్ధారులయిన కుమారులు ఇద్దరు కలిగారు. తిరుమలాంబకు నరసన్న అనే పుత్రుడు. పెద్ద తిరుమలయ్య అక్కమాంబ పుత్రుడు.

అన్నమయ్య తనకు అధికంగా సంక్రమించిన ఆస్తిని చూచుకోవడానికై టంగుటూరులో ఉండవలసివచ్చింది. అక్కడ ఉన్నజనంతో - ముఖ్యంగా బ్రాహ్మణకుటుంబాలతో యెక్కువ అనుబంధాలు యేర్పడ్డాయి. ఆప్రాంతంలో అన్నమయ్య కీర్తిగౌరవాలు దినదిన ప్రవర్ధమానంగా ప్రకాశించినవి.

అక్కడకు సమీపంలో చిట్వేలు అనే చిన్నసామంత రాజ్యం ఉన్నది. దానిని మట్లి వంశపురాజులు పాలిస్తున్నారు.

వాళ్లు చంద్రగిరి రాజ్యానికి సామంతులు. ఆనాటి మట్లిరాజు సాళ్వ నరసింహరాయలయందు మిక్కిలి భక్తికలవాడు. అందు చేత తరచు టంగుటూరు వస్తుపోతూవుండేవాడు. అతనికి అన్నమయ్యగారితో పరిచయమయి అది భక్తిగా మారి వచ్చినప్పుడల్లా ఆయనను సేవించుకుంటూ వుండేవాడు. అప్పుడప్పుడూ కుటుంబంతో సహావచ్చి అన్నమయ్యగారిని దర్శించి ఆశీర్వచనాలు పొందడంకూడ కద్దు. అన్నమయ్యగారు తరచు ఉత్సవాలు చేస్తూవుండేవారు. శ్రీరామనవమి, హనుమజ్జయంతి, వామనజయంతి, నృసింహజయంతి, శ్రీకృష్ణాష్టమి మొదలయిన పండుగ దినాలలో ఆయన భాగవత సప్తాహాలు చేసేవాడు. ఆ ఉత్సవాలలో ఆయన సంకీర్తనలు కూడ చేస్తూవుండేవాడు.

అన్నమయ్యగారి సంకీర్తన గానం జగన్మోహనమయినది. అందుచేత అన్నమయ్యగారి సంకీర్తనలు వినడానికి దూర ప్రాంతాలనుండి కూడ జనం ఆవుత్సవాలకు వచ్చేవారు. అటు వంటి ఉత్సవాలకు చిట్వేలు ప్రభువు తప్పకవచ్చేవాడు. ఒకొక్కసారి భార్యను, కుమార్తెను వెంటతీసుకొని వచ్చే వాడు. ఆయన కుమార్తె నాగలాంబ. ఆమె సంస్కృతాంధ్రాలలో పండితురాలు. ఆమెకు మొదటి దర్శనంలోనే తిరుమలాంబమీద అమిత గౌరవం కలిగింది. ఆమె తిరుమలాంబతో సాహిత్యగోష్ఠి చేస్తూవుండేది.

తిరుమలాంబ ద్వారా అన్నమయ్యగారికి నాగలాంబ మీద సద్భావం కలగడం వాత్సల్యం కలగడం జరిగింది. నాగ

లాంబకు కూడ అన్నమయ్యగారివిూద మహాభక్తి గౌరవాలు కలిగినాయి.

అన్నమయ్యగారి ఉత్సవాలకు అనేకమంది రాజపురుషులు వస్తూవుండేవారు. మంత్రిసత్తములు వస్తూవుండే వారు. సేనాధిపతులు వస్తూవుండేవారు. ఆ రోజుల్లో సాళ్వనరసింహరాయలకు కుడిభుజంగా వున్నవాడు తుళువ నరసానాయకుడు. అతడు సేనాధిపతి. మహావీరుడు. అతిసమర్థుడు. అతడున్ను అన్నమయ్యగారి యందు మిక్కిలి భక్తి కలవాడు.

ఒక పర్యాయము చిట్వేలు మట్లిరాజుగారు భార్యతో కుమార్తెతో అన్నమయ్యగారి దర్శనానికి వచ్చాడు. తన కుమార్తెకు వివాహం నిశ్చయం చేసుకున్నామని అన్నమయ్యగారికి విన్నవించి మట్లిరాజు ఆశీర్వచనాలు అర్థించాడు. మట్లిరాజు భార్య, కుమార్తె నాగలాంబ ప్రణామాలుచేసి నిల్వబడిన తరువాత అన్నమయ్యగారు వారి ముఖాలవంక చూచాడు. ఆయనకు పెండ్లి చేసుకోబోతున్న నాగలాంబ ముఖంలో సంతోషం కనిపించలేదు.

అన్నమయ్యగారు మట్లిరాజుతో అన్నాడు కదా "అమ్మాయి నాగలాంబ మనస్సు యెట్లావున్నదో తెలుసుకున్నారా!" అని. అందుకు సమాధానంగా మట్లిరాజు "అమ్మాయికి యేమి తెలుసునండి. మనంచేసేది దాని మంచికేగా". అన్నాడు. అన్నమయ్యగారు "మంచిదే అయినా అమ్మాయిని అడిగి చూడండి. నే నెప్పుడూ మీ అందరి అభివృద్ధికోరే

వాడినే కదా". అన్నారు. ఆరాత్రి మట్లిరాజు స్వల్పాహారి వారంతో తిరిగి చిట్వేలు ప్రయాణం సాగించాడు. వెంట భార్య ఒక మేనాలోనూ, కుమార్తె నాగలాంబ ఇంకొక మేనా లోనూ ఉన్నారు. తెల్లవారుజామున టంగుటూరులో బయలుదేరిన మట్లిరాజుగారు పరివారంతో సహా తెల్లవారే టప్పటికి చిట్వేలు చేరాడు. మేనాలు అంతఃపురానికి చేరు కున్నాయి. రాజుగారి భార్య మేనానుండి దిగింది. నాగలాంబ యెంత సేపటికి మేనానుండి దిగకపోవడంతో తల్లి మేనా తలు పులు తెరచింది. తెరచిచూచిన తల్లి దిగ్భ్రమచెందిపోయింది. అందులో నాగమాంబ లేదు. ఆమె సంభ్రమానికి చకితుడయి మట్లిరాజు వచ్చి తానుకూడ చూచాడు. అతనికిన్ని ఆశ్చ ర్యము సంభ్రమము భయము క్రోధము పౌరుషము ఒక్క సారిగా కలిగాయి. కూతురు నాగలాంబ యేమయి పోయిందో అతనికి తెలియలేదు. మేనా టంగుటూరులో బయలుదేరినప్పుడు నాగలాంబను మేనాలో దొక్కించి తానే తలుపులు మూసాడు. అప్పటినుంచి మేనాను ఎక్కడా దించలేదు. బోయీలు రెండు మూడు తడవలు దింపి వంతులు మార్చుకున్నారేమో గాని మేనాని దింపడంగాని విశ్రాంతి తీసుకోవడం గాని చేయలేదు. నాగలాంబ యెట్లా అదృశ్యమయిందో అతనికి బోధపడలేదు. ఇటువంటి పరిస్థితిలో యేమి చేయాలో అతనికి తెలియలేదు. ఆలోచన తట్టలేదు.

భార్య అతనికంటే ముందుగా తేరుకొని అతనిని లోపలికి తీసుకొనివెళ్లింది. ఆమె చెప్పింది కదా "త్రోవలో దొక్కడో

గుర్రము సకిలింపు వినిపించినట్లుగా వున్నదని, అప్పుడు తనకు నిద్రమత్తుగా వుండటంవల్ల యెక్కువ పట్టించుకోలేదని" చెప్పింది. గుర్రము సకిలింపు తమ పరివారజనంలోని పరిచారకులు స్వారిచేస్తున్న గుర్రంకాదని బాటకు కొంచము దూరంలో వున్న గుర్రం సకిలింపుగా భాసించినదని చెప్పింది. ఈ మాటలు విన్న మట్లిరాజుకు మరింత సంభ్రమము కలిగింది.

అయితే నాగలాంబను యెవరో యెత్తుకు పోయారన్న మాట. ఇది ముందే వేసిన పన్నాగమన్నమాట. ఆమెకోసం బాటలో గుర్రముమీద యెవరో వేచి వున్నారన్నమాట. ఆసకిలింపు విని నాగలాంబ మేనాలోంచి అతిమెల్లగా బయటకు దూకిన దన్నమాట. ఆమె వెళ్లి ఆవేచివున్న గుర్రపు రౌతును కలుసుకొన్నదన్నమాట. ఇది అంతా ఆమె సమ్మతితో జరిగిన పన్నాగమన్నమాట. అయితే తాను చూస్తున్న సంబంధము ఆమెకు ఇష్టము లేదన్నమాట.

ఈ భావములు భాసించగా మట్లిరాజుకి అన్నమయ్యగారి మాటలు జ్ఞాపకానికి వచ్చినవి. ఆయన నాగలాంబ మనసులో వున్న భావాన్ని గ్రహించావా అని తన్ను ప్రశ్నించారు కదా! అంటే అన్నమయ్యగారికి కూడ ఈ పన్నాగము తెలుసునేమో. ఇది స్ఫురించగా మట్లిరాజు మనస్సు మండిపోయింది. వెంటనే కొంత పరివారంతో గుర్రాలమీద టంగుటూరుకి వచ్చిచేరాడు.

రావడం సరాసరి అన్నమయ్యగారింటికే వచ్చాడు. అప్పుడు అన్నమయ్యగారు భోజనంచేసి వాకిట్లో అరుగుమీద

విశ్రాంతి తీసుకొంటున్నారు. ఆయన మంచముమీద పడుకొని వుండగా బాలుడయిన కుమారుడు తిరుమలయ్య ముద్దు పలుకులతో కూనిరాగాలు తీస్తూ పదములు అంటున్నాడు. అన్నమయ్యగారు మంచం పట్టీ పట్టుకొని నిల్చునివున్న తిరుమలయ్య చుబుకాన్ని పుణికి పుచ్చుకొంటున్నారు.

మట్లిరాజు పరివారంతో వచ్చాడు. వాకిట్లో గుర్రందిగి సరాసరి దూతుడుగా అన్నమయ్యగారి అరుగుమీదకి లంఘించాడు. అతనివెంట పరివారజనం కూడ దూతుడుగా ముందుకు చొచ్చారు. ఈ అలజడిని గమనించి వీరి వంక చూచిన అన్నమయ్యగారికి వాళ్లతొందర అర్థముకాలేదు. ఆయన చటుక్కున మంచముమీద లేచి కూర్చుని "ఏమిటి రాజుగారు అంత దూతుడుగా వచ్చారు" అన్నాడు.

మట్లిరాజు "మీకు తెలియదా! పెండ్లి చేద్దామని మీదగ్గర ఆశీర్వచనాలు తీసుకొని పరివారంతో బయలుదేరి వెళ్లాము. నాగలాంబ మేనాలోంచి త్రోవలో అదృశ్యమయి పోయింది. మీరు పెండ్లి విషయంలో ఆమె మనస్సు అన్య విధంగా వుండవచ్చునని సూచించారు కదా! కాబట్టి ఆమె యేమయి పోయిందో మీకు తెలిసివుంటుందని ఆశతో వచ్చాను." అన్నాడు.

అన్నమయ్యగారు మందస్మితము చేసారు. "పిచ్చివాడా! కుమార్తె మనస్సు గ్రహించలేకపోయావు. ఇక్కడకు వస్తూ పోతూ వుండటంవలన ఆమె దృష్టిని యెవరు ఆకర్షించారో నా

కిదివరకే తెలిసిపోయింది. ఆ ఆకర్షణ యెంత బలమయినదో నే నిదివరకు ఆలోచించలేదు. ఇప్పుడు నాకు పూర్తిగా అర్థ మయింది. నీ కుమార్తె రాజకన్య కదా! ఆమె మహావీరుణ్ణో వరించింది. నీవు ఆందోళన పడనక్కరలేదు." అని చెప్పి రాజు గారిని ఆయన పరివారజనాన్ని సేవతీప్పుకోమని చెప్పి అన్న మయ్యగారు వారికి తమ ఇంట్లోనే ఆతిథ్యాన్ని యేర్పాటు చేశారు.

ఇంటికివచ్చిన అతిథులు భోజనాలకు కూర్చున్నారు. అన్నమయ్యగారు స్వయముగా వడ్డించారు. ఎన్ని ఉపశమన వాక్యాలు చెప్పినా మట్లిరాజుకు మాత్రము మనశ్శాంతి కలుగ లేదు. అన్నమయ్యగారు ఇది గ్రహిస్తూనేవున్నారు వీరంతా భోజనాలుచేసి తలవాకిటకు వచ్చేటప్పటికి వాకిట్లో సాళ్వ నరసింహరాయల సేనాపతి తుళువ నరసానాయకుడు వచ్చి వున్నాడు. అతడు అన్నమయ్యగారిని చూడగానే సాష్టాంగ ప్రణామముచేసి చేతులు జోడించి నిలబడ్డాడు. అతడు అన్న మయ్యగారు కబురు పంపగా వచ్చాడు.

అన్నమయ్యగారితోపాటు మట్లిరాజు వుండటం తుళువ నరసానాయునికి ఆశ్చర్యము కలిగించలేదు. అతడు ఆశ్చర్యపడ నట్లు అతని ముఖముమీద ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. అతని ముఖాన్ని పరిశీలించిన అన్నమయ్యగారికి ఉన్న అనుమానాలు బలపడ్డాయి. అన్నమయ్యగారు నరసానాయకునితో "సేనాపతి గారు! మట్లిరాజుగారు తమ కుమార్తె నాగలాంబకోసం ఆందో

ళన పడుతున్నారు. ఆయనకు యేకపుత్రిక అయిన నాగలాంబ మీద అత్యంత అనురాగ వాత్సల్యాలు. ఇదివరకు ఆమె మనస్సు యేమిటో గ్రహించకపోవడంవల్ల ఆయన ఇతరత్రా సంబంధము నిశ్చయించారుగాని ఇప్పుడు ఆమె ఇష్టప్రకారము చేయడానికి సిద్ధంగావున్నారు." అని మట్లిరాజు వంక చూశారు. మట్లిరాజుగారు సమ్మతిగా తల వూపాడు

అన్నమయ్యగారు మళ్లీ నరసానాయకునివంక చూస్తూ "ఆందోళనపడుతున్న మట్లిరాజుగారికి శాంతి కలిగించడము కోసం ఆయనకు కుమార్తెను చూపించండి" అన్నారు. ఈమాటలకు నరసానాయకుడు శిరఃకంపనము చేస్తూ "చిత్తం చిత్తం తమ అనుగ్రహం" అన్నాడు. తరువాత తన వెంటవున్న అంతరంగ సేవకుని వంకచూస్తూ "ఇంకా మట్లిమహారాజువారి కుమార్తె వేంచేయలేదా!" అన్నాడు.

అతడు అన్నమాటకు అన్నమయ్యగారికి, మట్లిరాజుగారికి కూడ ఆశ్చర్యమే వేసింది. నరసానాయకుడు చేతులు జోడించుకొని నిల్చున్నవాడు అట్లానే నిల్చొని అన్నమయ్యగారి వంక చూస్తూ తమరు కబురంపించారన్నప్పుడే నాకు అంతా అర్థమయింది. కుమార్తె కనపడక మట్లిరాజుగారు తిరిగివచ్చి తమ దగ్గర ఫిర్యాదుచేసి వుంటారని గ్రహించాను. అందుచేతనే అంతఃపురాన్ని చేరుకొన్న మట్లిరాజుగారి కుమార్తెను మేనాలో యెక్కించుకొని పరివారసమేతముగా తమ దర్శనానికి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించాను" అన్నాడు.

ఇంతలో వాకిట్లో బోయీలు మేనా నిలుపడం మేనా నుండి మేలిముసుగుతో నాగలాంబవచ్చి అన్నమయ్యగారికి, తండ్రిగారికి ప్రణామాలుచేయడం జరిగిపోయింది. తరువాత ఆమె నరసానాయకుని ప్రక్కకువెళ్లి నిల్చుంది. అన్నమయ్యగారు మల్లిరాజుగారి వంక చూస్తూ "మీకు అవగాహన అయిందా? మహావీరుడయిన నరసానాయకుడు నాగలాంబ మనసును ఆకర్షించాడు. ఇక్కడికి వస్తూ పోతూ వున్నప్పుడు వారివారి దృష్టులనుబట్టి నా కిదివరకే ఈ అనుమానం కలిగింది. అయితే నరసానాయకునికి ఇదివరకే వివాహం అయింది. అందుచేత మీసమ్మతి వుండదని వాళ్లు అనుకొన్నట్టున్నారు. రాత్రి త్రోవలో యెక్కడో సంకేతస్థలంలో పొంచివుండి నరసానాయకుడు నాగలాంబను గుర్రముమీదను తీసుకొని వచ్చాడన్నమాట. ఇప్పుడు చేయవలసినది మరేమీ లేదు. వీరిద్దరికి యథావిధిగా వివాహం చేయడమే మిగిలివున్న కార్యక్రమము" అని అన్నమయ్యగారు చెప్పారు.

అప్పుడు నాగలాంబ నరసానాయకుడు హర్షపులకాంకితులై అన్నమయ్యగారి పాదాలకు ప్రణామాలు చేశారు. అన్నమయ్యగారు చిరునవ్వుతో "మీకు జగదేకవీరుడు, విద్వచ్చిరోమణి అయిన కుమారుడు కలిగి సాహితీసమరాంగణ చక్రవర్తిగా దక్షిణ భారతదేశాన్ని ఏకచ్ఛత్రంగా పాలిస్తాడని ఆశీర్వదిస్తున్నాను" అన్నారు.

10

చంద్రగిరి రాజ్యాన్ని పరిపాలిస్తున్న గుండరాజుకి అక స్మాత్తుగా ముంచుకువచ్చింది. టంగుటూరులో నున్న సాళువ నరసింహరాయలు తన తండ్రికి ముంచుకు వచ్చినదన్నవార్త తెలియగానే మేఘూలమీద ప్రయాణంచేసి చంద్రగిరి చేరు కున్నాడు. సాళువ నరసింహరాయలు చంద్రగిరి చేరుకోవడము గుండరాజు మరణించడం ఒక్క-సారి జరిగినవి. గుండరాజు వెంట అతనికి పరమవిశ్వాసపాత్రుడైన తుళువ నరసానాయకుడు ఉండనే ఉన్నాడు. తండ్రిని పోగొట్టుకున్న దుఃఖంలో సాళువ నరసింహరాయలు ఉండగా తుళువ నరసానాయకుని తండ్రి ఈశ్వరనాయకుడు, గుండరాజుదగ్గర సర్వసేనాధిపతి, శాంతి భద్ర తలను కాపాడటానికి అవనరమైన చర్యలన్నిటినీ తీసుకున్నాడు. ఎటువంటి ముప్పు వాటిల్లకుండా సాళువ నరసింహరాయలు చంద్రగిరిరాజ్యానికి రాజు అయినాడు.

సాళువ నరసింహరాయలు కొలది మాసముల తరువాత పట్టాభిషేక ఉత్సవము చేసుకున్నాడు. ఆ ఉత్సవాలకు నలు మూలలనుంచి పండితులు విచ్చేశారు. అన్నమయ్యగారికి కూడ ఆహ్వానము వెళ్లడం మాత్రమే కాకుండ తుళువ నరసానాయ కుడు వచ్చి విన్నపాలు చేసుకున్నాడు. . అన్నమయ్యగారిని తోడ్కొని వెళ్లటానికి స్వల్పపరివారాన్నికూడ నియమించాడు. అన్నమయ్యగారు సహకుటుంబముగా బయలుదేరటానికని మేనాలు సిద్ధపరిచాడు.

చంద్రగిరిలో అన్నమయ్యగారికి మహాగౌరవాలు జరిగాయి. ఆయనకే సభాప్రథమగౌరవం జరిగింది. సకలరాజోపచారాలతో దైవోపచారాలతో అన్నమయ్యగారిని సాళువ నరసింహరాయలు పూజించాడు. చంద్రగిరిలో మహాగౌరవాలు చేయించుకొని అన్నమయ్యగారు సకుటుంబంగా తిరుమలకువెళ్లి శ్రీస్వామిని దర్శించి సన్నిధానంలో కొన్నినాళ్లు ఉన్నాడు. తరువాత మళ్లీ టంగుటూరు చేరుకున్నాడు.

* * * * *

టంగుటూరులో అన్నమయ్యగారి ఇంటిప్రక్కగా ఒక వృద్ధబ్రాహ్మణదంపతులు ఉన్నారు. వారికి కూడ కుమార్తె ఒక్కతే. ఆయన కుమార్తెను మేనల్లునికే ఇచ్చి అతనిని ఇల్లటం తెచ్చుకున్నాడు. ఆమేనల్లుడి పేరు మల్లన్నగారు. మల్లన్నగారు యువకుడు. ఆయనకు అన్నమయ్యగారికి స్నేహం కలిసింది. అన్యోన్యం పరమగౌరవం ఏర్పడింది. మల్లన్నగారుకూడ మహా పండితుడు. అన్నమయ్యగారికి మల్లన్నగ్గారికి స్నేహం దేహి దేహాన్యాయంగా పరిణమించింది. మల్లన్నగారు ఒక మహా విద్వద్వంశానికి చెందినవాడు.

మల్లన్నగారు పాఠం చెప్పడం మనోహరంగా ఉంటుంది. ఆయన నిఖిల పురాణజ్ఞుడు; దర్శనాంతసాహిత్యుడు. ముందు శ్లోకాన్ని మధురంగా చదివి తరువాత చదివించి పిమ్మట అన్వ

యము చూపించి వ్యాకరణ విశేషాలు చెప్పి సాహిత్య మర్మాలు ఉపన్యసించి సమ్యగ్వ్యాఖ్యానము చేస్తారు.

పాఠం వింటున్న వారికి అమృతసేచనం చేస్తున్నట్లుగా ఉంటుంది. ఏవో మనోహర దివ్యలోకాలలో విహరిస్తున్నట్లుగా ఉంటుంది. ధర్మమయమైన కృతయుగాది పూర్వయుగాలలో ఉంటున్నట్లుగా ఉంటుంది. ఆకావ్యలోకాలలో వీరులు వారి పరాక్రమాలు, వారి సత్యాగ్రహాలు, గురుదైవభక్తిప్రపత్తులు, తపోవ్రతనిష్ఠలు, వారి భార్యల పాతివ్రత్యాలు, ఆనాడు మానవులు దేవతలు కలసి సంచరించడాలు, మానవలోకాన్ని మనోహరంగా చిత్రించే మహావర్ణనలు - అన్నీ మల్లన్నగారి ముఖతః వింటుంటే శ్రోతల్ని సమ్మోహాపారవశ్యంలో ముంచెత్తుతాయి. అప్పుడు శ్రోతలు కశ్మలదూషితమైన లౌకికవాతావరణం నుంచి బయటపడటమే కాకుండా లౌకికవిషయాలను విస్మరించడమే జరుగుతుంది.

మల్లన్నగారు పాఠం చెప్పడం వింటున్న విద్యార్థులు బాలురైతే వాళ్ల మనస్సుల్లో ఆయనమీద మహాగౌరవం, మహాభక్తి పుట్టుకువస్తాయి. గురుభక్తి పుట్టుకువస్తుంది. వృద్ధులైతే ఆయనమీద గౌరవం విపరీతంగా పుట్టుకువస్తుంది. వింటున్నవారు మధ్యవయస్కులైన పురుషులైతే విపరీతమైన అభిమానం స్నేహం కలుగుతాయి.

పాఠం వింటున్నవాళ్లు స్త్రీలైతే - అందులో అప్పుడే నవయౌవనంలోకి కాలు పెట్టుతున్న తరుణీమణి అయితే -

అప్పటి పరిస్థితి అపూర్వమైనదే అవుతుంది. మల్లన్నగారి వయస్సు ముప్పై సంవత్సరాలకు లోపుగా ఉంటుంది. ఆయన బంగారు వంటి దేహచ్ఛాయతో, అజానుబాహువులతో, ముఖముమీద తాండవిస్తున్న బ్రహ్మతేజస్సుతో, విశాలమైన ఫాలభాగంతో, ముఖానికి విచిత్రమైన శోభను కూరుస్తున్న త్రిపుండ్రంతో చూపరుల్ని ఆకర్షిస్తూ ఉంటాడు. ఆ చూసేవారు స్త్రీలైతే - అందులోనూ అప్పుడే యౌవనారంభ దశలో ఉన్న తరుణీమణులైతే - అందులో అవివాహితలైయుంటే - వారిపైన ఆయన ఆకర్షణ మరింత తీవ్రంగా మధురంగా అపూర్వరమణీయంగా ఉండుటలో విపరీతమైనదేమీ లేదు.

పాఠం వింటూవున్న గౌరమ్మ తెలివితేటలు గలది. అంతకుముందే తన తండ్రిదగ్గర ఆంధ్రమహాభారతాన్ని ఆమూలచూడం పాఠం చెప్పించుకున్నది. ఆమెకు సంస్కృతం కూడా చదువుకోవాలని అభిలాష కలిగింది. ఏకపుత్రిక కావడం మూలాన తండ్రి ఆమె కోరికను కాదనలేదు. పైగా ఆ కోరిక ఉత్తమంగా ఉండటంమూలాన సంతోషమే పడ్డాడు. ఆమె కోరిక ప్రకారం సంస్కృతం చెప్పిస్తున్నాడు.

అయితే ఆమె మల్లన్నగారి దగ్గర సంస్కృతం చెప్పించమని కోరలేదు. మల్లన్నగారిని సహకుటుంబంగా తమ ఊరికి ఆహ్వానించి ఆయన దగ్గర కుమార్తెకు సంస్కృతం చెప్పించడానికి ఆమె తండ్రిగారి నిర్ణయమే కారణం. ఆ తండ్రిగారు

మల్లన్నగారినే ఆహ్వానించడానికి ప్రత్యేకమైన హేతువు ఉన్నది.

రఘువంశం పాఠం వింటున్నప్పుడు గౌరమ్మకు మల్లన్న గారు మొదట్లో మల్లినాథ సూరిలాగ తోచారు. కాని దిలీప మహారాజు వృత్తాంతం వింటుంటే ఆయన వశిష్ఠమహర్షి అనిపించారు. తన కళ్లముందు పుట్టి రాజ్యాన్ని పాలించి అంతరించి పోయిన రఘువంశపు మహారాజుల గాథలను ఆయన తన అగాథాలనుంచి త్రవ్వితీస్తున్నట్లుగా ఉండేది. ఆ గాథలలో స్వానుభవం ఉన్నట్లుగా ఉండేది. ప్రత్యక్షదర్శనం అనుభవించిన సన్నివేశాన్ని వర్ణిస్తున్నట్లుగా ఉండేది.

కాళిదాసుని రఘువంశం పూర్తి అయ్యేటప్పటికి గౌరమ్మకు చాల వైదుష్యం ఏర్పడటం మాత్రమే కాదు. ఆమె మనస్సులో మల్లన్నగారికి ప్రముఖమైన స్థానం యేర్పడింది. ఆయనతో తనకు ఎన్నో పూర్వజన్మాంతరాల సంబంధం ఉన్నట్లుగా తోచింది. ఆయనతో ఏదో అనిర్వచనీయమైన భావానుబంధం తనకు దృఢమైపోయినట్లుగా బలమైన భావాలు కలిగినాయి.

కుమారసంభవ కావ్యాన్ని మల్లన్నగారు పాఠం ప్రారంభించేటప్పటికే ఆమె మనస్సు సంచలించడం మొదలు పెట్టింది. విచిత్రమైన భావానుభవం కలగటం మొదలైనది. ఆ గాథా ప్రవాహంలో ఆమె మనస్సు విలీనమైపోయింది. ఆమెకు ఆ కావ్యజగత్తే వాస్తవికమై వాస్తవికమైన జగత్తు. విస్మృతి పథంలో పడిపోయింది.

తన తండ్రికి తాను ఏకపుత్రిక. లేకలేక కలిగిన సంతానము. తన్ను తన తండ్రి మిక్కిలి గారాబంగా పెంచుతున్నాడు. దేవతాత్మనంటి హిమాలయనగాధిరాజులో ఆమెకు తన తండ్రి కనిపించాడు.

పార్వతీదేవి అమ్మవారు హిమవంతునికి తపఃఫలంగా జన్మించింది. ఆమె దినదిన ప్రవర్థమానంగా పెరుగుతూ ఉన్నది. గౌరమ్మకు అమ్మవారిలో తన మూర్తి కనిపించింది. గౌరీదేవికి వివాహ వయస్సు వచ్చింది. ఆమె వివాహ ప్రస్తి వచ్చింది. ఆమె పరమేశ్వరుణ్ణి వివాహమాడుతానని ప్రతిజ్ఞ చేసింది. తపోవనానికి వెళ్లిపోయింది. గౌరమ్మ మనస్సు తహతహలాడిపోయింది. హృదయం చలించిపోయింది. తాను అమ్మవారే అయినట్లు తానే పరమేశ్వరుణ్ణి పతిగా వాంఛించి తపస్సు చేస్తున్నట్లు తపించిపోయింది. తపోవ్యగ్రత అనుభవించింది.

కంటిముందు నేత్రపర్వంగా భస్మత్రిపుండ్రాంక ఫాల భాగంతో తేజస్వియై పాఠాన్ని చెప్పుతున్న మల్లన్నగారు గౌరమ్మకు పరమేశ్వరుడే వచ్చినట్లుగా భాసించారు. ఆమెకు మల్లన్నగారిమీద భరింపరానంతగా మోహం కలిగిపోయింది.

ఇంతలో కాళిదాసు కుమారసంభవం కథలోకి మన్మథుణ్ణి తీసుకువచ్చాడు. మన్మథునితోపాటు అతని పరివారమంతా వచ్చింది. వసంతుడు, మందానిలం, చిలుక, చంద్రముడు, పంచపుష్ప బాణములు, రతీదేవి అందరూ వచ్చారు. వాళ్లందరి రాకతోను గౌరమ్మ మనస్సు మాన్మథీయమైన వ్యగ్రత పొందింది.

మన్మథుడు పార్వతీ పరమేశ్వరులను సంధానపరచడంకోసం పుష్ప బాణాలు వేశాడు. మన్మథుని పుష్పబాణాలు పరమేశ్వరుణ్ణి జయింపలేకపోయినా, గౌరమ్మను మాత్రం మొదటి బాణమే జయించింది. ఆమెకు మల్లన్నగారే పరమేశ్వరుడై, ప్రాణేశ్వరుడై—తన సర్వస్వానికి నాథుడై పోయాడు.

మల్లన్నగారికి మాత్రం గౌరమ్మ మనస్సులోని భావాలు తెలియనే తెలియవు. ఆయన పాఠం చెప్పేటప్పుడుగాని, తరువాతగాని, గౌరమ్మ ముఖం చూచి యెరుగడు. ఆయన పాఠం చెప్పే పద్ధతి ఉత్తమంగా ఉన్నట్లే, పాఠం ఉపక్రమించడానికి ముందు తీసుకునే చర్యలు కూడా ఉత్తమంగానే ఉన్నాయి. ఆయన మాధ్యాహ్నికం ముగించుకొని భోజనంచేసి కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని తరువాత పాఠాన్ని ప్రారంభిస్తారు. కావ్య పాఠమే కాబట్టి అనధ్యయనాలు లేవు. అన్నిరోజులూ పాఠం ఉంటుంది. గౌరమ్మ వెలుపలఉంటే అయిదవ స్నానం అయ్యే వరకు పాఠం ఉండదు. అట్లాగే మల్లన్నగారి భార్య వెలుపల ఉన్నప్పుడుకూడా పాఠం ఉండదు. ఆ దినాలలో వారికి స్వయం పాకం కాబట్టి అయిదోరోజే మళ్ళీ పాఠం జరుగుతుంది. పాఠం సూర్యాస్తమయ సమయానికి ఘడియసేపు ముందుగా నిలుపుదల చేస్తారు. ఇది ప్రతిదినమూ సాగుతున్న కార్యక్రమము.

మల్లన్నగారు గౌరమ్మకు సంస్కృతపాఠం చెప్పడానికి ప్రారంభించినప్పుడే తమ ధర్మపత్నికికూడా అదేపాఠం ప్రారంభించారు. ఆమెకూడా వచ్చి ప్రతిదినమూ పాఠం వింటూ ఉంటుంది.

మల్లన్నగారు తమ ధర్మపత్నివంక చూస్తూనే పాఠం చెప్పుతారు. అసలు ఆమెకు మాత్రమే పాఠం చెప్పుతున్నట్లుగా ఉంటుంది వారు చెప్పడం. ఆ సమయంలో అక్కడ గౌరమ్మ కూడా ఉన్నదనీ, ఆమెకూడా పాఠం వింటున్నదనీ, ఆయనకు గుర్తు ఉన్నట్లే ఉండదు.

మల్లన్నగారికి ముప్పయి ఏళ్లయినా నిండలేదు. ఆయన భార్య ఆయనకంటె ఆరేండ్లు చిన్నది. ఆమెను చూస్తూ పాఠం చెప్పడం వలననేమో—మల్లన్నగారి పాఠం మరింత మనోహరంగా ఉంటుంది, పరమాహ్లాదకరంగా ఉంటుంది. శృంగారరసాన్ని వేశాలలో పారవశ్యం కలిగిస్తూ ఉంటుంది. ఆ రసమయఘట్టాలలో మల్లన్నగారు తమ భార్యతో శృంగారభాషణం చేస్తున్నట్లే ఉంటుంది.

ఆభార్యా భర్తలు లోకాన్ని మరచిపోయి, కావ్యగత శృంగారరసాన్ని వేశాలలో స్వానుభవాన్ని నెమరువేసుకుంటూ తేలికగా రససమాధిస్థితిని చేరుకుంటూ ఉన్నట్లుగా ఉండేది. గౌరమ్మ మాత్రం ఏకాగ్రమైన చిత్తంతో పాఠాన్ని వింటూ శృంగారరసమయ సన్నివేశాలలో రసానందపులకిత అవుతూ పారవశ్యాన్ని అనుభవిస్తూ ఉండేది. ఆమె ఎంత రసానంద తన్మయత్వం పొందినా, పారవశ్యం అనుభవించినా, తన మనస్సులోని భావాలను వ్యక్తం చెయ్యకుండా నిగ్రహాన్ని అవలంబించగలిగింది. మర్యాదాతిక్రమణం జరుగకుండా ఆమె నిగ్రహించుకోవడానికి దోహదంగా మల్లన్నగారి భార్య అన్ని వేళలా సన్నిహితురాలుగా ఉండటమే కావచ్చును.

గౌరమ్మకు పద్దెనిమిది సంవత్సరాల వయస్సున్నది. ఆమె వ్యక్తురాలై నాలుగైదు సంవత్సరాలు గడచినాయి. ఆమె తండ్రి దగ్గర తెలుగు కావ్యాలు చదివింది. ఆంధ్రమహాభారతం, రామాయణం, సోమనాథుని కావ్యాలూ, ఎఱ్ఱాప్రెగ్గడ కావ్యాలూ, శ్రీనాథుని కావ్యాలూ పూర్తిచేసింది. లౌకిక విషయాలుగాని స్త్రీ పురుష విషయాలుగాని ఆమెకు అనుభవంలో లేవు. కాని ఆ విషయాలన్నిటిని ఊహించుకుని అవగాహన చేసికోగలిగిన వయస్సు ఉన్నదామెకు. వయస్సు ఉండటం మాత్రమే కాదు. వయస్సును మించిన ఊహలు పోహలు ఉన్నాయి.

మల్లన్నగారి భార్యకూడా ఉండి పాఠాలు వింటూ ఉండటం గౌరమ్మ మొదట్లో తనకు అవరోధంగా ఉన్నదని భావించుకున్నది. కాని ఆమె నిత్యమూ సన్నిహితురాలుగా ఉండటంవల్లనే—తాను నిగ్రహం అవలంబించకలిగితినని ఆమె త్వరలోనే తెలుసుకోగలిగింది. అందుచేత గౌరమ్మ మల్లన్నగారి భార్యమీద ద్వేషాన్ని పెంచుకోలేదు.

ఇంకో చమత్కారంకూడా ఉన్నది. మల్లన్నగారి భార్య పేరు గౌరీదేవమ్మ. అయితే ఆమెను మల్లన్నగారు పేరుపెట్టి పిలువరు. మల్లిక అనీ, మల్లీ అనీ అంటూ ఉంటారు. తాను మల్లికార్జునుడు కాబట్టి ఆమె మల్లిక అని వారు చమత్కరిస్తున్నారన్న మాట. ఆ క్రొత్త ఊరులో ఆమె పేరెవ్వరికి తెలియదు. మల్లన్నగారు ఆమెను 'మల్లిక' అని పిలువడంవలన ఆమె ఊరందరికీ మల్లికమ్మగా రయింది. కొందరు మల్లికాంబగారని కూడా అంటు

న్నారు. మల్లన్నగారి రెండో కుమారుడు నాలుగైదేండ్లవాడున్నాడు. అతని పేరు కుమారస్వామి. రెండేండ్ల కుమార్తె ఉన్నది. ఆమెపేరు అన్నమాంబ.

మొదట్లో గౌరమ్మ మల్లికాంబను అమ్మగారని పిలుస్తూ ఉండేది. కాని యెందుకో ఆ పిలుపు బాగాలేదనిపించి మార్పు చేసింది. మల్లికాంబ తనకంటె నాలుగేండ్లు మాత్రమే పెద్దది. అమ్మగారని పిలువడానికి మనస్కరించలేదు. అక్కయ్యగారని పిలువడం ప్రారంభించింది. ఆమె గౌరమ్మను 'చెల్లమ్మా' అని పిలిచేది. ఆమె మొదటినుంచీ 'చెల్లమ్మా' అని పిలువడంచేతనే గౌరమ్మకు అక్కయ్యగారని పిలువడానికి బుద్ధి పుట్టిందేమో.

ఆఊరు వచ్చినప్పటినుంచీ కుమారస్వామికీ అన్నమాంబకూ గౌరమ్మతో చనవు పెరిగిపోయింది. ఎప్పుడూ ఆమె తోనే ఉండటం. ఆమె చదువుకోని కాలమంతా వాళ్లతోనే గడపేది. వాళ్లను ఎత్తుకొని ముద్దాడి, ఆలింగనంచేసుకొని, ఆచేష్టలలో వాళ్లద్వారా వాళ్ల పితృమూర్తిని సన్నిహితంగా భావించుకుంటూ అపూర్వమైన అనుభూతుల్ని పొందుతూ ఉండేది. ఆపిల్ల లిద్దరిచేతా 'పిన్నమ్మా' అని పిలిపించుకుంటూ మురిసిపోయేది.

ఆ ఊళ్లో మల్లన్నగారిని అయ్యగారనీ, స్వామివారనీ పిలుస్తున్నారు. ఆయనభార్య ఆయన్ను 'స్వామీ' అని పిలుస్తుంది. గౌరమ్మ ఆయన్ను ఎప్పుడూ పిలచి ఎరుగదు. అవసరం కలుగలేదు. పాఠం వినేటప్పుడు సాధారణంగా అవగాహన

కాని విషయం ఉండేదికాదు. ఆయన్ను పిలువవలసిన అవసరమే కలుగుటలేదు. ఇతరులతో ఆయన్ను గురించి చెప్పవలసి వచ్చినప్పుడు "మాస్వామి వారు" అనేది.

గౌరమ్మకు పసితనంలోనే తల్లి గతించింది. తండ్రి కేసన శెట్టి మళ్లీ పెండ్లి చేసుకోలేదు. తానే తల్లికూడా అయి కుమార్తెను పెంచాడు. లేకలేక కలిగిన సంతానం. కేసనశెట్టికి మధ్య వయస్సులో కలిగింది. ఎన్నో వ్రతాలు చేయగా పుట్టిన కుమార్తె మీద ప్రేమతో అతడు మళ్లీ పెండ్లిమాట తలపెట్టలేదు. అతడు రెండు గ్రామాలకు అమరమాగాణపు ప్రభువు కావడంవలన పెండ్లి చేసుకోవాలనుకుంటే కన్యలు లభిస్తారు. అతనిది కులాల కులం. అతనికి కన్యలను ఇవ్వడానికి కొందరు ప్రయత్నించారు కూడా. అతను ఇష్టపడలేదు. అతనిని బలపరచింది అతని తోబుట్టువు. ఆమె చిన్నతనంలో భర్తను పోగొట్టుకుని అన్నగారి ఇల్లుపట్టింది. ఆమె కొక కొడుకు. అతని కిచ్చి గౌరమ్మకు పెండ్లి చేయాలని కేసనశెట్టి ఆలోచన. అందుచేతనే అతడు మళ్లీ పెళ్లి చేసుకోకపోవడాన్ని తోబుట్టువు హర్షించింది.

గౌరమ్మ తండ్రిదగ్గరే ఆంధ్ర కావ్యాలు చదివింది. ఆమె వ్యక్తురాలుకాగా వివాహం చేద్దామనుకున్నాడు తండ్రి. కాని గౌరమ్మ సంస్కృతం పంచకావ్యాలూ, రామాయణం పూర్తి చేసికాని వివాహంచేసికోనన్నది. ఆమెను గారాబంగా పెంచిన తండ్రి ఆమె మాటను తోసివేయలేక సమ్మతించాడు. ఆమెకు సంస్కృతం చెప్పించడానికి పూనుకున్నాడు.

కేసనశెట్టి పురాతనకుటుంబంవాడు. ప్రఖ్యాతిగల కుటుంబం వాళ్లది. ఆంధ్రకవిబ్రహ్మ తిక్కన సోమయాజిగారికి భారతరచనలో లేఖకుడైన గురునాథుడు వాళ్లమూలపురుషుడు. గురునాథుని సేవకుమెచ్చి తిక్కన సోమయాజి మహామంత్రుల వారు గోపవరం, మిన్నపల్లె అనే రెండు గ్రామాలను అమరమాగాణంగా ఇప్పించారట. ఆనాటినుండి ఆకుటుంబంవారు ఆగ్రామాలను దక్కించుకుంటూ సుఖజీవనంచేస్తూ ధనికులుగా ఉంటున్నారు. కేసనశెట్టి రెండు అమరమాగాణపు గ్రామాలకు ప్రభువై చిన్నపాలెగానివలె సామంతునివలె ఉన్నాడన్నమాట.

మహామంత్రి తిక్కనామాత్యులవారు గురునాథుని వంశానికి ఇంకో ఉపకారం కూడా చేశారు. గురునాథుని వంశంలోవాళ్లు సంస్కృతం అధ్యయనం చేసుకోవాలనుకుంటే తమ వంశంలోనివారు అధ్యయనం చేయిస్తారనిమాట ఇచ్చారట. కేసనశెట్టి తిక్కనామాత్యులవారి వంశంలోనివాడైన శ్రీకంఠయ్యగారి దగ్గర సంస్కృతం అధ్యయనం చేశాడు. శ్రీకంఠయ్యగారు ఉండేది పాటూరులో. కేసనశెట్టి వారి గ్రామానికి వెళ్లి వారిని సేవించి అధ్యయనం చేశాడు.

కేసనశెట్టి తనకు పుత్రసంతానంలేదని కొంత బాధపడ్డాడు. తనతో తన కుటుంబమున సంస్కృతవిద్య నిలచిపోతున్నదని విచారపడ్డాడు. తన మేనల్లునికి సంస్కృతం చెప్పించాలనుకున్నాడు. కాని ఆకుర్రవానికి తెలుగే అంటలేదు. వానికి చదువుమీద శ్రద్ధలేదు. నాకు చదువెందు కన్నాడు

వాడు. కేసనశెట్టి మనస్సు బాధపడింది. అతని కుమార్తె ఆ బాధను పోగొట్టింది.

గౌరమ్మ ప్రజ్ఞావంతురాలని కేసనశెట్టి గ్రహించాడు. ఆమెకు తెలుగుచెప్పడం ప్రారంభించగా ఆమె సాహిత్యమర్మాలు తెలిసినదానిలాగా చదివింది. సకలపూర్వాంధ్రసాహిత్యాన్ని పూర్తిచేసింది. సాహిత్యభావుకత పెంపుచేసుకున్నది. తెలుగు పూర్తిచేసి ఆమె సంస్కృతం ప్రారంభిస్తాననగా కేసనశెట్టి హృదయం ఆనందపడింది.

కాని కుమార్తెకు సంస్కృతం చెప్పించడానికి అతని తోబుట్టువు వద్దన్నది తన కుమారుడు పెరుమాళ్లయ్యకు చదువంట లేదు. అతనికి కాబోయే భార్యకు మాత్రమెందుకని ఆమె అభిప్రాయం. అందులో సంస్కృతమసలే అక్కరలేదు. పెరుమాళ్లయ్య తల్లి అభిప్రాయానికి మద్దతుచేశాడు. అబ్బాయి గౌరమ్మకు సంస్కృతం చెప్పించ వద్దంటున్నాడని తోబుట్టువు కేసనశెట్టికి రెండు మూడుసార్లు చెప్పింది. కేసనశెట్టి చెవిని వేసుకోలేదు.

పెరుమాళ్లయ్య క్రొత్త అభ్యంతరం లేవదీశాడు. అమరమాగాణ ప్రభువుల కుమార్తె - వయసువచ్చిన యువతి - బయట ఊళ్లకువెళ్లి చదువుకోవడం కుటుంబగౌరవహాని అని అతని వాదం. ఆవాదం కేసనశెట్టి చెవినివేసింది తోబుట్టువు. కేసనశెట్టి ఆలోచనచేశాడు. నిజముగా తన కుమార్తె ప్రభువులబిడ్డ. స్థానాన్నిబట్టి కొంతవరకు హద్దులు పాటించవలసిన మాట

నిజమే. ఆమెను మరియొక ఊరికి చదువులకు పంపడం సమంజసం కాదు. పైగా తనకు ఏకసంతానం. వదలిపెట్టి తానుమాత్రం ఉండగలడా? ఆమెను చూచుకొనిగదా తాను బ్రతుకు తున్నాడు?

అతడు బాగా యోచనచేశాడు. తన గురువుగారైన శ్రీకంఠయ్యగారి ఊరువెళ్లాడు. శ్రీకంఠయ్యగారు చాల నాళ్లక్రితమే దివంగతులైనారు. ఆయనకు కుమార్తెద్దరు. పెద్దాయన పాటూరి గ్రామాధికారిగా ఉంటున్నాడు. ఆయనకు కేసనశెట్టి తన సమస్య మనవిచేశాడు. ఆయన తన తమ్ముని దగ్గరకువెళ్లమన్నాడు. గ్రామాధికారిగా తనకు తీరుబడిలేదన్నాడు. ఆయన తమ్ముడు మల్లన్నగారు మహావిద్వాంసుడై అనుష్ఠానాలు చేసుకుంటూ మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. మేనమామకు ఏక పుత్రిక. ఆమె మల్లన్నగారి భార్య. వారిది టంగుటూరు.

కేసనశెట్టి టంగుటూరు వెళ్లి మల్లన్నగారి దర్శనం చేశాడు. మల్లన్నగారి పసితనంలో తాను శ్రీకంఠయ్యగారిని సేవించిఉన్నాడు కనుక కేసనశెట్టి ముఖపరిచయం మల్లన్నగారికి లేదు. తన్ను తాను ఎరిగించుకున్నాడు. తన తండ్రిగారి శిష్యుడని మల్లన్నగారు రతనిని ఆదరించారు. కేసనశెట్టి తన సమస్యను విన్నవించాడు. తన్ను చూచుకొని బ్రతుకుతున్న వృద్ధులు మేనమామను మేనత్తను వదలి మల్లన్నగారు గోపవరం రావడానికి అంగీకరించలేదు. పైగా తనకు శాంతిగా నిత్యానుష్ఠానం చేసుకోవడమే అభిమతం. పాఠాలు చెప్పేకోరిక లేదు.

కేసనశెట్టి మల్లన్నగారి మేనమామగారికి మనవిచేశాడు. ఆయన మందస్మితంచేసి ఊరుకున్నాడు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన అన్నమయ్యగారు కేసనశెట్టి విన్నపం విన్నాడు. అన్నమయ్యగారిని చూడగా కేసనశెట్టికి గౌరవభావం కలిగి ఆయనతో మొరపెట్టుకున్నాడు. ఆంధ్రసాహిత్యకారులకు అనుల్లంఘ్యమైన తిక్కన సోమయాజిగారి వరం ఏమి కావాలన్నాడు. ఆయన ఇచ్చినమాట నిలువబెట్టవద్దా? అని హెచ్చరించాడు.

అన్నమయ్యగారికి కరుణకలిగింది. తాను కలిపించుకొని మల్లన్నగారికి నచ్చచెప్పారు. ఆంధ్రభాష మాటాడే వారందరికీ తిక్కన సోమయాజిగారిమాట శిరోధార్యమైనది. వారి వంశం లోని వాళ్లకది తిరుగులేని శాసనము. దానిని పాలింపకతప్పదు. ఇక్కడ టంగుటూరులో మేనమామగారికి ఆయన భార్యకు ఫరవాలేదు. వాళ్లను తాను చూచుకుంటూ ఉంటాడు. వాళ్లిద్దరు తమ ఇంట్లోనే ఉంటారు. అయినా నాలుగైదేండ్లు మాత్రమేగా. ఈ మాటలకు మల్లన్నగారు తలవంచాడు. అంగీకరింపక తప్పలేదు.

మల్లన్నగారిని కేసనశెట్టి కుటుంబంతో సహా తెచ్చి గోపవరంలో వసతి ఏర్పాట్లుచేశాడు. మల్లన్నగారు శ్రీకంఠయ్యగారి కుమారుడు కాబట్టి శ్రీకంఠయ్యగారి మల్లన్నగారిని వ్యవహారము. ఆయన తిక్కనామాత్యులవారివంశమువాడని, గురునాథుని కాలమునుండి తమకు విద్యాగురువంశమువాడని, తనకు గురుపుత్రుడని, ఆరాధ్యుడని, నిత్యపూజనీయుడని కేసనశెట్టి

ఆయనయందు పరమేశ్వరభావమే అనుసంధించుకున్నాడు. తన శక్తికి వీలైనంత వసతి సౌకర్యాలు సమకూర్చాడు. పార్వతీ సహితుడైన పరమేశ్వరుడు తన ఇంటికివచ్చినట్లు సంతోష పడ్డాడు. మల్లన్నగారు గోపవరానికి వచ్చిన నాలుగోనాడు ఆయన గౌరమ్మకు కాళిదాసుని రఘువంశమహాకావ్యాన్ని 'సరాజ్యం గురునాదత్తం' శ్లోకంతో చతుర్థసర్గలో ప్రారంభించాడు.

ఆనాడు పాఠ ప్రారంభానికి కేసనశెట్టి కూడా వచ్చాడు. ప్రార్థనలో మల్లన్నగారు 'వాగర్థావివ' శ్లోకాన్ని చదివి వ్యాఖ్యానించారు. సకల అలంకారగ్రంథాలూ కదలాడిపోయి నవి. పూర్వమీమాంసాది బహుదార్శనికభావాలు ప్రకాశించినవి. మంత్రశాస్త్రము ముగ్ధరూపమున ప్రసన్నతవహించినది. కేసనశెట్టి పరవశించిపోయాడు. మళ్లీ శ్రీకంఠయ్యగారి పాఠం వింటున్నట్లుగా ఉన్నది తనకు. తన కుమార్తెకు వైదుష్యము కరతలామలకము కాగలదని ఆనందపడ్డాడు. మల్లన్నగారు తన ధర్మపత్నిని దగ్గరపెట్టుకొని పాఠంచెప్పడం కేసనశెట్టికి మరింత బాగున్నది.

గౌరమ్మ సంస్కృత అధ్యయనం మేనత్తకు ఇష్టము కాదాయె. మల్లన్నగారు రావడం కూడా ఆమెకు ఇష్టము కాదు. ఆయన్ను చూడటమే ఆమెకు కోపము ద్వేషము కలిగినవి. దినములతోపాటు ఆమె ద్వేషము పెరుగుతూవచ్చింది. ఆయనకు జరుగుచున్న గౌరవాలు ఆమె కోపాన్ని ప్రజ్వలింప

చేశాయి. ఆయన భార్యను పిల్లలనుచూస్తే ఆమెకు వళ్లు మండిపోతుండేది. వాళ్లతో మాట్లాడేదికాదు. చురచుర చూశేది. వాళ్లకు కేసవశెట్టి కల్పిస్తున్న సదుపాయాలకు భంగం కలిగించాలని ప్రయత్నం చేస్తుండేది. కాని కేసవశెట్టి మిక్కిలి జాగ్రత్త కలవాడు. గురుభక్తి కలవాడు. గురులింగ జంగమార్చనపరుడు. భవభక్తికతుడు. మల్లన్నగారి కెట్టిలోపము రాకుండ జాగరూకుడై చూచుచున్నాడు. తన తోబుట్టువు కల్పిస్తున్న అవరోధాలు అతనికి తెలియకపోలేదు. కేసనశెట్టికి తోబుట్టువుమీద ప్రత్యేకమైన ఆదరం ఉన్నది.

ఆమె చిన్నతనంలో భర్తను పోగొట్టుకొని అన్నగారి ఇల్లు పట్టినది. వేరేదిక్కులేదు. కేసనశెట్టికి కూడ మరియొక ఆడదిక్కులేదు. భార్యపోవడం మూలాన ఇంట్లో పెత్తనమామెదై పోయింది. ఆమె కుమారునికి కేసనశెట్టి తన ఏకపుత్రిక నివ్వబోతున్నాడు కూడా - అప్పుడంతా ఆమెదే కదా! కేసనశెట్టి బంధుప్రియుడు. ప్రియభాషి. మల్లన్నగారియందు తోబుట్టువు చూపుతున్న ద్వేషమును గమనించి, తెలియనట్లే ప్రవర్తిస్తూ అవరోధాలను తొలగిస్తూ ఉండేవాడు.

12

మల్లన్నగారు మధ్యాహ్న భోజనం ముగించి ఘడియసేపు విశ్రాంతి తీసుకొని ముందువసారోలోకి వచ్చేవారు. వెంట భాగ్య పాఠం చెప్పుతున్న కావ్యాన్ని వ్యాసపీఠాన్ని తీసుకువచ్చేది. అదివరకే అక్కడ తివాచీ పరచి ఉంచబడే 'యన కూర్చున్న

తరువాత వ్యాసపీఠాన్ని ఆయనముందు భార్య ఉంచేది. భార్య చిన్నచాపవేసుకుని ఎదురుగా కూర్చునేది. గౌరమ్మ ఆమెకు కుడి ప్రక్కగా చిన్నచాపమీద కూర్చునేది.

మల్లన్నగారు బయటకు వచ్చేటప్పటికే గౌరమ్మ వచ్చి ఉండేది. ఆయన బయటకురాగా లేచినిల్చుని, ఆయన ఆయన భార్య కూర్చున్నతరువాత వాళ్లిద్దరకు ప్రణామం చేసి గౌరమ్మ కూర్చునేది. తరువాత మల్లన్నగారు పాఠం మొదలుపెట్టేవారు. మల్లన్నగారి పిల్లలువచ్చి తల్లిప్రక్కనో గౌరమ్మ ప్రక్కనో కూర్చుండుటో, లేక పడుకోవడమో చేసేవారు.

చిన్న ప్రార్థనా శ్లోకంతో పాఠం ప్రారంభమై స్వస్తివాచకంతో ముగిసేది. పాఠం ముగిసిన తర్వాత గౌరమ్మ మళ్లీ ప్రణామంచేసి నిలువబడేది. మల్లన్నగారు పాఠం చెప్పేటప్పుడుగాని మరెప్పుడుగాని గౌరమ్మ వంక చూచేవారు కాదు. మాట్లాడే వారుకాదు. మాట్లాడవలసిన అవసరము లేదు. సక్రుత్తుగా అవసరమైతే మాటలు ముక్తసరిగా ఉండేవి. ఒకప్పుడు ఆమెకు చెప్పవలసిన మాటలుకూడా భార్యతోనే చెప్పడం జరిగేది. అప్పుడు ఆయన భార్య గౌరమ్మ వంకచూచేది.

పాఠం చదువుకోవడానికి వచ్చేటప్పటికి గౌరమ్మ కూడా భోజనం చేసివచ్చేది. ప్రతిదినం శిరస్నానం చేసి శుభ్రమైన ఆరవేసిన బట్టలుకట్టుకొని, జారుముడివేసుకొని, అందులో తనకు ఇష్టమైన జాజిపూవులు పెట్టుకొనివచ్చేది. జాజిపూవులు అన్ని ఋతువులలోనూ గుబాళించేపువ్వులు. ఆపువ్వులు దండగ్రుచ్చి

ధరించకుండా ఆమె ఏదినమూ ఉండేదికాదు. ప్రతిదినం ఉదయ కాలంలో కొన్ని జాజిపూవులు కరవీరాలు తెచ్చి మల్లన్నగారి దేవతార్చనకోసం ఇచ్చిపోతూ ఉండేది కూడాను.

గౌరమ్మపేరు కూడా మల్లన్నగారి భార్యపేరే అవడం మూలాన - ఆయన గౌరమ్మను గురించి భార్యతో చెప్పవలసి వచ్చినప్పుడుకూడా పేరుతో చెప్పడం జరిగేదికాదు. గౌరమ్మకు జాజిపువ్వులు ఇష్టమైన పువ్వులని తెలిసినప్పటినుంచీ ఆమె పరోక్షంలో ఆమెను 'మొల్ల' అనేవారు. మల్లన్నగారి భార్య ఆపేరుపెట్టి గౌరమ్మను ప్రత్యక్షంగానే పిలిచి నవ్వేది. ఆయన పిల్లలు గౌరమ్మను 'మొల్ల పిన్నమ్మ' అనేవారు. ఆపేరు మల్లన్న గారు పెట్టినది కావడంవలన ఆపేరుతో పిలచినప్పుడల్లా మొల్ల పరవశించిపోతూ ఉండేది.

వసంతకాలపురోజులు గుబాళించుకుంటూ చక్కా వచ్చాయి. మామిడిచెట్టు ఆసంవత్సరం అధికంగా చిగురాకులు తొడిగింది. వనంలో పుష్పాలు క్రొత్తవాసనలతో వెల్లివిరిసినాయి. ఒక నూతనలోకం అవతరించినట్లుగా చేశాడు వసంతరాజు.

కుమారసంభవంలో పాతం ఎనిమిదవసర్గను చేరుకున్నది. పార్వతీ పరమేశ్వరుల కల్యాణఘట్టంలో మొల్ల హిమవంతుని రాజనగరులో ఉండి అమ్మవారి కల్యాణాన్ని స్వయంగా చూస్తున్నట్లే ఆనందించింది.

కవికులగురువైన కాళిదాసమహాకవి జగత్తునకు తలి దండ్రులైన పార్వతీ పరమేశ్వరుల సంభోగ శృంగారాన్ని

వర్ణించడం ప్రారంభించాడు. ఆలంకారిక శిరోమణి అయిన ఆనందవర్ధనుడు 'తల్లి దండ్రుల సంభోగమును వర్ణించుట ఎంత నీచమో ఎంత లజ్జాకరమో అదేవిధముగా ఉత్తమ నాయికా నాయకులగు దేవతల సంభోగవర్ణన కూడా అసహ్యమగుటచే కవి ఔచిత్యమును పాటింపక తప్ప' దన్నాడు. ఇట్టివర్ణన ఆభిజాత్యం కాదని శిష్టుల మతము. శివపార్వతులు జగత్పితలు. దేవతాసమ్రాట్టులు. వారికంటె ఉత్తమపాత్ర లెవ్వరుంటారు? 'సుతరామసహ్యం' అన్నప్పటికీ కాళిదాస మహాకవి మాత్రం సంభోగశృంగారాన్ని తేలికగా వదలిపెట్టలేదు.

పార్వతీ పరమేశ్వరులు ఏకాంతవిహారం చేస్తున్నారు. వారి శృంగారవైభవం లోకోత్తరంగా ఉన్నది. కాళిదాసు వర్ణన శృంగారరస మూర్తీభావంగా ఉన్నది. ప్రత్యక్ష రస మయంగా ఉన్నది.

మల్లన్నగారు పార్వతీ పరమేశ్వరుల బాహ్యశృంగార క్రీడావిశేషాలను మధురంగా రసవద్వ్యాఖ్యానం చేస్తూ - ఆ క్రీడలకు వాత్స్యాయన కామసూత్రాలలో లక్షణములను ఉదహరించి - సమన్వయ వివరణలుచేస్తూ - భార్యవంకచూస్తూ - మందస్మితంచేస్తూ ఆనందపారవశ్యం అనుభవిస్తున్నారు. ఆయన భార్య అయన ఆనందంలో పాలు పంచుకొంటున్నది.

ఆ సంభోగశృంగార రసానందసాగరంలో మొల్ల కూడా తన్మయురాలై మునిగిపోయి ఉన్నది. పులకాంకురిత అయి ఉన్నది. శృంగారరస పారవశ్యంలో శరీరం తెలియకుండా

ఉన్నది. ఆ మోహావేశంలో ఆమె మల్లన్నగారినే ఏకాగ్ర దృష్టితో చూస్తున్నది. ఆమెకు ప్రపంచంలో మరేమీ తెలియడం లేదు. సంభోగసుఖం అనుభవిస్తున్న పార్వతీదేవిలాగా ఉన్నది ఆమెస్థితి. అప్పుడు ముందానిలపశంచేత ఆమె పమిట తొలగిపోయినట్లు, ఆమె కఠిన స్తనమండలం ఆచ్ఛాదనం లేక పోవడం మూలాన కంచుకాన్ని ఛేదిస్తున్నట్లుగా ఉన్నదని ఆమె గ్రహింపలేదు

పమిట తొలగి కంచులికను ఛేదిస్తూ పర్వాగ్ర యుగళం లాగా కుచద్వయం వ్యగ్రస్థితి పొందడం, ఆనందపారవశ్యంతో కన్నులనుండి ఆనందబాష్పాలు కురుస్తూ ఉండటం - ఆమె శృంగారరసాధి దేవతలాగా ఉన్నది.

ఇంతలో సర్గాంత మైపోయింది. పాఠం నిలచిపోయింది. సాధారణంగా అప్పుడు మొల్ల ప్రణామం చేసి నిలువబడవలసి ఉన్నది. ఆమె బాహ్యస్మృతి లేకుండా రససమాధిలో ఉండి ప్రణామం చెయ్యలేదు. మల్లన్నగారు ఆయన భార్యవంక చూశారు. వాళ్లిద్దరికీ మొల్ల రసానందస్థితియందున్నదని తెలిసింది.

మల్లన్నగారి భార్య ఛటాలున మొల్లను సమీపించి ఆమె పమిటకొంగు సరిచేసి ముంగురులు దువ్వి కనులొత్తి చుబుకాన్ని ముద్దాడి ఆలింగనం చేసుకున్నది. అప్పుడు మొల్లకు బాహ్యస్మృతి కలిగి సిగ్గుపడిపోయింది. అంతకుముందే మల్లన్నగారు లోపలకు వెళ్లిపోయారు. మొల్ల మల్లన్నగారిభార్యకు మాత్రమే పాదాభివందనంచేసి ఇంటికి తిరిగివచ్చింది.

ఆమె ఇంటికి తిరిగివచ్చినా మనస్సు రసమయ వాతావరణంలోనుంచి బయటపడనే లేదు. ఇంకా పార్వతీ పరమేశ్వరుల బాహ్యాశృంగారక్రీడలు ఆమె మనోనేత్రాలముందు కన్పిస్తూనే ఉన్నయి. ఆమె మనస్సు స్వాస్థ్యాన్ని పొందనే లేదు.

ఆరాత్రి మొల్లకు నిద్దురపట్టలేదు. ఐతే ఆమె జాగ్రదవస్థలో ఉన్నదని చెప్పడానికి కూడా వీలులేదు. కన్నులు మూయగా నిద్దురలోని స్వప్నములో లేక రసమయమైన వ్యగ్ర స్థితియో. ఆమెకు అపూర్వమైన సుఖస్వప్నాలు. మల్లన్నగారు పరమేశ్వరుడై వచ్చి పార్వతీదేవి యగు తన్ను వివాహం చేసికొన్నట్లు, ఆయన తనతో ఏకాంతవిహారం చేసినట్లు, తనతో బాహ్యాశృంగార క్రీడలతో క్రీడించినట్లు, తాను ఆయనను చుంబించినట్లు, ఆయన తన్ను గాఢాలింగనం చేసుకుని, చుంబించి, ఉక్కిరి బిక్కిరి చేసినట్లు, అన్యోన్యం పెనవేసికొన్నట్లు, భోగించినట్లు, తాను పురుషాయితము చేసినట్లు స్వప్నములై ఆమె మాధుర్యకసలోకంలో విహరించింది. కైలాసశిఖరంమీద శివునితో క్రీడించింది. దారుకావనంలో పరమేశ్వరునితో భోగించింది.

తెల్లవారగా - ఆమె కన్నులు తెరచి - ఏదో క్రొత్త లోకంలో - అపరిచితమైన లోకంలో అడుగు పెట్టుతున్నానుకొన్నది.

రాత్రి స్వప్నంలో కలిగిన అనుభవాలు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకానికి వచ్చి ఆమె పులకరింతలతో పరవశం అయింది. ఆమెకు అమృతం మీద క్రుమ్మరింపబడినట్లుగా ఉన్నది. జాగ్రదవస్థలో

మధురస్వప్నములు వచ్చినట్లుగా ఉన్నది. మధుకుల్యంపాయలు పాయలుగా తన్ను చుట్టుముట్టినట్లుగా ఉన్నది. స్వప్నంలోని అనుభవం జాగ్రదవస్థలోనికి ప్రవేశిస్తున్నట్లుగా ఉన్నది. ఆ అనుభవం నిత్యమై హృదయంమీద చెరగిపోని ముద్ర వేసినట్లుగా ఉన్నది.

వినూత్నమైన అనుభవానికి మొల్ల సంచలించిపోయింది. చాలసేపటివరకు ఆమెను పారవశ్యం వదలిపెట్టనే లేదు. మామూలు కాల్యకరణీయాలను క్రమంగా నిర్వహింపలేక పోయింది. ఆమె చిత్రంగా ప్రవర్తిస్తున్నదని తండ్రి గ్రహించాడు. ఒంట్లో బాగాలేదేమోనని సరిపెట్టుకున్నాడు.

ఆమె రసమయప్రకృతియై వ్యగ్రత్వాన్ని నిగ్రహించుకోలేకపోయింది. భాగవత దశమస్కంధంలో వియోగాన్ని అనుభవిస్తున్న గోపికలలాగా ఆమె మల్లన్నగారిని చూడటానికి తహతహలాడిపోయింది.

గబగబాస్నానం ముగించుకొని బట్టలు కట్టుకొని జారుముడివేసుకొని జాజిపువ్వులుపెట్టుకొని, కొన్నిపువ్వులను పూలసజ్జలో పెట్టుకుని మల్లన్నగారింటికి వెళ్లింది. మామూలుగా అయితే పువ్వుల్ని తామరాకులోపెట్టి తామరాకును గుమ్మానికి లోపలగాఉంచి, ఆసంగతి మల్లన్నగారి భార్యకు కేకవేసి చెప్పి వచ్చివేసేది.

ఇప్పుడు అట్లాకాదు. మల్లన్నగారాసమయంలో ప్రాతరను ష్ఠానం చేసుకుంటూ మధ్యలో సూర్యనమస్కారాల కోసం

దొడ్డిలోకి వస్తారు. ఆయన ఒక అంగవస్త్రాన్ని కట్టుకొని మరొక అంగవస్త్రాన్ని నడుముకి బిగించుకొని ఉంటారు. ఆయన దొడ్డి లోకి వస్తే ద్వారం దగ్గర నిల్చున్నవాళ్లకు కన్పిస్తూఉంటారు. ఆయన సూర్యనమస్కారాలకోసం దొడ్డిలోకి వచ్చేదాకా మొల్ల గుమ్మందగ్గర నుంచున్నది.

మల్లన్నగారు దొడ్డిలోకి వచ్చి సూర్యనమస్కారాలు ప్రారంభించారు. మొల్ల అల్లంత దూరంలో ఉన్నది. చేతిలోని పూలసజ్జను క్రిందపెట్టి తన్మయురాలై మల్లన్నగారిని చూస్తూ నిలుచుంది. ఆమె మళ్లీ పారవశ్యంలో పడిపోయింది. పమిటి కొంగు జారిపోవడం గమనించలేదు. మల్లన్నగారిని చూస్తూ నిలబడిపోయింది. మల్లన్నగారు తన ధోరణిలో తాను ఉన్నాడు గాని మొల్లవంక చూడనేలేదు.

సూర్యనమస్కారాలు ముగింపుచేశాక మల్లన్నగారు మొల్లను గమనించారు. ఆమెవంక చూచారు. ఆమె పరిస్థితి ఆయనకు అవగాహన అయింది. మెల్లిగా ఏదో అన్నారు. ఆ మాటకు ఇంట్లోంచి భార్య బయటకు వచ్చింది. ఆమె బయటకు వస్తూ మొల్లను చూచింది. మొల్ల ఇంకా అట్లాగే నిలబడి ఉన్నది.

ఆమె మెల్లిగా మొల్లదగ్గరకు వచ్చింది. మొల్ల మల్లన్న గారివంకే చూస్తూ ఉన్నది. పమిట జారి స్తనమండలం ఉద్విగ్నం పొంది కన్నులు లౌల్యంగా ఉన్నాయి. ఆమెకు విషయం తెలిసింది. ఆమె "మొల్లా" అన్నది. అప్పుడు మొల్లకు కొరడా

దెబ్బ తగిలినట్లయింది. ఒక్కసారి లౌకికస్మృతి వచ్చింది పమిట సర్దుకున్నది. శిరస్సు వంచుకున్నది ఏదో తప్పుచేసిన దాని లాగా దడదడలాడిపోయింది. అక్కడ నిలువలేకపోయింది. ఆమె ముఖాన్ని చూడటానికి సిగ్గుపడింది. పూలసజ్జ అక్కడనే ఉంచి చకచకా ఇంటికి వెళ్లిపోయింది.

13

కేసనశెట్టికి తోబుట్టువు మీద మేనల్లుని మీద అభిమానం ఉండటానికి ప్రత్యేకమైన కారణం ఒక్కటి ఉన్నది. తోబుట్టువును సన్నిహితబంధువర్గంలోనే ఇచ్చాడు. కులవృత్తి చేసుకుంటూ కొంత భూమి సేద్యం చేసుకుంటూ ఆమె భర్త సుఖజీవనంచేస్తూ ఉండేవాడు. కాని అతడు అకస్మాత్తుగా మరణించడానికి అసాధారణమైన హేతువే ఉన్నది.

పూర్వం వేంగీపూర్వచాళుక్యులు, దక్షిణకోసలాధిపతులూ, త్రిపురికళచురిరాజులూ కూడ త్రికళింగాధిపతులమని చెప్పుకునే వాళ్లు. కాని పూర్వగాంగరాజులు వంశధారా నదీతీరంలో ఉన్న ముఖలింగపురం రాజధానిగా కళింగ రాజ్యాన్ని స్థాపించారు. ముఖలింగపురానికి కళింగనగర మని కూడా పేరు. ఆనగరం అమరావతితో సరితూగుతుందట. సర్వర్తు సుఖరమణీయమైనదట. విజయవంతమైనదట.

పూర్వగాంగవంశరాజన్యులు శివభక్తులు. వారి దైవం శకల శశాంకశేఖరధరుడు. సకల భువననిర్మాణైకసూత్రధారుడు.

మహేంద్రాచలామలశిఖరప్రతిష్ఠితుడు. ఆయనను పూర్వగాంగ వంశ రాజన్యులు గోకర్ణస్వామి యని వ్యవహరించే వాళ్లు. గోకర్ణస్వామి చరణయుగళ సేవాప్రసాదంవలన తాము విగత కలికలంకులమైతి మని చెప్పుకునే వాళ్లు. వాళ్లు స్వఖడ్గ పరిస్పందముచేత సకల కళింగానికి ప్రభువులయ్యారు. ఆరాజన్యులందరు మాతాపిత్రుపాదానుధ్యాతులు. వారి గురువులు వేద వేదాంగేతిహాసపురాణ న్యాయవిద్యా స్వసిద్ధాంతాధిగతులు.

కాలక్రమంలో అర్వాచీన గాంగవంశంవారు కళింగ దేశపాలకు లయ్యారు. కళింగోత్కలదేశములు సర్వముతో ముఖాభివృద్ధిని అర్వాచీనగాంగ వంశరాజన్యుల కాలంలో పొందినవి. వాళ్లు ధర్మాన్ని రక్షించారు. వైదికసంస్కృతిని అవలంబించి దాని అభివృద్ధికి కృషిచేశారు. వాళ్లకు వైష్ణవ మతంపైన అభిమానం ఉండేది. అందుచేత వాళ్లకాలంలో ఉత్కళ కళింగప్రాంతాలలో వైష్ణవమత ప్రాబల్యం పెరిగింది. వైష్ణవమతాన్ని ప్రచారంచేసిన మధ్వాచార్యులవారి శిష్యులలో ముఖ్యులు నరహరితీర్థ శ్రీపాదులు. ఆయన కళింగ దేశమువాడు. ఆయన మూలంగా కళింగదేశంలో వైష్ణవమత ప్రాబల్యం పెరిగినది. ఆయన కళింగదేశాన్ని మొదటి భానుదేవుడు రాజ్యం చేస్తున్నప్పుడు ఉన్నాడు. ముదుసలి సచివుడు నరహరిమునీశ్వరు డని ప్రఖ్యాతి. శ్రీకూర్మంలోను సింహాచలంలోను ఆయన చేసిన వ్యవస్థలు ఇంకా ఉన్నాయి.

అర్వాచీన గాంగవంశరాజులలో నాలుగవ వీరభానుదేవుడు కళింగోత్కలదేశములకు పట్టాభిషిక్తుడైన కాలము

నుండి ఉపద్రవములు ప్రారంభమైనవి. అతని కాలమున మహా సామంతులు మహామండలేశ్వరులు బలపడి కేంద్రాధికారమును సన్నగింపచేశారు. కొండవీటి రాజ్యాధినేత కొమరగిరి రెడ్డి తన బావమరిది, ప్రధాని, దండనాయకుడు అయిన కాటయవేమా రెడ్డిని గొప్ప సైన్యంతో కళింగంపై దండయాత్రకు పంపాడు. కాటయ వేమారెడ్డి కళింగేశ్వరుని జయించి కటకనగరాన్ని చూరగొని మహామండలేశ్వరులను మహాసామంతులను పరాభూతుల్ని చేసి కానుకలతో కప్పములతో కొండవీటికి తిరిగి వచ్చాడు.

తరువాత కొండవీటి రాజ్యము రెండు తునకలైనది. రాజమహేంద్రవరంలో ఒక రెడ్డి రాజ్యము నెలకొన్నది. రెడ్డి రాజ్యమున వచ్చిన అంతఃకలహాముల సందర్భముగా వీరభానుదేవుడు వీలు చూచుకొని రాజమహేంద్రవర రెడ్డి రాజ్యముపై దండెత్తి వెళ్లాడు. అప్పుడు కళింగంలో రాజకీయవిద్వేషం జరిగింది.

అతని మంత్రులలో ప్రముఖుడైన కపిలేశ్వరుడు మంత్రి సామంతుల సహాయంతో కటక సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. అతడు సూర్యవంశ క్షత్రియుడు. అతని తండ్రి జాగేశ్వరుడు. తాత కపిలేశ్వరుడు. కపిలేశ్వరుని తాత మహా పరాక్రమవంతుడట. తండ్రి జాగేశ్వరుడు కూడ ప్రసిద్ధుడైన నాయకుడు. కపిలేశ్వరునికి బలరాము డను అన్నగారు పరశురాము డను తమ్ముడు కలరు. కపిలేశ్వరుని సోదరులిద్దరు మహాబల

పరాక్రమవంతులు. బంధువుల సాహాయ్యముతో కపిలేశ్వరుడు కటక సింహాసనమును ఆక్రమించుకో గలిగాడు.

కపిలేశ్వరగజపతి భార్య పార్వతి. వారికి హంవీరగజపతి పురుషోత్తమగజపతి అను కుమారు లిద్దరు. హంవీరుడు మహా పరాక్రమశాలి. కపిలేశ్వరగజపతి కటకసింహాసనమును స్వాధీనం చేసుకున్న 26 సంవత్సరాలకు బహ్మనీసుల్తానుతో బాధపడు చున్న దేవరకొండ వెలమనాయకుడైన లింగమనేడు అతని సాహాయాన్ని అర్థించాడు. అది తన రాజ్య విస్తరణకు చక్కని అవకాశమని కపిలేశ్వరగజపతి తన కుమారుడైన హంవీరుని గొప్పసైన్యంతో పంపించాడు.

హంవీరుడు తేలికగా బహ్మనీసుల్తాను సేనల్ని పరాభూతం చేశాడు. ఓరుగల్లు దుర్గాన్ని స్వాధీనం చేసుకుని విజయ ధ్వజం ఎత్తాడు. తరువాత కపిలేశ్వరుని సైన్యాలు హంవీరుని నాయకత్వంలో విజయనగర సామ్రాజ్యంమీద పడ్డాయి. ఆనాటి విజయనగరచక్రవర్తి మల్లికార్జునరాయలు హంవీరుని థాటిని నిలువరింపలేక పోయాడు. హంవీరుడు ఎదురులేని పరాక్రమంతో విజృంభించి దక్షిణదేశంలో యథేచ్ఛావిహారం చేశాడు. ఉదయగిరి, చంద్రగిరి దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ రాజ్యాలను కైవసం చేసుకున్నాడు. కాంచీపురాన్ని హస్తగతం చేసుకున్నాడు. పడవీడు, వలుదలంపట్టి, ఉపావడి, తిరువారూరు, తిరుచిరాపల్లి మొదలైన ద్రవిడదేశ దుర్గాలను అవలీలగా జయించాడు. శ్రీరంగనాథుని సేవించి

శత్రురక్తమైన తన ఖడ్గాన్ని సేతుసముద్రజలంతో శుభ్రం చేసుకున్నాడు. కపిలేశ్వర గజపతి గంగానది మొదలు శ్రీరంగం వరకు గల భూమికి చక్రవర్తి అయ్యాడు. గజపతి గౌడేశ్వరుడని, నవకోటి కర్ణాటకలు బరిగేశ్వరుడని ప్రసిద్ధిపొందాడు. హంవీరుని విజయవిహారం దాక్షిణాత్య సరదారులందరకు తల వంపులు తెచ్చిపెట్టింది. ఆ అవమానాన్ని ఖడ్గజీవి అయిన వాడెవ్వడు భరింపలేడు.

చంద్రగిరి రాజ్యాన్ని పాలిస్తున్న సాళువ నరసింహ రాయలీ అవమానానికి మరింత కదలిపోయాడు. పరితపించి పోయాడు. తిరిగి తాను ఓడ్ర గజపతులను జయింపకపోతే లాభం లేదనుకున్నాడు. విజయనగర సామ్రాజ్యంమీద కన్ను వేసిఉండిన సాళువ నరసింహరాయలకు హంవీరుని చేతిలో పరాభవం తుడిచి వేసుకోకపోతే తనకు ఉన్న ఆశలు నిరాశలై పోతాయనిపించింది. అతడు బాగా ఆలోచించాడు.

సాళువ నరసింహరాయల దండనాథులు సేనాపతులు ముఖ్య అనుచరులు అతనికి అనుకూలమైన మంతనాలు చెప్పారు. హంవీరుని చేతిలోని అపజయపరాభవంలో మ్రగ్గిపోనక్కరలేదని చెప్పారు. తిరిగి ప్రాభవోన్నతిని కైవసం చేసుకోవడానికి నిరం తరమైన కృషిచేయమని సలహాచెప్పారు. తాము బాసటగా నిలుస్తామని ప్రమాణాలు చేశారు. సాళువ నరసింహరాయలకు ధైర్యం కుదిరింది.

అతడు సేనల్ని సమీకరించాడు. చంద్రగిరి రాజ్యంలో ఉన్న పాలెగాండ్లను అందరినీ చేరదీసి వారి మూలంగా పెద్ద

బలాన్ని సమకూర్చుకున్నాడు. అతడు సహాజంగా శక్తి సామర్థ్యాలు కలిగినవాడు. అతనికి విశ్వాసపాత్రులైన మహావీరులు దండనాథులుగా లభించారు. పైగా వారందరికీ దేశభక్తి ఉన్నది. హంపీరుడు ఓడ్డ దేశస్థుడు కాగా సాళువ నరసింహరాయలు తమరాజు. తమ దేశాన్ని పరాయివారినుండి కాపాడుటకు ప్రయత్నిస్తున్నవాడు. కాబట్టి చంద్రగిరి రాజ్యంలోని పాలెగాండ్లు పరిపూర్ణమైన దేశభక్తితో సాళువ నరసింహరాయలకు మద్దతుగా వచ్చారు.

అట్టి పాలెగాండ్లలో గోపవరం అమరమాగాణం కలిగిన కేసనశెట్టి కూడా ఉన్నాడు. కేసనశెట్టి తన సాయశక్తులా సాళువ నరసింహరాయలకు అండగా నిలబడ్డాడు. తన రెండు గ్రామాలలోఉన్న యువకులను సమకూర్చుకుని చిన్న దళాన్ని చేసుకొని సాళువ నరసింహరాయలకు అండగావచ్చాడు. కేసన శెట్టి తన వెంట తనతోబుట్టువు భర్తను కూడా తీసుకొనివెళ్లాడు. అతనికి కేసనశెట్టిపైన అమితమైన భక్తి గౌరవాలు ఉన్నాయి కేసనశెట్టి దళానికి కేసనశెట్టి స్వయంగా దళవాయిగా ఉన్నాడు. అతనికి అంగరక్షకుడుగా తోబుట్టువు భర్త ఉన్నాడు.

హంపీరుడు శ్రీరంగంనుంచి తిరిగిపోయే సమయానికై సాళువ నరసింహరాయలు తన బలంతో వేచిఉన్నాడు. అతన్ని వెనుక పీఠీనుండి ముట్టడిస్తే ఫలితం అనుకూలంగా ఉంటుందని నరసింహరాయల పథకం.

ఈలోగా విచిత్రమైన పరిణామం కలిగింది. వృద్ధాప్యం వచ్చుటచేత కపిలేశ్వరుడు పరిపాలనా వ్యాసంగంనుంచి విర

మించుకుని కుమారులలో ఒక్కరికి యువరాజ్యాభిషేకం చేయ బోతున్నాడనీ - అతనికి జగన్నాథస్వామి కలలో దర్శనమిచ్చి రెండవ కుమారు డగు పురుషో త్తమగజపతిని ప్రభువుచేయమని చెప్పినట్లు వా ర్తలు వ్యాపించినవి.

ఈ వా ర్తలు విని క్రుద్ధుడై హంవీరుడు శీఘ్రగమనంతో శ్రీరంగంనుండి కటకనగరానికి ప్రయాణం చేస్తున్నాడని తెలిసింది. హంవీరుడు కొందరు సామంతులను, దక్షిణకపిలేశ్వర హంవీర మహాపాత్రుని తనకు అనుకూలంగా త్రిప్పుకున్నాడని, తండ్రిమీద తిరుగుబాటు చేయనున్నాడని వా ర్తలు వ్యాపించినవి.

ఆ సమయము సాళువ నరసింహరాయలకు దైవానుకూలముగ కన్పించినది. తన సైన్యాన్ని సర్వసన్నద్ధముగా ఉంచుకొని హంవీరుని కోసం బొంచి ఉన్నాడు. హంవీరుని సైన్యాలు ముందుకు సాగుచుండగా వేసుకున్నపథకం ప్రకారం సాళువ నరసింహరాయలు వెనుకనుండి ముట్టడిచేశాడు.

హంవీరుడు తొందరగా రాజధానికి వెళ్లి పోవలసి ఉన్నది. తండ్రి తమ్మునిపై యెక్కువ మక్కువతో ఉన్నాడని మనఃక్లేశంతో ఉన్నాడు. ఆ పరిస్థితులలో వెనుకనుండి నరసింహరాయల ముట్టడి. వీరుడైన హంవీరుడు యుద్ధానికి వెనుదీయలేదు. సంకులమైన సమరం జరిగింది. ఉభయసైన్యాలు పరాక్రమాన్ని చూపిస్తూ పోరాడినవి.

కేసనశెట్టి నాయకత్వంలో ఉన్న సేనావిభాగంకూడా బాగా పరాక్రమించి పోటుతనాన్ని చూపింది. అసలు ముందుగా ముట్టడి చేసింది కేసనశెట్టి పదాతిదళమే. ఆ యుద్ధంలో కేసనశెట్టి నేర్పు చూపించాడు. వెనుకగా ఉన్న స్కంధావారాన్ని ముందుగా పట్టుకున్నాడు. అందుచేత ఆహారధాన్యాల భాండాగారము ముందుగా కైవసం అయింది ఆయుధాగారం కైవసం అయింది. తరువాత గజయూథాన్ని తాకినప్పుడుగాని ముందున్న అశ్వపదాతి దళములవాళ్లకు ముట్టడి జరిగినట్లు తెలియలేదు. నిజానికి అప్పటికి సగం యుద్ధం అయిపోయింది.

గజయూథంలో ఒక గజం మీదనుంచి విసరిన కత్తి కేసనశెట్టిని గాయపరచింది. కేసనశెట్టి పడిపోయాడు. శత్రు సైనికులు అతనిమీదకు రావడానికి ప్రయత్నించారు. కేసనశెట్టి పదాతిదళంవారు నిరుత్సాహపడ్డారు. ఆ పరిస్థితులలో అతని తోబుట్టువు భర్త తన కర్తవ్యాన్ని నిర్వహించాడు. అతడు తమ పదాతిదళాన్ని ఉత్సాహపరిచాడు. నైపుణ్యంతో కేసనశెట్టి శరీరాన్ని శత్రువులనుండి రక్షించి జాగ్రత్తగా సంరక్షించి సురక్షితమైన స్థలానికి చేర్చాడు. తాను శత్రువులపై దూకి పరాక్రమం చూపించాడు.

సాళువ నరసింహరాయల నైపుణ్యానికే విజయం సంప్రాప్తించింది. ఐతే కేసనశెట్టి తోబుట్టువు భర్తమాత్రం వీరమరణం పొందాడు. హంవీరుని సేనలు ఉత్తరమార్గంగా తిరోగమించాయి. వీలైనంత దూరం సాళువ నరసింహరాయలు తరుము

కుంటూ వెళ్లాడు. తన శక్తి సామర్థ్యములచేత సాళువ నరసింహ రాయలు పూర్వము విజయనగర రాజ్యభాగములను తిరిగి గజపతులనుండి స్వాధీనం చేసుకున్నాడు. కృష్ణానదికి దక్షిణ ప్రాంతదేశాన్ని అంతటినీ తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

కేసనశెట్టి ప్రాణాలతో ఇల్లు చేరాడు. తన తోబుట్టువు భర్తను రణభూమికి బలిచేసి వచ్చానన్న బాధ అతనికి ఉన్నది. తన ప్రాణాలను రక్షించినవానిని రక్షించుకోలేక పోయామన్న మనోవ్యథ ఉన్నది. చనిపోయిన వానియందు, వాని భార్యయైన తన తోబుట్టువునందు విపరీతమైన కృతజ్ఞతాభావం యేర్పడింది. తిరిగి వచ్చినప్పటినుండీ కేసనశెట్టి తన తోబుట్టువును ఆమె కుమారుణ్ణి తన స్వంత కుటుంబ సభ్యులుగా చూడటం మొదలు పెట్టాడు.

ఆ నాటికి తోబుట్టువు కుమారుడు పెరుమాళ్లయ్య బాలుడు. అతని రక్షణ భారాన్ని కేసనశెట్టి తానే స్వీకరించాడు. అప్పటికి కేసనశెట్టికి లేకలేక కలిగిన ఏకసంతానం గౌరమ్మ చాల చిన్నది. ఆ దినములలోనే తన కృతజ్ఞతాభావము కొద్ది గౌరమ్మను పెరుమాళ్లయ్యకు ఇచ్చి పెండ్లి చేస్తానని చెప్పటం మొదలు పెట్టాడు. తరువాత కొలదినాళ్లకే కేసనశెట్టి భార్య మరణించింది. అతని తోబుట్టువుకు ఇంటిపెత్తనం లభించింది. ఐతే ఆమెమాత్రం గౌరమ్మను కూడా బాగానే చూచింది. ఏలోపమూ లేకుండా పెంచింది. గారాబంగానే చూచింది. అనురాగంతోనే సాకింది. ఐతే గౌరమ్మకుమాత్రం ఆమెమీద

అభిమానం లేదు. నిర్లక్ష్యభావం ఉన్నది. ఆ నిర్లక్ష్యభావం రానురాను విచిత్రంగా పరిణమించింది.

14

కేసనశెట్టికూడా మేనల్లుడు పెరుమాళ్లును స్వంతబిడ్డగా చూచాడు. పెరుమాళ్లయ్యకు మేనమామమీద భక్తిగౌరవాలు కలుగలేదు గాని—పైకిమాత్రం ముభావంగా ఉండేవాడు. కేసనశెట్టి చిన్న ప్రభువు. అతని తరువాత అతని గ్రామాలు అల్లుడు కాబోతున్న తనకు సంక్రమిస్తాయి. అందుచేత పెరుమాళ్లు మేనమామ కేసనశెట్టిని ధిక్కరించేవాడు కాదు. ఐతే అతని తల్లిమాత్రం కుమారునికి మేనమామమీద భక్తిశ్రద్ధలను నూరిపోసేది. అవి పెరుమాళ్లకు మాత్రం వంట పట్టలేదు.

పెరుమాళ్లు గౌరమ్మకంటె పెద్దవాడే. ఆమెను పెండ్లాడటానికి తగిన వయస్సు ఉన్నది. పూర్వ బంధుత్వం ఉన్నది. వరుస ఉన్నది. వావి ఉన్నది. ఉభయులకు పెద్దవాళ్ల అనుకూల్యం ఉన్నది. పెరుమాళ్లయ్యకు చిన్నప్పటినుంచీ గౌరమ్మను పెండ్లాడాలని ఉన్నది. అసలు తానిదివరకే కేసవశెట్టికి అల్లుడు అయిపోయినట్లు అతడు ప్రవర్తిస్తాడు. గౌరమ్మ అభిప్రాయంమాత్రం ఏమిటో తెలియదు. ఆమెను ఎవ్వరూ అడుగలేదు. ఆమె ఎవ్వరికీ చెప్పలేదు. ఆమెకు భిన్నమైన అభిప్రాయం ఉండవచ్చునని ఎవ్వరికీ తోచనూ లేదు.

చిన్నప్పటినుంచీ పెరుమాళ్లయ్యకు చదువు అంటలేదు. తండ్రి ఉన్నప్పుడే అక్షరాభ్యాసం జరిగిందిగాని అది ముందుకు

సాగలేదు. అంతలో తండ్రి పోవటం మూలాన గారాబం పెరిగి పోయింది. అతనిని చదువుకోమని తల్లిగాని మేనమామగాని తొలిరోజుల్లో ఒత్తిడి చేయలేదు. ఆ తరువాత ఒత్తిడిచేసి ప్రయోజనం లేకపోయింది.

పెరుమాళ్లయ్య తేలికగా ఆటలలో నేర్పు సంపాదించాడు గాని అక్షరజ్ఞానం సంపాదించలేదు. ఊళ్లో గడుగ్గాయి పిల్లలందరికీ అతడు నాయకుడై కూర్చున్నాడు. అతనికి ఒక చిన్న సైన్యం ఏర్పడిపోయింది. ఆ వానరసైన్యానికి అతడు అంగదుడు, హనుమంతుడు, సుగ్రీవుడు. ఊళ్లో తోటలలో దొడ్లలో చెట్లమీద పండ్లు మిగలటం లేదు. చెఱకు తోటలకు ముప్పు వీర్పడింది.

మెల్లిమెల్లిగా వార్తలు కేసనశెట్టిని చేరినాయి. అతడు మేనల్లుని అదుపులో పెట్టడానికి ప్రయత్నించాడు. మొదట్లో పెరుమాళ్లు మేనమామ చేసే అదలింపుల్ని పట్టించుకోలేదు. తరువాత తరువాత ఎదురుచెప్పడం సాగించాడు — కేసనశెట్టి చేయగలిగింది ఏమీ లేకపోయింది. పైగా అతనికి తల్లి మద్దతు ఎప్పుడూ ఉండనే ఉన్నది.

పెరుమాళ్లకు వయస్సు పెరిగినకొద్దీ చిల్లర తిరుగడు కొంత తగ్గింది. ఐతే చదువుమీద శ్రద్ధమాత్రం పెరుగలేదు. గరిడీలమీద శ్రద్ధ పెరిగిపోయింది. ఏమి చెప్పినా, ఏమి చేసినా, అతనికి చదువుమీద ఆసక్తికలుగనేలేదు. పైగా అమరమాగాణ ప్రభువైన తనకు చదువు వ్రాతకోతలు ఎందుకనేవాడు.

వయస్సు పెరిగినకొద్దీ పెరుమాళ్లు సాము గరిడీలలో యుద్ధవిద్యలలో నేర్పు సంపాదించడం మొదలుపెట్టాడు. దానిమీద నిత్య శ్రద్ధగా ఉండేవాడు. అది ఏనా ఫరవాలేదని మేనమామ కేసన శెట్టి ఊరట పొందాడు. పెరుమాళ్లు యుద్ధవిద్యలలో రాణించి ఘను డనిపించుకోవడం ప్రారంభమైనప్పటినుంచీ అతడు కేసనశెట్టి అమురమూగాణం వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవడం మొదలుపెట్టాడు.

మొదటినుంచీ గౌరమ్మకు చదువుమీద శ్రద్ధ ఎక్కువ ఉండటం మేనత్తకు యిష్టంలేదు. గౌరమ్మ తన కుమారుడు పెరుమాళ్లును పెండ్లిచేసుకొని భార్య కాబోతున్నది. పెరుమాళ్లుకు చదువు అబ్బలేదు. ఆ స్థితిలో గౌరమ్మకుమాత్రం చదు వెందుకని ఆమె అభిప్రాయం. ఆమె ఆ మాటలే అన్న కేసనశెట్టితో, మేన కోడలు గౌరమ్మతో చెబుతూ ఉండేది. వాళ్లెవరూ ఆమె మాటల్ను పట్టించుకోలేదు. గౌరమ్మ తండ్రిదగ్గర తెలుగు గ్రంథాలు పూర్తిచేసి సంస్కృతం చదువుతానని పట్టుపట్టి నప్పుడు మేనత్త గట్టిగా అడ్డుచెప్పింది. కేసనశెట్టి ఆమె మాట లను తోసివేశాడు.

కాని ఆమె తేలికగా సమాధానపడలేదు. అన్నగారు కేసనశెట్టితో "అమ్మాయికి సంస్కృతంకూడా దేనికిరా! అన్నయ్యా!" అని అన్నం వడ్డిస్తూ అన్నది. కేసనశెట్టి తల యెత్తి తోబుట్టువు ముఖాన్ని చూచాడు. ఆమె యేదో భయ పడుతున్నట్లుగా తెలిసిపోయింది. "సంస్కృతం నేర్చుకుంటే తప్పేమిటమ్మా" అని సముదాయింపుగా అన్నాడు.

ఆమె "అది కాదు అన్నయ్యా! మన ఇంట్లో ఆడపిల్లలకు ముందెప్పుడైనా తెలుగైనా చెప్పించారా? నాకేమి చదువు చెప్పించారు చెప్పు? మన యింటావంటా లేని సంస్కృతం చదువు అమ్మాయి కెందుకురా!" అన్న దామె. కేసనశెట్టి ఆమెను చూస్తూ "అది కాదే! మనం మహాభారతాన్ని తెలుగులో లిఖించిన గురునాథునివంశం వాళ్ళం. ఆయన కాలంనుంచీ మన వంశంలో పురుషులందరూ సంస్కృతాంధ్రాలు చదివిన వాళ్ళే. నీకు తెలుసునుగా! నేను కూడా పాటూరులో ఉండి శ్రీకంఠయ్యగారిదగ్గర సంస్కృతాంధ్రాలు చదివాను. మరి నా కడుపున మగబిడ్డ పుట్టలేదు. పుట్టిన ఆడుబిడ్డకే సంస్కృతాంధ్రాలు చెప్పిద్దామని, వంశాచారం నిలబెట్టుదామని ఆశ" అన్నాడు.

"ఈమె సంస్కృతాంధ్రాలు నేర్చుకుని ఏమి చెయ్యాలె" అన్నది తోబుట్టువు - "నీకు తెలియదు పోవే! గౌరమ్మ చాలా ప్రతిభ కలది. దానికి సాహిత్యమర్మాలు, సాహిత్యస్వారస్యాలు ఇట్లే తెలిసిపోతున్నాయి. దానికి సంస్కృతం కూడా బాగా అబ్బుతుందని నాకు ఆశగా ఉన్నది" అన్నాడు కేసనశెట్టి. "బాగా అబ్బినందువలన ప్రయోజనం ఏమిటని నే నంటున్నాను" అన్నది తోబుట్టువు.

"అందులో ఒక దేవరహస్యం ఉన్నది. నీకు తేలికగా అర్థం కాదులే!" అన్నాడు అన్నగారు కేసనశెట్టి. "అర్థం కాకపోతే పోయింది. నీతోపాటు పుట్టి, నీయింట్లో ఆడదిక్కుగా ఉంటున్న నేను విని ఐనా సంతోషపడకూడదా?" అన్నదామె.

"మన వంశపురుషుడైన గురునాథుడు కవి బ్రహ్మయైన తిక్కన సోమయాజిగారిని లేఖకుడై సేవించాడు. భారత రచన పూర్తి అయిన తర్వాత తన సేవను సోమయాజిగారు ప్రశంసింపగా గురునాథుడు భక్తితో వినమ్రుడై "మీ అనుగ్రహాన్ని పొంది నాపూర్వపుణ్య ఫలంచేత ఆంధ్రమహాభారత గ్రంథానికి లేఖకుణ్ణి అయ్యానను. నా వంశంలోకూడా గ్రంథరచనాదక్షులు జన్మించి ఆంధ్రసరస్వతీసేవ చేసేటట్లు ఆశీర్వదించండి" అని ప్రార్థించాడట. అప్పుడు సోమయాజిగారు చిరునవ్వుతో "గురునాథా! నీవు భారతమునకు లేఖకుడవై చేసిన అనల్పసేవకు ఆంధ్రసరస్వతీదేవి సంతోషపడింది. ఆమె అనుగ్రహంవలన నీ వంశంలో సరస్వతీ అంశతో జన్మించిన గ్రంథకర్త చిరయశస్సు ఆర్జించును" అన్నారట. వారే గదా తమ వంశంవారు మన కుటుంబంవారికి తరతరాలుగా సంస్కృతాంధ్రాలు పాఠం చెప్పడానికి శాసనం చేశారు. మన కీరెండుగ్రామాలు అమర మాగాణం ఇప్పించారు.

కవిబ్రహ్మ సోమయాజిగారు మహర్షివంటివాడు. ఆయన అనుగ్రహించిన రెండు గ్రామాలను మనం ఇప్పటికీ అనుభవిస్తున్నాం. ఆయన ఇచ్చిన విద్యాదానంవల్లనే నేను కూడా శ్రీకంఠయ్యగారి దగ్గరకుపోయి చదువుకు వచ్చాను. ఇప్పుడు అమ్మాయికి కూడా సంస్కృతం వారి కుటుంబం వారే చెప్పాలి. వేరెవ్వరూ చెప్పరు

ఇక పోతే సోమయాజిగారి మూడో వరమే ఉన్నది. వారు అనుగ్రహించి దాదాపు రెండువందల సంవత్సరాలైంది.

నాది వీడవ పురుషాంతరం. ఇంతవరకు మన కుటుంబంలో గ్రంథ కర్త పుట్టలేదు. ఆయన వరం ఫలించలేదు. మన వంశంలో యిప్పటివాణ్ణి నేను. నాకు నుగ సంతానమే కలుగలేదు. ఇక సోమయాజులవారి వరం ఫలించే దెప్పుడో తెలియడం లేదు. కాని పతంజలి యోగసూత్రాలలో "సత్యప్రతిష్ఠాయాం క్రియా ఫలాశ్రయత్వం" అన్నప్రకారం సోమయాజిగారి వరం ఫలించి తీరాలి.

ఇక అమ్మాయిని చూస్తుంటే నాకు కొంత ఆశగా ఉన్నది. దానికి సాహిత్యమర్మాలు శిల్పసౌకుమార్యాలు, ఆలంకారిక శాస్త్రరహస్యాలు వాటంతట అవే తెలుస్తున్నాయి. అది తెలుగు కావ్యాలు పూర్తి చేసేటప్పటికే దానికి మహాప్రతిభ ఉన్నట్లు బయటపడింది. దాని మూలాన మన వంశానికి ప్రతిష్ఠ వస్తుందని ఆశగా ఉన్నది. అందుకే దానికి సంస్కృతం చెప్పించడానికి నాకూడా అభిమతంగానే ఉన్నది" అన్నాడు.

అన్నగారి సమాధానం ఆమెకు తృప్తి కలిగించలేదు. గౌరమ్మకు సంస్కృతం చెప్పించినందువల్ల జరుగబోయే దేమీ లేదని ఆమెకు దృఢమైన అభిప్రాయం. కేసనశెట్టి మాటలు ఆమె నమ్మకాన్ని సడలించలేకపోయినై. ఎప్పుడో తిక్కన సోమయాజి గారనే బ్రాహ్మణుడు వరమిచ్చాడనీ అందువల్ల గౌరమ్మ కవయిత్రి కాబోతున్నదనీ అనుకోవడం ఆమెకు హాస్యాస్పదంగానే తోచింది. అసలు తమ కుటుంబంలో కవి పుట్టవలసిన అవసరం ఏమున్నది? పుట్టకపోతే మాత్రం వంశానికి వచ్చిన ప్రమాద మేమిటో ఆమెకు అవగాహన కాలేదు.

కాని ఆమెకు ఒకటిమాత్రం అర్థమైపోయింది. అన్న గారికి ఈ విషయంలో ఏమి చెప్పినా ఎంత చెప్పినా విన్పించు కోదు. పట్టించుకోదు. చెప్పి ప్రయోజనం లేదు. వర్ధికంఠశోషే అవుతుంది. అందుకని ఆపని విరమించుకొన్నది.

గౌరమ్మనే నిరుత్సాహపరచాలని చూచింది. ఆమె మాట లను గౌరవంతో వినే అలవాటు గౌరమ్మకు లేనేలేదు. పెద్ద ఆస్తితెస్తూ తనకు కాబోయే కోడలు. చిన్నప్పటినుంచీ తన చేతులలో పెరిగిన బిడ్డ. గౌరమ్మ మనస్సు గాయపరచే అభి ప్రాయం కూడా ఆమెకు లేదు కాని ఆడవాళ్లు సంస్కృతం అభ్యసించడం తమ కులంవాళ్లకు కూడనిపని, దానివలన ఏదో ముప్పురావచ్చునని ఆమె భావనలు పెంచుకున్నది. దిగులు పడింది. ఏమి చెయ్యాలో తెలియక కలతపడింది.

మల్లన్న గారి కుటుంబం గోపవరానికివచ్చిన తర్వాత తన ఆందోళనకు ఆకుటుంబమే కారణమైనట్లుగా కేసనశెట్టి తోబుట్టువు అభిప్రాయం బలపరచుకున్నది. రోజురోజుకీ ఆమె ద్వేషం పెరిగింది. ఆ కుటుంబంవాళ్లు తమకు ఆపద కలిగించ బోతున్నారని, వాళ్లు శత్రువులనీ భావించుకున్నది. వాళ్లేమి చేసినా, ఏమిచెప్పినా ఆమెకు విపరీతార్థాలే తోచేవి. ద్వేషము పెరుగుతూ ఉండేది. మల్లన్న గారి సౌందర్యం, ఆయన వయస్సు, గౌరమ్మయొక్క యౌవనారంభదశ, కేసనశెట్టి తోబుట్టువు గుండెలో భీతిని ద్వేషాన్ని పదింతలుచేసినై. ఆమెకు సర్వకాల సర్వావస్థలలోను అదే చింతయి పట్టుకున్నది. గౌరమ్మను మల్లన్న గారిని ఆయన కుటుంబాన్ని వేయికండ్లతో కనిపెట్టుతూ ఉండేది.

ఐతే మల్లన్నగారి భార్య గౌరమ్మకంటే సౌందర్యరాశి కావడం, ఆమె సంతానవతి కావడం, మల్లన్నగారు పాఠం చెప్పేటప్పుడు కూడా భార్యను దగ్గరగా కూర్చోపెట్టుకోవడం, ఊరివాళ్లంతా వారిద్దరు మంచివాళ్లనీ, ఋషి దంపతులనీ, దేవ భూతి కర్దములనీ, అరుంధతీ వశిష్ఠులనీ, ఆదర్శదంపతులనీ, చెప్పుకోవడంవలన ఆమె భయభ్రాంతులకు కొంత తాత్కాలిక ఉపశమనం లభించింది కాని భయాందోళనలు నిర్మూలనం మాత్రము కాలేదు.

తన కుమారుని భవిష్యత్తు గౌరమ్మతో పెనవేసికొని ఉన్నది. గౌరమ్మ అరుణమాగాణ ప్రభువుబిడ్డ. బాగా చదువుకొని పండితురాలగుచున్నది. చదువుకొన్న స్త్రీ, అందులో విద్వాంసురాలైనస్త్రీ చదువురానివానిని పెండ్లాడుతుందా? విద్వాంసులైన పురుషులు విద్యలేని స్త్రీలను పెండ్లాడుట లేదా? అట్లే స్త్రీలవిషయము కారాదా? ఆమె తన కుమారుని వివాహమాడుటకు నిరాకరించినచో? అప్పుడు తన కుమారుని గతి ఏమి? వానికి చదువు లేదు. సేద్యము చేయుట తెలియదు కులవృత్తి నేర్చుకొనలేదు. తన గతి ఏమిటి? అందుచేత తాను తొందరపడి గౌరమ్మ మనస్సు పాడుచేయకూడదు.

ఈ భావాలతో బహిరంగముగా తనమనసు ఆమె ఎవ్వరికీ విప్పిచెప్పలేదు. తనలో తాను లోపల లోపల మండిపోతూ కుల్లిపోతూ ఉన్నది.

15

కేసనశెట్టి తోబుట్టువు తన అభిప్రాయాలను తనలోనే దాచుకున్నది. అన్నగారితో మళ్లీ ఆనిషయం ప్రస్తావించనే లేదు. ఆనాటి తరువాత అన్నగారితో అస లెక్కువ మాటాడనే లేదు.

సాధారణంగా కొడుకుతోకూడా ఎక్కువ మాట్లాడే అవకాశం ఆమెకు లేదు. అత డెప్పుడూ ఇంట్లోనే ఉండడు. ఎక్కడకు పోతాడో ఏమో. వాని ఇష్టం వచ్చినప్పుడు వచ్చి భోజనంచేసి పోతూ ఉంటాడు. వాని జట్లు, సాముగరిడీలు. వాని గొడవ వేరు. పెరుమాళ్లయ్య ఇంట్లో ఎవ్వరితోనూ ఎక్కువ పట్టించుకోడు. తల్లి పూర్వకాలం మనిషి. ఏమీ తెలియని అమాయకురాలు. మేనమామ కూతురు గౌరమ్మ కాబోయే భార్య. చిన్నప్పటినుంచీ ఇద్దరూ సిగ్గుపడుతూ దూరదూరంగానే ఉంటున్నారు. మేనమామ కేసనశెట్టితో అతని కెప్పుడూ సన్ని హితత్వము లేదు. అతడు శ్రద్ధగా చదువుకోవాలని మేనమామ అభిలాష. చదువంటే పెరుమాళ్లయ్యకు అసహ్యం. అతని ఆగ డాలు చేష్టలు మేనమామకు అసహ్యం. ఇదివరకు ఇద్దరిమధ్య అప్పుడప్పుడు సంఘర్షణలు జరుగుతూ ఉండేవి. అందుకని ఇద్దరు దూరదూరంగానే ఉంటారు. అతడు మేనమామకు ఎదురుపడ కుండా తప్పించుకుని తిరుగుతాడు.

ఇంట్లో పరిస్థితు లిట్లా ఉండగా బయట పరిస్థితులుకూడా మేనమామ మేనల్లుళ్లమధ్య సామరస్యాన్ని కల్గించే విధంగా

లేవు. పెరుమాళ్లయ్య రోజురోజుకీ పూనుతున్న స్వేచ్ఛా భావాలు, అతని విశృంఖలవిహారం మేనమామకు కంటకింపుగా ఉన్నాయి.

ఊరిలో పెరుమాళ్లయ్య అనుచర బృందాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అనుచరులతో కలసి అతడు యథేచ్ఛా విహారం చేస్తూఉంటాడు. తోటలలో దొడ్లలో అతనికి అడ్డు చెప్పగలవారు లేరు. కాని అతని ప్రవర్తనసేవకులకు బాధకలిగిస్తూ ఉండేది. వాళ్లు మెత్తగా కేసనశెట్టికి ఫిర్యాదులు చేస్తూనే ఉండేవారు. కేసనశెట్టి విని ఊరుకునేవాడు.

వయస్సు పెరుగుతున్నకొలదీ పెరుమాళ్లయ్య ఆగడాలు మితిమీరుతూ వచ్చాయి. యౌవనంలో ప్రవేశించిన పెరుమాళ్లయ్య, అతని అనుచరులు యౌవనదశాసంబంధమైన స్వైర విహారానికి ఉపక్రమించారు. వారిచేతలు చేష్టలు గ్రామంలో వాళ్లకు సహింపడానికి వీలులేకుండా ఉండటం మొదలైంది. స్త్రీ జనానికి బాధగా ఉన్నది. కేసనశెట్టికి చేసిన ఫిర్యాదులవలన ఫలితం కన్పించలేదు.

ప్రతి సాయంకాలం పెరుమాళ్లయ్య బృందం పెన్నా నదిగట్టుమీద ఉన్న మామిడితోటలో కూడుతారు. కొంతసేపు క్రీడలతో, కొంతసేపు సాముగరిడీలతో, కొంతసేపు వ్యాయామాలతో సందె చీకటిదాకా గడుపుతారు. ఆ తరువాత పెన్నా నదిలో స్నానాలుచేసి ఇళ్లకు చేరుతారు.

ఆనాటి సాయంత్రంకూడా అట్లా మామూలుగానే జరిగింది. అనుచరులతో కలసి పెరుమాళ్లయ్య పెన్నానదిలో స్నానాలు చేస్తున్నాడు. ఆ రోజున తోటప్రక్కన ఉన్న మైదానంలో ఒక లంబాడీ తండా వచ్చిచేరింది. వాళ్లు సాధారణంగా నీళ్ల సౌకర్యం ఉన్నచోటు చూచుకొని మకాంచేస్తూ ఉంటారు. ఆ ఊరు సుభిక్షమైన ఊరు. అక్కడ జలసమృద్ధి ఉన్నది. పెన్నా నదిగట్టు. ఊళ్లో చెట్లు బాగా ఉన్నాయి. వాళ్లు దిగిన మైదానంలో చింతచెట్లు బాగా ఉన్నాయి. దానికి చింతలతోపు అనే పేరున్నది. అక్కడ గ్రామంలోని పశువులు మధ్యాహ్నంపూట వచ్చి నిలుస్తాయి. అందుచేత దానిని మంద పోరంబోకు అని కూడా అంటారు. లంబాడి తండాలవాళ్లు పశువుల వ్యాపారం చేస్తూ గ్రామాలవెంట తిరుగుతూ ఉంటారు. వాళ్లు ఆనాటి అపరాహ్ణకాలంలోనే ఆగ్రామం చేరారు. చింతలతోపులో విడిది చేశారు.

ప్రొద్దు సంజవాటారుతున్నప్పుడు లంబాడీ కన్యలు కుండలు తీసుకుని దగ్గరలోఉన్న పెన్నానదికి నీళ్లకు వచ్చారు. వాళ్లు యౌవనం వికసించిన వయస్సులో ఉన్నవాళ్లు. ప్రకృతి మాతఒడిలో పెరిగినవాళ్లు. సర్వాంగ సౌష్ఠవం కలిగిన శరీరాలతో మన్మథుని బాణాలుగా తయారైన వాళ్లు. పూర్ణంగా నగ్నమైన స్తనమండలాలతో సౌందర్యదేవతతోపాటు సమ్మోహదేవతను కూడా శరీరాలలో ఆవేశింపచేసుకున్నవాళ్లు.

ఆ కన్యలు ఏట్లో నీళ్లు ముంచుకుంటూ ఉండగా కొంచెం దూరంలో స్నానాలు చేస్తూన్న పెరుమాళ్లయ్య బృందం

వాళ్లను చూచించి, ఆ కన్యల అర్థనగ్నాకృతి పెరుమాళ్లయ్యలో పశుత్వాన్ని రేకెత్తించింది. అతడు తన్ను తాను నిగ్రహించుకోలేకపోయాడు. రెండు అంగలలో ఆ కన్యలను సమీపించాడు. అత డప్పటికే స్నానం ముగించి పొడిబట్టలు కట్టుకుని ఉన్నాడు. అతని స్నేహితులు కొందరు ఇంకా స్నానాలు చేస్తున్నారు. ఆ కన్యలలో ఎక్కువ. భారీగా ఎక్కువ సమ్మోహనకరమైన విగ్రహం కలిగిన కన్యను పెరుమాళ్లయ్య సమీపించి చేయి పుచ్చుకున్నాడు.

పెరుమాళ్లయ్య ఏమి చెయ్యబోతున్నాడో అతని అనుచర వర్గానికికూడ తెలియలేదు. వాళ్లు చూస్తూ నిలబడిపోయారు. ఇతడు వెళ్లి చేయిపుచ్చుకోగా, ఆ లంబాడీ కన్య విడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తూ పెద్దగా అరుస్తూ గోల చేసింది. మిగిలిన కన్యలు కుండలు దిగబెట్టి తమ తండా ఉన్న చోటుకు పరుగెత్తుకుపోతూ హాహాకారాలు చేశారు. పెరుమాళ్లయ్య ఆ పిల్లను రెండు చేతులతోనూ పట్టుకొని నేల మీద పడవెయ్యడానికై పెనగులాడుతూనే ఉన్నాడు.

ఇంతట్లో లంబాడీ తండానుంచి పాతికమంది మగవాళ్లు పెద్దపెద్ద కట్టెలను పుచ్చుకొని పరుగెత్తుకొని వస్తుండగా— పెరుమాళ్లయ్య స్నేహితులు చూచి పెరుమాళ్లయ్యను హెచ్చరించి తాము దౌడుతీశారు. పెరుమాళ్లయ్య కూడా లంబాడీ పిల్లను వదలిపెట్టి పరుగుతీశాడు. వచ్చిన లంబాడీ మగవాళ్లలో యువకులు పదిమంది పెరుమాళ్లయ్య వెంటబడి తరుమసాగారు.

ప్రాణాలను రక్షించుకోవడానికి పెరుమాళ్లయ్య పరుగెత్తుతున్నాడు. అతడు చేసిన దారుణకృత్యానికి క్రుద్ధులై అతన్ని శిక్షించాలనే పట్టుదలతో లంబాడీయువకులు తరుముతున్నారు. పెరుమాళ్లయ్య అనుచరవర్గాన్ని గురించి వాళ్లు పట్టించుకోలేదు. పెరుమాళ్లయ్య అనుచరులు ప్రక్కదారులగుండా పారిపోయి ఊరికి రెండో ప్రక్కన ఉన్న కొంగల బాడవదగ్గరకు చేరారు. అక్కడకు చేరినతర్వాత తమవెంట లంబాడీలు తరుముకు రావడంలేదని తెలిసింది. వాళ్లు అక్కడనుంచి చీకట్లో మెల్లిగా గ్రామంలో తమ తమ ఇళ్లకు చేరారు.

పెరుమాళ్లయ్య సంగతి అంత తేలికగా జరుగలేదు. అతణ్ణి లంబాడీయువకులు వదలిపెట్టలేదు. తరుముతూనే ఉన్నారు. అతడు ప్రాణాలమీద ఆశకొద్దీ పరుగిడుతూనే ఉన్నాడు. వాళ్లు తరుముతూనే ఉన్నారు. అతడు సాముగరిడీలలో ఆరితేరిన యువకుడు. బలాఢ్యుడు. వాళ్లన్నూ యువకులు. ఒకొక్కసారి పెరుమాళ్లయ్య వాళ్లకు దొరకిపోయేటట్లు కన్పిస్తూ మళ్లీ అందకుండా పరుగెత్తుతున్నాడు.

చీకట్లు దట్టమై పెరుమాళ్లయ్యను కన్పించకుండా చేసేదాకా అతనిని లంబాడీలు తరుముతూనే ఉన్నారు. అప్పటికి ఐదారు క్రోశులదూరం వచ్చి ఉంటారు. ఆతరువాత వాళ్లు ఆగి సేదతీర్చుకుని మళ్లీ వెనుక క్రోవపట్టారు.

ఐతే పెరుమాళ్లయ్య మాత్రం ఇంకొక క్రోశడు దూరం పరుగెత్తాడు. వెనుకనుంచి లంబాడీల ఆర్భాటాలు వినిపించక

పోవడం - చీకట్లు దట్టమైపోయినట్లు గుర్తించి తన్ను వాళ్లు దూరన్నుంచి చూడలేరనే ధైర్యం కలగటం - వాళ్లు వెనక్కు వెళ్లిపోయి ఉంటారని గ్రహించాడు. ఆగి కొంతసేవ తీర్చుకున్నాడు. అప్పుడేమి చెయ్యాలో అతనికి తోచలేదు. ఏమైనా వెనక్కు వెళ్లాలని అతనికి అనిపించలేదు. లేచి ఆరాత్రి తెల్ల వారలూ తెల్లవారి వెలుతురు వచ్చే దాకా నడుస్తూనే ఉన్నాడు. దొరకిన దారివెంట నడిచి పోయాడు.

మరునాడు ఉదయానికి ఊరిలో పెరుమాళ్లయ్య లంబాడీ పిల్లమీద చేసిన అఘాయిత్యం గుప్పుమని పోయింది. అతడు ఏమై పోయాడో ఎవ్వరికీ తెలియలేదు. అతని తల్లి, మేనమామ కేసనశెట్టి ఆందోళన పడిపోయారు. తల్లి అన్నమే ముట్టలేదు. అతడు ఎక్కడకు వెళ్లాడో అంతు పట్టలేదు. అతనికోసం మేన మామ కేసనశెట్టి పరిసర గ్రామాలలో వెదకించాడు. ఆచూకీ తెలియలేదు. తల్లి మంచం పట్టింది. మేనమామకు ఏమి చెయ్యా డానికీ పాలు పోలేదు.

రాజమార్గాన్నిపట్టి తెల్లవారలూ నడచిన పెరు మాళ్లయ్య తెల్లవారేటప్పటికి ఒక నదీ తీరంలో ఉన్న ఒక ఊరు సమీపంలో ఉన్నాడు. అతనికి కూడా తను ఏ ఊరు దగ్గరకు పోతున్నది తెలియలేదు. వెలుతురు వచ్చిన తరువాత చూడగా తాను ఏటిగట్టు వెంటఉన్న రాజపథంలో నడుస్తు

న్నట్లు తెలుసుకున్నాడు. ముందు కొంతదూరాన బురుజులతో చిన్నకోట కన్పిస్తున్నది. మెల్లిగా ఊరును సమీపించి కనుపించిన వాళ్లను అడుగగా ఆ ఊరు టంగుటూరని తెలిసింది. ఆ యేరు బావుదానది అని పిలువబడీ చెయ్యేరు అని తెలిసింది.

ఊరును సమీపించిన తరువాత కాలకృత్యాలు తీర్చుకుని నదిలో స్నానం చేశాడు. కొంత అలసట తీరింది, కాని ఆకలి మాత్రం దహించుకుపోతున్నది. రాత్రి అతనికి ఆహారం లేదు. విశ్రాంతి లేదు, నిద్ర లేదు. నడుస్తూనే ఉన్నాడు. స్నానం చెయ్యగా బడలిక కొంత తీరింది గాని ఒక్కసారి ఆకలి ముంచుకు వచ్చింది.

ఊరిలోకి వెళ్లి విచారించాడు. అది చంద్రగిరిరాజ్యంలో సైనికపటాలాల స్థావరంగా ఉన్న ప్రాంతమని తెలిసింది. అక్కడ ఊరిలో ఉన్న వారంతా - సేనలో పనిచేసేవారో - లేక సేనా వారానికి కావలసిన సదుపాయాలను సమకూర్చేవారో - లేక ఆహారాదులు సమకూర్చేవారో - అయి ఉన్నారు. వాళ్లకు అతిథి సత్కారాలుచేసే అలవాట్లు ఉన్నట్లు కన్పించలేదు. వాళ్లను అడిగి ప్రయోజనం ఉండదనుకున్నాడు.

విచారించగా బ్రాహ్మణ అగ్రహారం నదికి సమీపంలోనే ఉన్నదని తెలుసుకున్నాడు. బ్రాహ్మణాగ్రహారంలో ప్రవేశించగా - మొదటి గుమ్మం ముందు పెద్ద ముత్తైదువ ఒకస్తుక నిల్చుని ఉన్నది. ఆమెను సమీపించి దణ్ణంపెట్టి నుంచున్నాడు. ఆమె "ఏమిటి నాయనా" అన్నది.

"అమ్మా! మాది పొరుగూరు. త్రోవ తప్పి ఇట్లా వచ్చాను. రాత్రి భోంచెయ్య లేదు. ఆకలి దహించి వేస్తున్నది. కొంచెం అన్నం పెట్టమ్మా" అని అన్నాడు. అతనికి అప్పుడు ఉన్న ఆకలి అతనిచేత ఆ వినయభాషణ చేయించింది ఆము త్తైదువ "చద్ది ఉన్నది పెట్టాను నాయనా" అన్నది. లోపలకు రమ్మన్నది. అక్కడ ప్రహరీగోడ దాటిన తర్వాత ఖాళీస్థలం ఉన్నది. ఇంటికి ప్రహరీగోడకు మధ్యగా ఉన్నదా స్థలం. అక్కడ రెండు ఆవులు కట్టివేయబడి ఉన్నాయి. ఇంతలో ఇంటి ఆయన రాగా ఆయనకు ఆమె పెరుమాళ్లయ్య వృత్తాంతం చెప్పింది. అయితే విస్తరివేసి వడ్డించమని ఆయన అన్నాడు.

ఆమె లోపలకు వెళ్లగా ఆబ్రాహ్మణుడు పెరుమాళ్ల య్యతో "నాయనా! ఆ ఆవులదగ్గర కొంచెం బాగుచెయ్యి" అన్నాడు. పెరుమాళ్లయ్య ఇన్నాళ్లూ రాచఠీవితో పెరిగినవాడు. ఇప్పుడు ఆవుపేడ తియ్యడానికి సంకోచపడ్డాడు. ఆ సంగతి బ్రాహ్మణునికి తెలిసిపోయింది. ఆయన నవ్వుతూ "నాయనా నువ్వు రాచఠీవిగా ఉన్నావు. పెద్దింటి వాడివని తెలుస్తున్నది. సిగ్గు యీపని చెప్పకూడదు. కాని అయితే మీవంటివారు ఉచితంగా బ్రాహ్మణభోజనం చెయ్యకూడదు. ఏదైనా సేవ చెయ్యాలి. లేకపోతే మేమంకాదు. అందుకని చెప్పాను. పైగా-గోసేవ - సర్వమానవులకు అవశ్యమైనదే. ఇందులో కించపడ వలసిన దేమీ లేదు" అన్నాడు.

పెరుమాళ్లయ్య తలవంచుకొని ఆవులదగ్గర తనకు చేతై నట్లుగా శుభ్రం చేశాడు. ఆయన చూపించగా బావి దగ్గరకు

వెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కున్నాడు. ఇంతలో ఆమె అన్నం పెట్టి పిలిచింది. ఊరుపిండి పెరుగుతో చద్ది భోజనం సుష్ఠుగా చేశాడు

భోజనంచెయ్యగా అతనికి నిద్రవచ్చింది. ఇంటివారితో చెప్పి చాపతీసుకొని గోళాలలో వేసుకొని పడుకున్నాడు. రాత్రి అతడు తెల్లవార్లూ నడుస్తూనే ఉన్నాడు ఆ బడలిక, పైగా నిద్రలేదు. ఇప్పుడు పడుకోగా వెంటనే గాఢనిద్ర ముంచుకు వచ్చింది. అతనికి మెలకువ వచ్చేటప్పటికి సాయంకాలం ప్రొద్దు వాటారుతున్నది. అల్లంత దూరాన్నుంచి అతడు నిద్రలేవడం గమనించిన బ్రాహ్మణదంపతులు దగ్గరకు వచ్చారు. ఆమె చెప్పింది "నాయనా! నువ్వు చాలా అలసిపోయి ఉన్నావు. ఇంతసేపు నిద్రపోయావు. లేచి కాళ్లు చేతులు ముఖం కడుక్కో. అన్నం తిందువుగాని." అతడు ఆమె చేసినట్లు చేశాడు.

అన్నం తింటూఉండగా ఆ వృద్ధబ్రాహ్మణుడు పెరుమాళ్లయ్యను కబుర్లలోకి దింపాడు. పెరుమాళ్లయ్య తన వృత్తాంతము చెప్పుకున్నాడు. "తనది గోపవరం. తను కులాలకులస్థుడు. అయితే తన తండ్రికాలంనుంచి కులవృత్తి చెయ్యడంలేదు. తన తండ్రి గొప్పవీరుడు. సాళువ నరసింహరాయలవారి రాణువలో దళపతిగా ఉండేవాడు. ఒక యుద్ధంలో వీరమరణం పొందాడు. తనుగూడా చంద్రగిరివెళ్లి సేనలో చేరాలనే అభిప్రాయంతోనే గోపవరంనుంచి బయలుదేరాడు. ఐతే త్రోవతప్పి ఇక్కడకు చేరుకున్నాడు"

ఆ మాటలు వృద్ధ బ్రాహ్మణుడు విశ్వసించాడు. "ఐతే నాయనా! గోపవరం పాలెగాడు కేసనశెట్టిని ఎరుగుదువా?" అన్నాడు. పెరుమాళ్లయ్య సంచలించిపోయాడు. నిగ్రహించుకొని "ఎరుగున్నాను; మా కులంవాడే - మా యింటిదగ్గరే. మీకెట్లా తెలుసు?" అన్నాడు.

"నాయనా! మాకు సంతానం కుమార్తె ఒక్కతే. మేనల్లుని కిచ్చాము. అతనిని తెచ్చుకుని ఇక్కడే ఉంచుకున్నాము. వాళ్ల దసలు పాటూరు. తిక్కనసోమయాజిగారి వంశం. మావాడు మహాపండితుడు. మావాని తండ్రి శ్రీకంఠయ్యగారు మీ కేసనశెట్టికి విద్యాగురువు. మా ల్లుణ్ణి తన కుమార్తెకు సంస్కృతం చెప్పమని ప్రార్థించి కేసన శెట్టి తీసుకువెళ్లాడు. మా అల్లుడు మల్లన్నతో అమ్మాయి పిల్లలు వెళ్లారు. వాళ్ల క్షేమసమాచారాలు నీకేమైనా తెలుసా?" అని వృద్ధబ్రాహ్మణుడు ప్రశ్నించాడు.

పెరుమాళ్లయ్య మల్లన్నగారిని గురించి విన్నాడేకాని ఆయన్ను చూచిందిలేదు ఆయన్ను గురించి తల్లికూడా తనకు చెప్పింది. తన తల్లి ఆయన్ను గురించి మంచిమాటలు చెప్పలేదు. ఐతే తన అనుచరవర్గంవాళ్లు ఆయన్ను గురించి గొప్పగా చెప్పారు. ఆ మాటలు పెరుమాళ్లయ్యకు జ్ఞాపకం వచ్చాయి. పెరుమాళ్లయ్య అప్రయత్నంగానే మల్లన్నగారిని గురించి నాలుగు మంచిమాటలు అన్నాడు. తను మల్లన్నగారి సన్నిధానానికి వెళ్లి దర్శనం చేసుకోలేదుగాని ఆయన్ను దూరంనుంచి

చూచి నమస్కరించానని, కేసనశెట్టి మల్లన్న గారి కుటుంబానికి సకల రాజోపచార సౌకర్యాలు సమకూర్చాడని చెప్పాడు.

పెరుమాళ్లయ్య చెప్పిన మాటలతో అతనిమీద ఆ వృద్ధబ్రాహ్మణ దంపతులకు అభిమానం కలిగింది. ఆయన వాత్సల్యంతో "నాయనా! ఈ ఊళ్లో చంద్రగిరిరాజుల రాణువ ఉన్నది. ఆ సేనాగారాన్ని చూడటానికి అప్పుడప్పుడు సేనాధ్యక్షుడైన ఈశ్వరనాయకుడు వస్తూఉంటాడు. ఇదివరకు ఇక్కడ యువరాజుగా సాళువ నరసింహరాయలు ఉంటూ ఉండేవాడు. అప్పుడు ఈశ్వరనాయకుని కుమారుడు తుళువ నరసానాయకుడు కూడా ఇక్కడనే ఉండేవాడు.

మా ఇంటిప్రక్క ఇంటిలోనే మహాభక్తశిరోమణి సంకీర్తనాచార్యులు పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమయ్యగారు ఉంటున్నారు. ఆయనకు శిష్యపరమాణువు తుళువ నరసానాయకుడు. సాళువ నరసింహరాయలకు కూడ అన్నమయ్యగారిమీద అత్యంత భక్తిగౌరవములు. రాయలుగారుగాని, ఈశ్వరనాయకుడుగాని, నరసానాయకుడుగాని ఈ ఊరువస్తే అన్నమయ్యగారి దర్శనం చేసుకోకుండా వెళ్లరు. నీ సంగతి నేను అన్నమయ్యగారితో మనవిచేస్తాను. వారు రాయలగారి రాణువలో నీకు ప్రవేశం కల్పిస్తారు" అని చెప్పాడు.

అప్పుడే పెరుమాళ్లయ్యను తీసుకొని అన్నమయ్యగారి దర్శనానికి వెళ్లాడా వృద్ధుడు. వృద్ధుని చూడగా అన్నమయ్య

గారు లేచివచ్చి నమస్కరించి తోడ్కొనిపోయి కూర్చో పెట్టారు. వృద్ధుడు అన్నమయ్యగారితో "బాబూ! ఈ కుర్ర వాడు గోపవరంవాడు. కేసనశెట్టి ఇంటిప్రక్కవాడు. అతని కులమే. మన మల్లన్నను ఎరుగున్నాట్ట. వాళ్లు క్షేమంగానే ఉన్నారుట. ఇతడు రాయల రాణువలో చేరాలనుకుంటు న్నాడు. నీవు కొంచెం సాయంచెయ్యి" అని చెప్పాడు.

అన్నమయ్యగారు ఎదురుగా నిల్చునిఉన్న పెరుమా ళ్లయ్యను పరిశీలనగా చూచాడు. గోపవరంలో మల్లన్నగారి క్షేమ సమాచారాలను గురించి గ్రుచ్చిగ్రుచ్చి అడిగారు. పెరుమాళ్లయ్య తనకు చేతనైనంత బాగా సమాధానాలు చెప్పాడు. అన్నమయ్యగారు పెరుమాళ్లయ్యను పరిశీలిస్తూ "సేనలో ఉండటానికి తగినట్లుగానే ఉన్నది శరీరం! రేపే ఇక్కడకు తుళువ ఈశ్వరనాయకుడు వస్తున్నాడు. నన్ను చూడటానికి వస్తాడు. నిన్ను గురించి చెప్తాను." అన్నారు.

పెరుమాళ్లయ్య సంతోషిస్తూ కృతజ్ఞతతో నమస్కా రాలు చేశాడు. ఆ వృద్ధబ్రాహ్మణుని ఆదరముతో మర్నాటి వరకు పెరుమాళ్లయ్యవారి ఇంటిలోనే ఉన్నాడు. మర్నాడు ఈశ్వరనాయకుడు తమ దర్శనానికి రాబోతున్నాడని తెలియగా అన్నమయ్యగారు వచ్చి పెరుమాళ్లయ్యను తమ ఇంటికి తోడ్కొనిపోయారు.

ఈశ్వరనాయకుడు అన్నమయ్యగారి దర్శనానికి వచ్చి నప్పుడు పెరుమాళ్లయ్య అన్నమయ్యగారి సన్నిధిలోనే

ఉన్నాడు. ఈశ్వరనాయకుడు అన్నమయ్యగారికి ప్రణామంచేసి వారి ఆనతిమేరకు ఆసనంమీద కూర్చున్న తర్వాత ప్రక్కగా ఉన్న పెరుమాళ్లయ్యమీద అతని దృష్టిపడింది. పెరుమాళ్లయ్య అతని దృష్టిని ఆకర్షించాడు ఆజానుబాహువైన విగ్రహం. మహాబలశాలి అని చూడగానే తెలిసిపోతున్నది. 'అత డెవ్వరని' ఈశ్వరనాయకుడు అన్నమయ్యగారివంక చూశాడు.

ఆయన క్లుప్తంగా పెరుమాళ్లయ్య వివరాలు తెలిపి అతడు సేనలో చేరాలని అభిలాషతో ఉన్నాడన్నారు. అతని విగ్రహాన్ని చూచి సంతోషపడిన ఈశ్వరనాయకునికి అతనిని సేనలో చేర్చుకోవడానికి అభ్యంతరము లేనే లేదు.

ఆ దినమే ఈశ్వరనాయకుడు పెరుమాళ్లయ్యను చిన్న చిన్న పరీక్షలుచేశాడు. అన్నిటిలో పెరుమాళ్లయ్య ఉత్తమంగా ఉత్తీర్ణుడైనాడు. పెరుమాళ్లయ్యను పదాతిదళంలో చేర్చుకున్నారు.

పెరుమాళ్లయ్యకు అదివరకే యుద్ధవిద్యలు చాలతెలుసు. అతనికి కావలసినంత శరీరసౌష్ఠవం ఉన్నది. అమితంగా వ్యాయామంచేసి ఉన్నాడు. ఈశ్వరనాయకుడు టంగుటూరులో ఉన్న వారమునాలలోను పెరుమాళ్లయ్య అతని ప్రత్యేకాభిమానాన్ని సంపాదించుకోగలిగాడు. ఈప్రత్యేకాభిమానానికి కారణం పెరుమాళ్లయ్య శక్తి సామర్థ్యాలు మాత్రమే కాకుండా అతనికి అన్నమయ్యగారి ఆశ్రయమున్నదని తెలియడం కూడాను.

ఈశ్వరనాయకుడు చంద్రగిరికి తిరిగివెళ్లేటప్పుడు పెరుమాళ్లయ్యను తనవెంట తీసుకువెళ్లాడు. తనస్వంత ఆంతరంగిక పదాతిదళంలో చేర్చుకున్నాడు. పెరుమాళ్లయ్య టంగుటూరునుంచి వెళ్లుతూ అన్నమయ్యగారికి గాని మల్లన్నగారి అత్తమామలకు గాని కృతజ్ఞతలు చెప్పవలెనని అనుకోలేదు. తన సంగతి వాళ్లదగ్గర ఎక్కడ బయటపడుతుందోనన్న భీతితో ఉన్న పెరుమాళ్లయ్యకు వాళ్ల ఊరునుంచి వెళ్లిపోవడం సంతోషకారణమే అయింది

చంద్రగిరిలో పెరుమాళ్లయ్య ప్రాభవం దినదినాభివృద్ధి పొందిది. సేనలోని వారంతా ప్రతిదినం కవాతు చేస్తారు. యుద్ధక్రీడలలో పాలొంటారు. మల్లయుద్ధాలుచేస్తూ ఉంటారు. అవి సైనికులకు నిత్యనైమిత్తిక కర్మలు.

అన్నిక్రీడలలోను పెరుమాళ్లయ్యదే పైచేయి గా ఉండేది. అతనిని చూస్తేనే మిగిలినవాళ్లు జంకుతూ ఉండేవారు. పెరుమాళ్లయ్య స్వభావం విచిత్రమైనది. క్రింద పడిపోయిన ప్రత్యర్థిమీద ఇంకా బలప్రయోగంచేస్తూనే ఉండేవాడు. పడిపోయినవాణ్ణిపట్టి పల్లార్చడం క్రీడాధర్మంకాదని ప్రతిపర్యాయం పైవాళ్లు మందలించవలసి వచ్చేది.

తనదే పైచేయిగా ఉన్నా-ప్రత్యర్థులమీద కసిచూపడం, నిష్కారణంగా హింసించడం అతనికి స్వభావమని తెలిసిపోయింది. ఇతరులకు బాధ కలిగించడం అతనికి సరదా. చేతులు విరవడం కాళ్లకు బందాలువేసి పడగొట్టడం అతనికి అవలీలగా తెలిసిన

క్రీడలు. అతడు ప్రతిదినం, ప్రతిక్రీడలోను, ప్రతివారితోను దురుసుగా ప్రవర్తించేవాడు. ప్రతిసారి దళపతులు దండనాథులు కల్పించుకొని మందలిస్తూ ఉండవలసివచ్చేది. పెరుమాళ్లయ్య పేరుచెప్పితేనే సేనలోని వాళ్లంతా భయపడుతూ ఉండేవాళ్లు.

అతని హింసా ప్రవృత్తిమాట ఎట్లాఉన్నా, పెరుమాళ్లయ్య రాణువలో పరాక్రమశాలి అనీ, బలశాలి అనీ పేరు సంపాదించుకున్నాడు. కాని అతని హింసాప్రవృత్తివలన బద్ధశత్రువు లేర్పడ్డారు. అటువంటి శత్రువులలో సేనలోను, రాజధానిలోను ప్రముఖులైన వాళ్లు ఉన్నారు. చంద్రగిరిప్రభువైన సాళువ నరసింహరాయల కుమారులలో పెద్దవాడైన తిమ్మరాయడు ఆ శత్రుకోటిలో ముఖ్యుడు. ఇంకో ముఖ్యశత్రువు తుళువ నరసానాయకుడు.

వాళ్లు శత్రుత్వం పూనడానికి కారణాలున్నాయి. ఒకసారి సర్వసేనాధ్యక్షుని ఆంతరంగికదళంలోని వాళ్లు గుట్టాలను స్వారిచేస్తూ పోటీలుపడుతూ క్రీడిస్తున్నారు. నరసానాయకుడు తనతండ్రి ఈశ్వరనాయకుని ఆంతరంగిక దళాధిపతి. ఆనాటి పోటీలో అన్ని గుట్టాలకంటె నరసానాయకుని గుట్టం ముందుగా ఉన్నది. ఆతరువాత కొంచెం వెనుకగా పెరుమాళ్లయ్య గుట్టం వస్తున్నది. మిగిలిన వాళ్ల గుట్టాలు చాల వెనుకగా ఉన్నాయి.

పరుగిడుతూ ఉన్న నరసానాయకుని గుట్టానికి దౌడు తీస్తున్నప్పుడు అకస్మాత్తుగా పెద్దఅయి తగిలింది. గుట్టం ముందు

కాళ్లకు దెబ్బతగిలి కూలబడిపోయింది. గుట్టంమీద ఉన్న నరసా నాయకుడు కూడా నేలమీద పడిపోయాడు. పెద్దగాయమే అయింది. అటువంటి పరిస్థితులలో వెనుక గుట్టాలమీద ఉన్న వాళ్లు విధ్యుక్తధర్మమేమంటే తమ గుట్టాలను నిలిపి పడిపోయిన వానిని లేవతీసి అవసరమైన ప్రథమ చికిత్సాదులుచేసి, వెంట కొనిపోవడం. అంతకంటె ఆధమపక్షంలో అతనిని పట్టించుకోకుండా తమ గుట్టాలను ప్రక్కనుంచి దౌడు తీయించేవాళ్లు కూడా ఉండవచ్చును. కాని పెరుమాళ్లయ్య అధమాధమంగా ప్రవర్తించాడు. పడిపోయిన నరసానాయకుని మీదనుంచి కావాలని తన గుట్టాన్ని గంతువేయించాడు. అంటే తన గుట్టం కాళ్లక్రింద నరసానాయకుడు దూరిపోయినట్లన్నమాట. ఇది వీరుడైన ప్రతివానికి అనమానకరమైన చర్య.

వెనుకనుంచి వస్తున్నవాళ్లు గుట్టాలను ఆపి నరసానాయకునికి ప్రథమ చికిత్సచేశారు. అతని గుట్టాన్నికూడా లేవదీశారు. వాళ్లందరికీ పెరుమాళ్లయ్య చర్య కోపాన్ని తెచ్చింది. అందరూకలసి పెరుమాళ్లయ్యను వెంబడించి పట్టుకొని శిక్షించాలని తలపోశారు. కాని అంతలో అక్కడకు ఈశ్వరనాయకుడు వచ్చాడు. వాళ్లవ్యగ్రతనుబట్టి ఏదో వ్యవహారం జరిగినదని అతడు గ్రహించాడు. ప్రశ్నించి వివరాలు తెలుసుగున్నాడు. అతడు కల్పించుకుని పెరుమాళ్లయ్యచేత క్షమాపణ చెప్పించాడుగాని లేకపోతే ఆనాడు వాళ్లంతాకలసి పెరుమాళ్లయ్య సంగతి తేల్చిపెట్టేవారు. ఈశ్వరనాయకుని జోక్యం వలన పెరుమాళ్లయ్యకు ఆనాడు ఆపద తప్పిందే కాని, అతని

మీద నరసానాయకునకు ఇతరులకు పగమాత్రం అట్లాగే ఉన్నది. వాళ్లు కూడా మరొక అవకాశం కోసం వేచి ఉన్నారు.

యువరాజైన తిమ్మరాయనికి పెరుమాళ్లయ్య మీద ఆగ్రహం కలుగడానికి మరొక కారణం ఉన్నది. యువరాజైన తిమ్మరాయడు దృఢగాత్రుడు కాదు. బలహీనుడు. అందుచేత వ్యాయామక్రీడానిపుణుడు కాలేకపోయాడు. అతనికి కొంచెం గూని కూడా ఉన్నది. వంగినడుస్తాడు. అతని పరోక్షంలో సైనికులు 'గూని తిమ్మడు' అంటూ హాస్యంచేస్తూ ఉండేవాళ్లు. యువకులైన సైనికులు యువరాజులాగా గూని నడకలు నడుస్తూ స్కంధావారాలలో హాస్యంచేస్తూ ఉండేవాళ్లు.

ఒకసారి స్కంధావారంలో పెరుమాళ్లయ్య "ఇదిగో గూని తిమ్మడు నడక" అంటూ - యువరాజు తిమ్మరాయని గూని నడక అనుసరిస్తూ హాస్యంచేస్తూ ఉన్నాడు. మిగిలిన కుట్టికారు కేరింతలు కొట్టుతున్నారు. ఆ సమయంలోనే యువరాజు తిమ్మరాయడు అక్కడకు వచ్చాడు. ఆతనిని చూడకుండా పెరుమాళ్లయ్య ఇంకా హాస్యంచేస్తూ "గూని తిమ్మయ్యను నేనే" అంటూ పాటలు పాడుతున్నాడు. యువరాజు ముఖం మాడిపోయింది. ఏమి చెయ్యలేక విలవిలలాడి దురుసుగా వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోతున్నప్పుడుగాని పెరుమాళ్లయ్యకు యువరాజు వచ్చినట్లు తెలియలేదు.

ఈసంఘటన యువరాజు తిమ్మరాయని మనస్సులో శాశ్వతంగా నిలిచిపోయింది. పెరుమాళ్లయ్యమీద విపరీతమైన

ద్వేషాన్ని కలిగించింది. కాని తనకున్న గూనిని చూచి యువ సైనికులు వెక్కిరిస్తున్నారని యెవ్వరితో చెప్పుకుంటాడు? ఆనాటి యుద్ధావసరాలనుబట్టి రాజుగారికి, సేనాపతికి, సైన్యంలో వీరులైన యువకులమీద చాలా అభిమానం ఉన్నది. ఇటువంటి చిన్నచిన్న తప్పిదాలను వాళ్లు పట్టించుకోరు. అందుచేతనే తిమ్మరాయడు యువరాజై ఉండికూడా తన ద్వేషాన్ని తలలోనే పెట్టుకోవలసి వచ్చింది.

సాళువ నరసింహరాయలు హంవీరుని తరిమికొట్టిన తరువాత కొద్ది సంవత్సరాలలోనే గుండ్లకమ్మనుండి కావేరీనది పర్యంతమున్న తీరప్రాంతదేశాన్ని తన స్వాధీనం చేసుకుని సుస్థిరమైన ప్రభుత్వాన్ని నెరపుతూ ఉన్నాడు. అక్కడ అతని రాచరికం పాతుకుపోయింది.

కళింగ దేశంలో కపిలేశ్వర గజపతి మరణించగా అతని కుమారులు హంవీరుడు పురుషోత్తముడున్నూ కలహించుకున్నారు. పురుషోత్తమునితో పోరాడి జయింపజాలని హంవీరుడు బహ్మనీసుల్తాను సహాయమపేక్షించాడు. ఆనాటి బహ్మనీ సుల్తాను మూడవ మహమ్మదుషాహు. తన్ను గజపతి సింహాసనమీద సుప్రతిష్ఠితుని చేస్తే సుల్తానుకు హంవీరుడు తేలికగా తెలంగాణాప్రాంతం స్వాధీనము చేస్తున్నందుకు మహమ్మదుషాహు సంతోషపడి హంవీరునికి సహాయముచేసి తెలంగాణాను ఆక్రమించుకున్నాడు. తెలంగాణా మాత్రమేగాక తూర్పు సముద్ర పర్యంత తీరాంధ్ర భూమిని మహమ్మదుషాహు ఆక్రమించు

కున్నాడు. అందుచేత సాళువ నరసింహరాయలకు ఉత్తరపు కొల్లగా బహ్మనీ రాజ్యము వచ్చినది.

బహ్మనీ సుల్తానుతో యుద్ధమువస్తే సాళువ నరసింహ రాయలకు తేలికయిన పనిగాదు. సుల్తాను చాల బలవంతుడు. అతనితో యుద్ధము చేయవలసిన అవసరము కలుగక మునుపే సుల్తాను బలాన్ని తగ్గింపవలసిన అవసరం ఉన్నదని నరసింహ రాయలు గ్రహించాడు.

బహ్మనీ సుల్తాను రాజ్యంలో అరిగాపులైన కొండపల్లి కొండవీడు ప్రాంతాలలోని సైందవ జమిందారులతో సాళువ నరసింహరాయలు స్నేహాన్ని వృద్ధిపొందించాడు. మహమ్మదు షాహు కళింగదేశముపై దండెత్తి పోగా, నరసింహరాయలు సమయం కనిపెట్టి కొండవీటి ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సాళువ నరసింహరాయల రాజ్యపు ఉత్తరపు సరిహద్దు కృష్ణా నదీ తటాన్ని చేరుకున్నది.

ఆ సమయంలో విజయనగర సామ్రాజ్యానికి అధినేతగా ఉన్న విరూపాక్షరాయల అధికారం పశ్చిమాంధ్రలోను కర్ణాటకంలోను మాత్రమే చెల్లుబడి అవుతూ ఉండేది. మిగిలిన దక్షిణ భారతమంతా చిన్నచిన్న పాలెగాండ్ల స్వాధీనంలో ఉన్నది. వాళ్లు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి ఉన్నారు. ఈ చిన్న చిన్న పాలెగాండ్లను జయించి సాళువ నరసింహరాయలు తన ఆధిపత్యాన్ని స్థాపించుకున్నాడు.

ముందుగానే నరసింహరాయలు ఉదయగిరిని, నెల్లూరును జయించాడు. ఆమూరు, కోనగిరి, చెంజి, శ్రీరంగము, తిరుచిరాపల్లె మొదలైన దుర్గాలనుకూడ స్వాధీనము చేసుకున్నాడు.

పెరుమాళ్లయ్య పదాతి దళంలోచేరి పేరు తెచ్చుకున్న తరువాత మళ్లీ సాళువ నరసింహరాయలు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. ఈ విజయయాత్రలో కొంగు, ధారాపురం, నాగమంగలం, కుందాణి, బెంగళూరు, శ్రీరంగపట్టణం కోటలు స్వాధీనం చేసుకోబడినాయి. ఈ దుర్గాలను స్వాధీనం చేసుకునేటప్పుడు పెరుమాళ్లయ్య మహాపరాక్రమం చూపించాడు.

శ్రీరంగపట్టణం కావేరీనది మధ్యలోఉన్న దీవి. ఇది జల దుర్గం. దానిని స్వాధీనం చేసుకోవడం చాలా కష్టమైన పని. నరసింహరాయలు కోట ముట్టడిచేసి నెలనాళ్లైనది. కోట స్వాధీనం కాలేదు. కావేరీనది వరదల్లో ఉన్నది. కోటను పట్టుకోవడం సాధ్యపడేటట్లు తోచలేదు. నరసింహరాయలు, అతని సేనాపతి ఈశ్వర నాయకుడు మంతనాలు చేశారు. వారికి మార్గం కనుపించలేదు.

పదాతి సైన్యంలో మహాసాహసికుడని పేరు తెచ్చుకున్న పెరుమాళ్లయ్య ఈశ్వరనాయకుని దర్శించి ఒక పథకాన్ని నివేదించాడు. ఈశ్వరనాయకుడు, నరసింహరాయలకు మనవి చేశాడు. ఆ పథకం మహాసాహసంతో కూడుకొని ఉన్నది. దానిని నిర్వహింపగల సాహసికులు ఉంటేనే ఆచరణ సాధ్యమౌతుంది. నరసింహరాయలు అనుమతి అన్నాడు. ఈశ్వర

నాయకుడు తిరిగి విన్నవించాడు. పెరుమాళ్లయ్య తాను స్వయంగా ఎట్టి సాహసమైనా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడని, ఆ పథకాన్ని ఆచరణలో పెట్టడానికి అతడు పూనికతో ఉన్నాడని, నరసింహరాయలు సమ్మతించాడు.

ఆరోజు అమావాస్య. చీకటి దట్టముగా ఆలముకొని ఉన్నది. పైగా ఆకాశం మేఘావృతం అయి ఉన్నది. చల్లని ఈదరగాలికూడా కొట్టుతూ ఉన్నది. ఇట్టి రాత్రివేళ శత్రువుల ప్రమాదం ఉండజాలదని కోటలోనివాళ్లు ప్రమత్తులుగా ఉన్నారు. బురుజులమీద మాత్రం సైనికులు పహరాచేస్తూనే ఉన్నారు. స్వల్పసంఖ్యలో భటవర్గం గస్తీ తిరుగుతూ ఉన్నది.

నడిరాత్రివేళ కత్తి నడుముకు బిగించుకొని, పెద్దమోకు తాడు నడుము చుట్టూ చుట్టుకొని, పెరుమాళ్లయ్య వరదలలో ఉన్న కావేరీనదిలో దూకాడు. అతడు గజ ఈతగాడు. దూకిన చోటనే మునిగిపోయినాడు. నదిలో నీటి అడుగున నడుచుకుంటూ పోయాడు. ఈవలగట్టున చీకట్లో నరసింహరాయలు, ఈశ్వరనాయకుడు, అతని కుమారుడు నరసానాయకుడు ముఖ్యులైన దండనాథులు దళపతులు వేచిఉన్నారు. పెరుమాళ్లయ్య నడుముచుట్టూ చుట్టుకున్న మోకుతాడు మిగిలిన భాగం—నది గట్టున చుట్టలు చుట్టలుగా ఉన్నది. ఆచుట్టల్లోనుంచి తాడు మెల్లిమెల్లిగా కదులుతూ ఉన్నది. మెల్లిమెల్లిగా కావేరీనది లోనికి పోతూ ఉన్నది. అది కొంచెం కొంచెంగా పురోగమించడం వలన పెరుమాళ్లయ్య ముందుకు సాగుతూనే

ఉన్నాడని, ప్రమాదమేమీ జరుగలేదని వాళ్లు గ్రహిస్తూ ఉన్నారు.

కొంతసేపటికి తాడు కదలడం మానివేసింది. అప్పుడు వీళ్లంతాకలసి తాడును పట్టుకొని బలంతో లాగిచూచారు. తాడు చాలా బిగువుగా ఉన్నది. అంటే తాడును అవతల పక్క పెరుమాళ్లయ్య దేనికో గట్టిగా బిగించి కట్టినాడని తెలిసిపోయింది. ఇవతల వీళ్లుకూడా తాడును దగ్గరలో ఉన్న పెద్ద చెట్టుకి బిగించి కట్టారు.

వెంటనే మహాసాహసికులైన సైనికులు అయిదు వందల మంది సిద్ధము చేయబడ్డారు. వీళ్లంతా కత్తులు ధరించి, తాడును పుచ్చుకుని నదికి అడ్డముగా ఈదుతూ నదినిదాటి అవతల గట్టుకు చేరుకున్నారు. ఈ సాహసదళానికి సాళువ నరసింహ రాయలు స్వయంగా నాయకత్వం వహించాడు. శత్రువులు ప్రమత్తులుగా ఉన్న ఆ మహాంధకార సమయంలో పెరుమాళ్లయ్య ఈశ్వరనాయకుని కుమారుడు నరసానాయకుడు కోట గోడలకు యెగబ్రాకి లోపలకు ప్రవేశించారు. అవతల ద్వారాన్ని కాపుదలచేస్తున్న స్వల్ప భటవర్గాన్ని వీళ్లిద్దరూ కన్నుమూసి కన్ను తెరచేలోపల హతం చేశారు. ద్వారాలు తెరువగా నరసింహరాయలు సాహసదళంతో లోపల ప్రవేశించాడు. సేనాపతి ఈశ్వరనాయకుడు లోపల బంధించి ఉన్న చిన్నచిన్న పడవలను తీసుకుని కొద్ది సైనికుల సహాయంతో ఈపల గట్టుకు వచ్చాడు. ఈ పడవల సహాయంతో తన

సైన్యాన్ని గబగబా నదిని దాటిస్తూ ఉన్నాడు. నదిని దాటిన సైనికులు కోటలోపల ప్రవేశిస్తూ ఉన్నారు.

కోటలోపల ప్రవేశించిన నరసింహరాయలు ముందుగా కోట ద్వారాలను బురుజులను స్వాధీనం చేసుకున్నాడు. తరువాత ఘడియసేపట్లో కోట స్వాధీనమై పోయింది. ఆయుధం ధరింపగల శత్రు సైనికు డెవ్వరు మిగులలేదు.

ఆ యుద్ధంలో పెరుమాళ్లయ్య రాక్షసవిహారం చేశాడు. అతణ్ణి మహాభూతమో, భేతాళమో ఆవహించినట్లుగా ఉన్నది. అతడు యుద్ధం చేసినట్లుగా లేదు. పిశాచతాండవం చేసినట్లుగా ఖడ్గ విహారం చేశాడు. శత్రుసైనికుల కంఠాలను ఊచకోతగా నఱికినాడు. వాళ్ల శిరస్సులతో కందుకక్రీడ చేశాడు. రెండు చేతులతోనూ ఖడ్గాలను ధరించి చెంగుచెంగున దూకుతూ యుద్ధరాక్షసి విజృంభించినట్లుగా ఉన్మత్తవిహారం చేశాడు. ఆకలిగొన్న బెబ్బులి మహానాదం చేసినట్లుగా గగ్గోలు చేశాడు.

శ్రీరంగపట్టణం కోట పట్టుబడిన తరువాత కోటలో నరసింహరాయలు జరిపిన విజయోత్సవంలో పెరుమాళ్లయ్య ప్రతాపాన్ని రాయలు ప్రశంసించి అతనిని దళపతిని చేశాడు.

శ్రీరంగపట్టణం స్వాధీన పరచుకొన్నతరువాత నరసింహరాయలు సేనలతో చంద్రగిరికి తిరిగి వస్తూ ఉన్నాడు - అతడు అశ్వారూఢుడై సేనాగ్రభాగంలో ఉన్నాడు. ప్రక్కగా అంగ

రక్షకదళం వస్తున్నది. అంగరక్షక దళానికి దళపతిగా ఉన్నాడు పెరుమాళ్లయ్య. శ్రీరంగపట్టణాన్నుంచి చంద్రగిరి వచ్చేలోగా ఎన్నో అరణ్యాలను దాటవలసి ఉన్నది. చిన్నచిన్న గుట్టలను కొండలను, నదులను దాటవలసి ఉన్నది. ఆరుకాడు అడవులలో ఉండగా ఒక సంఘటన జరిగింది.

ఇంతట్లో అంచరికంటె ముందుగాఉన్న నరసింహరాయల మీద ప్రక్కగా ఉన్న పొదమాటునుంచి పెద్దపులి లంఘించి దూకింది. ప్రమత్తంగా ఉన్న నరసింహరాయలు గుట్టం మీద నుంచి క్రిందపడ్డాడు. అతనిమీదనే పులికూడా పడింది. పులి గోళ్లు గుచ్చుకున్న గుట్టం భయంతో సకిలిస్తూ దౌడు తీసింది. ఇదంతా కనురెప్పపాటులో జరిగింది. నరసింహరాయలు పులి వాతపడి ప్రాణాలను కోలుపోయేటట్లే ఉన్నాడు.

కాని మహాసాహసికుడైన పెరుమాళ్లయ్య గుట్టంమీద నుంచి లంఘించి పులిమీదకు దూకాడు. తనమీద అకస్మాత్తుగా పడిన పెరుమాళ్లయ్యవైపు తలత్రిప్పి - కొరకపోతూన్న నర సింహరాయలను పులి వదలిపెట్టింది. పులి తన తలను పెరుమా ళ్లయ్యవైపు త్రిప్పేలోగానే దాని కంఠాన్ని తన ఖడ్గంతో నరికి వేశాడతడు. అది భీకరంగా గర్జిస్తూ చచ్చిపోయింది. అంగరక్షక దళంలో వారంతా అప్పటికి సమీపానికివచ్చి చేరారు.

పెరుమాళ్లయ్య కనక లంఘించి దూకి ఉండకపోతే - ఏమాత్రం ఆలస్యమైనా నరసింహరాయలను రక్షింప గలిగి ఉండేవాళ్లుకాదు. ఆ లంఘించి సరిగ్గా పులిమీదనే దూకడం -

అది తలత్రిప్పేలోగా దానితలను నరకివెయ్యడం - యివి మహా సాహసవంతునికి, మిక్కిలి సామర్థ్యం కలిగిన వీరునికీ మాత్రమే సాధ్యం అయ్యేపనులు. అట్లా గురిచూచి దూకగలిగిన నేర్పు - దూకుతూనే ఖడ్గాన్ని ఉపయోగింపగలనేర్పు - అంత సాహసం చేయగలిగిన ధైర్యస్థైర్యాలు అంగరక్షకబళంలో పెరుమాళ్లయ్యకు మాత్రమే ఉన్నాయి. నిజానికి సేనాధిపతి వృద్ధుడైన ఈశ్వరనాయకుడుగాని, అతని కుమారుడు దళపతి నరసానాయకుడు కాని అంత సాహసం చేయలేరు. ఆ మహావీరకృత్యాన్ని చూచినవాళ్లంతా పెరుమాళ్లయ్యను అభినందించారు.

ప్రాణాలు దక్కించుకొన్న నరసింహరాయలు తేరుకొని మళ్లా నిలువతొక్కుకున్నాడు. అప్పటికప్పుడే సాళువ నరసింహరాయలు పెరుమాళ్లయ్యను తన అంగరక్షకదళానికి అధిపతిగా చేశాడు. సాళువ నరసింహరాయల సేనలు తిరిగి చంద్రగిరి దుర్గాన్ని చేరుకున్నాయి. విజయోత్సవాలు జరిగినాయి. ఆ ఉత్సవాలకు రాయలు అన్నమయ్యగారిని ఆహ్వానించాడు.

అన్నమయ్యగారు పెరుమాళ్లయ్య మహాసాహస కృత్యాలను గురించి విని సంతోషపడ్డాడు. అన్నమయ్యగారు రాయలును ఆశీర్వదించారు. విజయోత్సవాలకు కవి పండితులెందరో వచ్చిరి.

సోమరాజు పల్లెనుండి భారతీతీర్థ శ్రీచరణకరుణాపాత్రుడైన పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి వచ్చెను. అతడు మంత్రోపాసకుడు. తంత్రరహస్యవేత్త. అతడు రచించిన నవరస దర్పణము

గురించి నారదీయము గురించి మానసోల్లాసము గురించి శృంగార శాకుంతలము గురించి ఆంధ్రదేశ విద్వత్ పరిషత్తులందు ప్రశంసలు ముస్నే చెలగినవి. ప్రణవపీఠమున మంత్రపరంపరలు గొలువ పేరొలగమునన్న వాగ్దేవిని మహాప్రభ్వాగా సేవించినవా డితడు.

పినవీరభద్రకవి రాజసభలో తన రచనయైన నవరస దర్పణమునుండి కొన్ని ఆలంకారిక సిద్ధాంతములను ప్రవచనము చేయగా అన్నమయ్యగారికి పరమానందమైనది. దర్పణములో పినవీరభద్రుడు వివరించిన శృంగారనాయికా ప్రభేదలక్షణములను విని అన్నమయ్యగారు అప్పటికప్పుడే ఆ లక్షణములకు లక్ష్యములుగా పదములుపాడి వినిపించిరి.

అన్నమయ్యగారు రచించిన ఈ పదములకు నాయకుడు పరవాసుదేవ్రుడైన శ్రీనివాసవేంకటేశ్వరమూర్తి. శ్రీకృష్ణదేవుని పట్టమహిషులు శృంగారనాయికలు. అన్నమయ్యగారి శృంగార పదములు సర్వజనరంజకములై సభికులను ఆహ్లాదపరిచినవి. అన్నమయ్యగారు పినవీరభద్రకవి పరస్పరము మిక్కిలి గౌరవములు చేసుకొన్నారు. అన్నమయ్యగారిని భక్తాగ్రేసరుడని సంకీర్తన సార్వభౌముడని శ్రీవేంకటేశ్వరుని అంశావతారమని పినవీరభద్రకవి వినుతించాడు. అన్నమయ్యగారు పినవీరభద్ర కవిని యోగీశ్వరుడని సర్వతంత్ర స్వతంత్రుడని విద్వత్ కవి నాథుడని ప్రశంసించారు.

సాళువ నరసింహరాయలు నిండు సభలో పినవీరభద్ర కవికి కప్పురపు తాంబూలమిచ్చి జైమినీభారతమును ఆంధ్రీక

రించి తన కంకితము చేయమని కోరెను. అన్నమయ్యగారు సంతోషపడి భారతాశ్వమేధపర్వ కథలోని అద్భుతవృత్తాంతము లెన్నో పినవీరభద్రుని రమణీయకవితామార్గమున చక్కగా రాణించగలవన్నారు.

18

కుమారసంభవ కావ్యాంతమున పాఠము వింటూ తన్మయత్వము పొందిన మొల్ల నాల్గురోజులు పాఠమునకు వెళ్ళలేదు. ఆమె తన ప్రవర్తనకు సిగ్గుపడి పోయినది. మల్లన్న గారిని ఆయన భార్యను చూచుటకు లజ్జ పడిపోయినది. నాలుగు రోజులు పాఠమునకు రాకపోగా మొల్లయొక్క స్థితి మల్లన్నగారికి అవగాహన అయింది. ఆయన తన భార్యతో సంప్రతించాడు.

మల్లన్న గారి భార్య వెళ్ళి మొల్లను పలకరించింది. బుజ్జగించింది. అనునయింపు మాటతో ఆమె సిగ్గును పోగొట్టింది. వెంటపెట్టుకుని పాఠానికి తీసుకువచ్చింది. మళ్ళీ పాఠాలు సాగినవి. సంస్కృతంలో భారవి మాఘము పూర్తి అయినవి. భారవియొక్క అర్థగౌరవము మాఘుకవియొక్క మహారచయిత్వలక్షణము విశదంగా తెలిసినవి. "కావ్యేషు మాఘుః" అన్నసూక్తియొక్క ఔచిత్యము విపులీకరించబడినది. కాళిదాసులోని ఉపమాలంకారస్నిగ్ధత, భ రవి మహాకవియొక్క అర్థగౌరము, దండి మహాకవియొక్క పదలాలిత్యము ఈ మూడు గుణాలును మాఘు మహాకవిలో నిరూపింపబడినాయి.

పంచకావ్యముల తరువాత మొల్ల కోరికపై మల్లన్న గారు శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణాన్ని ప్రారంభించారు. పాఠం చతుర్వ్యాఖ్యానాలతో సాగుతున్నది. ముందు సాంప్రదాయిక ప్రార్థన శ్లోకములు జరిగినవి. పిమ్మట గాయత్రి రామాయణాన్ని ఎత్తుకున్నారు. చాలభాగం నడిచింది. అంతరార్థాలతో, వేదాంత సర్వస్వము విపులీకరణ చేయబడుతున్నది.

ఇంతలో ఆనాడు పెరుమాళ్లయ్య గోపవరానికి తిరిగి వచ్చాడు. తిరిగివచ్చిన పెరుమాళ్లయ్య స్వల్పపరివార సమేతంగా వచ్చాడు. చంద్రగిరి మహారాజుల అంగరక్షకదళాధిపతిగా వచ్చాడు. రాజఠీవితో వచ్చాడు. పెరుమాళ్లయ్య వస్తున్నాడన్న వార్త గోపవరంలో కొంచెం ముందుగానే తెలిసింది.

ఇంతకాలంగా పెరుమాళ్లయ్య ఏమైపోయాడో తెలియని గోపవరానికి ఆవార్త ఆశ్చర్యసంభ్రమాలను కలిగించింది. పెరుమాళ్లయ్య అనుచరవర్గంవారి ఉత్సాహానికి మేరలేకపోయినది. అతని తల్లి సంబరపడింది.

పెరుమాళ్లయ్య మంచిపేరు తెచ్చుకోవడం మేనమామ కేసనశెట్టికి కూడా ఆనందమే కలిగింది. అతడు మేనల్లుడికి పరమహార్దికమైన స్వాగతాన్ని చెప్పడానికి సిద్ధపడ్డాడు.

పెరుమాళ్లయ్య వచ్చీరావటంతోటే అసందర్భంగా ప్రవర్తించాడు. అతడు గుఱ్ఱంమీద వచ్చినపుడు వాకిట్లోనే కేసనశెట్టి ఉన్నాడు. మేనల్లుడువచ్చి తనకు నమస్కరిస్తాడని కేసన

శెట్టి అనుకున్నాడు. పెరుమాళ్లయ్య గుట్టాన్నిదిగి కేసనశెట్టిని చూచి అతనికి గుట్టపు కళ్లెం అందించాడు. అంటే నీళ్లు పెట్టి కొట్టంలో కట్టివెయ్యి అన్నమాట. పెరుమాళ్లయ్య ఇట్లా ప్రవర్తించటం కేసనశెట్టికి విభ్రాంతి కలిగించింది. అతడు నిరుత్తరుడై చూస్తూ నిలబడిపోయాడు. ఆపని నౌకర్లకు చెప్పవలసినదికాని అయిరమాగాణ ప్రభువైన కేసనశెట్టికి - తన మేనమామకు - తన్ను పెంచి పెద్దచేసిన వానికి చెప్పవలసినదికాదు. ఇంతలో దగ్గరలోఉన్న పనివాడు పరిగెత్తుకునివచ్చి గుట్టం కళ్లాన్ని పుచ్చుకున్నాడు.

మొదటినుంచి పెరుమాళ్లయ్య అహంభావం కలవాడు. చంద్రగిరిరాజు అంగరక్షకబలానికి అధిపతి కావడంతో అతని గర్వము పర్వతాకారం దాల్చినది. తానే సర్వసేనాధిపతి అయినట్లు సాళువ నరసింహరాయల రాజ్య విస్తరణకు తానే కారణం అయినట్లు అతని గర్వాహంకారాలు పెరిగిపోయాయి. అతని కండ్లకు మేనమామ ఆనలేదు.

పెరుమాళ్లయ్య లోపలికివెళ్లి తల్లిని మాత్రం పరమ ఆప్యాయతతో పలకరించాడు. ఆమె ఆనందభరితురాలయింది. ఇంతలో అక్కడకువచ్చిన మొల్లతో తల్లి ఎదుటనే మోటుగా ప్రవర్తించాడు. తల్లికిగల పుత్రప్రేమలో అతని ప్రవర్తనలోని దోషం ఆమెకు కనిపించలేదు. అంతే కాకుండా వాళ్లు మేనత్త మేనమామ బిడ్డలు. భార్యా భర్తలు కాబోతున్నారు. అందు చేత ఆతల్లి దృష్టిలో అతని ప్రవర్తన అసందర్భంగా కనుపించలేదు.

ఆ తల్లికి మహాసేనాని అయినట్లు ప్రభువు అయినట్లు మండలేశ్వరుడు అయినట్లు, చంద్రగిరి మహారాజు అయినట్లు, విజయనగరసామ్రాజ్యపు చక్రవర్తి అయినట్లు కనిపించాడు. ఇన్నాళ్లుగా తమకు ఆధారమైన అన్నగారు కేసనశెట్టి తన కొడుకు ముందు ఆనలేదు.

పెరుమాళ్లయ్య తానే యింటి యజమాని అయినట్లు తానే గోపవరం అమరమాగాణ ప్రభువు అయిఉండగా కేసన శెట్టి తనకు ఆశ్రితుడైనట్లు కేసనశెట్టి కూతురు గౌరమ్మ తనకు భార్య అయిపోయినట్లు ప్రవర్తించాడు.

గౌరమ్మకు అతనిని చూడగానే ఏవగింపు పుట్టుకువచ్చింది. అతని ముఖంమీద క్రౌర్యం కొట్టవచ్చినట్లుగా ఉన్నది. చిన్న ప్పటి నుంచి ఆమెకు పెరుమాళ్లయ్యమీద ఇష్టం లేదు. అతడు మహాబలశాలి అనిగాని మహాపరాక్రమవంతుడని గాని ఆమెకు తెలియకగాదు. అతడు భీమసేనుడు లాగా ఉంటాడు. అతనికి చదువు అంటలేదు. చదువుల సరస్వతి అయిన గౌరమ్మకు అతని మీద చిన్నప్పటినుంచీ చిన్నచూపే.

పెరుమాళ్లయ్య ప్రవర్తన నౌకర్లకు మాత్రమే కాకుండా కేసనశెట్టికి కూడ అసహ్యంగా ఉంది. తన కండ్ల ఎదుట తన యింటిలో తన కుమార్తె అవమానింపబడుతూ ఉండగా కేసనశెట్టి ఏమి చేయలేకపోయాడు. తన నిస్సహాయ తకు తనని తాను నిందించుకున్నాడు. తను పెరుమాళ్లయ్య పశు ప్రవర్తనను గురించి విని ఉన్నాడు. మునుపు లంబొడీపిల్లను

చేసినట్లు పెరుమాళ్లయ్య గౌరమ్మను చేస్తాడేమోనని కేసనశెట్టి భయపడ్డాడు.

ఆరాత్రి పెరుమాళ్లయ్యకు తల్లి పంచభక్ష్య పరమాన్న ములతో భోజనం పెట్టింది. కుమారుడు ఊరు వదిలిపెట్టి వెళ్లి పోయిన నాటినుంచీ ఊళ్లో జరిగిన సంగతులు తల్లి చెప్పింది. ఆ చెప్పడంలో ప్రస్తుతి కల్పించి మల్లన్నగారిమీద తనకున్న ద్వేషాన్ని వెళ్లగక్కింది. తనకున్న అనుమానాలు గౌరమ్మ బుద్ధి మల్లన్నగారు పాడుచేస్తున్నారని మొదలైన సంగతులు చిలవలు పలవలుగా చెప్పింది.

ఆమె చెప్పినమాటలకు పెరుమాళ్లయ్య ఉగ్రుడైనాడు. కాని అప్పటికే చాలారాత్రి అయివుండటంచేత తమాయించుకున్నాడు. రాత్రి తెల్లవార్లూ అతనికి నిద్రపట్టలేదు. కోపం పెరుగుతూవచ్చింది. పగపట్టిన మహాసర్పం కాటు వెయ్యడానికి ముందు బుసలుకొట్టుతూ ఉన్నట్లు రుసరుసలాడిపోయాడు. కష్టంమీద ఆగ్రహాన్ని సంబాళించుకున్నాడు.

మర్నాడు ఉషఃకాలంలో లేచి, కాలకృత్యములన్నా తీర్చుకోకుండా బయలుదేరాడు. అతని మనస్సులో ఉన్న హాలాహాలం ఎట్లా నురుగులు గ్రక్కుతున్నదో తల్లి గ్రహింప లేదు. అతనిని దూరంగా ఉంచిన కేసనశెట్టికి తెలియనే తెలియదు. గౌరమ్మకు తెలిసే అవకాశమే లేదు.

పెరుమాళ్లయ్య సరాసరి మల్లన్నగారి ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఉషఃకాలం అతిక్రమించి అరుణోదయం అవుతున్నది

పెన్నానది ఏటికివెళ్లి స్నానంచేసి పిండుకుని కట్టుకున్న తడిబట్ట లతో, చేతిలో బుడి చెంబుతో మల్లన్నగారు ఇల్లు చేరు తున్నారు. ఆయన్ను చూడగా పెరుమాళ్లయ్యకు పిశాచత్వం ఆవేశించింది. ఒక్క దూకుడుతో ఆయనమీదకు లంఘించి ఒర లోని కత్తిదూసి ఆయన శిరస్సును ముక్కలు ముక్కలుగా ఖండించాడు. యుద్ధరంగంలో మహాయోధునితో ద్వంద్వ యుద్ధంచేసి విజయం సాధించినప్పుడులాగా సింహగర్జన చేశాడు.

స్నానంచేసి తలవంచుకొని, ఏవో ప్రాతఃస్మరణ శ్లోకాలు చదువుకుంటూ వస్తున్న మల్లన్నగారు పెరుమాళ్లయ్యను గమ నించనే లేదు. ఆయన కళేబరం అట్లాగే నేలకు ఒరిగిపోయింది. పెరుమాళ్లయ్యచేసిన గర్జకు ఇంటిలోనుంచి బయటకువచ్చిన మల్లన్నగారి భార్య ఆ హింసాకాండచూచి ఆక్రందనం చేసింది.

19

మల్లన్నగారిని పెరుమాళ్లయ్య హత్య చేశాడని కొంచెం సేపట్లో గోపవరమంతా పొక్కిపోయింది. ఊరంతా మల్లన్న గారి ఇంటి ముందుకు పరుగెత్తుకు వచ్చారు. తెల్లవారు ఝామున నే లేచి పశువుల శాలలో పనిచూస్తున్న కేసనశెట్టికి కొంత ఆలస్యంగా తెలిసింది. తెలియగానే అతడు పరువెత్తుకొని వచ్చాడు.

కేసనశెట్టి వచ్చేటప్పటికే ఊరంతా అక్కడ ఉన్నది. మల్లన్నగారి భార్య ఆయన కళేబరం మీదపడి రోదిస్తున్నది.

పిల్లలు కూడా ఆమె ప్రక్కనే కూర్చుని దుఃఖిస్తున్నారు. మొల్ల ఆమెకు దగ్గరగా కూర్చుని ఉన్నది. ఆమె కూడా రోదిస్తూనే ఉన్నది. ఈ పరిస్థితులలో కేసనశెట్టివచ్చి చూచి విలవిలలాడి పోయాడు.

వెంటనే కేసనశెట్టి పెరుమాళ్లయ్య ఏమైనాడని విచారించాడు. అతడు సరాసరి పెన్నానది స్నానఘట్టానికి వెళ్లాడని చెప్పారు. కేసనశెట్టి పాలెగాడు అవటం మూలాన అతని అజమాయిషీలో సాయుధులైన సేవకులు పదిమందిదాకా ఉన్నారు. వాళ్లను పిలిపించి వెంటనే పెరుమాళ్లయ్యను బందీచేసి తీసుకురమ్మని ఉత్తర్వుచేశాడు.

సాయుధులైన సైనికులు పెన్నానది రేవుకు పోయేటప్పటికి పెరుమాళ్లయ్య స్నానం ముగించి మళ్లీ పొడిబట్టలు కట్టుకుని బయలు దేరుతున్నాడు. సైనికులువచ్చి చుట్టుముట్టగా పెరుమాళ్లయ్య కత్తిదూసి కలయబడ్డాడు. అతడు మహాబలశాలి. మహాసాహసికుడు. రాయల రాణువలో తర్ఫీదు పొందినవాడు. అతని ముందు యీగ్రామసైనికులు నిలువలేకపోయారు. ఇద్దరికి కత్తి దెబ్బలు తగిలి నేల కూలిపోయారు. పెరుమాళ్లయ్య తప్పించుకొనిపోయాడు. అతడు సరాసరి తన గుఱ్ఱం ఉన్న చోటికిపోయి దానిని ఊడదీసుకొని స్వారీ చేసుకుంటూ వెళ్లిపోయాడు. అతనిని అడ్డగించడానికి ఎవ్వరూ సాహసించలేదు.

కేసనశెట్టి రెండు మేనాలను సిద్ధపరిచాడు. ఒక మేనాలో మల్లన్నగారి శవాన్నిఉంచి, రెండవ దానిలో ఆయన భార్యను

పిల్లలను ఎక్కించి, స్వల్పపరివారంతో టంగుటూరు ప్రయాణమై వెళ్లాడు. మొల్ల తానుకూడా వెంటవస్తానని పట్టుపట్టి వెళ్లింది. ఆమెకూడా తండ్రితోపాటు మేనా వెంట నడుస్తా నన్నది. తండ్రి ఆమెకు కూడా మేనా కట్టించాడు.

పెరుమాళ్లయ్య వెంటవచ్చిన చంద్రగిరి పరివారసైనికులు తాము ఏమిచెయ్యాలో తెలియక తికమకపడ్డారు. కేసనశెట్టి వాళ్లను చంద్రగిరివెళ్లి సేనాపతులతో జరిగిన సంఘటనలు విన్నవించమనీ, పెరుమాళ్లయ్య పరారీ అయినట్లు చెప్పమనీ తానొక ప్రత్యేక విన్నపము కూడా వ్రాసి వాళ్లద్వారా పంపుకున్నాడు.

మల్లన్నగారి కళేబరం టంగుటూరు చేరగా మళ్లీ దుఃఖ సంరంభమైంది. మల్లన్నగారి అత్తమామలు అన్నమయ్యగారి కుటుంబం వారంతా మిక్కిలి శోకించారు. తన మూలంగా టంగుటూరునుంచి కదలివెళ్లిన మల్లన్నగారు సజీవంగా తిరిగి రాలేదని అన్నమయ్యగారు బాధపడ్డారు.

జరిగిన సంఘటన వివరాలన్నీ కేసనశెట్టిచెప్పగా అన్నమయ్యగారు చంద్రగిరిరాజు సాళువ నరసింహరాయలకు విన్నపం వ్రాస్తూ నిరపరాధి అయిన మల్లన్నగారికి అన్యాయం జరిగిపోయిందని తెలిపాడు. ఆకుటుంబానికి అన్నమయ్యగారే అండదండ అయ్యారు.

మల్లన్నగారి కర్మాంతరాలు ముగిసే దాకా కేసనశెట్టి టంగుటూరులోనే ఉన్నాడు. ఆమర్నాడు స్వస్థానానికి బయలు

చేరి కుమార్తెను రమ్మన్నాడు. ఆమె రానన్నది. తన జీవితశేషం మల్లన్నగారి భార్యనూ పిల్లలను సేవిస్తూ గడపుతానన్నది. తాను వారిని వదలిరానన్నది. కేసనశెట్టి చెప్పిచూచాడు. ఫలితం లేకపోయింది.

మల్లన్నగారి అత్తమామలచేత చెప్పించాడు. లాభంలేక పోయింది. ఈ పన్నెండు రోజులలోనూ మల్లన్నగారి భార్యకు మొల్లకు ఎంతో ఆప్యాయత పెరిగిపోయింది. మొల్ల ఆమెను ఆమె పిల్లలను అట్లా సేవించింది. మల్లన్నగారి పిల్లలు మొల్లను వదలిపెట్టడానికికూడా అంగీకరించలేదు.

కేసనశెట్టి తన బాధ అన్నమయ్యగారికి నివేదించాడు. ఆయన వచ్చి మొల్లను పిలచి విచారించారు. ఆమె అన్నమయ్యగారికి వివరంగా తన భావాలు మనవి చేసింది. తాను మల్లన్నగారిని ఆయన భార్యను శివపార్వతులలాగా ఆరాధించింది. మల్లన్నగారు తనకు పరమేశ్వరుడే. ఆయనకు తన సర్వస్వమూ అర్పణచేసింది. ఆయన భార్య తనకు అక్కగారు. సాక్షాత్తు పార్వతీదేవి. వీరిని సేవించిన శరీరంతో తాను అన్యజనసంగం వాంఛించుటలేదు. తన అక్కగారితోపాటు తానుకూడా ఐచ్ఛికవైధవ్యాన్ని అవలంబింప తలచుచున్నది. తనకు ఉన్నదేమైనా ఉంటే అది అంతా మల్లన్నగారి పిల్లలదే. తన మూలమున కదా వాళ్లు తండ్రిని పోగొట్టుకున్నారు!

అన్నమయ్యగారు ఆమెభక్తి తాత్పర్యాలకు సంతోషపడ్డారు. ఆయన మొల్ల విద్వాంసురాలని అనుకున్నారు గాని,

ఇంత మనస్వి అనీ, యోగ్యురాలు అనీ అనుకోలేదు. ఆమెను ఆయన ప్రశంసింపగా ఆమె ఆయనదగ్గర రామాయణాన్ని పూర్తిచేయాలని కోరికగా ఉన్నదన్నది. మల్లన్నగారు తనకు గాయత్రి రామాయణంవరకు పాఠం చెప్పినట్లు చెప్పింది.

అన్నమయ్యగారు అన్నారు కదా "అమ్మా! ఇక నీవు ఎవరి దగ్గరా చదువుకో నక్కరలేదు. నీకు రామాయణం స్వయంగానే అన్వయమౌతుంది. చదువుకో. మల్లన్నగారు చెప్పిన గాయత్రి రామాయణం నిత్యపారాయణం చేస్తూఉండు. అది నీకు సర్వా భీష్టప్రదాయి. నిన్ను ఉద్ధరించేది రామాయణమే." అన్నమయ్యగారి హితోపదేశం మొల్లకు నచ్చింది.

కేసనశెట్టి చేయగలిగిందిలేక కుమార్తెను టంగుటూరులో వదలిపెట్టి తానొక్కడే దుఃఖభారంతో గోపవరానికి తిరిగి వచ్చాడు. అతడు తిరిగి వచ్చేటప్పటికే అతని తోబుట్టువు మంచంపట్టి ఉన్నది. ఆమె పరిస్థితులు ఏమీ అర్థం కాలేదు. పెరుమాళ్లయ్య మల్లన్నగారిని ఎందుకు హత్యచేశాడో— ఎక్కడకు వెళ్లిపోయాడో ఆమెకు అర్థం కాలేదు. ఇదివరకు వెళ్లినప్పుడు మళ్లీ వస్తాడేమోనని ఆశ ఉన్నది. ఇప్పు డిక అటు వంటి ఆశ లేదు. ఎందుచేతనంటే తిరిగివస్తే రాజదండన తప్పదు. అందుచేత పెరుమాళ్లయ్య తిరిగి రానేరాడని ఆమె నిర్ధారించు కున్నది.

పెరుమాళ్లయ్య వెళ్లిన నాటినుండి ఆమె అన్నం ముట్ట లేదు. ఆమె విషయం పట్టించుకొనేవారు లేకపోయారు. కేసన

శెట్టి తిరిగివచ్చి మరణశయ్యమీద ఉన్న తోబుట్టువును చూచాడు.

20

పెరుమాళ్లయ్య ఏమైపోయాడో ఎవరికీ తెలియలేదు. అతనికోసం సేనాధిపతి ఈశ్వరనాయకుడు సైనికులను పంపించి గాలించాడు. కాని పెరుమాళ్లయ్య పత్తా తెలియలేదు. అతని మీద పగ ఉన్న నరసానాయకుడుకూడా రహస్యంగా గాలింపు చేశాడు. ఏమీ తెలియలేదు. అన్నమయ్యగారికి మాత్రం మల్లన్న గారి కుటుంబాన్ని చూచినప్పుడల్లా హృదయం తరుక్కు పోతూ ఉండేది. మల్లన్న గారికి నచ్చచెప్పి గోపవరం పంపించింది తనే కదా! ఈ భావం జ్ఞాపకానికి వచ్చినపుడల్లా అన్నమయ్య గారు దుఃఖాన్ని నిలువరించుకోలేక పోయేవారు.

ఈ శోకమువల్ల కలిగిన అశాంతినుండితప్పించుకోవడానికి అన్నమయ్యగారు తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనానికి వెళ్లారు. అన్నమయ్యగారు తిరుమలకు విజయంచేసినట్లు చంద్రగిరిరాజు సాళువ నరసింహరాయలుకి తెలిసినది. ఆయన కూడా తిరుమలకువచ్చి స్వామివారి దర్శనంచేసి అన్నమయ్య దగ్గరకు వచ్చాడు. అన్నమయ్యగారికి నమస్కరించి చంద్రగిరి వేంచేయమని కోరాడు.

సాళువ నరసింహరాయల ప్రార్థనను మన్నించి అన్న మయ్యగారు చంద్రగిరి విజయం చేశారు. అక్కడ కొన్నినాళ్లు

ఉండి తమకు దక్షిణదేశయాత్ర చెయ్యాలని అభిలాష కలిగిందని రాయలుతో చెప్పి బయలుదేరారు. సాళువ నరసింహరాయలు తనకుకూడా ఆ కోరిక ఉన్నదని తానుకూడ వస్తున్నానని అన్నాడు. చంద్రగిరి కోట రక్షణకు అవసరమైన సదుపాయము లన్నీ చేసి సముచితమైన పరివారముతో అన్నమయ్యగారి వెంట సాళువ నరసింహరాయలుకూడా దక్షిణదేశ యాత్రకు బయలుదేరాడు.

*　　*　　*

ఆనాడు గోపవరంనుంచి పరారి అయిన పెరుమాళ్లయ్య ఆలోచనలేకుండా ఆరోజల్లా స్వారీ చేశాడు. ఆ సాయంత్రానికి అతడు గుండ్లకమ్మ నదీతీరాన్ని చేరాడు. అక్కడ గుఱ్ఱానికి నీళ్ళుపెట్టి దానిని ఏటిగట్టుమీద మేతకు వదలి తాను పక్కగా ఉన్న పల్లెకుపోయి భోజనం సంపాదించుకున్నాడు. ఆరాత్రి అక్కడనే ఉండి బాగా ఆలోచించుకున్నాడు. అతనికి విషయం బాగా బోధపడింది. ఇక తాను చంద్రగిరి రాజ్యంలో ఉండలేడు. తన్ను రాజసైనికులు ప్రాణాలతో ఉండనివ్వరు. ఇక తాను వేరే రాజును శరణువేడవలసినదే. ఇట్లా ఆలోచించుకుని పెరుమా ళ్లయ్య ఉత్తరంగా వెళ్లిపోయాడు.

*　　*　　*

సాళువ నరసింహరాయలు రామేశ్వరం, కన్యాకుమారి, దర్భశయనం, శుచీంద్రం, మధుర మొదలైన పుణ్యక్షేత్రాలను దర్శించుకొని శ్రీరంగానికి చేరుకున్నాడు. సముచితమైన పరివార

మున్నది. పరివారానికి నాయకుడుగా తుళువ నరసానాయకుడు ఉన్నాడు.

అన్నమయ్యగారు ముందుగానే తిరుమలకు తిరిగి వచ్చారు. ఆ ఉదయం ఆయన తిరుమలలో శ్రీస్వామివారి దర్శనం చేసుకుని టంగుటూరు బయలుదేరవలసి ఉన్నది. ఆయన వెంటఉండే దేవతార్చన ఇతర సామగ్రి ఇద్దరు బ్రాహ్మణపరిచారకులు మోసుకొని కొండక్రింద బండిలోవేసికొని బయలుదేరారు. వాళ్లు తెల్లవారు ఝామునే బయలుదేరినారు. అనుకున్నప్రకారం వాళ్లు ముందుగా మామండూరుచేరుకుని అక్కడ వసతిచూచి, వంటచేస్తూ ఉంటే వెనుక అన్నమయ్యగారు వస్తామన్నారు. అన్నమయ్యగారి వెంట మరొక పరిచారకుడు కూడా ఉన్నాడు.

ముందుగా రెండెడ్ల బండిలో బయలుదేరిన పరిచారకులు జాము ప్రొద్దెక్కేటప్పటికి రోదిస్తూ అన్నమయ్యగారికి ఎదురు వచ్చారు. ఆయన్ను చూడగానే వీళ్లు బావురుమంటూ ఆయన పాదాలమీద పడ్డారు. ఆయన వాళ్లను సముదాయించి ఏమిటిసంగతని ప్రశ్నించారు. వాళ్లు తమ వృత్తాంతాన్ని చెప్పారు.

తమ బండి అడ్డత్రోవను పోతూఉండగా సూర్యోదయం అయిన రెండు ఘడియలకు ఒక తురకలదండు వీళ్లకు ఎదురు పడిందట. వాళ్లు బండికి అడ్డంగా నిలిచారుట. ఆదండులో ఇరవై మందిదాకా ఉన్నారుట. వాళ్లు కత్తులుదూసి ఉన్నారుట. విధి

లేక తాము బండి ఆపారుట. వాళ్లు బండిని చుట్టుముట్టి తమ రిద్దరినీ క్రిందకులాగి, దెబ్బలుకొట్టి బాటప్రక్కకు తోసి వేశారుట. వాళ్లు బండిని దానిలోఉన్న సామానుతో సహా తోలుకు పోయారట.

ఈ వార్తలు వినగా అన్నమయ్యగారికి మనస్సు పని చెయ్యలేదు. అశనిపాతము జరిగినప్పుడు ఉండేటట్లుగా స్తబ్ధత వీర్పడింది. ఆయనను మహాదుఃఖం వచ్చింది. బండి ఎడ్లు పోయినందుకు గాని అందులో సామాను పోయినందుకుగాని ఆయనకు దుఃఖము కలుగలేదు. ఆయన నిత్యము అర్చన చేసుకుంటున్న దేవతార్చన కూడ పోయినందుకు ఆయన దుఃఖపడ్డాడు. తనకు ప్రాణప్రదమైన దేవతావిగ్రహములు పోగా తన ప్రాణము లెట్లా నిలచి ఉన్నాయని ఆయనకు అంత దుఃఖములోను ఆశ్చర్యము కలిగింది.

అన్నమయ్యగారు ఏమి తోచక అక్కడనే చెట్టుక్రింద కూలబడిపోయాడు. కొంతసేపు కుమిలికుమిలి దుఃఖించాడు. ఆ దుఃఖంలో మగతవచ్చినట్లుగా అయింది. అందులో ఆంజనేయ స్వామి దర్శనం లభించినట్లుగా అయింది. అక్కడనుంచి మామం డూరు పోయేత్రోవలో అడవిదారిని ఒక ఆంజనేయ ఆలయం ఉన్నది. అది చిన్న ఆలయం అయినా ఆప్రాంతంలో ఎక్కువ ప్రశస్తి కలిగిఉన్నది. దర్శనం ఇచ్చిన ఆంజనేయస్వామి తన్ను ఆ ఆలయం దగ్గరకు రమ్మన్నట్లుగా అన్నమయ్యగారికి స్ఫురించింది

అప్పు డాయన లేచి ఆలయందికుక్కగా ప్రయాణం సాగించాడు. "ఇందిరారమణునితెచ్చి మాకియ్యవో - ఆయనను పూజింప పొద్దాయెనని" ఆంజనేయుని గురించి సంకీర్తనచేస్తూ ఉత్సాహంతో ముందుకు నడిచారు. మైరావణునిదండించి నేరుపుమీరగ రాముని తెచ్చినవాడట ఆంజనేయుడు.

లంకలో యుద్ధంలో రామలక్ష్మణులు నాగపాశాలతో బంధితులు కాగా గరుడుని తెక్కల చప్పుడుకే ఆపాశాలు విడి పోయినవట. గరుడుడు అంత గొప్పవాడు. బంధింపబడిన తన స్వామిని తెచ్చినివ్వమని అన్నమయ్యగారు గరుడుని ప్రార్థించారు.

సర్వమయుడైన హరిని సర్వోత్తుడుగా దేవతలు కూడ దర్శించలేనప్పుడు ప్రహ్లాదుడు నారసింహుని స్తంభములో చూపించినవాడు. తన స్వామిని తనకు చూపింపమని అన్నమయ్య గారు ప్రహ్లాదుని ప్రార్థించారు.

తనకు సఖుడు, గురువు అయిన శ్రీకృష్ణునిమూర్తిలో విరాడ్రూపాన్ని దర్శించిన మహనీయుడు అర్జునుడు. తన స్వామి దర్శనం తనకు కలిగించమని అన్నమయ్యగారు అర్జునుణ్ణి ప్రార్థించారు.

శ్రీవేంకటాచలమున క్షేత్రపాలకుడుగా ఉన్న కార్తవీర్యార్జునుని ప్రార్థించి తన దేవతార్చన విగ్రహములను పాలించి తెచ్చిపెట్టమన్నారు.

ఈ విధంగా సంకీర్తనలుచేస్తూ అన్నమయ్యగారు ఆంజనేయ దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ చేరుకోగానే వారికి పరమాశ్చర్యం వేసింది. ఆలయానికి ముందుగా తమ దేవతార్చన విగ్రహాలన్నీ చిందరవందరగా నేలమీద చిమ్మబడి ఉన్నాయి. అని ఉంచబడిన పెట్టె ప్రక్కనే పడిఉన్నది. మిగిలిన సామానుగాని, బండిగాని, ఎడ్లుగాని లేవు.

అక్కడ నేలమీద ఉన్న గుర్తులనుబట్టి బండిని అక్కడ కొంచెంసేపు నిలపి ఉంచారని తోచింది. తురుష్కుల దండు వాళ్లు బండిని అక్కడనిలపి సామాను తనిఖీ చేసుకున్నారన్న మాట. ఈ దేవతావిగ్రహాలు పనికిరానివని అక్కడ పారేసినట్లున్నారు. వాళ్లు చుట్టుప్రక్కల గ్రామాలలో కొల్లగొట్టి తెచ్చుకున్న ధనం కూడా ఆ బండిలోపెట్టుకుని ప్రయాణంచేసినట్లుగా ఉన్నదని అక్కడ విసర్జించబడిన వాటినిబట్టి అన్నమయ్యగారు గ్రహించారు.

తమ దేవతావిగ్రహాలు తిరిగి లభించినందుకు అన్నమయ్యగారు అపరిమితానందం పొందారు. అక్కడనే పారిదగ్గర స్నానంచేసి, ఆ అడవిలో లభించిన పదార్థాలతో దేవతార్చన చేసి బయలుదేరారు.

త్రోవలో ఆయన చూచిన దృశ్యములు హృదయవిదారకంగా ఉన్నాయి. గ్రామాలలో తుటుమునైన తుండెములు మొండములు. అంగభంగము పొందిన అంగనల అంగలార్పులు. పదులుగా నూర్లుగా గోహత్యలు. పడగొట్టబడిన దేవతామందిర

ములు. ఎక్కడ చూచినా శవములు. స్త్రీల, బిడ్డల రోదనములు. తిండి గింజలు కూడ మిగల్చలేదని గ్రామములవారి ఆక్రందనలు. వారు చెయ్యని పనిలేదు. సుఖముగా నిలచిన గృహము లేదు.

దుర్భరవిషాద సన్నివేశములను చూస్తూ-పరమకరుణా మయమైన గాథలనువింటూ అన్నమయ్యగారు టంగుటూరు వచ్చి చేరుకున్నాడు. ఆయన వెంటఉన్న పరిచారకులకు ఆయనకు మాత్రమొక తృప్తిమాత్రము మిగిలినది. అన్నమయ్యగారి దేవతార్చన విగ్రహములన్ని మాత్రము తిరిగి దొరకినాయి. ఇది చాల అదృష్టము. అడవిలో ఆంజనేయమందిరము చాల చిన్నది. అది ఆంజనేయమందిరమని క్రొత్తవాళ్లకు తెలియదు. అందు చేత దానిని తురుష్కులు ముట్టనట్టులేదు. అది సాధారణంగా శనివారమునాడు మాత్రమే తెరువబడి ఉంటుంది. ఇది కూడా వాళ్లకు తృప్తికలిగించింది.

శ్రీరంగనాథుని దర్శించుకొని కావేరి నదీతీరంలో తీర్థ కర్మ విశేషాలు జరుపుతుండగా చంద్రగిరినుంచి ఈశ్వర నాయకుడు పంపిన దూతవచ్చి చేరుకున్నాడు. అతడు చాలా అప్రియమైన వార్త తెచ్చాడు.

ఈశ్వర నాయకుడు టంగుటూరులో రాణువను చూడటానికి వెళ్లి అక్కడ ఉండగా అకస్మాత్తుగా అతనికి - జబ్బు చేసినట. అమితమైన చలిజ్వరం వచ్చి కదలలేక పోయినాడట. ఆ రుగ్మతవలన మూడువారాలు టంగుటూరులో ఉండిపోవలసి వచ్చినదట. ఆసమయంలో ఉత్తరమునుంచి బహ్మనీసుల్తాను సేనలు

తండోపతండాలుగా వచ్చినవట. ఆ సైనికులు మొదట కాంచీ పురాన్ని కొల్లగొట్టి దోచుకున్నారట. తరువాత చంద్రగిరివచ్చి నానాభీభత్సం చేశారుట. ఆ సైనికులకు పెరుమాళ్లయ్య నాయకుడుగా ఉన్నాడట. పెరుమాళ్లయ్యకు యీప్రాంతం అతి పరిచయమైనది కావడంమూలాన, అతనికి చంద్రగిరి కోటయొక్క రహస్య ద్వారములన్నీ తెలిసిఉండటం మూలాన ఈ తురుష్క సైనికులు తేలికగా కోటలో ప్రవేశింపగలిగారుట.

ఇప్పుడు పెరుమాళ్లయ్య మామూలుగా లేడట. తురుష్కమతం పుచ్చుకుని మొహమ్మద్ రజాక్ అయినాడట. ఇదివరకే అతడు మహాసాహసికుడు. ఇప్పుడు మరింత మతావేశం. ఇప్పుడు అతనికి మద్యం నిరంతర సేవ్యంగా ఉన్నదట. పూర్వం అతనికి అలవాటు లేదు.

తురుష్కసైనికులు ధనాన్ని దోచుకోవడంతో తృప్తి పడక స్త్రీల మానభంగాలు చేశారుట. ఈ దుష్కార్యానికి పెరుమాళ్లయ్యదే పైచెయ్యి అట. కొంతమంది స్త్రీలను అపహరించి వెంటతీసుకొని పోయారుట. చంద్రగిరి పట్టణం అంతా కాంతిహీనమై పీనుగు పెంటలతో, అవమానింపబడిన స్త్రీల రోదనములతో ఉన్నదట.

చంద్రగిరినుంచి పెరుమాళ్లయ్య గ్రామాలను కొల్లగొట్టుతూ గోపవరానికి సేనలను తరలించుకు పోయాడట. అక్కడ కేసనశెట్టిని వధించి అతని శిరస్సునుమోద నిలబడి పిశాచతాండవంచేసి వికటాట్టహాసాలతో చిందులు త్రొక్కాడుట.

కేసనశెట్టి కుమార్తెను అపహరించి తీసుకొని పోవాలని గోప వరంలో ఉన్న ప్రతి ఇల్లూ వెదకినాడట. ఆమె కనుపించకపోయి నందువలన ఉగ్రుడై కనుపించిన వారందరినీ నరకినాడట. పూర్వం తనకు అనుచరులుగా ఉన్నవారినిగాని వాళ్ల కుటుం బాల వారిని గాని వదలిపెట్టలేదట. తన పూర్వపరిచితులనే ఎక్కువగా హింసించాడట. వాళ్ల స్త్రీలకే ఎక్కువ మాన భంగాలు జరిగినవట.

ఈవార్తలు సాళువ నరసింహరాయలకు, తుళువ నరసా నాయకునకు ఆవేదన కలిగించాయి. సాళువ నరసింహరాయలు ఆ వార్తలను విన్నతరువాత ఆగలేక పోయాడు. హటాత్తుగా చంద్రగిరి వచ్చిచేరాడు.

21

దక్షిణభారతదేశంలో మహమ్మదుబిన్ తుగ్లక్ మహమ్మదీయ పరిపాలన నెలకొల్పిన తరువాత దక్షిణప్రాంతమునందు తురు ష్కుల ప్రాభవము పెరుగజొచ్చినది. దౌలతాబాదు రాజధా నిగా హసన్ గంగు స్థాపించిన బహ్మనీరాజ్యము విస్తరించుట ప్రారంభించినది. బహ్మనీరాజ్యాన్ని పరిపాలించిన సుల్తానులలో ముమ్మడి మహమ్మదుషాహు దక్కువాడైనవాడు. ఇతని తండ్రి హుమ యూన్‌షాహు కాలమున కపిలేశ్వరగజపతి బహ్మనీరాజ్యము నుండి తెలంగాణాప్రాంతాన్ని గెలుచుకున్నాడు. ఇతడు కపిలే

శ్వరగజపతి కుమారుడైన పురుషో త్తమగజపతినుండి మరల తెలంగాణా ప్రాంతాన్ని మాత్రమేకాక తీరస్థ ఆంధ్రదేశాన్ని కూడ ఆక్రమించుకున్నాడు. బహ్మనీరాజ్యముయొక్క పొలిమేరలను పూర్వపశ్చిమసముద్రాలకి తాకించాడు.

రాజమహేంద్రవర దుర్గానికి ఒక మహమ్మదీయుడ్ని కొండపల్లి దుర్గానికి మరొక మహమ్మదీయున్ని అధిపతులుగా నియమించి కట్టుబాట్లు చేశాడు తరువాత కొంతకాలానికి గజపతుల మద్దతుతో కొండవీటుదుర్గము తిరుగుబాటుచేయగా ప్రబలమైన సేనలతోవచ్చి గజపతిని తరిమికొట్టి ధనరాసులు దోచుకుని మళ్లీ కొండవీటిదుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. కొండవీటికోటలో ఉన్న గొప్పదేవాలయాన్ని పడగొట్టి అక్కడ మసీదును కట్టించాడు. అక్కడ దేవాలయంలో పూజారి బ్రాహ్మణుని తన చేతిమీదుగా నరికించంపి ఖాజీ అనే బిరుదు వహించాడు. తెలుగుదేశాన్ని రెండు విభాగాలు చేశాడు, ఒక ప్రాంతానికి రాజమహేంద్రవరము ముఖ్యస్థాన ముగా ఉంచి, రెండవ ప్రాంతానికి ఓరుగల్లును ముఖ్యస్థాన ముగా చేశాడు. నిజాము ఉల్ముల్క్ ఖైరీ అనేవారిని ఒక ప్రాంతానికి అజీముఖాన్ అనేవారిని, ఇంకో ప్రాంతానికి అధిపతులుగా చేశాడు.

కొండవీటిలో తిరుగుబాటుకు చంద్రగిరిరాజు సాళువ నరసింహరాయలుకూడా మద్దతు ఇచ్చిఉంటాడని మహమ్మదు శాహు అభిప్రాయపడ్డాడు. అందుచేత అతన్ని శిక్షించే అవ

కాళంకోసం వేచియున్నాడు ఇటువంటి పరిస్థితులలో పెరుమా
ళ్ళయ్యవచ్చి అతడి దర్శనంచేశాడు. వెలుకుతున్న తీగ కాలికి
తగిలినట్లుగా అయింది. పెరుమాళ్ళయ్యను విశ్వసించవచ్చునా
లేదా అని అతడు పరిక్షించాడు. పెరుమాళ్ళయ్య తన్ంతట
తనే మహమ్మదీయమతము పుచ్చుకుంటానన్నాడు. సుల్తానికి
అతడిమీద నమ్మకం పెరిగిపోయింది.

తేలికగా పెరుమాళ్ళయ్య మహావీరుడని సుల్తాను గ్రహిం
చాడు. పెరుమాళ్ళయ్య చెప్పకపోయినా ఏదో పెద్దకారణము
ఉండి అతడు చంద్రగిరి రాజ్యంమీద కక్ష్యగట్టి ఉన్నాడని,
పగపట్టి ఉన్నాడని సుల్తాను గ్రహించాడు. తన శత్రువుమీద
అమితమైన పగ ఉన్నవాడ్నికదా నమ్మవలసింది? మహమ్మదీ
యుడై మహమ్మదురజాక్ అయిన పెరుమాళ్ళయ్యను సుల్తాను
ముఖ్య దండనాథుడుగా నియమించాడు. ఈ క్రొత్తగావచ్చిన
పదవితో మహమ్మదురజాక్ గర్వాంధకారం పదింతలైయింది.
అతనికి చంద్రగిరి సైన్యంలో లేని స్వేచ్ఛ ఇక్కడ లభించింది.
సదా మద్యము, మదవతి అతనికి కావలసివచ్చాయి.

దక్షిణప్రాంతమంతా మహమ్మదురజాక్ పెరుమాళ్ళయ్య
బాగా ఎరిగిఉన్నదగుటచేత తురుష్కసైన్యాలు తేలికగా
ముందుకు వచ్చాయి. మహమ్మదురజాక్ పెరుమాళ్ళయ్య అడవి
క్రోవలలో దగ్గరక్రోవలలో సేనల్ని శీఘ్రగమనం చేయిం
చాడు. సుల్తాను అవృష్టంకొద్ది సాళువ నరసింహరాయలు తీర్థ
యాత్రలో ఉన్నాడు. సేనాధిపతి ఈశ్వరనాయకుడు టంగు
టూరులో జబ్బుపడి ఉన్నాడు.

తురుష్క-సేనలకు అడ్డులేకపోయింది. స్వేచ్ఛావిహారం చేశారు తురుష్కులు. అపారధనరాసులు కొల్లగొట్టారు. గ్రామ గ్రామాన్ని దోచుకున్నారు అతి అమానుషంగా ప్రవర్తించారు. ఈ అన్ని అక్రమకార్యాలలోను నాయకుడు మహమ్మదరజాక్ పెరుమాళ్లయే. అతని రాక్షసత్వానికి పైశాచిక ఘాతుకచర్యలకు అవధులు లేకుండా పోయాయి. చంద్రగిరిని కొల్లగొట్టి గోపవరాన్ని దోచుకుని తురుష్క-సేనలు విజయ గర్వాంధకారంతో ముందుకుపోతున్నాయి.

తీర్థయాత్రలనుంచి హుటాహుటీ సాళువ నరసింహరాయలు తిరిగివచ్చిననాటికి ముందునాడే ఈశ్వరనాయకుడు టంగుటూరునుంచి తిరిగివచ్చాడు. ఆ రాత్రి మంతనాలు జరిగాయి. తెల్లవారేటప్పటికి సాళువ నరసింహరాయలు అమిత మైన బలాన్ని సమీకరించుకొని బయలుదేరాడు. తుళువ ఈశ్వరనాయకుడు, అతని కుమారుడు నరసానాయకుడు ఆశ్విక పదాతి దళాలకు నాయకత్వం వహించారు. తురుష్క-సేనల చేతులలో అమానుష చర్యలకు గురి అయిన ప్రజలంతా క్రుద్ధులై పగబట్టి సాళువ నరసింహరాయల ఫవుజులో చేరారు.

ఈ విముక్తి సేనల ఉత్సాహానికి మేరలేకపోయింది. వీరంతాపరమోత్సాహం ఉరకలు వేస్తుండగా అతివేగంతో ప్రయాణించారు. కందుకూరు దగ్గర అడవులలో విడిదిచేసి యున్న తురుష్క-సేనలపైన సాళువ నరసింహరాయలు ఫవుజు అకస్మాత్తుగా వచ్చిపడింది. తురుష్కులు యుద్ధాలు సేవించి

ప్రమత్తులై ఉన్నారు. వాళ్లకు ఆయుధాలు చేతబట్టుకునే అవకాశంకూడ లభించలేదు. ఈశ్వరనాయకుడు ప్రళయకాల రుద్రునివలె విజృంభించాడు. వీరవిహారం చేశాడు.

నరసానాయకుడు వచ్చినప్పటినుంచీ పెరుమాళ్లయ్య కోసమే వెతికాడు. దండనాథుడైన పెరుమాళ్లయ్య గుడారం తేలికగానే కనపడింది. బయట జరుగుతున్న కల్లోలము పెరుమాళ్లయ్య మత్తును వదిలించలేదు. అతడు మదవతుల మధ్యలో కూర్చుండి మద్యపానలోలుడై ఉన్నాడు. నరసానాయకుడు నలుగురు సైనికులతో పెరుమాళ్లయ్య గుడారాన్ని ప్రవేశించగా మదవతులు చెల్లాచెదరు అయ్యారు. నరసానాయకుడు లంఘించి పెరుమాళ్లయ్య శిరస్సును తన ఎడమ కాలితో తన్నాడు. ఆ దెబ్బకు పెరుమాళ్లయ్య క్రిందపడగా నరసానాయకుడు అతడిపైకి ఎక్కి పొడిచిచంపాడు. అతని శవాన్ని బల్లానికి గ్రుచ్చి బయటకు తెచ్చాడు. దానిని చూచి సాళువ నరసింహరాయల సేనాజనం ఉత్సాహంతో జయ జయ ధ్వానాలు చేసింది.

అన్నమయ్యగారి దగ్గర విద్యాభ్యాసం చేయడానికి అనేకమంది విద్యార్థులు వస్తూ ఉండేవారు. వచ్చినవాళ్లకు ఆయన అన్నముపెట్టి విద్య చెప్పేవారు. ఆయన టంగుటూరులో ఉన్నా తాళ్లపాకలో ఉన్నా, తిరుమలలో ఉన్నా,

చంద్రగిరిలో ఉన్నా విద్యార్థులవెంట ఉండేవారు. ఆయనదగ్గర సంస్కృతసాహిత్యాలంకారాలు అధ్యయనం చేసినవాళ్లలో ఆయనకు బంధువైన పెద్దన్న ముఖ్యుడు. పెద్దన్నది కోకట గ్రామం. అన్నమయ్యగారికి వేలువిడిచిన మేనమామ కొడుకు. అన్నమయ్యగారి కీర్తి ప్రఖ్యాతులు పాండిత్య ప్రాభవాలు దేశంలో విస్తరించిపోగా పెద్దన్న తండ్రి తన కుమారుని అన్నమయ్యగారివద్ద విద్యాభ్యాసమునకు పంపించాడు. పెద్దన్న చురుకుతనము ప్రజ్ఞ అన్నమయ్యగారి మెప్పుదల గడించాయి. తనదగ్గిర పెద్దన్న సాహిత్యాలంకారాలు పూర్తిచేయగా అన్నమయ్యగారు తనని విశిష్టాద్వైత దర్శనము అధ్యయనము చేయమని తమ గురువులైన శఠగోపయతీంద్రులవారి దగ్గరకు పంపించారు.

అన్నమయ్యగారు చంద్రగిరిలో ఉండగా సాళువ నరసింహరాయల దగ్గర మంత్రిగా ఉన్న నాదెండ్ల చినగంగ నామాత్యునితో స్నేహం కలిసింది. ఆ స్నేహం రానురాను అభివృద్ధి పొందింది. నాదెండ్ల చినగంగనామాత్యుని అన్న మనుమడు తిమ్మరాజు. అతడుకూడ చంద్రగిరిలో రాజోద్యోగిగా ఉన్నాడు. అతని మామగారు సాళ్వ బొచిరాజు. నాదెండ్ల తిమ్మరాజునకు సాళ్వ బొచిరాజు మేనమామ కూడ. బొచిరాజుగారిది కొండవీటి ప్రాంతము. అక్కడ పరిస్థితులు కల్లోలమయంగా ఉండటంవలన అతడు తన బంధుజనం ఎక్కువగా ఉన్న చంద్రగిరికి చేరాడు. బొచిరాజుగారికి నాదెండ్ల తిమ్మ

రాజుకిచ్చిన కుమార్తెగాక ఇంకొకరు లిద్దరున్నారు. వాళ్లు తిమ్మ రాజు, గోవిందరాజు.

బాచిరాజుగారు చంద్రగిరికి కుటుంబాన్ని తరలించుకుని వచ్చిన కొలది కాలానికే మరణించడం జరిగింది. తరువాత కొద్ది నెలలకే ఆయన భార్య కూడ దివంగతురాలైయింది. తిమ్మరాజు, గోవిందరాజు ఆశ్రయంలేని వాళ్లయ్యారు. వీళ్లిద్దరిని పోషించ గల స్తోమతు చిన్న రాజకీయ ఉద్యోగి అయిన బావగారికి లేకపోయింది. తిమ్మరాజు, గోవిందరాజు నానాకష్టాలు పడ్డారు. మాధుకరవృత్తిచేసి బ్రతుకుతూ ఉండవలసివచ్చింది.

అట్టి పరిస్థితులలో అన్నమయ్యగారికి వాళ్లను గురించి తెలిసింది. వాళ్లిద్దరూ బుద్ధిమంతులు వినయం కలవారు. వాళ్లిద్ద రినీ తాము చేరదీయటానికి అన్నమయ్యగారు భావించారు. అయితే తాము చంద్రగిరిలో ఎక్కువ కాలం ఉండరు కదా! అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉంటారు. కాని వాళ్లిద్దరూ చంద్ర గిరిని వదలిపెట్టి రావడానికి ఇష్టపడలేదు. అన్నమయ్యగారికి అభిమానం కలిగి సాళువ నరసింహరాయలుతో చెప్పాడు. ఆయన వాళ్లకు రాయల ధర్మసత్రంలో భోజనం ఏర్పాటు చేశారు.

తిమ్మరాజు, గోవిందరాజు తండ్రి బాచిరాజుగారి దగ్గరనే సంస్కృతసాహిత్యం పూర్తి చేశారు. అప్పుడప్పుడు వస్తూ పోతూ ఉన్న అన్నమయ్యగారివద్ద అలంకారశాస్త్రాన్ని పూర్తి చేశారు. అన్నమయ్యగారికి తిమ్మరాజుయొక్క ప్రజ్ఞ విషయ

గ్రహణతీవ్రత, కుశాగ్రబుద్ధి, వినయము, సుగుణసంపత్తి, పెద్దల యందు భక్తివిశ్వాసాలు మొదలైన గుణాలు ఆహ్లాదపరిచాయి.

అన్నమయ్యగారి దగ్గరకు చంద్రగిరిలో తిమ్మరాజు, గోవిందరాజువచ్చి చదువుకుంటూ ఉన్నప్పుడు తుళువ నరసానాయకుడు కూడ రావడం జరిగింది. అతనికి కూడా తిమ్మరాజు మీద ఆదరణ కలిగింది. అతడు అతిలోకమేధాసంపత్తి కలవాడనీ, వినయసంపత్తి కలవాడనీ, విశ్వసింపతగినవాడనీ గ్రహించాడు. అతనికి ఉన్న సద్భావాన్ని గ్రహించి అన్నమయ్యగారు కూడా తిమ్మరాజునుగురించి ప్రశంసించారు. ఆశ్రయం లేకుండా ఉన్న ఈ బాలకుల్ని ఆదరించి పైకి తీసుకు రమ్మని కోరారు.

తిమ్మరాజును చూసిన వేళావిశేషము ఎట్టిదో గాని తుళువ నరసానాయకునికి అతనిమీద భ్రాతృనిర్విశేషమైన అనురాగవాత్సల్యాలు కలిగాయి. ప్రతిదినం తిమ్మరాజు, గోవింద రాజుల యోగక్షేమాలు విచారిస్తూ ఉండేవాడు. అలంకార శాస్త్రము ముగింపు కాగా అన్నమయ్యగారు తిమ్మరాజుతో రాజనీతిశాస్త్రము, అర్థశాస్త్రము మొదలైనవి అధ్యయనం చేయమన్నారు.

ఆ శాస్త్రాలుగాని రాజకీయ నిర్వహణకు అవసరమైన మంత్రాంగాన్ని గురించిన యితర శాస్త్రాలుగాని పాఠం చెప్ప గలవాళ్ళు చంద్రగిరి ప్రాంతంలో లేరు. అన్నమయ్యగారికి స్నేహితు డొకడు ఇటువంటి శాస్త్రాలలో దిట్ట ఉన్నాడు. ఆయన అప్పటికే వృద్ధుడు. నీతిశాస్త్రవిశారదుడని రాజనీతి

తంత్రజ్ఞుడని దేశఖ్యాతిపొందిన చిట్టి గంగనామాత్యు డాయన. అన్నమయ్యగారి ప్రోద్బలంతో లేఖతో తిమ్మరాజు, గోవిందరాజు చిట్టి గంగనామాత్యుని దగ్గరకు విద్యాభ్యాసానికి వెళ్లారు. తిమ్మరాజును ప్రాణప్రదంగా చూచుకుంటున్న తుళువ నరసా నాయకుడు వాళ్ల విద్యాభ్యాసానికి కావలసిన అన్నిసౌకర్యాలు చేశాడు.

23

విద్యారణ్యస్వాములవారి అనుగ్రహంతో స్థాపించబడిన విజయనగరసామ్రాజ్యం హరిహర బుక్కరాయల కాలంలోనే ప్రాక్‌పశ్చిమ సముద్రతీరాలను చేరుకున్నది. తరువాత సమర్థులైన సంగవంశపురాజుల కాలంలో విస్తరించింది. చంద్రగిరి రాజులు విజయనగరచక్రవర్తులకు సామంతరాజులే. సాళువ నరసింహరాయలు చంద్రగిరిరాజుగా ఉండగా విజయనగర చక్రవర్తిగా ఉన్నవాడు విరూపాక్షరాయలు.

అంతకు ముందు చక్రవర్తిగా ఉన్నవాడు మల్లికార్జున రాయలు. విరూపాక్షరాయలు మల్లికార్జునరాయలకు పినతండ్రి కుమారుడు. ఇతని తండ్రి ప్రతాపదేవరాయలు. తల్లి సింహళ దేవి. మల్లికార్జునరాయలు కుమారుడయిన రాజశేఖరరాయలను మోసముచేసి సింహాసనమును విరూపాక్షరాయలు కాజేసాడు. త్వరలోనే ఇతడు వారకామినీజనలోలుడై సురాపానప్రియుడై రాజకార్యములను పట్టించుకోలేదు. దండనాథులకు దర్శన మిచ్చుట కయినా సిద్ధపడలేదు.

ఇతని అసమర్థతను గుర్తించి ఉత్తరమున ఓఢ్రగజపతులు ఒక ప్రక్కనుంచి మహమ్మదీయులు వేరొక ప్రక్కనుంచి రాజ్యాన్ని ఆక్రమించుకో మొదలు పెట్టారు. విరూపాక్ష రాయల కాలము నాటికే పశ్చిమ సముద్రతీరమునందున్న గోవా గొప్ప వర్తకస్థానంగా ఉండేది. అక్కడ మూరులనే విదేశీయ వర్తకు లుండేవారు. వాళ్ళు అరబ్బీ దేశాలనుండి మంచి గుఱ్ఱాలను తెచ్చి బహ్మనీ సుల్తానులకు విజయనగరచక్రవర్తులకు అమ్ముతూ ఉండేవారు. విరూపాక్ష రాయల కాలము వచ్చేటప్పటికి మూర్లు యొందుచేతనో విజయనగరచక్రవర్తులకు గుఱ్ఱాలను అమ్మటకు నిరాకరించారు.

విరూపాక్ష రాయలకు మూర్లమీద విపరీతమైన కోపము వచ్చింది. క్రుద్ధుడైనాడు. గోవానగరంలో వుంటున్న పదివేల మందిమూర్లను వధించుటకు విరూపాక్ష రాయలు ఆజ్ఞాపించాడు. ఈ ఘోరవృత్తాంతము బహ్మనీసుల్తాను ముష్కడి మహమ్మద్ శాహుకు తెలిసింది. ఆ దారుణ వృత్తాంతము విని అతడు సహించలేకపోయాడు. సేనలను పంపించి బహ్మనీసుల్తాను గోవా నగరాన్ని స్వాధీనము చేసుకొన్నాడు. విరూపాక్ష రాయలు మళ్లీ గోవానగరాన్ని స్వాధీనపరచుకోడానికి ప్రయత్నించాడు కాని బహ్మనీసుల్తాను సేనల ముందు విరూపాక్ష రాయల సేనలు నిలువలేకపోయినవి.

విజయనగరసామ్రాజ్యంలో పశ్చిమతీరాన ముఖ్యమయిన గోవాప్రాంతము శత్రుహస్తములకు చిక్కిపోయి దానిని విజయ

నగరచక్రవర్తులు మళ్లీ స్వాధీనపరచుకోలేనప్పుడు చిన్నచిన్న సామంతులకు ధైర్యోత్సాహాలు కలిగి స్వేచ్ఛావాంఛలు ప్రబలి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు.

విషయాసక్తుడై అసమర్థుడై ప్రజలకు సేనాపతులకు అప్రియుడయి పరిపాలిస్తున్న విరూపాక్షరాయలను అతని పెద్ద కుమారుడు చంపి తన తమ్ముడైన ప్రౌఢరాయలను నామమాత్ర నికి చక్రవర్తిని చేశాడు. తన అన్నవలన యేనాటికయిన ముప్పు తప్పదని భావించి ప్రౌఢరాయలు అన్నను చంపాడు. అటువంటి పరిస్థితులలో సామంతరాజులు తిరుగుబాటు చేశారు. రాజ్యో ద్యోగులెవ్వరు రాజవంశముమీద భక్తి చూపించలేదు. అంతా పితృహంతలు భ్రాతృహంతలు అయిన వంశాన్ని అస హ్యించుకున్నారు.

విజయనగరంలో అల్లకల్లోలం జరుగుతుండగా అన్న మయ్యగారు చంద్రగిరిలో ఉన్నారు. అప్పటికి తుళువ ఈశ్వర నాయకుడు గతించి నరసానాయకుడు సర్వసేనాధిపతిగా ఉన్నాడు. విజయనగర పరిస్థితులను గమనించిన నరసానాయకుడు అన్నమయ్యగారు సాళువ నరసింహరాయలను ప్రోత్సాహపరి చారు. విజయనగరసామ్రాజ్యము నశించిపోతే దక్షిణ భార తంలో మహమ్మదీయుల ప్రాభవం పెరిగిపోతుంది అప్పుడు భార తీయ సంస్కృతి భారతీయ సనాతనమతము దక్షిణ భారతంనుంచి కూడ అదృశ్యము అవుతాయి. కాబట్టి విజయనగరసామ్రా జ్యాన్ని రక్షించుకోవాలి. అంతేగాకుండ రాజ్యము వీరభోజ్య మైనది.

ఈ భావాలు వీరవరేణ్యుడైన సాళువ నరసింహరాయలకు ఉత్సాహము కలిగించినవి. అతడు స్వాతంత్ర్యాన్ని అవలంబించి మహాబలాలను సమకూర్చుకొని విద్యానగరాన్ని స్వాధీనము చేసుకొని విజయనగరసామ్రాజ్య చక్రవర్తి అయ్యాడు.

సాళువ నరసింహరాయలు విజయనగరసామ్రాజ్యాధీశుడయినప్పటికి అన్నమయ్యగారిని మరచిపోలేదు. సామ్రాజ్యంలో కొంత శాంతి స్థిరపడిన తరువాత నరసింహరాయలు విశ్రాంతి తీసుకోవడానికి పెనుగొండ వచ్చాడు. అప్పుడు అన్నమయ్యగారు ఉంటే కాలక్షేపము బాగా అవుతుందని అనుకున్నాడు. ఆసమయంలో తిరుమలలో ఉంటున్న అన్నమయ్యగారికోసం పరివారాన్నిపంపి ఆహ్వానించాడు.

అన్నమయ్యగారికి సాళువ నరసింహరాయలు సకల రాజమర్యాదలతోను స్వాగతానుచెప్పి పెనుగొండలో వసతి సౌకర్యాలు చేశాడు. అన్నమయ్యగారిని రాయలు సంకీర్తనము వినిపింపవేడగా అన్నమయ్యగారు మనోహరంగా పాడి వినిపించాడు. ఆయన పాటలలో తియ్యదనము తేనెలపై తేటవలె తిన్నని చెఱకు పానకముల వేరు పరచిన మేలు చక్కెరలోని తీపివలె చల్ల తెమ్మెరలవలె చిక్కని కర్పూరంబు జీవరత్నంవలె అమృతంమ్రోది చవులవలె ఉన్నదట.

అన్నమయ్యగారి పాటలు విని సాళువ నరసింహరాయలు ఆనందపరవశుడై సత్కరించాడు. పచ్చల కడియాలు మొదలుగా చాల ఆభరణాలు సమర్పించాడు. ఎన్నో అగ్రహారాలిచ్చాడు.

చాలదినాలు అన్నమయ్యగారిని పెనుకొండలో ఉంచుకొని మహాగౌరవాలు చేశాడు. పూర్వము అన్నమయ్యగారు వెంక టేశ్వరస్వామిపై రచించిన శృంగారకీర్తనలు చంద్రగిరిలో పాడి ఉన్నాడు. ఆకీర్తనలు ఒకసారి మళ్లీ పాడమని సాళువ నరసింహ రాయలు అన్నమయ్యగారిని కోరాడు. నాదనామక్రియలో అన్నమయ్యగారు "గద్దరి తిరువేంకటపతి కౌగిటి యధరామృత ముల అద్దిన సురతపువేళల అందము" పొంగులు కాగా పాడి వినిపించాడు.

ఆపాటలు విని ఆనందపరవశుడైన సాళువ నరసింహ రాయలు మైమరచి పోయాడు. ఏమి మాటాడవచ్చునో ఏమి మాటాడకూడదో అన్న విచక్షణజ్ఞానము అతని గర్వంలో అదృశ్యమైపోయింది. అతడు దురహంకారియై తిరువేంకటపతి మీది శృంగారపదములవంటి పదములను తనమీద కూడ చెప్ప మని అన్నమయ్యగారిని కోరాడు.

అన్నమయ్యగారికి కోపమువచ్చినది. నరహరికీర్తనలో ఆనివ తన జిహ్వాఝరులను నుతింపనోపదని, మురహరుని పదము లకు మొక్కిన తన శిరము పరుల వందనమునకు పాల్పడదని సమాధానము చెప్పాడు.

దురహంకారుడైన సాళువ నరసింహరాయలుకు కోపం తో శరీరం పొంగిపోయింది. క్రిందు మీదలు తెలియలేదు. ఇంతవరకు తనకు అన్నమయ్యగారి యందున్న భక్తియంతా విస్మరించాడు. అన్నమయ్య గారికి మూరు రాయర గండమను

పేరుగల సంకెళ్లు వేయించి నిర్దయుడై చెఱసాలలో త్రోయించాడు. వెనుక ముందులు ఆలోచించలేదు. మిత్రుల మాటలు చెవిని పెట్టలేదు. అన్నమయ్యగారికి చెఱసాలలో నిర్దాక్షిణ్యముగా చూడవలసినదని ఆజ్ఞాపించాడు.

24

సాళువ నరసింహరాయలు అన్నమయ్యగారిని చెఱశాలలోకి త్రోయించినప్పుడు ఆయన దగ్గర శిష్యుడు పెద్దన ఉన్నాడు. పెద్దన అహోబలంలో శఠగోపయతీంద్రులవారిదగ్గర శాస్త్రాధ్యయనము చేసి కోకటం తిరిగిపోతూవుండగా అతనికి అన్నమయ్యగారు పెనుగొండకు వచ్చినట్లు తెలిసింది. అందుచేత సరాసరి పెనుగొండవచ్చి అన్నమయ్యగారి దర్శనంచేసి ఆయనను సేవిస్తూ ఉన్నాడు. అన్నమయ్యగారు సాళువ నరసింహరాయలకు యేకాంతంలో పాటలు వినిపించినప్పుడు కూడ పెద్దన అన్నమయ్య దగ్గరనే ఉన్నాడు. అన్నమయ్యగారికి సంకెళ్ళువేయించి చెఱశాలలో త్రోయించగా పెద్దన తాను చేయగలిగింది లేక దుఃఖించాడు.

ఆ సమయంలో తుళువ నరసానాయకుడు కూడ సాళువ నరసింహరాయల వెంటవచ్చి పెనుగొండలోనే ఉన్నాడు. నరసానాయకునికి ముగ్గురు భార్యలు. అందులో రెండవభార్య మల్లి రాజు కుమార్తె నాగలాంబ. నరసానాయకుని వెంట రెండవ భార్య నాగలాంబ పెనుగొండ వచ్చింది. నాగలాంబతో ఆమె

కుమారుడు పసిబాలుడు కృష్ణదేవరాయలు కూడ ఉన్నాడు. తుళువ నరసానాయకుడు ప్రాణపదంగా చూచుకొంటున్న సాళ్వ తిమ్మరాజు అతని తమ్ముడు గోవిందరాజు చిట్టి గంగనామాత్యుల వారి డగ్గర విద్యాభ్యాసము ముగించుకొని నరసానాయకుని దగ్గరకు వచ్చిఉన్నారు. వాళ్ళిద్దరుకూడ నరసానాయకుని వెంట పెనుగొండ వచ్చారు.

పెద్దన అన్నమయ్యగారిని రాజభటులు చెఱశాలకు తీసుకొని పోయినతర్వాత దుఃఖిస్తూ బయటకువచ్చాడు. అతడు సరాసరి సాళ్వ తిమ్మరాజు దగ్గరకువెళ్లి జరిగిన వృత్తాంతంచెప్పి బావురుమన్నాడు. తిమ్మరాజు, గోవిందరాజు కూడా ఆవృత్తాంతం విని ఖిన్నులయ్యారు. ఏమి చెయ్యాలో తిమ్మరాజుకి వెంటనే స్ఫురింపలేదు. అతడువెళ్లి జరిగిన సమాచారాన్ని నరసానాయకునితోను నాగలాంబతోను చెప్పాడు. ఆదారుణవృత్తాంతాన్ని విని నరసానాయకుడు స్తంభించి పోయాడు. నాగలాంబ తట్టుకోలేక బావురుమన్నది. అన్నమయ్యగారు గాంధర్వగాన సార్వభౌముడనీ, ఆయన నిత్యముక్తుడనీ, గరుడశేషాది సూరి జనుల వంటివాడనీ జనం విశ్వసిస్తున్నారు. అటువంటి విశ్వాసాన్ని నరసానాయకుడు నాగలాంబ త్రికరణశుద్ధిగా కలిగి ఉన్నారు. అన్నమయ్యగారి అనుగ్రహం ఉంటే సకలసౌభాగ్యాలు ఉంటాయనీ- ఆయనకు ఆగ్రహంవస్తే కష్టములన్నీ చుట్టుకుంటాయని వాళ్లు నమ్ముతున్నారు.

నరసానాయకునికి సాళువ నరసింహరాయలయందు అపారమైన ప్రభుభక్తి విశ్వాసాలు ఉన్నాయి. ఎల్లప్పుడు ఆయన

అభ్యుదయాన్ని దిగ్విజయాన్ని కోరుతూ ఉంటాడు. అయితే అన్నమయ్యగారియందు నరసానాయకునికి ఉన్న భక్తికూడ అపారమైనదే. అన్నమయ్యగారు దివ్యపురుషుడనీ, లోకాతీత దివ్యశక్తులు కలవాడని గ్రహించినవాడు. అన్నమయ్యగారికి అవమానం జరిపించినందున సాళువ నరసింహరాయల సామ్రాజ్యానికి ముప్పురావచ్చునని భయపడ్డాడు. అసలతని ఆయుర్దాయమే ముగింపు కాబోతున్నదేమోనని భయపడ్డాడు. ఒకప్రక్క తనకు అచంచల ప్రభుభక్తి. వేరొకప్రక్క అమితమైన వైష్ణవ జనభక్తి. తన ప్రభువువలన వైష్ణవాపచారం జరిగిపోయిందని నరసానాయకునికి అమితమైన చిత్తక్షోభ కలిగింది.

ప్రదోషకాలంలో తిమ్మరాజు, గోవిందరాజు వెడ్డనవచ్చి నరసానాయకునికి ఈవార్తచెప్పారు. ఆవార్త విని నరసానాయకుడు నాగలాంబ సంక్షోభంలో అట్లాగే ఉండిపోయారు. రాత్రి ప్రొద్దు మిగిలిపోతున్నదని వారు గ్రహించలేదు. నడిరాత్రి అయిపోయింది. ఎవ్వరికీ భోజనములు లేవు. ఆసంగతి ఆలోచనకు రాలేదు. చివరకు నరసానాయకునికి ఒక ఆలోచనవచ్చింది. నిశ్చయానికి వచ్చాడు.

అతని ఆలోచన భార్య నాగలాంబకు చెప్పాడు. ఆమె సంతోషముతో అంగీకరించింది. తిమ్మరాజుకు చెప్పాడు. అది సముచితంగా ఉన్నదని అతడన్నాడు. నరసానాయకుడు సాయుధుడై తిమ్మరాజు; గోవిందరాజు, నాగలాంబ కూడ ఆయుధములు ధరించి వెంటరాగా అన్నమయ్యగారు బంధింపబడిన చెఱసాలకు

త్రోవతీసాడు. నాగలాంబ కుమారుడు ఆరేండ్ల పసివాడు కృష్ణ దేవరాయలు కూడా తల్లి వెంట నడిచాడు.

అన్నమయ్యగారిని చెఱసాలలో పెట్టించిన తర్వాత సాళువ నరసింహరాయలకు మనశ్శాంతి కరవైనది. అంతఃపురం లోకి వెళ్లాడేగాని అతని మనస్సు కల్లోలసంకలితమై, భయాం దోళనభరితమై ఉన్నది. అన్నమయ్యగారియందు తనకు పరమ గౌరవం ఉన్నది. ఇన్నిదినములుగా చిన్ననాటినుండి ఆయన్ను గౌరవిస్తూ ఉన్నాడు. ఆయనయందు గౌరవం తనకు ఇప్పటికీ తగ్గలేదు. అయితే తనతో ఉన్న స్నేహాన్ని తనమీద ఉన్న వాత్సల్యాన్ని అన్నమయ్యగారు పాటించి తనకోర్కె తీర్చ లేదని గునుపుగా ఉన్నది. ఆమహానుభావుడు ఏమిచేసినా చెల్లు తుంది. తాను మాత్రం తొందరపడ్డాడేమో.

ఇటువంటిభావాలతో సాళువ నరసింహరాయలు విశ్రాంతి తీసుకోవాలని వెళ్లాడు. అతని శరీరము మాత్రం ఏమి పని చెయ్యడం లేదుగాని, మనస్సు పరిపరివిధాలుగా పోతున్నది. మనస్సు సకలభీభత్సంగాను ఉన్నప్పుడు శాంతిగాని విశ్రాంతిగాని ఏమిటి ! అతని మనస్సును వేయికత్తులువచ్చి పొడిచినట్లు, భగ వంతుడైన శ్రీవేంకటేశ్వరుని నందకఖడ్గం అనంత ఖడ్గరూపా లనుపొంది తన్ను చుట్టుముట్టినట్లు, తన శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసినట్లు అతనికి ఊహలు కలుగుతున్నాయి. ఊహలు కలుగుటమాత్రమే గాక నిజముగానే శరీరమంతా హూనం హూనం అయినట్లుగా ఉన్నది. దేహమంతా బాధ, నొప్పులు.

ఒళ్లంతా కందిపోయింది. విపరీతమైన నొప్పి క్షణక్షణానికీ భరించ డానికి అతీతంగా పెరిగిపోతున్నది. కన్నులు మూసుకుంటే వేయి నందకఖడ్గాలు చుట్టుముట్టి తన్ను సంహరించడానికి వస్తునట్లుగా ఉన్నది. కన్నులు తెరుచుకుంటే శరీరమంతా చెప్పరానంత బాధ. శరీరాన్ని తుషారాగ్నిలో పెట్టి ఉడుక పెట్టుతున్నట్లుగా ఉన్నది. సాళువ నరసింహరాయలు భరింపలేక పోయాడు. ఈ తాపమంతా మహానుభావుడైన అన్నమయ్య గారిని హింసించినందువల్ల వచ్చినదని గ్రహించాడు. ఆ సంగతి గ్రహించగానే అతనికి పశ్చాత్తాపం కలిగింది. వెంటనే అన్న మయ్యగారున్న చెఱసాలకు బయలుదేరాడు.

అన్నమయ్యగారు చెఱసాలలోకి త్రోయబడినప్పుడు దుఃఖపడలేదు. భగవంతుడైన శ్రీవేంకటేశ్వరుడు తన భక్తిని పరీక్షిస్తున్నాడని భావించాడు. తనవలన ఏదో భగవదపచారం జరిగినదని అందుచేత భగవంతుడిట్లా శిక్షిస్తున్నాడని భావిం చాడు. తన తప్పులను మన్నించమని భగవంతుడైన శ్రీతిరు వేంకటపతిని ప్రార్థించాడు. శ్రీవేంకటేశ్వర సాన్నిధ్యమును కల్పించుకొని శరణు వేడినాడు.

సాళువ నరసింహరాయలు తన్ను చెఱసాలలోనికి త్రోయింపగా అన్నమయ్యగారికి మనఃక్లేశంతోపాటు జ్ఞానో దయముకూడా అయింది. మనస్సు సంశిథిలంబై - తనలావు వైరి బలము చింతించారు. పుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తి కలిగింది. "మిథ్యామనోరథమెందుకు? రాయలను గెల్వలేము" అను కున్నారు.

ఆ ఆపత్సమయంలో ఆయనకీ మహాభాగవత పద్యములు జ్ఞాపకమునకు వచ్చాయి.

"ఏరూపంబున దీనిగెల్తు? నిటమీఁదేవెంట జింతింతు? నె
వ్వారిం జీరుదు? రెవ్వరడ్డ? మిఁక నివ్వారిప్రచారోత్తమున్
వారింపందగువార లెవ్వ? రఖిల వ్యాపారపారాయణుల్
లేరే? మ్రొక్కెద దిక్కు మూలిన మొఱాలింపం బ్రపుణ్యాత్ములల్
నానానేకపయూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపఁ దిశలఁజొక్కోటి కరణీనాథుండనై యుండి, మ
ద్దానాంభఃపరిపుష్టచందనలతాం తచ్ఛాయలందుండ లే
కీనీరాన నిటేలవచ్చితి? భయం బెట్లో కదే యీశ్వరా!"

గజేంద్రమోక్షఘట్టము మనోనేత్రముల ముందు కదలగా అన్నమయ్యగారు తనుకున్నారు గదా "మున్నా గజేంద్రుడు తేల్చిపెట్టినాడు. ఆ మహాభక్తుని మూలంగా ఆపన్నజనరక్షకుడెవ్వడో తేలిపోయింది. జగములకు తండ్రియైనవాడు, జగములందున్నవాడు, జగములు తన యందుంచుకొన్నవాడు, జగత్సృష్టిస్థితిలయకారణమైనవాడు, అనాదిమధ్యలయుడు, సర్వమూ తానయైనవాడు, ఆత్మభవుడు - అఖిలరూపములు తన రూపమైనవాడు, భక్తజనముల దీనుల పాలివాడు, విశ్వమయుడు విభుడు, విష్ణువు జిష్ణువు భక్తజనుల కడ్డపడువాడు తిరువెంకటాచల పతియే" అని నిశ్చయించుకొన్నారు.

అన్నమయ్యగారు తన మనస్సున వెంకటాచలాధీశ్వరుని సన్నిధానంబు కల్పించుకొని,

"లావొక్కింతయు లేదు; ధైర్యము విలో
లంబయ్యెఁ, బ్రాణంబులుక్
కావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁదనువుక్
డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవేతప్పనితఃపరంబెఱుఁగ; మ
న్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర కావవేవరద సం
రక్షింపు భద్రాత్మకా!"

వినుదఁట జీవులమాటలు ?
చనుదఁట చనరానిచోట్లకు ? శరణార్థులకో
యనుదఁట పిలిచిన సర్వముఁ
గనుదఁట సందేహమయ్యెఁ గరుణావార్ధీ !

అని మఱియు "ఓకమలాప్త ! ఓవరద!

రావే ! కరుణింపవే ! శర
ణార్థిని నన్ను గావవే ! అరయితరక్షకుం
డైన శ్రీవెంకటాచలపతి
ఆపన్నుండైన నన్ను గాచుగాక !"

అని తిరుమలయున్న దెసచూచుచు నిట్టూర్పులు నిగిడించుచు నుండి కొంతసేపటికి గొంతువిప్పి ఆర్తిగా పాడుకొన్నారు.

ఆకటి వేళలందు అలపైన వేళలందు తేకువ హరినామమే దిక్కుగాని మఱి లేదని, కొఱమాలివున్న వేళ కులము చెడినవేళ

చెఱనడి వొరులచే జిక్కినవేళ, హరినామ మొక్కటే గతిగాక మఱచి తప్పినచో మఱి వేరు తెఱగులేదని, ఆపద వచ్చినవేళ, ఆటోడిపడినవేళ, పాపపువేళ, భయపడినవేళ, వోపినంత హరినామ మొక్కటే గతిగాని మఱివేఱు తెఱగులేదని, సంకెలబెట్టినవేళ, చంప బిలిచిన వేళ, అంకిలిగా నప్పులవారాగిన వేళ, వేంకటేశు నామమే విడిపించగతిగాని మఱి వేరు తెఱగులేదని భావించి వేంకటేశనామ సంకీర్తన చేశాడు.

నీదాసుల భంగములు నీవు సంతసము పడుచున్నావా, ఆభంగములు నీకు తెలియుటలేదా, నీదాసులను రక్షింపవలసినది నీవేకదా, నిన్ను హెచ్చరింపవలసి ఉన్నదా - పాలసముద్రములో నీవు పవ్వళించినవేళ సురలు జేలలై మొఱపెట్టినట్లు నేను నానవి విన్నవించినాను. ఇంకా ఏల నిద్రిస్తున్నావు. నన్ను రక్షించరాదా ?

ద్వారకానగరములో పట్టమహిషి జనంతో నెత్తమాడే వేళలందు కౌరవసభలో వస్త్రాపహరణవేళ ద్రౌపది మొఱపెట్టిన యట్లు గాజసన్నిధిలో ఘోరమైన పరాభవంపొంది నీకు విన్న వించినాము. ఇంకా నీకు పరాకు దేనికి. ఇంక రక్షించరాదా ?

ఇందిరాదేవితో కలసి వైకుంఠపురమందు నీవు వీకాం తమునందున్నవేళ మొసలిచేత పట్టుబడిన గజేంద్రుడు మొఱ పెట్టినయట్లు నా విన్నపము సారెసారెకు చేసితిని, శ్రీవేంక టేశ్వరా నన్ను వేగమే రక్షించరాదా ! అని భగవంతునికి విన్న పాలు చేశారు.

దాసవర్గములకెల్ల దరిదాపు నీవే కాన నన్ను వాసిగ రక్షింపరాదా యని చెప్పి, సేనాధిపతియైన విష్వక్సేనుడా శ్రీనాథునికి మా విన్నపము చేయరాదా యని, భాష్యకారుల స్వామీ మా మనవి చనవులు మీరైన చెప్పరాదా యని, వేయినోళ్ల భోగియైన అనంతుడా - నీవైన విష్ణునికి మావిన్న పాలు వినిపించరాదా యని, దేవతాలోకములకు తల్లియైన ఇందిరాదేవీ! శ్రీవేంకటేశునికి చిత్తములరునట్లు మావిన్నపమును మీరైన చెప్పరాదా యని, దీనముగా ప్రపత్తిగానం చేశారు.

ఇట్లు అన్నమయ్యగారు భగవన్నామ సంకీర్తనలు చేస్తూ తన ఆర్తిని శ్రీవెంకటేశ్వరునికి నివేదిస్తూ తన మనస్సును శ్రీవెంకటపతి శ్రీచరణములందు లగ్నముచేసి ఉండగా ఆయనకు విచిత్రమైన అనుభవం కలిగింది.

శ్రీస్వామి శ్రీపాద లగ్నమైన మనస్సు ఏకవస్తుగత మగుటవలన కుంచించుకొనిపోయింది. మనస్సులయభూతమగుట చేత ఆయనకు ఆర్తిగాని దుఃఖముగాని అసౌఖ్యముగాని అశాంతిగాని లేకుండపోయినవి. అప్పుడు మనస్సు వినాశము పొంది లేకుండపోవుట కాదు. మిక్కిలి కుంచించుకొన్నదై అల్పాల్ప బీజప్రాయమై పోయినది.

ఆస్థితిలో కొంతసేపుగడువగా అన్నమయ్యగారికి మగత నిద్రవలె వచ్చింది. అప్పు డొక స్వప్నమువచ్చింది. అన్నమయ్య గారు తానొక గజేంద్రుడై యున్నాడట. తనకు వెనుక ముందట ఉభయపార్శ్వంబులందు తృషార్దితములై ఏనుగుగములు వచ్చు

చుండగా నొక్క తెరువు వెంటపోయి, ఒక మహాసరోవరమును చేరెనట. అందు నానావిధవిహారములను చేసెనట. ఇంతలో నొక మకరి తన్నొడిసిపట్టినదట. ఆయన ఆమకరినుండి విడిపించు కొనుటకై బహుభంగుల యుద్ధముచేసెనట. పెక్కు అహో రాత్రములు యుద్ధముచేయగా తన బలము క్షీణించిపోవుచున్న దట. తన్ను పీడించుచున్న మకరిబలము వృద్ధియగుచున్నదట. తానింక మకరిని గెల్వజాలనని తెలిసికొని దీనుడై ఆర్తితో శ్రీవేంకటాచలాధీశుని తాను ప్రార్థించెనట.

అప్పుడు తిరువెంకటనాథుడు అలమేలుమంగతాయా రుతో గరుడాళువారుపై వచ్చెనట ఆయన వెంట ఇంద్రాది సకలదేవతాగణము వచ్చినదట. బ్రహ్మయు ఈశ్వరుడు వచ్చి రట. సకలదేవర్షులు మహర్షులు వైదిక సూక్తములతో ఆయనను స్తుతించుచు పరివేష్టించి వచ్చిరట.

తాను శ్రీమన్నారాయణుడైన తిరువెంకటపతికి మ్రొక్కి శరణువేడి మొఱపెట్టుకొనెనట. అప్పు డాసర్వేశ్వరుడు కరుణా మూర్తియై సుదర్శనచక్రమును ప్రయోగించి ఆమకరిని సంహరించెనట. అప్పుడు తాను భక్తియుక్తుడై ఆ దేవతా సార్వ భౌమునకు ప్రదక్షణీకరించి, ప్రణామముచేసి సన్నుతులు చేసెనట. ఆయన మందస్మితుడై అభయవరదాన ముద్రాధరుడై తన్ను అనుగ్రహకటాక్షమున చూచెనట. తాను ఆనందపార వశ్య మనుభవించెనట. ఆ అపూర్వ ఆనందకందళములో ఆయనకు స్వప్నభంగమై జాగరితమైనది.

అంతట్లో అన్నమయ్యగారి సంకెళ్లు ఊడిపోయి నేల మీదపడిపోయినవి. చెఱసాల తలుపులు తెరచుకున్నాయి. అన్న మయ్యగారు శ్రీవెంకటేశునకు కృతజ్ఞతలు నివేదించి బయటకు వచ్చాడు. చెఱశాల బహిర్ద్వారము దగ్గరకు వచ్చేటప్పటికి అక్కడకి సాళువ నరసింహరాయలు ఎదురువస్తూ కనిపించాడు. తనంతట తాను తన మహాత్మ్యముచేత చెఱవిడిపించుకొని అన్న మయ్యగారు రావడం సాళ్వ నరసింహరాయలకు అచ్చెరువు కలి గించింది. వెంటనే అన్నమయ్యగారి పాదముల మీదపడి శరణు వేడినాడు. అన్నమయ్యగారు పశ్చాత్తప్తుడయిన సాళ్వ నర సింహరాయలని కటాక్షించి "శ్రీవేంకటాద్రినాథ దయావర్ధిత రాజ్యుడవు" కమ్మని "రత్నాంశు మత్ర్కంచీ వేంకట కాళహస్తి నగరీకల్యాణ సౌధాంచల ప్రాంచచ్ఛాశనుడవు" కమ్మని ఆశీర్వ దించారు.

అదే సమయానికి అచ్చటికి తుళువ నరసానాయకుడు అతని భార్య నాగలాంబ కుమారుడు కృష్ణదేవరాయలు సాళ్వ తిమ్మరాజు గోవిందరాజు అల్లసాని పెద్దన వచ్చిచేరారు. వారంద రికి అన్నమయ్యగారు తన మహాత్మ్యమువలన చెఱనుండి బయటికి వచ్చినాడని సాళువ నరసింహరాయలు పశ్చాత్తాపముతో అన్న మయ్యగారిని శరణువేడినాడని తెలిసింది. తుళువ నరసానాయ కుడు తన ప్రభువు పశ్చాత్తప్తుడయి అన్నమయ్యగారి పాదము లను ఆశ్రయించినందుకు సంతోషపడ్డాడు.

అన్నమయ్యగారు అప్పుడే తిరుమలకు ప్రయాణము సాగించారు. ఆయనకు సాళువ నరసింహరాయల ఆజ్ఞచొప్పున

తుళువ నరసానాయకుడు సముచితపరివారాన్ని మేనాను సిద్ధ పరిచాడు. అన్నమయ్యగారి దగ్గర సాళువ నరసింహరాయలు రాజప్రాసాదము దగ్గర సెలవుతీసుకోగా పొలిమేరవరకు వచ్చి తుళువ నరసానాయకుడు నాగలాంబ కృష్ణదేవరాయలు సాగ నంపారు. వారివెంట సాళ్వ తిమ్మరాజు గోవిందరాజు వచ్చారు. అన్నమయ్యగారి శిష్యుడైన అల్లసాని పెద్దన అన్నమయ్యగారి వెంట ప్రయాణమయినాడు. పొలిమేర దగ్గర తుళువ నరసా నాయకుడు అతని భార్య నాగలాంబ కుమారుడు కృష్ణదేవ రాయలు సాళ్వ తిమ్మరాజు అన్నమయ్యగారికి ప్రణామాలు చేశారు.

అప్పుడు అన్నమయ్యగారు వారందరిని ఆశీర్వచనాలతో అనుగ్రహించారు. తుళువ నరసానాయకునికి తిమ్మరాజును చూపిస్తూ "ఇతడు మహామేధావి. సకల భూభార వహన తంత్రాంగ చతురుడు. ఇతనిని విశ్వసించి జాగ్రత్తగ దగ్గర పెట్టుకొనివుండు. నీ వంశానికి ఇతడు మహా యశస్సు గడించి పెట్టాడు." అన్నారు. అప్పుడు కృష్ణదేవరాయలు ఆరేండ్ల బాలుడుగావుండి ముద్దుమాటలతో "బాబయ్యగారు ఆశీర్వచ నాలు మా నాయనగారికేనా? నాకూ కూడ ఇవ్వరూ!" అన్నాడు. ఆముద్దుమాటలకు అందరూ సంతోషపడ్డారు. అన్నమయ్యగారి ఆనందానికి మేరలేకపోయింది. ఆయన కృష్ణదేవరాయల చుబు కాన్ని పుణికిపుచ్చుకొంటూ "నాయనా నీకే నానా ఆశీర్వచనా లన్ని. నువ్వు చక్రవర్తివి అవ్వుతావురా. ఇదిగో ఈ మాతిమ్మ రాజు, పెద్దన నీకు అండదండలుగ నుంటారురా. తెలుగు సరస్వతీ

దేవిని సంస్కృత భారతి అంత దానినిగ నువ్వు చెయ్యాలిరా. ఆంధ్రసాహిత్య చంద్రికలతో తెలుగు భూమిపైన వెన్నెల కావించాలిరా" అన్నారు.

అప్పుడు తుళువ నరసానాయకుడు నాగలాంబ చేతులు జోడించి మహాప్రసాదము, మహాప్రసాదమన్నారు. వాళ్లను చూచి కృష్ణదేవరాయలు కూడ మహాప్రసాదం అన్నాడు. అప్పుడు అతడు చూపిన వినయానికి ముగ్ధుడై సాళ్వ తిమ్మరాజు అతనిని ఎత్తుకొని ముద్దాడాడు. అప్పుడు కృష్ణదేవరాయలు "అప్పాజీగారు మీరు బ్రాహ్మణులుకదా నన్ను ఎత్తుకొనవచ్చా" అన్నాడు. అంతలో అల్లసాని పెద్దన సాళ్వ తిమ్మరాజుగారి చేతి నుండి కృష్ణదేవరాయలను తీసుకొంటూ "ఫరవాలేదు లేవోయ్ నువ్వు నీతల్లితండ్రులకు అన్నమయ్యగారి అనుగ్రహంచేత కలి గినవాడవు. నిన్ను అన్నమయ్యగారు చక్రవర్తిగా ఆశీర్వదిం చారు. కాబట్టి నువ్వు మా అందరికి పూజ్యుడవే" అంటూ ముద్దాడి నేలకు దించారు.

అన్నమయ్యగారు వంగి కృష్ణరాయలను ముద్దాడి "నువ్వు ఆంధ్రసంస్కృతాలు బాగా చదువుకోవాలి సుమా సీతండ్రికి నాకు ఇష్టదైవమైన శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితంగా కావ్యాలు వ్రాయాలి సుమా" అన్నారు. తర్వాత అన్నమయ్యగారి ప్రయాణము సాగింది. బయలుదేరేటందుకు ముందు అన్నమయ్యగారు నరసానాయకునితో కొన్నిమాటలు చెప్పి ఆ మాటలను సాళ్వ నరసింహరాయలకు చెప్పమన్నాడు.

అన్నమయ్యగారు సాళ్వ నరసింహరాయలకు తుళువ నరసానాయకుని ద్వారా పంపిన సందేశమేమనగా—శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామికి అనేక వుత్సవ విశేషాలను, నైవేద్యవిశేషాలను, ఆభరణ విశేషాలను, ప్రాకారమండప సోపానాది నిర్మాణ విశేషాలను వెలయింపవలసి వున్నదని. నరసానాయకుడు అన్నమయ్యగారి సందేశాన్ని సాళ్వ నరసింహరాయలకు వినిపించాడు. అప్పటి కప్పుడు సాళ్వ నరసింహరాయలు పథ్నాలుగు శాసనాలు వ్రాయించి అన్నమయ్యగారు చెప్పిన స్వామి కైంకర్యాలను విశేష ధనవ్యయంతో వెలయించినాడు.

సాళువ నరసింహరాయల శాసనములు అన్నమయ్యగారు తిరుమల కొండకు చేరునప్పటికే చేరునట్లు పంపబడ్డాయి. సాళువ నరసింహరాయలుచేసిన కైంకర్యాలకు అన్నమయ్యగారు తృప్తిపడ్డారు. ఆనాడు తిరుమల కొండమీద శ్రీవేంకటేశ్వరస్వామి కైంకర్య పరాయణుడై ప్రఖ్యాతి గాంచియున్న శ్రీమాన్ కందాళ రామానుజ జియ్యంగారిని సాళువ నరసింహరాయలు తానుచేసిన కైంకర్యములు సక్రమముగ నడుచునట్లు పర్యాలోకింపవలసినదిగ ప్రార్థనలు చేశాడు. అన్నమయ్యగారు సాళ్వ నరసింహరాయలు కందాళ రామానుజ జియ్యంగారి యందు చూపిన భక్తికి సంతోషపడ్డాడు. అన్నమయ్యగారు తాను కూడ పెక్కు విశేషకైంకర్యములు చేశారు. అగ్రహారములు సమర్పించారు. అప్పటినుండి కొండమీద స్వామి సన్నిధిని కాలము గడుపుటకు నిశ్చయించుకొన్నారు. అందుచేత కొండమీద అన్నమయ్యగారు స్వగృహాన్ని నిర్మించుకున్నారు.

25

ఒకనాడు అన్నమయ్యగారు స్వామివారి ఆలయానికి వెళ్లి మామూలుగ సంకీర్తనలు చేశారు. ఆరోజులలో మామిడి పండ్లు సమృద్ధిగా ఉన్నాయి. అన్నమయ్యగారు తన అగ్రహార మైన మరువాకరై గ్రామమునుండి తనతోటలో పండిన మామిడి పండ్లను తెప్పించి స్వామివారికి నైవేద్యము చేయించారు. తర్వాత తాను ఆరగింపగా అన్నమాచార్యునకు పండ్లు పులిసి నాయి. అవి జీడికంపు పుల్లమామిడిపండ్లు.

స్వామివారికి జీడికంపు పుల్లమామిడిపండ్లు నివేదింపబడి నందువలన గొప్ప అపచారము జరిగిపోయినదని అన్నమయ్య దుఃఖించారు. తనవలన జరిగిన ఈ అపచారాన్ని క్షమింపమని స్వామిని వేడుకొన్నారు. తన్ను మన్నించి పుల్లమామిడిపండ్లను తియ్యమామిడి చేయమని స్వామిని అర్థించారు. స్వామి అను గ్రహంచేత పుల్లమామిడిపండ్లన్నియు తియ్యమామిడి పండ్లైనవి.

తన విన్నపమును మన్నించి పుల్లమామిడిపండ్లను తియ్య మామిడిచేసిన స్వామియొక్క అనుగ్రహమునకు కృతజ్ఞతగా అన్నమయ్యగారు దివ్యభాషలో వేంకటాచలమహాత్మ్యాన్ని రచించారు. అన్నమయ్యగారికి స్నేహితుడయిన కందాళ రామానుజయ్యంగారు అన్నమయ్యగారు రచించిన సంస్కృత వేంకటాచలమాహాత్మ్యాన్ని పఠించి చాల సంతోషపడి ఆ మాహా త్మ్యాన్ని స్వయంగా శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో చదివి విని

పించారు. శ్రీస్వామివారు శ్రీకారము చిత్తగించారని అన్న మయ్యగారు సంతోషపడ్డారు. రామానుజ జియ్యంగారు వేంకటాచలమహాత్మ్యాన్ని స్వామివారి సన్నిధిలో నిత్యము విని పించుటకుగొన్ని వుత్సవములు చేయుటకు ఉభయముగ ధనాన్ని స్థానాధిపతులకు ఇచ్చారు.

తాళ్లపాక అన్నమయ్యగారు రచించి వెలయించిన వెంకటాచలమహాత్మ్యమునకు స్థానాధిపతులందరు మెచ్చు కొన్నారు. వారి సమ్మతితో అన్నమయ్యగారే వేంకటేశ్వర స్వామికి పెండ్లి తిరునాళ్లు తొలుత ప్రారంభించారు. ఆగమ శాస్త్రంలో వివాహ వుత్సవాన్ని చేస్తున్నమాన్యుడే కన్యా దాతగా వ్యవహరించాలనివున్నది కాబట్టి పెండ్లి తిరునాళ్లు ప్రారంభించిన అన్నమయ్యగారు వివాహముచేసినట్లుగా జన శ్రుతిలోనికి వచ్చినది. "శ్రీలలరంగ మాంగమును శ్రీహరి కెన్నడు దారవోయుచో, దాళుల అన్నమయ్యదా గడిగెన్ పదముల్" అని లోకోక్తిగా వచ్చింది. మఱియు "అమ్మహా దేవుండు తాళ్లపాక వంశ శిఖారత్నంబగు అన్నమాచార్యునకు జామాతరుం డనుపించుకొని, భవదీయసంకీర్తన లాలించిన కర్ణం బుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించెనట."

శ్రీవేంకటేశ్వరస్వామి వైభవమునకు అన్నమయ్యగారు ప్రఖ్యాతి గొల్పిరి. "నేనొక్కండ లేకుంటే సీకృపకుపాత్రమేది, పూని నావల్లనే కీర్తి పొందేవు నీవు" అని అన్నమయ్యగారు అన్నారు. అన్నమయ్యగారు స్వామి సన్నిధినివసించి సంకీర్త

నములను సాగించడం మాత్రమే కాకుండా పెక్కుమంది రాజుల నావర్జించుకొని వారి కృతముగాను స్వకృతముగాను ఆలయగోపుర ఆరామమార్గ సోపానాదినిర్మాణాలను ఉత్సవ విశేషాలను పెంపుచేయుటచేతను అన్నమయ్యగారి మూల ముగా తిరుపతి క్షేత్రానికి జనరంజకత్వం సమకూరింది.

తిరుపతిలో మధ్వసంప్రదాయ మహానుభావుడైన వ్యాసాచార్యులవారు పన్నెండు సంవత్సరములు తపస్సు చేస్తూఉన్నారు. ఆయనకు శ్రీస్వామివారి అనుగ్రహం లభించ లేదు. స్వప్నదర్శనమైనా అనుగ్రహించలేదు. వ్యాసరాయల వారికి ఎంతో మనఃక్లేశమైనది. తన్ను భగవంతుడు ఎందుకు అను గ్రహించలేదో తోచలేదు. పన్నెండు సంవత్సరాలుగా వ్యాస రాయలవారు కొండమీద ఉండి తపస్సు చేస్తున్నారుగాని తరచు అక్కడే ఉంటున్న అన్నమయ్యగారిని ఆయన ఎప్పుడూ పలుకరించలేదు. వ్యాసరాయలవారు అనుకున్నారు కదా-అన్న మయ్యగారు ఇద్దరు భార్యలతో భోగాలు అనుభవిస్తున్నాడు. శృంగారపురుషుడు. అందుచేతనే స్వామి వారిమీద శృంగార కీర్తనలు పాడుతూఉంటాడు వైరాగ్యంతో సన్యాసం తీసుకుని తపస్సుచేస్తున్న తనవంటి వాడు అన్నమయ్యగారిని పలుకరించ వలసిన పనిలేదు.

ఈ భావాలతో వ్యాసరాయలవారు అన్నమయ్యవైపు తలఎత్తి చూడలేదు. ఒకనాడు అన్నమయ్యగారు స్వామి ఎదుట సంకీర్తనముచేస్తూ ఉన్నారు. అందులో శృంగార

మంజరి యనుమంజరి ఛందోరచనలను భాషచే భావముచే శృంగారసుందరమైన దానిని పాడుచున్నారు. అప్పుడు శ్రోతలందరికీ ప్రసన్న మధురమైన ఆగానము వినగా రస సమాధికలిగింది. వ్యాసరాయలవారు నూతనమైన సంగీత రసానుభూతిలో సమాధిస్థితిని పొందారు. ఆసమాధిస్థితిలో వ్యాసరాయల వారికి ఒక విచిత్రమైన దృశ్యము కనిపించింది. శ్రీవెంకటేశ్వరస్వామి పసి బిడ్డవలె పవళించియుండగా అన్నమయ్యగారు జోలపాడుతూ ఉన్నారు ఆదృశ్యాన్ని చూచిన వ్యాసరాయలవారు పరమానందాన్ని పొందారు. ఇంతలో వికల్పము కాగా వ్యాసరాయల వారికి స్మృతివచ్చింది. అప్పుడు జో అచ్యుతానంద! జోజో ముకుంద రావే పరమానంద రామ గోవింద—అంగుగా తాళ్లపాక అన్నయ్య చాల శృంగార రచనగాచెప్పె నీజోల" అని చరణములు వినపడుతున్నాయి.

వ్యాసరాయల వారు తన తప్పిదాన్ని తెలుసుకున్నారు. అవతారపురుషుడై స్వామికి ఆప్తుడైన అన్నమయ్యగారిని తాను నిరాదరించి అపచారము చేయటంచేత స్వామి ఇంతవరకు తన్ను అనుగ్రహించలేదని తెలుసుకున్నారు. వెంటనేవెళ్లి అన్నమయ్య గారి పాదాలను ఆశ్రయించారు. అన్నమయ్యగారు వ్యాస రాయల వారిని లేవతీసి "అయ్యో ఇది ఏమి అపచారము. మీరు పెద్దలు. తపస్వులు. తురీయాశ్రమములో ఉన్నవారు నాకు నమస్కారము చేయవచ్చునా" అంటూ వ్యాసరాయల వారికి పాదాభివందనములు చేయబోయారు. వ్యాసరాయల వారు అన్నమయ్యగారిని పట్టుకుని పాదాభివందనం చెయ్యకుండా ఆపి

"మీరు మహాత్ములు. స్వామివారి అంశావతారము. నేను ఇన్నాళ్లుగా మిమ్మల్ని గుర్తించక అపచారం చేశాను. నన్ను క్షమించండి. నన్ను అనుగ్రహించమని స్వామికి మనవి చేయండి" అన్నారు.

అన్నమయ్యగారు "స్వామి పరమదయాళు. శ్రీవేంకటేశ్వరుడు శ్రీపతియు నితడే. పావనపు వైకుంఠపతియు నితడే. చక్ర-నారదాదుల సంకీర్తనకు చొక్కి నిక్కిన శ్రీవెంకటాద్రినిలయుడు నితడే" అని అన్నారు.

ఆరాత్రి వ్యాసరాయల వారికి స్వప్నసాక్షాత్కారము లభించింది. స్వామి ప్రసన్నవరదాభయుడై దర్శనం అనుగ్రహించాడు. స్వామి తిరుపతిలో ఇక తపస్సు చాలునని చెప్పి తుంగభద్రానదీతటమున విద్యానగరమునందుండి ధర్మప్రచారము చేయమని చెప్పెను.

వ్యాసరాయలవారు నిద్రమేల్కొని బ్రాహ్మీముహూర్తము సమీపించుట గ్రహించి శయ్యనుండి లేచి కాలోచితము ప్రారంభించి ముగించారు. ఆ సాయంకాలములోపున అన్నమయ్యగారిని దర్శించి ఆయనవద్ద సెలవు తీసుకుని విద్యానగరానికి ప్రయాణమై వెళ్లిపోయాడు.

అన్నమాచార్యులవారు నిత్యసేవలుచేస్తూ శ్రీవేంకటేశ్వరస్వామి వారికి కైంకర్యాలు చేస్తూఉన్నారు. ఆయన నిత్యసంకీర్తనలవలన సంకీర్తనశాస్త్రము కల్పింపబడినది. పల్లవి చరణములు కలిగిన పదకవితా రచనలు చేసినవాడగుటచేత ఆయన

ప్రఖ్యాతి యావద్భారతమునందు వికసించినది. ఆయన పద కవితాపితామహుడగుటవలన, సంకీర్తనాచార్యుడగుట వలన హరినామసంకీర్తనాచార్యుడగుట వలన ఆయనను దర్శించడానికి పలుప్రాంతాలనుండి గానప్రియులువచ్చి ఆయన దర్శనంచేసు కొని అయన గానాన్ని విని తరించిపోయామని సంతోష పడుతూ ఉండేవారు.

అన్నమయ్యగారి రచనలలో అనేక విధములైన ;, ధుర కవితా రచనా విశేషము లెన్నో వెలువడ్డాయి. జాజఅలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జయజయ, విజయాభవ, శోభన, మంగళవైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెనగూళ్లు, చందమామ, గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగ ళాలు, అల్లో నేరేళ్లు, చాంగుబళాలు, బళాబళాలు, సాన ముఖాలు, అవధానాలు, తందానాలు, వెన్నెలలు, చిత్తమా, మనసా, బుద్ధి సంబోధనలు మొకలైనవి ఉన్నాయి.

అన్నమయ్యగారు స్మార్తుడైపుట్టి వైష్ణవమతాన్ని ఆశ్ర యించినవారు. ఆయన రామానుజుల కాలంలో వైష్ణవస్వాము లుగా నిర్ణయింపబడిన స్వయమాచార్య వంశములలోనివాడు కాదని ఆయనను వైష్ణవస్వాములు తక్కువగా చూచేవారు. ఆయనతో పంక్తిభోజనం వాళ్లు అంగీకరించేవాళ్లుకాదు, అన్న మయ్యగారిని గర్భాలయములోనికి రానిచ్చేవారు కాదు.

ముద్రణాధారణా నంతరంకూడ ఇట్లా ఉండటం అన్నమయ్య గారికి బాధ కలిగించింది.

ఒకనాడు స్వామిసన్నిధిలో "వైష్ణవులు గాని వార లెవ్వరు లేరు. విష్ణుప్రభావ మీ విశ్వమంతయుగాన" అనే పాటపాడి మరల "మదమత్సరములేక మనసు పేడై పోవ పదరిన యాసలవాడువో వైష్ణవుడు" అనిన్నీ "విజాతు లన్నియు వృథావృథా, అజామిళాదుల కదియేజాతి" అనిన్నీ ప్రసన్నగంభీరంగా గానంచేశారు. అప్పుడు స్వామి శిరస్సునపై పుష్పమొక్కటివచ్చి అన్నమయ్యగారి శిరస్సునపైపడింది. వైష్ణవు లందరకు కనువిప్పు అయింది. అన్నమయ్యగారిని బంతిలో నుంచుకుని భుజించారు.

ఆనాటినుండి అన్నమయ్యగారు గర్భాలయంలోకి వెళ్లి స్వామి దర్శనం చేసుకొనేటందకు అడ్డంకి తొలగిపోయింది. స్వామివారికి ప్రతిశుక్రవారము తిరుమజ్జనోత్సవం జరుగు నప్పుడు అన్నమయ్యగారు దగ్గరఉండి నలుగుపాటలు అభిషేకపు పాటలు పాడుట ఆచారమైంది. అభిషేకానంతరం అన్న మయ్యగారికి అభిషేకంచేసిన పన్నీటిచెంబును తాంబూల చందనాలను ఇచ్చి సత్కరించుట కూడా ఆచారమైంది. తిరుమజ్జనోత్సవం శాశ్వతంగా జరుగటానికిగాను అన్నమయ్యగారే స్వామివారికి కొన్ని అగ్రహారాలను సమర్పించారు.

అన్నమయ్యగారు శ్రీహరి పాదతీర్థమే చెడనిమందని, మోహపాశాలనుకోసి మోక్షమిచ్చే మందని, ప్రసన్నుడైన

వేంకటరమణుని మందని, శంకించక దాసులు చేపట్టవలసిన మంచని - అభిషేకజలాన్ని ప్రశంసించారు.

ఒకనాడు స్వామిసన్నిధిలో అన్నమయ్యగారు పారవశ్యంతో గానముచేశారు. ఆ సమయంలో సన్నిధానమందున్న భక్తులందరు పారవశ్యాన్ని అనుభవించారు. ఆ సమూహంలో నుంచి మధ్వమతస్థునివలె కన్పిస్తున్న మధ్యవయస్కుడొకడు ముందుకువచ్చి అన్నమయ్యగారి పాదాలకు ప్రణామం చేశాడు. అన్నమయ్యగా రాతనివంక చూడగా అతడు "మహాత్మా! మీదర్శనం చేసుకుని నేను ధన్యుణ్ణి అయ్యాను. మీగానంవిని ఆనందసమాధి అనుభవించాను. ముఖ్యంగా మీరు మాళవిరాగంలో "శరణుశరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతి వల్లభా! శరణు రాక్షస గర్వసంహర, శరణు వెంకటనాయకా" అని పాడిన సంకీర్తనం నన్నెంతో ఆకర్షించింది. మీ గానంవలన నాకెన్నో సంగీతరహస్యాలు తెలిసినాయి" అని మళ్లీ ప్రణామించి "నన్ను ఆశీర్వదించండి. నేనుకూడా సంగీతంతో ముక్తి సాధించా లనుకుంటున్నాను" అన్నాడు.

అన్నమయ్యగారు అతనిని పరిశీలించి "నీ పేరేమిటి నాయనా" అన్నారు. అతడు "నన్ను పురందరదాసుడంటారు. శ్రీవ్యాసరాయలవారు నన్ను మీదర్శనంచేసుకుని రమ్మని పంపించారు. మీగానం విని, మీపాదాలకుమ్రొక్కి, మీ ఆశీర్వచనాలుపొంది రమ్మన్నారు. అప్పుడుగాని నా సంగీతానికి జీవశక్తి అలవడదన్నారు. నేనువచ్చి మీరు సాక్షాత్తూ

శ్రీవేంకటేశ్వరస్వామివారి అవతారమని గ్రహించాను. నన్ను కరుణించండి" అని చేతులు జోడించాడు.

అన్నమయ్యగారు మందస్మితంచేస్తూ "పురందరదాసా! నీవుకూడ ఒకపదం గానంచెయ్యి" అన్నారు. పురందరదాసు కూడ మాళవిరాగంలోనే "శరణుశరణు సురేంద్రవందిత శరణు శ్రీపతిసేవిత, శరణు పార్వతితనయ మారుతిశరణు సిద్ధి వినాయక" అని లలితసుకుమారమైన దేవరనామగానం చేశాడు. అన్నమయ్యగారు ఆనందపడి పురందరదాసును ఆలింగనము చేసుకుని "నీవు వ్యాసరాయలవారి శిష్యుడగుట వలననే మహత్తుడవైనావు. ఆయన తపస్సిద్ధుడు. నీ సంకీర్తనం లోకాద్భుతంగా ఉన్నది. నీవు శ్రీపాండురంగవిఠలు అవతారమే" అని ప్రస్తుతించారు.

అన్నమయ్యగారు వేదములన్నియు మంచిపదములు చేసిపాడుచు, శ్రీవేంకటేశ్వరసన్నిధిని గాన మయంచేస్తూ కలిదోషములను పోగొట్టుటకు ఘనపురాణములనెల్ల పలుకుల నించినించి హరిని పాడుచు శ్రీవేంకటేశ్వరుని పాదసన్నిధియం దుండి నిత్యముక్తునివలె ఆయన కల్యాణగుణములను అను భవిస్తూ సర్వవిధ కైంకర్యములను చేస్తూ కాలమును వెళ్ల బుచ్చారు.

శ్రీ

శ్రీ తాళ్ళపాక
అన్నమాచార్యులవారి కీర్తనలు

(ఎక్కువ ప్రచారమునందున్న కీర్తనలు కొన్ని)

స్వామి సాక్షాత్కారము.

[భూపాలం]

ఇప్పు డిటు కలగంటి నెల్ల లోకములకు
నప్పుడగు తిరువెంకటాద్రీశుఁ గంటి ॥పల్లవి॥

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడగంటిఁ జయ్యన మేలుకంటి ॥ఇప్పు॥

కనకరత్నకవాటకాంత లిరుగడఁ గంటి
ఘనమైన దీపసంఘములు గంటి
అనుపమమణీమయ మగు కిరీటము గంటి
కనకాంబరము గంటిఁ గ్రక్కున మేలుకంటి ॥ఇప్పు॥

అరుదైన శంఖచక్రాదు లిరుగడఁ గంటి
సరిలేని యభయహస్తము గంటిని
తిరువెంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి
హరిఁగంటి గురుఁగంటి నంతట మేలుకంటి ॥ఇప్పు॥

[పాడి]

సందేహమెక్కడాలేదు సంతోషించుకొంటి నేను
కందువ బ్రహ్మానందము గైకొంటినేను ॥పల్లవి॥

నున్నఁగా సంకీర్తన నానోరికిచ్చితి గనుక
నన్నురక్షింతువే యనుచు నమ్మితినేను
పిన్ననాఁడేనీవు నన్నుం బేరుకొంటివి గనుక
యిన్నంగ నీడేర్తువని యియ్యకొంటి నేను ॥సందే॥

శ్రీకాంతుఁడనీమూర్తి నాచిత్తములో నిల్పఁగాను
నాకు నీవుగలవని నమ్మితి నేను
దాకొనిలోకములో నీదాసుం డనిపించఁగా
ఈడక నేలితివని యొఁగితినేను ॥సందే॥

కైవసమై నీవు నాకుఁగలలో నానతియ్యఁగా
నావద్దనున్నాఁడవని నమ్మితి నేను
ఏవేళ శ్రీవేంకటేశ యొదుటనే వుండఁగాను
పావనమై యిన్నిటాను బ్రబలితి నేను ॥సందే॥

తిరుపతి వర్ణనము.

[మలహరి]

అదె చూడు తిరుపతి వెంకటాద్రి నాలుగుయుగము
లందు వెలుఁగొంది ప్రభమీఱఁగాను ॥పల్లవి॥

తగనూటయిరవై యొనిమిది తిరుపతులం గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును

వేంకటరమణుని మందని, శంకించక దాసులు చేపట్టవలసిన మందని - అభిషేకజలాన్ని ప్రశంసించారు.

ఒకనాడు స్వామిసన్నిధిలో అన్నమయ్యగారు పారవశ్యంతో గానముచేశారు. ఆ సమయంలో సన్నిధానమందున్న భక్తులందరు పారవశ్యాన్ని అనుభవించారు. ఆ సమూహంలో నుంచి మధ్వమతస్థునివలె కన్పిస్తున్న మధ్యవయస్కుడొకడు ముందుకువచ్చి అన్నమయ్యగారి పాదాలకు ప్రణామం చేశాడు. అన్నమయ్యగా రాతనివంక చూడగా అతడు "మహాత్మా! మీదర్శనం చేసుకుని నేను ధన్యుణ్ణి అయ్యాను. మీగానంవిని ఆనందసమాధి అనుభవించాను. ముఖ్యంగా మీరు మాళవిరాగంలో "శరణుశరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతి వల్లభా! శరణు రాక్షస గర్వసంహర, శరణు వెంకటనాయకా" అని పాడిన సంకీర్తనం నన్నెంతో ఆకర్షించింది. మీ గానంవలన నాకెన్నో సంగీతరహస్యాలు తెలిసినాయి" అని మళ్లీ ప్రణామించి "నన్ను ఆశీర్వదించండి. నేనుకూడా సంగీతంతో ముక్తి సాధించా లనుకుంటున్నాను" అన్నాడు.

అన్నమయ్యగారు అతనిని పరిశీలించి "నీ పేరేమిటి నాయనా" అన్నారు. అతడు "నన్ను పురందరదాసుడంటారు. శ్రీవ్యాసరాయలవారు నన్ను మీదర్శనంచేసుకుని రమ్మని పంపించారు. మీగానం విని, మీపాదాలకుమ్రొక్కి, మీ ఆశీర్వచనాలుపొంది రమ్మన్నారు. అప్పుడుగాని నా సంగీతానికి జీవశక్తి అలవడదన్నారు. నేనువచ్చి మీరు సాక్షాత్తూ

శ్రీవేంకటేశ్వరస్వామివారి అవతారమని గ్రహించాను. నన్ను కరుణించండి" అని చేతులు జోడించాడు.

అన్నమయ్యగారు మందస్మితంచేస్తూ "పురందరదాసా! నీవుకూడ ఒకపదం గానంచెయ్యి" అన్నారు. పురందరదాసు కూడ మాళవిరాగంలోనే "శరణుశరణు సురేంద్రవందిత శరణు శ్రీపతిసేవిత, శరణు పార్వతితనయ మారుతిశరణు సిద్ధి వినాయక" అని లలితసుకుమారమైన దేవరనామగానం చేశాడు. అన్నమయ్యగారు ఆనందపడి పురందరదాసును ఆలింగనము చేసుకుని "నీవు వ్యాసరాయలవారి శిష్యుడగుట వలననే మహత్తుడవైనావు. ఆయన తపస్సిద్ధుడు. నీ సంకీర్తనం లోకాద్భుతంగా ఉన్నది. నీవు శ్రీపాండురంగవిఠలు అవతారమే" అని ప్రస్తుతించారు.

అన్నమయ్యగారు వేదములన్నియు మంచిపదములు చేసిపాడుచు, శ్రీవేంకటేశ్వరసన్నిధిని గాన మయంచేస్తూ కలిదోషములను పోగొట్టుటకు ఘనపురాణములనెల్ల పలుకుల నించినించి హరిని పాడుచు శ్రీవేంకటేశ్వరుని పాదసన్నిధియం దుండి నిత్యముక్తునివలె ఆయన కల్యాణగుణములను అను భవిస్తూ సర్వవిధ కైంకర్యములను చేస్తూ కాలమును వెళ్ల బుచ్చారు.

శ్రీ

అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందఁగాను ॥అదె॥

మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్యతపసు లున్నగృహాములును
వొగినోరగుఁ బెరుమాళ్లవునికిపట్టయి వెలయు
దిగువతిరుపతి గడవఁగాను ॥అదె॥

పొదవి యరయోజనము పొడవుననుఁ బెలుపొంది
పదినొండు యోజనంబుల పరపుననుఁ బరగి
చెదరకేవంకఁ జూచినమహాభూజములు
సింహాశార్దూలములును ॥అదె॥

కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులు
గరుడగంధర్వయక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవాఱఁగాను ॥అదె॥

ఎక్కువల కెక్కువై యెసగి వెలసినపెద్ద
యొక్కుడతిశయముముగానెక్కు నంతటివిూఁద
అక్కజంబైన పల్లవరాయనిమఠము
అలయేట్లపేడగడవక ॥అదె॥

చక్కనేఁగుచు నవ్వచటిగడచి హరింపఁదలఁచి
మ్రొక్కుచును మోఁకాళ్ళముడుగు గడచినవిూఁద
నక్కడక్కడ వెంకటాద్రిశు సంపదలు
అంతంతఁగాన రాఁగాను ॥అదె॥

బుగులుకొను పరిమళంబుల పూవుదోటలును
పొందైన నానావిధంబుల వనంబులును
నిగిడి క్రిక్కిఱిసి పండిన మహావృక్షముల
నీడలను నిలిచి నిలిచి ॥అదె॥

గగనంబు దాకి శృగారరసభరితమై
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలుగల నగరు
సరగుననుఁ గానరాఁ గాను ॥అదె॥

ప్రాకటంబైన పాపవినాశనము లోన
భరితమగు దురితములు పగిలిపాఱుచునుండ
ఆకాశగంగతోయములు సోకిన భవము
లంతంత వీఁడి పాఱఁగను ॥అదె॥

ఈకడనుఁగోనేఱు యతులు బాశుపతుల్ముసు
లేన్నగ్గలమైవున్న వైష్ణవులలో
నేకమై తిరువెంకటాద్రీశుఁ డాదరిని
యే ప్రొద్దు విహరించఁగాను ॥అదె॥

శేషాద్రిదర్శనము

[శ్రీరాగం]

అదివో అల్లదివో హరి వాసము
పదివేల శేషుల పడగలమయము ॥పల్లవి॥

అదె వెంకటాచల మభిలోన్నతము
అది వో బ్రహ్మాదుల కపురూపము

అదివో నిత్యనివాస మఖిలమునులకు
నదె చూడుఁడదె బ్రొక్కుఁడానందమయము ॥అది॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము ॥అది॥

కైవల్యపదము వెంకటనగ మదివో
శ్రీవెంకటపతికి సిరులయినది
భావింప సకల సంపదలరూప మదివో
పావనముల కెల్లఁ బావనమయము ॥అది॥

[రామక్రియ]

కట్టెదుర వైకుంఠము కాణాచయన కొండ
తెట్టె లాయ మహిమలే తిరుమలకొండ ॥పల్లవి॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేఱులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥

సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచఱులైన కొండ
వుర్వీఁ దపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపుఁ గొండ
కురిసి సంపదలెల్ల గుహాలనిండిన కొండ
విరివైన దిదివో శ్రీ వేంకటపుఁ గొండ ॥కట్టి॥

[ఆ హి రి]

తోరణములే త్రోవెల్లా
మూరరు బారట ముంచినలతల ॥పల్లవి॥

కూరిమి మటములు గోపురంబులును
తేరుపడగలే తెరువెలా
కోరినపండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురు జొంపములు ॥తోర॥

ఆటలుఁ దిరుపులు నందపు టురుపులు
పాటలు వనవైభవ మెల్లా
కూటువ నెమిళ్ల కోవిల గుంపులు
పేటలఁ దేటల పెనుఁగూటములును ॥తోర॥

వింజామరలును విసనకట్టులును
గొంజె గొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వెంకటపతి
సంజీవని పరుషుల కొదవఁగను ॥తోర॥

శ్రీపాదములు

[ము ఖా రి]

బ్రహ్మగడిగిన పాదము

బ్రహ్మము దానీపాదము ॥పల్లవి॥

చెలఁగి వసుధ గొలిచిన నీపాదము

బలి తలమోపిన పాదము

తలఁకక గగనము దన్నిన పాదము

బలరిపు గాచిన పాదము ॥బ్రహ్మ॥

కామిని పాపము గడిగిన పాదము

పాము తల నిడిన పాదము

ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదము

పామిడి తురగపు బౌదము ॥బ్రహ్మ॥

పరమయోగులకుఁ బరిపరి విధముల

వరమొసఁగెడి నీపాదము

తిరువేంకటగిరి తిరమని చూపిన

పరమపదము నీపాదము. ॥బ్రహ్మ॥

ఆశుకవితాశతకమునందు కొన్ని పద్యములు

చ. అరసెలు నూనెబూరియలునోఁగులుఁజక్కెరమండెగల్ వడల్
బురుడలు పాలమండెఁగలపూపము లయ్యలమేలు మంగనీ
కరుదుగ విందువెట్టుఁ బరమాన్నశతంబుల సూపకోట్లతో
నిరతవినిర్మలాన్నముల నేతులగోనల వేంకటేశ్వరా!

ఉ. చొచ్చితిఁ దల్లి నీమఱుఁగు సొంపుగ నీకరుణాకటాక్షమె
ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి యోయలమేలుమంగ నీ
మచ్చిక నంచునీతరుణిమన్ననే నినుఁ గంటి నీకు నా
బచ్చెనమాట లేమిటికి బ్రాతివి చూడఁగ వేంకటేశ్వరా!

ఉ. యోగ్యతలేని కష్టుడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడగర్భని
ర్భాగ్యుఁడ నీకృపామతికిఁ బ్రాప్తుడ నోయలమేలుమంగ నా
భాగ్యము నీకృపాగరిమఁ బ్రాప్యము కావుమటంచు సారెనీ
భాగ్యవతీ శిరోమణిని బ్రస్తుతిచేసెద వేంకటేశ్వరా!

ఉ. అమ్మకుఁ దాళ్లపాక ఘనుఁ డన్నఁడు పద్యశతంబు నెప్పెఁగో
కొమ్మని వాక్పసూనములఁ గూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలును జవ్వనిలీలల వేంకటేశ్వరా!

త్రోవభాష్యకారులు

గతు లన్ని ఖిలమైన కలియుగ మందును
గతి యీతడే చూపె ఘనగురుదైవము ॥పల్లవి॥

ఈతని కరుణనేకాయిల వైష్ణవుల మైతి
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతఁడే కావుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర
మీతఁడే రామానుజులు ఇహపరదైవము ॥గతు॥

వెలయించె నీతండె కావేదపురహస్యములు
చలిమి నీతండె చూపె శరణాగతి

నిలిపినాఁ డీతండె కాని జముద్రాథారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము ॥గతు॥

నియమము లీతండె కానిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁదగ నీతండె
నయమై శ్రీవేంకటేశునగ మెక్కీ వాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టె తల్లి దండ్రి దైవము ॥గతు॥

స్వామిపుష్కరిణి

[గుండక్రియ]

దేవునికి దేవునికి నీ తెప్పల కోనేరమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥పల్లవి॥

ధర్మార్థకామ మోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదే నీదరులు
నిర్మలపు నీజలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీలోఁతువో కోనేరమ్మా ॥దేవు॥

తగిన గంగాది తీర్థములు నీకడళ్ళు
జగతి దేవతలు నీజల జంతులు
గగనపుఁ బుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమూఁకలు మును లోయమ్మా ॥దేవు॥

వైకుంఠనగరము వాకిలే నీయాకారము
చేకొను పుణ్యములే నీ జీవ భావము

యేకడను శ్రీవెంకటేశుండె నీవునికి
దీకొని నీతీర్థ మాడితిమి కావవమ్మా ॥దేవు॥

దేవాలయ ప్రవేశము

[పాడి]

సేవించి చేకొన్నవారి చేతి భాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁడీడను ॥పల్లవిఁ

గరుడ గభంము కాడ కడుఁ బ్రాణాచారులకు
వరము లొసఁగిని శ్రీవల్లభుండు
తిరమై కోనేటిచెంతఁ దీర్థఫలము లెల్ల
పరుషల కొసఁగీని పరమాత్ముఁడు ॥సేవించి॥

సేన మొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించని నారాయణుఁడు
కానుకపైఁడి గాదెల కాడ నిజ రూపు
ఆనుక పొడచూపీని అఖిలేశుఁడు ॥సేవించి॥

సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు
ఎన్నికం బాదాలవద్ద ఇహము పరముఁ జూపీ
మన్ననల నలమేలు మంగవిభుఁడు ॥సేవించి॥

విష్వక్సేనుఁడు.

[లలిత]

నీవేకా చెప్పఁ జూప నీవేకా
శ్రీవిభు ప్రతినిధివి సేనమొదలారి ॥పల్లవి॥

నీవేకా కట్టుదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుండవు
యేవంక విచ్చేసినాను యిందిరాసతికి నిజ
సేవకుండవు నీవేకా సేన మొదలారి ॥నీవేకా॥

పసిఁడి బద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులు వంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాల వారి నిందఱిని నీ
సిసువులఁగా నేలిన సేన మొదలారి ॥నీవేకా॥

దొరలైన యసురులఁ దుత్తుమురువేసి జగ
మిరవుగా నేలితి వేకరాజ్యమై
పరగు సూత్రవతి పతివై వెంకట విభు
సిరుల పెన్నిధి నీవె సేన మొదలారి ॥నీవేకా॥

ప్రసాదములు

[దేసాళి]

ఏ పొద్దు చూచిన దేవుఁ డిట్లానె యూరగించు
రూపులతోఁ బదివేలు రుచులైనట్లుండెమా ॥పల్లవి॥

మేరు మంద రాలవ లె మెఱయు నిడ్డెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁ బళ్ళెలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను ॥ఏపొద్దు॥

పలుజలధులవంటి పైఁబడి వెండిగిన్నెలు
వెలిఁగొండ లంత లేసి వెన్నముద్దలు
బలసిన చిలువాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెల రసమం దిచ్చినట్లుండెను ॥ఏపొద్దు॥

పండిన పంటలవంటి పచ్చళ్లుఁ గూరలును
వండి యలమేలు మంగ వడ్డించఁగా
అండనె శ్రీవెంకటేశుఁ డారగించి మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను ॥ఏపొద్దు॥

స్వామి దర్శనము

[శంకరాభరణం అటతాళం]

పొడగంటిమయ్య మిమ్ము పురుషో త్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయఁ డా
కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁ డా ॥పొడ॥

భావింపఁ గైవసమైన పారిజాతమా, మమ్ము
చేరదేరఁ గాచినట్టి చింతామణీ
కామించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా ॥పొడ॥

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా
లడఁచి రక్షించే దివ్యౌషధమా
బడిఁ బాయక తిరిగే ప్రాణబంధుఁడా, మమ్ము
గడియించినట్టి శ్రీవేంకటనాథుఁడా. ॥పొడ॥

[భూపాళం]

పావనము గావో జిహ్వా బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమాఱునుంబొడి ॥పల్లవి॥

హరినామములే పాడి అతని పట్టపురాణి
ఇరవై మించినయట్టి యిందిరఁ బొడి
సరస నిరువంకలాను శంఖ చక్రములఁ బొడి
వరదకటిహస్తాలు వరుసతోఁ బొడి ॥పావ॥

ఆదిపురుషునిఁ బొడి అట్టే భూమిసతిఁ బొడి
పాదములఁ బొడి నాభిపద్మముఁ బొడి
మోదపు బ్రహ్మాండాలుమోచే వుదరముఁ బొడి
ఆదరానఁ గంబుకంతమంకెతోఁ బొడి ॥పావ॥

శ్రీవేంకటేశుఁ బొడి శిరసుతులసిం బొడి
శ్రీవత్సము తోడురముఁ జెలఁగి పొడి

లావుల మకరకుండలాల కర్ణములు పాడి
ఆవటించి యితని సర్వాంగములుఁ బొడి ॥పావ॥

స్వామి యభయహస్తము

[సామంతం]

ఇందఱికి నభయంబు లిచ్చుచేయి
కందువ లగుమంచి బంగారుచేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదికితెచ్చిన చేయి
చిలుకుగుబ్బలి క్రిందఁ జేర్చుచేయి
కలికియగు భూకాంతఁ గౌఁగిలించినచేయి
వలనైన కొనగోళ్ల వాఁడిచేయి ॥ఇంద॥

తనివోక బలిచేత దాన మడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకుఁ దెచ్చినచేయి
యెనయ నాఁగేలు ధరియించుచేయి ॥ఇంద॥

పురసతుల మానములు పొల్లచేసినచేయి
తురగంబుఁ బరపెడి దొడ్డచేయి
తిరువెంకటచలాధీశుఁడై మోక్షంబు
తెరువు ప్రాణుల కెల్లఁ దెలిపెడిచేయి ॥ఇంద॥

స్వామిమహిమలు

[శంకరాభరణం పల్లవి]

ఎటువంటి వాఁడవో నీమహిము
లెట్టు దెలియవచ్చును
నిటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు
నిన్నెట్లు దెలిసేరు మానవులు ॥పల్లవి॥

తిరుమలనంబి తాతాత యన్ననాఁడె
తెలిసెఁబోమీ పెద్దతనములు
కురువనంబిగారి చేతి బంకమట్టి పువ్వులు
కొన్ననాఁడె తెలిసె మీ భోగము ॥ఎటు॥

మఱియు ననంతాళువారి చెఱువుగట్ట
మన్ను మోయఁగా దెలిసె మీ నటనలు
గరుడ గంభముకాడ కాసు కొక్కవరమిచ్చి
గడియించఁ దెలిసె మీసంపద ॥ఎటు॥

తొండమాం జక్రవర్తికి సంపద
తొలుత నియ్యఁగాఁ దెలిసె మీమాయావులు
అండయెఱుకు వారి కొట్టిచేని యెన్ను
లారగించగాఁ దెలిసె మీరుచులు

వుండి గొల్లల కావిళ్ళపాలెల్ల
వుట్టుకోఁగఁ దెలిసె మీనేమములు

దండిగ సంపంగిమాఁకుల నడిపించ
దైవరాయ తెలిసె మీవిద్యలు ॥ఎటు॥

మును దాసు తిమ్మన్న తుంబురు కొండకు
మోఁకుమియ్యఁగా దెలిసె మీబుద్ధులు
పనివడి తాళ్ళపాక అన్నమయ్యగారి
పదములలోఁ దెలిసె మీవోజలు ॥ఎటు॥

యెనయ శ్రీవెంకటనాథ యలుమేలుమంగ
నెదనుంచఁగాఁ దెలిసె మీగోప్యము
వెనుకొని పురుషవారి కెదురువోయి
వెంటరాఁగాఁ దెలిసె మీరాజసము ॥ఎటు॥

[బౌళి]

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన
అంతమాత్రమే నీవూ
అంతరాంతరము లెంచిచూడఁ
బిండంతె నిప్పటి యన్నట్లూ ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుండని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మమనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ
డనుచు ॥ఎంత॥

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిసెనముల మిము నానావిధులను తలఁపుల కొలఁదుల
భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁదలచినవారికి నల్పం బవుదువు
గరిమల మిము నేఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁ
డవు ॥ఎంత॥

నీవలనఁ గొఱఁత లేదు మఱి నీరు కొలంది తామరవు
ఆవల భాగీరథిదరి బావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవెంకటపతి నీవై తేమముఁ జేకొనివున్న దైవమని
యీవల నే నీశరణనియెద నిదియే పరతత్వము నాకు
॥ఎంత॥

[బాళి]

ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను
ఏమఱక కొలచిన నితఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందఱికిఁ గన్ను లిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై
తనుఁ గొలువుమని చిత్తము లిచ్చుఁ గరుణించి
వొనర లోకాన కెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁ గొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితము లేని కొడుకుల నిచ్చును
చొచ్చిన చోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు
నిచ్చలులోకానకెల్ల నిజమైన దైవము ॥ఏమి॥

పంతమాడి కొలచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు
యెంతటిపదవులైన నిట్టె యిచ్చు
వింతవింత విభవాల వెంకటేశుం డిదే మా
యంతరంగమున నుండే అరచేతి దైవము ॥ఏమి॥

గురుకీర్తనము

[భైరవి]

చూడుఁ డిందఱకు సులభుఁడు హరి
తోడునీడ యగు దొరముని యితఁడు ॥పల్లవి॥

కైవల్యమునకుఁ గనకపుఁ దాపల
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మొకరూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితఁడు ॥చూడు॥

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన
దీపమై జగతికిఁ దేజమై
పాపాలడపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁ డిదే యీతఁడు ॥చూడు॥

కరుణానిధికి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటగిరి పతికిఁ
నిరతి నహోబల నృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠకోపముని యితండు ॥చూడు॥

శృంగారకీర్తనలు

[నాదనామక్రియ]

యే మొకో చిగురుటధరమున యొడనెడఁగ స్తురినిండెను
భామిని విభునకు వ్రాసినపత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా ॥ఏ మొ॥

పడతికి చనుఁగవమెఱుఁగులు పైపైఁ బయ్యద వెలుపల
కడుమించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁ డొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల కాదుగదా ॥ఏయె॥

ముద్దియచెక్కుల కెలఁకుల ముత్యపుజల్లుల చేర్పుల
వొద్దికలాగు వివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువెంకటపతి కౌఁగిటి యధరామృతముల
అద్దిన సురతపువేళల అందము కాదు గదా ॥ఏ మొ॥

రాజధిక్కారము

[లలిత]

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిదెమాకాపురమూ ॥పల్లవి॥

నరహరికీర్తన నానినజిహ్వా
ఒరుల నుతింపఁగ నోపదుజిహ్వా
మురహరు పదముల మ్రొక్కినశిరము
పరులవందనకుఁ ఒరగదు శిరము ॥తల॥

శ్రీపతినే పూజించిన కరములు
చోఁపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికడకేఁగిన కాళ్లు
పాపులయిండ్లకుఁ బౌఅవు కాళ్లు ॥తల॥

శ్రీవెంకటపతిఁ జింతించు మనసు
దావతి నితరముఁ దలఁచదు మనసు
దేవుండతని యాధీనపు తనువు
తేవల నితరా ధీనము గాదు ॥తల॥

[పాడి]

పుట్టు భోగులము నేము భువి హరి దాసులము
నట్టనడిమిదొరలు నాకియ్యవలెనా ॥పల్లవి॥

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు
వెల్లివిరి మహాలక్ష్మి విలాసములు
తల్లియాకె మగనినే దైవమని కొలిచేము
వొల్లనే మాకీసిరులు వొరులియ్యవలెనా ॥పుట్టు॥

గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు
ఆమని భూకాంతకు నంగ భేదాలు

భామినియాకె మగని ప్రాణథారి లెంకలము
వోమి మాకాతఁడె యిచ్చి వొరులయ్యవలెనా ॥పుట్టు॥

పసగల బ్రహ్మపదవులు బ్రహ్మ నిర్మితములు
వెస బ్రహ్మ తండ్రి శ్రీవేంకటేశుండు
యెసఁగి యాతఁడే మమ్మునేలి యిన్నియునిచ్చె
వొసఁగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా ॥పుట్టు॥

[శుద్ధవసంతం]

చీచీ వివేకమా చిత్తవికారమా
యేచిహారిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు ॥పల్లవి॥

బతికేనంటాఁబోయి పయిఁడి వచ్చుకతన
పతియవరమునఁ బ్రాణ మిచ్చీని
బతు కందులోన నేది పసిఁడి యొక్కఁడనుండు
గతిహారిఁ గొలువక కట్టువడె జీవుండు ॥చీచీ॥

దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలచి వారి
కడ్డము నిడుపు మొక్కినతి దీనుఁడై
దొడ్డతన మేదియందు దొర యాడనున్నవాఁడు
వొడ్డి హారిఁ గొలువక వోడుపడె జీవుండు ॥చీచి॥

చావనేల నోవనేల సారె, గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుఁడింట నున్నాఁడు
దేవిఁ డాతఁడె నేడు తెలిసి కొలిచెఁగాని
భావించ కిన్నాళ్లదాఁగా భ్రమపడె జీవుండు ॥చీచీ॥

[వ రా ళి]

ఎవ్వరివాఁడాఁ గాను యే మందు నిందుకు
నవ్వుచు నాలోని హరి నన్నుఁగావవే ॥పల్లవి॥

కోపుల రాజుల నెల్ల కొలచి కొన్నాళ్లు మేను
చూపుడుఁ బూఁటి వెట్టితి సొగసి నేను
యేపున సంసారమున యిదిగాక కమ్మటాన
దాపుగ తొల్లుంబూఁటి తగిలించఁ కొంటిని ॥ఎవ్వ॥

మొదలఁ గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువ వెట్టితినే గుతేగానకా
వెదకి కామునికి విషయములకునే
నదివో నావయసెల్ల నాహి వెట్టితిని ॥ఎవ్వ॥

ఇప్పుడే శ్రీవెంకటేశ యీడేర్చి నామనసు
కప్పిన గురుఁడు నీకు క్రయవచ్చెను
వొప్పించిరిందఱు బలువుఁడు చేపట్టెనుచు
అప్పులెల్లఁబాసి నీసొమ్మైతినే నయ్యా ॥ఎవ్వ॥

విముక్తికై సంకీర్తన

[ము ఖా రి]

ఆఁకటివేళల నలపైన వేళలను
త్రోఁకువ హరినామమే దిక్కు మఱి లేదు ॥పల్లవి॥

కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిన నైన మఱిలేదు తెఱఁగు ॥ఆక॥

ఆపద వచ్చినవేళ నాఱడిఁ బడినవేళ
పాపపువేళల భయపడినవేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాఁకాఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ఆక॥

సంకెలఁ బెట్టినవేళ చంపఁ బిలిచినవేళ
అంకిలిగా నప్పులవా రాఁగినవేళ
వెంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మఱిలేదు తెఱఁగు ॥ఆక॥

[దేసాక్షి]

సీదాసుల భంగములు నీవు చూతువా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా ॥పల్లవి॥

పాలసముద్రముమీఁదఁ బవళించినట్టి నీకు
బేలలై సురలు మొఱవెట్టినయట్టు
వేళతో మామానవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా ॥సీదాసు॥

ద్వారకానగరములో తగనెత్త మాడే నీకు
బీరాన ద్రౌపది మొఱవెట్టిన యట్టు
ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నింక రక్షించరాదా ॥నీదాసు॥

ఎనసి వైకుంఠములో నిందిరఁ గూడున్న నీకు
పెనఁగి గజము మొఱవెట్టినయట్టు
చనవుతో మాఁకోరిక సారె విన్నవించితిమి
విని శ్రీవెంకటేశుండ వేగ రక్షించరాదా ॥నీదాసు॥

[సామంతం]

దాసవర్గముల కెల్లా దరిదాపు మీరే కాన
వాసికి నెక్కించరాదా వసుధలోమమ్మును ॥పల్లవి॥

సేనాధిపతి నీవుచేరి విన్నవించరాదా
శ్రీనాథునికి నేము సేసే విన్నపము
ఆనుక భాష్యకారులు అట్టే మీరుం జేయరాదా
మానక విన్నపములు మామనవిచనవులు ॥దాస॥

వేయినోళ్లభోగి నీవు విన్నపము సేయరాదా
వేయేసి మావిన్నపాలు విష్ణునికిని
ఆయితమై గరుడండ అట్టే మీరుం జేయరాదా
యేయెడ విన్నపము మాకేమి వలసినాను ॥దాస॥

దేవులమ్మ యిందిర మాదిక్కె వివ్వనించరాదా
శ్రీవెంకటపతికి చిత్తమందను
ఆవేళ శేషాచలము అట్టేమీరుం జేయరాదా
యీవేళ మావిన్నపము లీడేరే నింకను ॥దాస॥

అన్నమయ్య జోల

జో వచ్చుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద ॥పల్లవి॥

అంగజుని గన్నమాయన్న యిటురారా
బంగారుగిన్నెలోఁ బాలుపోసేరా
దొంగ నీవనిసతులు పొంగుచున్నారా
ముంగిటనాడరా మోహనాకారా ॥జో॥

గోవర్ధనంబెల్ల గొడుగుగాఁ బట్టి
కావరమ్మున నున్న కంసుఁబడగొట్టి
నీవు మధురాపురము నేలఁ జేపట్టి
ధీవితో నేలిన దేవకిపట్టి ॥జో॥

లింగుగాఁ దాళ్లపాకాన్నయ్య చాల
శృంగారరచనగాఁ జెప్పె నీజోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥జో॥

అన్నమయ్య లాలి

[శ్రీరాగం జంపెతాళం]

లా లనుచు నూచేరు లలన లిరుగడల
బాలగండవరగోపాల నినుఁ జాల ॥పల్లవి॥

ఉదుటుగుబ్బలసరము లుయ్యాల లూఁగ
పదరి కంకణరవము బహుగతుల మ్రోఁగ
వొదిఁగి చెంపలకొప్పు లొక్కింత వీఁగ
ముదురు చెమటలు నళికములు తొప్పదోఁగ ॥లాలి॥

సొలపు తెలిగన్నుఁగవ చూపు లిరువంక
మలయురవళులకుఁ బలుమాటును బెళంక
కొలఁది కోవిలగములు క్రొలుమదనాంక
ములఁ గ్రేణిసేయు రవములు వడిఁ దలంక ॥లాలి॥

సరసపదములు జంగచాపుచేఁ బాయ
గుసగుసల మిఁదగాళ్ళఁ గుచ్చెళ్లురాయ
కరమూలములు కాంతి కడుఁజాయఁ జేయ
సరస నుయకుసుమ వాసన లెదురు డాయ ॥లాలి॥

కొలఁది నునుమేను లతకూనలసియాడ
మెలఁకువతో నొకరి నొకరి మెచ్చి సరిగూడ
తలలూఁచి చొక్కి చిత్తరుబొమ్మలాడ
అల్లరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥లాలి॥

లలిత తాంబూలరసకలితంబులైన
తళుకు దంతములు కెంపుల గుంపులీన
మొలక వెన్నెల డాలు ముసురుకొనితోన
చెలఁగి సెలవుల ముద్దుచిఱునవ్వులాన ॥లాలి॥

మలయ మారుతగతులు మాటికిఁ జెలంగ
ఫలుకుఁగపురపుతావి పైపై మెలంగ
బలుగానలహరి యింపుల రాల్గగంగ
బలసి వినువారిచెవి బడలిక దొలంగ ॥లాలి॥

లలనాజనా పాంగలలిత సుమచాప
జలజ లోచనదేవ సదుణ కలాప
తలఁపులోపల మెలఁగు తత్వప్రదీప
భళిర గండవరేణ పరమాత్మరూప. ॥లాలి॥

Printed at the Vavilla Press, Madras - 21.

222

Check List

Book Number	MB0109207	Date	23/12/21
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, iVi, 220, 221		
Missing Pages	NO		
Prepared By	Sandhya	Cutting By	Sandhya
Scanned By	Ch. Ramya	Pages	235